సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 224
బుధవారం 5-11-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

అమ్మానాన్నలూ గెలిచారు
ఇండియన్ విమెన్ క్రికెట్ టీం సభ్యులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం - 8లో

సెన్సెక్స్ 519 పాయింట్లు మైనస్
25,600 స్థాయి దిగువకు నిఫ్టీ
ఐటీ, మెటల్ షేర్లలో లాభాలు - 12లో

కృష్ణా జిల్లా గూడూరు వద్ద అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

దయలేని బాబు
దగా పాలన
చంద్రబాబు ప్రతి అడుగులోనూ రైతన్నకు నష్టమే
ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే ధాన్యం కొనుగోలు చేయం అని బ్లాక్ మెయిల్ చేస్తారా?

రైతుల విషయంలో ఎంత నిర్దాక్షిణ్యంగా, నిర్దయగా వ్యవహరిస్తోందో చెప్పడానికి శతకోటి ఉదాహరణలు
మోంథా తుపాను ప్రభావిత ప్రాంత పర్యటనలో నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రైతు కన్నీరు పెడితే ఏ ప్రభుత్వానికైనా అరిష్టమే.. వ్యవసాయం దండగ.. అన్న మైండ్ సెట్ మారాలి
తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలి
రబీ సీజన్ నుంచైనా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి
విపత్తుల వేళ రైతులను ఉదారంగా ఆదుకోవాల్సింది పోయి ఇబ్బంది పెడతారా?
31వ తేదీలోగా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని 30వ తేదీన ప్రొసీడింగ్స్ జారీ చేస్తారా?
24 గంటల్లో ఎక్కడైనా ఎన్యుమరేషన్ పూర్తి చేయడం సాధ్యమా?
15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఎందుకు తగ్గించాలని చూస్తున్నారు?
18 నెలల్లో 16 సార్లు విపత్తులతో రైతుకు నష్టం.. ఒక్కరికైనా రూపాయి నష్ట పరిహారం ఇచ్చారా?
నేడు ఈ-క్రాప్ నిర్వీర్యం.. బీమాకు మంగళం.. ఆర్బీకే వ్యవస్థ నాశనం.. గిట్టుబాటు ధర లేదు
మా హయాంలో 54.55 లక్షల మంది రైతులకు రూ.7,800 కోట్ల బీమా పరిహారం
నాడు 85 లక్షల మందికి బీమా కవరేజ్.. నేడు 19 లక్షల మందికే పరిమితం
మా హయాంలో ధరలు పతనమైన ప్రతిసారి మార్కెట్‌లో జోక్యం
ఆ ఐదేళ్లలో రూ.7,800 కోట్ల విలువైన పంట ఉత్పత్తుల కొనుగోలు
ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం

6 లో

"తుపాన్‌తో నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాల్సింది పోయి.. ఎలా పరిహారం ఎగ్గొడదామా అని ఆలోచనలు చేస్తుండటం దుర్మార్గం. ఎన్యుమరేషన్ అక్టోబర్ 31వ తేదీ నాటికి పూర్తి కావాలని చెబుతూ ఒక్క రోజు ముందు 30న ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని ఏమంటారు? ఒక్క రోజులో ఎన్యుమరేషన్ అనేది ఎలా సాధ్యం? పంట నష్ట పరిహారం జాబితాలో పేరుంటే ధాన్యం కొనుగోలు చేయం అని చెప్పడం దారుణం. ఇలా రైతులను బ్లాక్ మెయిల్ చేస్తూ.. బెదిరిస్తూ.. పైకి మాత్రం రైతులను ఉద్ధరిస్తున్నట్లు బిల్డప్‌లా?

తుపాను కారణంగా వరి కంకుల సుంకు (పుప్పొడి) రాలిపోయిందా? లేదా? అన్నది పరిశీలించడం ఎన్యుమరేషన్ ప్రక్రియలో కీలకం. ఎన్యుమరేషన్ చేసే అధికారులు పంట పొలాల వద్దకు వచ్చి స్వయంగా చూసే పరిస్థితే లేదు. సుంకు రాలిపోతే పాలు పోసుకునే పరిస్థితి ఉండదు. జర్మినేషన్ ప్రాసెస్ ఆగిపోతుంది. తద్వారా తాలు గింజలు ఏర్పడతాయి. ఈ వాస్తవాలు పరిశీలించేందుకు పొలాల వద్దకు వెళ్లకుండానే ఎన్యుమరేషన్ అయిపోయిందంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? ఇదేనా రైతులకు మేలు చేసే మీ విధానం?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

ఆకుమర్రు లాకు వద్ద పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎవరూ వచ్చి చూసింది లేదు..
7 లో

- పడిపోయిన పంటలను చూడమన్నా.. ఒక్కరూ రావట్లేదు
- దెబ్బ తిన్నట్లు రాసుకుంటే.. తర్వాత ధాన్యం కొనబోమంటున్నారు
- వరి పొలాల్లో వైఎస్ జగన్ ఎదుట అన్నదాతల ఆక్రోశం

ఆకుమర్రు గ్రామంలో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇక్షక్.. నౌకాదళానికి
రక్షక్!
3 లో

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹78	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 113 కిలో	డ్రెస్సిడ్ స్కిన్‌తో 203 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్ 140 కిలో	స్కిన్ లెస్ 231 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

కృష్ణా తీరం.. జన తరంగం
జననేత జగన్‌కు అడుగడుగునా బ్రహ్మరథం.. అసాంతం ఉవ్వెత్తున ఎగసిన ప్రజాభిమానం

- జగన్‌ను చూసేందుకు వెళ్లకుండా ప్రజలకు అడుగడుగునా పోలీసుల ఆంక్షలు
- సరిహద్దులు, ప్రధాన రహదారులు, కూడళ్లలో బారికేడ్లు, భారీ తాళ్లతో అడ్డంకులు
- అయినా మండుటెండనూ లెక్కచేయక వెల్లువలా పోటెత్తిన ప్రజావాహిని
- ప్రజాభిమానం ఉప్పొంగడంతో 70 కిలోమీటర్ల దూరానికి 7 గంటలకు పైగా సమయం
- కృష్ణా జిల్లాలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన దిగ్విజయం

14 లో

గూడూరులో వైఎస్ జగన్‌తో కరచాలనానికి పోటీ పడుతున్న అక్కచెల్లెమ్మలు

ఆర్థిక పరిస్థితి బాగోలేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆపలేరు
టెర్మినల్ బెనిఫిట్స్ దాతృత్వం కాదు.. అవి వారి హక్కు, ఆస్తి

ఏళ్ల పాటు సేవలు చేయించుకుని ప్రయోజనాలు ఇవ్వకపోవడం అమానవీయం
రాజ్యాంగ విరుద్ధం కూడా.. అవి ఉద్యోగుల జీవనోపాధిలో అంతర్భాగం
నలుగురు ఉద్యోగుల బెనిఫిట్స్‌ను 10 శాతం వడ్డీతో చెల్లించండి
రాష్ట్ర ప్రభుత్వం, డీసీసీబీలకు హైకోర్టు ఆదేశం

2 లో

మంగళవారం.. మరో రూ.3000 కోట్ల రుణం
17 నెలల చంద్రబాబు పాలనలో ప్రజలపై అప్పుల భారం
కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.2.27 లక్షల కోట్ల అప్పు

- ఇందులో బడ్జెట్ అప్పులే రూ.1,40,602 కోట్లు
- బడ్జెట్ బయట అప్పులు రూ.86,383 కోట్లు
- అయినా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఎగనామం
- అప్పుల వృద్ధి తప్ప ఆస్తుల కల్పన లేదు
- 17 మెడికల్ కాలేజీలతో ప్రభుత్వ సంపదగా ఆస్తులు సృష్టించిన వైఎస్ జగన్
- వాటిని పీపీపీ పేరుతో ప్రైవేట్‌పరం చేస్తున్న బాబు సర్కారు

2 లో

ఛత్తీస్‌గఢ్‌లో ఢీకొన్న రైళ్లు
8 మంది మృతి
14 మందికి గాయాలు
ఒకరి పరిస్థితి విషమం
బిలాస్‌పూర్ సమీపంలో ఘటన
5లో

సభాహక్కుల పేరుతో ఎలాపడితే అలా
చేయడానికి వీల్లేదు
సామాన్యులకు వర్తించే చట్టమే మీకూ వర్తిస్తుంది

- చట్టం చేశాం కాబట్టి వాటి అమలు నుంచి మినహాయింపు కోరలేరు
- ఏం చేసినా కూడా రాజ్యాంగం, చట్టానికి లోబడే చేయాలి
- అందుకు అనుగుణంగానే సభ హక్కుల తీర్మానాలు, నిర్ణయాలు ఉండాలి
- సభాహక్కుల తీర్మానంపై తుది నిర్ణయం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుంది
- హక్కుల ఉల్లంఘన జరిగిందని నిరూపించాల్సిన బాధ్యత వారిదే
- ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది.. పౌరుల హక్కులను ప్రభావితం చేస్తుంటే ఆ నిర్ణయాలపై న్యాయ సమీక్ష చేయవచ్చు
- చట్టపరమైన పరిమితులను గుర్తెరిగి నిర్ణయాలు తీసుకోవాలి
- 'సాక్షి' వివరణ, ఇతర ఆధారాలను చూసి సభ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలి.. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి సభా హక్కుల కమిటీ నోటీసుపై హైకోర్టు తీర్పు

2 లో

క్లుప్తంగా...

సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం 9.59 హెక్టార్ల అటవీ భూమి

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతాన్ని కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారి(ఎన్‌హెచ్–16)తో అనుసంధానిస్తూ నిర్మిస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్డు(ఈ–13) కోసం తాడేపల్లి పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో కంపార్ట్‌మెంట్ 132లో 9.59 హెక్టార్ల అటవీ భూమిని రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ)కు ప్రభుత్వం బదలాయించింది. ఆ భూమిపై న్యాయపరమైన హక్కులు అటవీశాఖకే ఉంటాయని పేర్కొంది. రోడ్డు నిర్మాణానికి మినహా ఆ భూమిని మిగతా ఏ అవసరాలకు ఉపయోగించుకోకూడదని నిర్దేశించింది. ఆ భూమిలో కార్మికుల కోసం క్యాంపు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేసింది. అడవుల పెంపకం కోసం రూ.4.09 కోట్లు, వన్యప్రాణుల పరిరక్షణ కోసం రూ.55 లక్షలు అటవీ శాఖ వద్ద డిపాజిట్ చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు చక్రాల మోటర్ సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల(త్రీ వీలర్) పథకానికి అర్హులైన వారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం, దరఖాస్తు చేసుకునేందుకు **www.apdascac.ap.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గనుల శాఖలో జాయింట్ డైరెక్టర్ల సీనియారిటీ జాబితా ఖరారు

సాక్షి, అమరావతి: గనుల శాఖలో జాయింట్ డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ జాబితాలో డి. శ్రీనివాసరావు ఒక్కరే ఉన్నారు. ఆయన 2019న జాయింట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ జాబితా ప్రకారం భవిష్యత్తు పదోన్నతులు, నియామక ప్రక్రియలు చేపట్టాలని ప్రభుత్వం గనుల శాఖ డైరెక్టర్‌కు సూచించింది.

థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ ఉంటే చాలు

- పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలుపై సర్కార్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 31 నుంచి 100 మందికిపైగా ఉద్యోగులున్న వ్యాపార, వాణిజ్య సంస్థలు పరిశ్రమలు కార్మిక చట్టాల అమలుపై థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ పొందితే శాఖాపరమైన తనిఖీలు అవసరం లేదని ప్రభుత్వం తేల్చేసింది. ఈ మేరకు ప్రభుత్వం 2016లో ఇచ్చిన కార్మిక శాఖలో ఆన్‌లైన్ ఇన్‌స్పెక్షన్‌పై ఇచ్చిన జీవో 27కు సవరణలు చేసింది. ఈమేరకు మంగళవారం కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిపి 300 మందికిపైగా కార్మికులు ఉండే సంస్థలను హైరిస్క్ సంస్థలుగా పరిగణించారు. సవరించిన ఉత్తర్వుల్లో 1–30 మంది ఉద్యోగులున్న వాటిని హైరిస్క్, 31–100 వరకూ మీడియం రిస్క్, 100 మందికిపైనే ఉద్యోగులున్న సంస్థలను లో–రిస్క్‌గా వర్గీకరించారు. అన్ని మీడియం, లో–రిస్క్ సంస్థలు థర్డ్ పార్టీ ఆడిట్ సర్టిఫికేషన్‌ను ఎంచుకునే వీలు కల్పించారు. ఆ సంస్థల్లో కార్మిక శాఖ ఇన్‌స్పెక్షన్ చేయదని స్పష్టం చేశారు. హైరిస్క్ సంస్థలు వరుసగా మూడేళ్లు రిటర్న్‌లను దాఖలు చేస్తే థర్డ్ పార్టీ ఆడిట్‌ను ఎంచుకోవడానికి అవకాశం ఇస్తారు.

ఆర్థిక పరిస్థితి బాగోలేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆపలేరు

టెర్మినల్ బెనిఫిట్స్ దాతృత్వం కాదు.. అవి వారి హక్కు, ఆస్తి

నలుగురు ఉద్యోగుల బెనిఫిట్స్‌ను 10 శాతం వడ్డీతో చెల్లించండి

రాష్ట్ర ప్రభుత్వం, డీసీసీబీలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఉద్యోగాంతర ప్రయోజనాలైన (టెర్మినల్ బెనిఫిట్స్) గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలను చెల్లించడంలో ప్రభుత్వం, దాని పర్యవేక్షణలోని సంస్థలు చేస్తున్న అసాధారణ జాప్యంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఏళ్ల తరబడి సేవలు చేయించుకుని వారికి టెర్మినల్ బెనిఫిట్స్‌ను చెల్లించకపోవడం చట్ట విరుద్ధమే కాక రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది. టెర్మినల్ బెనిఫిట్స్ ప్రభుత్వాల దాతృత్వం కాదని, అవి ఉద్యోగుల హక్కు అని స్పష్టం చేసింది. ఆర్థిక పరిస్థితి బాగోలేదన్న సాకుతో ఉద్యోగులకు రాజ్యాంగం కల్పిస్తున్న సామాజిక భద్రత హక్కును ప్రభుత్వం, దాని సంస్థలు కాలరాయలేవని పేర్కొంది. పదవీ విరమణ చేసిన 16 ఏళ్లకు కూడా ఉద్యోగులకు టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించకపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఆ ఉద్యోగులు వడ్డీతో సహా బకాయిలను పొందేందుకు అర్హులని హైకోర్టు తేల్చి చెప్పింది.

> టెర్మినల్ బెనిఫిట్స్ కోసం పిటిషన్లు దాఖలు చేసిన వారు 70, 80, 90 ఏళ్ల సీనియర్ సిటిజన్లు. ఈ వయస్సులో అనేక ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర సమస్యలు ఎదుర్కొంటుంటారు. వీరి నుంచి జీవితాంతం సేవలు తీసుకున్నారు. పదవీ విరమణ తర్వాత 16 ఏళ్లకు కూడా వారికి పదవీ విరమణ ప్రయోజనాలను ఇవ్వకపోవడం అమానవీయం. రాజ్యాంగ విరుద్ధం. - ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

నాటి నుంచి టెర్మినల్ బెనిఫిట్స్ పొందని పిటిషనర్లు..

చిట్టిబోయిన భారతరావు, పి. చంద్రమౌళీశ్వరరావు, బండ శివరామకృష్ణ ప్రసాద్, ఏ.సాయిబాబు పెయిడ్ సెక్రటరీలుగా కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో పనిచేశారు. తరువాత వారి పోస్టులు డీ–కేడరైజ్ చేసి సెక్రటరీలుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలోకి (పీఏసీఎస్) బదిలీ చేశారు. నాబార్డ్ మార్గదర్శకాల ప్రకారం వారిని 2009 మార్చి 2న తిరిగి పెయిడ్ సెక్రటరీలుగా డీసీసీబీలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి పదవీ విరమణ వరకు వారు ఎలాంటి మచ్చ లేకుండా పని చేశారు. రిటైర్ అయినప్పటికీ, వారికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి టెర్మినల్ బెనిఫిట్స్‌ను చెల్లించలేదు. వీటి కోసం ప్రభుత్వం, డీసీసీబీలతో పోరాడి అలసిపోయిన ఆ వృద్ధులు 2016లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై డీసీసీబీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, పిటిషనర్లు కొంత కాలం పీఏసీఎస్‌లలో పనిచేసినందున, అవి వారి వాటా బెనిఫిట్స్‌ను చెల్లించాలని, ఆ మొత్తం రాగానే దానితో కలిపి టెర్మినల్ బెనిఫిట్స్ ఇస్తామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు ఇటీవల కీలక తీర్పు వెలువరించారు.

16 ఏళ్ల తరువాత కూడా ప్రయోజనాలు చెల్లించరా...?

‘రిటైర్ అయిన 16 ఏళ్లకు కూడా వారికి ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం అమానవీయం. రాజ్యాంగ విరుద్ధం. ప్రభుత్వం, డీసీసీబీ, పీఏసీఎస్‌లు పిటిషనర్ల నుంచి వారి జీవిత కాల సేవలు పొందాయి. ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేకపోయినా బెనిఫిట్స్‌ను చెల్లించలేదు. అది పిటిషనర్ల చట్టబద్ధమైన, రాజ్యాంగ హక్కులను హరించినట్లే. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం సెక్షన్ 7 ప్రకారం ఉద్యోగి పదవీ విరమణ చేసి దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి 30 రోజుల్లోపు చెల్లించాలి. లేదంటే ఆ రోజు నుంచి వడ్డీ కూడా చెల్లించాలి. దీని ప్రకారం ఈ కేసులో పిటిషనర్లు చట్ట ప్రకారం వడ్డీ పొందేందుకు అర్హులు. ఇది యజమాని విచక్షణపై ఆధారపడి ఉండదు. గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఇతర ప్రయోజనాలను పిటిషనర్లు లేదా వారి కుటుంబ సభ్యులకు 10 శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలి. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు పరిశీలించి, ఆ తరువాత 8 వారాల్లో చెల్లించాలి. కోర్టు ఖర్చుల కింద పిటిషనర్లు ఒక్కొక్కరికి రూ.10 వేలు ప్రభుత్వం, డీసీసీబీ, పీఏసీఎస్ చెల్లించాలి. టెర్మినల్ బెనిఫిట్స్‌లో పీఏసీఎస్ నుంచి రావాల్సిన వాటాను వసూలు చేసుకునే హక్కు డీసీసీబీకి ఉంది. పీఏసీఎస్ వాటా చెల్లించలేదు కాబట్టి పిటిషనర్లకు టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించలేకపోయామన్న డీసీసీబీ వాదన చట్టబద్ధం కాదు’ అని జస్టిస్ మహేశ్వరరావు తన తీర్పులో పేర్కొన్నారు.

మంగళవారం...

మరో రూ.3,000 కోట్ల రుణం

17 నెలల చంద్రబాబు పాలనలో ప్రజలపై అప్పుల భారం

కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.2.27 లక్షల కోట్ల అప్పు



సాక్షి, అమరావతి: ప్రతి మంగళవారం... అప్పు వారం అన్నట్లుగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ అప్పు చేసింది. తాజాగా రూ.3 వేల కోట్ల రుణం తీసుకుంది. ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ రుణాన్ని సమీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది. తద్వారా 17 నెలల్లో ఏకంగా రూ.2.27 లక్షల కోట్ల అప్పు చేసినట్లయింది. బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట కలిపి ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రజలపై భారీ భారం మోపింది. ఎడాపెడా అప్పులు, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు పాలన కొనసాగుతోంది. సంపద సృష్టి అంటూ చెప్పిన మాటలు గాలికి కొట్టుకుపోగా... అప్పులు చేయడంలో మాత్రం భారీ వృద్ధి కనబరుస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక బడ్జెట్ లోపల రూ.1,40,702 కోట్లు, బడ్జెట్ బయట రూ.86,383 కోట్లు అప్పు చేశారు. ఇంత స్వల్పకాలంలో ఇంత పెద్దఎత్తున అప్పులు గతంలో ఏ ప్రభుత్వం చేయకపోవడం గమనార్హం. బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రభుత్వ గ్యారెంటీతో మరో రూ.55,383 కోట్లు అప్పు చేసింది. రాజధాని పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ, హడ్కో నుంచి ఏకంగా రూ.31 వేల కోట్లు రుణం తీసుకుంటోంది.

సూపర్ సిక్సులు లేవు.. అప్పులే..

చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట ఇష్టానుసారం అప్పులు చేస్తున్నప్పటికీ సూపర్ సిక్స్‌లో కీలకమైన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలు అమలు చేయకుండా ఎగనామం పెట్టింది. దీనికితోడు వైఎస్ జగన్ సీఎంగా ఉండగా... ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలతో ఆస్తులు కల్పించారు. వాటిని చంద్రబాబు సర్కారు పీపీపీ పేరుతో ప్రైవేట్‌పరం చేస్తోంది.

- తీసుకున్న అప్పులను ఆస్తుల కల్పనపై వెచ్చించాలి. ఇదే విషయాన్ని ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు పదే పదే చెప్పారు. కానీ, ఇప్పుడు చేసిన అప్పులను ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మిగిలిన నిర్మాణాలకు వ్యయం చేయడం లేదు. అటు సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైనవి కూడా ఇవ్వడం లేదు. సంపద సృష్టిస్తానంటూ పెద్దపెద్ద మాటలు చెప్పిన చంద్రబాబు రాష్ట్ర ఆదాయాన్ని పెంచలేకపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చిన ఆదాయం కూడా రానివిధంగా పాలన సాగిస్తున్నారు.

కళ్లు లేని ఎల్లోమీడియా

చంద్రబాబు సర్కారు కేవలం 17 నెలల్లోనే రూ.2.27 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినా ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో లేని అప్పులను కూడా ఉన్నట్లు అదే పనిగా తప్పుడు కథనాలతో ఊదరగొట్టింది. ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేశారంటూ దుష్ప్రచారం సాగించింది. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ సర్కారు ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి 15వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగానే అప్పులు చేసినా రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా గగ్గోలుపెట్టింది. ఇప్పుడు చంద్రబాబు రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టి మరీ అప్పులు చేస్తున్నా ఎల్లో మీడియాకు కనిపించడం లేదు.

బడ్జెట్ అప్పు (రూ.కోట్లలో)	
ఈ ఏడాది మార్చి వరకు కాగ్ గణాంకాల మేరకు అప్పు	81,597
ఏప్రిల్, మే నెలల్లో	22,505
జూన్‌లో	14,000
జూలై 1న	2,000
జూలై 15న	3,600
ఆగస్టు 5న	5,000
సెప్టెంబర్ 2న	5,000
సెప్టెంబర్ 30న	2,000
అక్టోబర్ 7న	1,900
నవంబర్ 4న	3,000
మొత్తం	1,40,702

వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రభుత్వ గ్యారెంటీతో బడ్జెట్ బయట చంద్రబాబు సర్కారు చేసిన అప్పులు (రూ.కోట్లలో)	
పౌర సరఫరాల సంస్థ	2000
మార్క్‌ఫెడ్	13,700
ఏపీఐఐసీ	1,000
ఏపీఎండీసీ	9,000
ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్	5,710
ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్	1000
ఏపీ జలజీవన్ మిషన్ కార్పొరేషన్	10,000
ఏపీఐఐసీ ద్వారా	7,500
ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా	5,473
మొత్తం	55,383

రాజధాని అప్పులు (రూ.కోట్లలో)	
ప్రపంచ బ్యాంకు, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు	15,000
హడ్కో	11,000
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	5,000
మొత్తం	31,000

పంచాయతీ కార్యదర్శుల పేరు, కేడర్‌లో మార్పు

ఇకపై గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీపీడీవో)గా కొనసాగింపు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇకపై గ్రామ పంచాయతీ కార్యదర్శి పోస్టును గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీపీడీవో)గా ప్రభుత్వం మార్పు చేసింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీసుకునే వేతనాల్లో ఎలాంటి మార్పులు లేకుండా, ప్రస్తుతం ఉన్న ఐదు కేడర్‌లను నాలుగు కేడర్‌లకు కుదించింది. జనాభా, వార్షికాదాయం ప్రాతిపదికన రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను కొత్తగా వర్గీకరిస్తూ గత నెల 10వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన అంశాలతో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం జీవో జారీ చేశారు. తద్వారా ఇప్పటిదాక అమలులో ఉన్న 7,244 క్లస్టర్ గ్రామ పంచాయతీల స్థానంలో 13,351 గ్రామ పంచాయతీలు పని చేస్తాయి. 359 అర్బన్ పంచాయతీలు, 3,082 గ్రేడ్–1 పంచాయతీలు, 3,163 గ్రేడ్–2 పంచాయతీలు, 6,747 గ్రేడ్–3 పంచాయతీలుగా వర్గీకరణ చేశారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలతో ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14,989 మంది పంచాయతీ కార్యదర్శుల్లో 1,487 మంది గ్రేడ్–1.. 993 మంది గ్రేడ్–2.. 2,235 మంది గ్రేడ్–3.. 4,108 మంది గ్రేడ్–4.. 6,166 మంది గ్రేడ్–5లో పని చేస్తున్నారు. తాజా వర్గీకరణలో వీరిలో 359 మంది అర్బన్ పంచాయతీ కార్యదర్శులుగా, 3,082 మందిని గ్రేడ్–1.. 3,163 మందిని గ్రేడ్–2.. 6,747 మందిని గ్రేడ్–3.. 1,638 మందిని అడిషనల్ గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శులుగా కేడర్‌లో మార్పులు చేశారు. 359 అర్బన్ పంచాయతీల్లో ఉండే జీపీడీవో డిప్యూటీ ఎంపీడీవో స్థాయిలో కొనసాగడానికి సంబంధించి వేరుగా ఆదేశాలు ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1,097 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్లుగా పని చేస్తుండగా.. అందులో 359 జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు.

- గ్రామ సచివాలయాల్లో పని చేసే మిగులు డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో పంచాయతీ రికార్డులు, పరిపాలనా ప్రక్రియలను డిజిటలైజ్ చేయడానికి, వర్క్ ఫ్లో ఆటోమేషన్, రియల్ టైమ్ పర్యవేక్షణ కోసం శాఖలో డెడికేటెడ్ ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్స్ ద్వారా ఖర్చు భరించే స్థాయి ఉండే పంచాయతీల్లో ప్రత్యేక శానిటేషన్ విభాగం, నీటి సరఫరా విభాగం, కంట్రీ ప్లానింగ్ విభాగం, స్ట్రీట్ లైటింగ్–ఇంజినీరింగ్ విభాగంలో రెవెన్యూ విభాగం తరహా సిబ్బందిని అవుట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించుకోవడానికి అవకాశం కల్పించారు.
- ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసే వారు కొత్తగా డీపీవో కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ తదితర క్యాడర్‌లో పని చేసేందుకు వీలుగా నిబంధనలు మార్పులు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఆయా మార్పులు చేర్పులకు సంబంధించి వేర్వేరుగా అదనపు వివరాలతో ప్రభుత్వం మరికొన్ని జీవోలు జారీ చేయనుంది.

సభాహక్కుల పేరుతో ఎలాపడితే అలా చేయడానికి వీల్లేదు

సామాన్యులకు వర్తించే చట్టమే మీకూ వర్తిస్తుంది

- చట్టం చేశాం కాబట్టి వాటి అమలు నుంచి మినహాయింపు కోరలేరు
- ఏం చేసినా కూడా రాజ్యాంగం, చట్టానికి లోబడే చేయాలి
- అందుకు అనుగుణంగానే సభా హక్కుల తీర్మానాలు, నిర్ణయాలు ఉండాలి
- సభాహక్కుల తీర్మానంపై తుది నిర్ణయం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుంది
- హక్కుల ఉల్లంఘన జరిగిందని నిరూపించాల్సిన బాధ్యత వారిదే
- ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది
- చట్టపరమైన పరిమితులను గుర్తెరిగి నిర్ణయాలు తీసుకోవాలి
- ‘సాక్షి’ వివరణ, ఇతర ఆధారాలను చూసి సభ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలి
- సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి సభా హక్కుల కమిటీ నోటీసుపై హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: శాసనసభ హక్కులు రాజ్యాంగంలో నిర్దేశించిన సూత్రాలకు లోబడే ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. సామాన్యులకు ఏ చట్టాలైతే వర్తిస్తాయో, అవే చట్టాలకు అనుగుణంగా సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాలు, సభ నిర్ణయాలు కూడా ఉంటాయని తేల్చిచెప్పింది. సభా హక్కుల పేరుతో ఎలాపడితే అలా వ్యవహరించడానికి వీల్లేదని పేర్కొంది. పార్లమెంట్ లేదా శాసనసభలు, వాటికి సంబంధించిన కమిటీలు కూడా సాధారణ చట్టాలకు లోబడే ఉంటాయంది. అవేమీ చట్టాలకు అతీతం కాదని స్పష్టం చేసింది. చట్టం చేసేవారు కూడా అదే చట్టానికి లోబడి ఉండాలని, అంతే తప్ప ప్రజల కోసం రూపొందించే చట్టాల అమలు నుంచి వారు మినహాయింపు పొందలేరని తెలిపింది. ‘‘ఎంతటి భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ప్రతి శాసనసభకు చట్టాలు సమానంగా వర్తిస్తాయి. కాబట్టి సభా హక్కుల తీర్మానంపై తీసుకునే తుది నిర్ణయం న్యాయ సమీక్షకు లోబడే ఉంటుంది. కోర్టు న్యాయ సమీక్ష చేసే సమయంలో సభా హక్కుల ఉల్లంఘన జరిగిందని నిరూపించాల్సిన బాధ్యత హక్కులకు భంగం కలిగిందన్న సభ, వ్యక్తిదే. ఈ విషయాన్ని సీతాసోరెన్ కేసులో సుప్రీం కోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. శాసనసభ, సభా హక్కుల కమిటీ రాజ్యాంగ సూత్రాలను, చట్టపరమైన పరిమితులను గుర్తెరిగి సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు ఆశాభావం వ్యక్తం చేసింది’’ అని పేర్కొంది. సభా హక్కుల కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ బి.ఫణికుమార్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఇచ్చింది కేవలం షోకాజ్ నోటీసు మాత్రమేనని, అనంతరం చాలా దశలు ఉంటాయని, అందువల్ల ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి వ్యాఖ్యానించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు.

‘సాక్షి’పై కక్షసాధింపు చర్యలు... షోకాజ్ నోటీసు జారీ

ఎమ్మెల్యేలకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించాలని శాసనసభ వర్గాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్ణయించాయి. ఎమ్మెల్యేలు, అతిథులకు హోటళ్లు, భోజనాలు, బహుమతులు తదితరాల కోసం భారీగా ఖర్చు చేశారు. అయితే, లోక్‌సభ స్పీకర్ ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఆ ఖర్చంతా వృథా అయింది. దీనిపై ‘సాక్షి’ ఫిబ్రవరి 22న ‘రూ.కోట్లు ఖర్చు... శిక్షణ తుస్సు’ శీర్షికన కథనం ప్రచురించింది. కంగుతిన్న అధికార పార్టీ నేతలు ‘సాక్షి’పై కక్షసాధింపు చర్యలు చేపట్టారు. పత్రిక కథనం సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, దానిని తాను సభలో ప్రస్తావించేందుకు అనుమతించాలని టీడీపీ ఎమ్మెల్యే జయసూర్య ఫిబ్రవరి 25న అసెంబ్లీ స్పీకర్‌ను కోరుతూ నోటీసు ఇచ్చారు. స్పీకర్ ఈ వ్యవహారాన్ని సభా హక్కుల కమిటీకి నివేదించారు. దాని ఆదేశాల మేరకు ‘సాక్షి’కి అసెంబ్లీ సెక్రటరీ జనరల్ షోకాజ్ నోటీసులు జారీచేశారు.

పాలనాపరమైన అంశాలపైనే కథనం

ఎమ్మెల్యే ఇచ్చిన నోటీసుతో పాటు, సెక్రటరీ జనరల్ ఇచ్చిన షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డి, చీఫ్ రిపోర్టర్ ఫణికుమార్ జూన్‌లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్, వి.మహేశ్వర్‌రెడ్డి, అనూప్ కౌశిక్ వాదిస్తూ... సభలో జరిగిన విషయాలపై ‘సాక్షి’ కథనం రాయలేదని, పాలనాపరమైన అంశంపైనే ప్రచురించిందని, దాని కారణంగా ఎవరి హక్కులకూ భంగం వాటిల్లలేదని, ఆ కథనం సభా హక్కుల ఉల్లంఘన కిందకు రాదని వివరించారు. శాసన వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పిటిషనర్లకు ఇచ్చింది కేవలం షోకాజ్ నోటీసు మాత్రమేనన్నారు. వారి వివరణ తీసుకున్న తరువాత పలు దశలు ఉంటాయని, వివరణతో సభా హక్కుల కమిటీ సంతృప్తి చెందితే తదుపరి చర్యల ఉపసంహరణకు సిఫారసు చేయవచ్చన్నారు. ‘సాక్షి’ కథనం ధిక్కారం కిందకే వస్తుందని కమిటీ భావించినా అంతిమంగా నిర్ణయం శాసన సభనే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. షోకాజ్ నోటీసుల దశలో కోర్టుల జోక్యం తగదని, ఈ వ్యాజ్యాలను తోసిపుచ్చాలని కోరారు.

పౌరులను కాపాడే రక్షణ కవచమే రాజ్యాంగం

‘‘పౌరుల హక్కులను ప్రభావితం చేసేలా రాజ్యాంగ వ్యవస్థలు ఏకపక్ష, అన్యాయ నిర్ణయాలు తీసుకుంటే, వాటి నుంచి కాపాడే రక్షణ కవచమే రాజ్యాంగం. అధికరణ 194 కింద... రాష్ట్ర అసెంబ్లీలు తీసుకునే నిర్ణయాలు పౌరుల హక్కులను ప్రభావితం చేస్తుంటే, అవి కచ్చితంగా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయి. సభా హక్కుల ఉల్లంఘనకు సంబంధించి జారీచేసే షోకాజ్ నోటీసులు పలు దశల్లో చట్టపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయి. సభా హక్కుల కమిటీ మొదట పిటిషనర్ల వివరణను పరిగణనలోకి తీసుకుని, తదుపరి చర్యలను ఉపసంహరించాలని శాసనసభకు సిఫారసు చేయవచ్చు. అలాకాకుండా పిటిషనర్ల వంటి పౌరులకు వ్యతిరేకంగా కమిటీ సిఫారసు చేసినప్పటికీ, శాసనసభ పిటిషనర్లు సమర్పించిన వివరణను, ఆధారాలను పరిగణనలోకి తీసుకుని స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది’’ అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

కాంట్రాక్టర్లను బెదిరించిన మంత్రి అనుచరుడు ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు

- ‘టెండర్లలో పాల్గొనొద్దు’ శీర్షికన కర్నూలు ఎడిషన్‌లో కథనం
- వాస్తవాలు జీర్ణించుకోలేక కక్షగట్టిన కూటమి నేతలు
- ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు

కర్నూలు (అర్బన్): కర్నూలు నగరపాలకసంస్థలో రూ.2 కోట్ల పనులకు సంబంధించిన టెండర్లు తమవారికే దక్కాలని, ఎవరూ టెండర్లు వేయవద్దని మంత్రి అనుచరుడు బెదిరిస్తున్నారని సాక్షిలో ప్రచురించటంతో కూటమి నేతలు కక్షగట్టారు. ఎవరూ టెండర్లు వేయవద్దని మున్సిపల్ కాంట్రాక్టర్ల వాట్సాప్ గ్రూపుల్లో పంపించిన మెస్సేజ్ సహా వాస్తవాలు ప్రచురించడాన్ని జీర్ణించుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30వ తేదీన సాక్షి కర్నూలు ఎడిషన్‌లో ‘టెండర్లలో పాల్గొనొద్దు’ శీర్షికన కథనం ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగా అధికార పార్టీకి చెందిన వారిపై తప్పుడు సమాచారాన్ని ప్రచురించారనే ఫిర్యాదు మేరకు సాక్షి ఎడిటర్, పబ్లిషర్ ఆర్.ధనంజయరెడ్డి, సాక్షి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ రిపోర్టర్ ప్రతాప్‌పై కర్నూలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కార్పొరేషన్‌లో ముక్కు, మొహం తెలియని వ్యక్తులు, కాంట్రాక్ట్ పనిచేయనివారు, కాంట్రాక్టర్ లైసెన్స్ కూడా లేనివారు కార్పొరేషన్‌లో పెత్తనం చెలాయిస్తున్నారని పత్రికలో ప్రచురించారని బిజినేపల్లి సందీప్, చంద్రశేఖర్‌ల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 267/2025 యూ/సెక్షన్ 352, 353(1)(బి), 356(3) అండ్ (4), 61(1)(బి) ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదుచేశారు.

కర్నూలులో ఐదో కేసు

వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే సదుద్దేశంతో వరుస కథనాలను ప్రచురిస్తున్న ‘సాక్షి’పై కర్నూలులో ఇప్పుడు ఐదోకేసు నమోదైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి పాలకులు వ్యవహరిస్తున్న తీరు, అనుసరిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతుండటాన్ని కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే కూటమి నేతల ఫిర్యాదుల మేరకు పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. ఒక ఉపాధ్యాయుడు తనను కిడ్నాప్ చేశారు మొర్రో అంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ముందు వాపోయిన కథనాన్ని ప్రచురించిన ‘సాక్షి’పై మొదటి కేసు నమోదైంది. ‘రాయలసీమలో అనకొండ ఐపీఎస్’ శీర్షికతో ప్రచురితమైన కథనంపైన కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే దశాబ్దాల తరబడి నివాసముంటున్న నగరంలోని ఎ, బి, సి క్యాంపుల్లోని ప్రభుత్వ క్వార్టర్లను ఖాళీ చేయించాలనే ప్రభుత్వ నిర్ణయంపై ‘ఎ, బి, సి క్యాంపుల భరతం పడతాం’ శీర్షికన ప్రచురితమైన వార్తపై కూటమి నేతలు నగరంలోని పోలీస్‌స్టేషన్లలో రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించారు.

క్లుప్తంగా...

మద్యం పర్మిట్ రూమ్‌లో యువకుడి మృతి

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఘటన

మదనపల్లె రూరల్: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మద్యం షాపు పర్మిట్‌రూమ్‌లో మంగళవారం యువకుడు మృతి చెందాడు. అతడిని స్థానిక అప్పారావుపేటలోని పోతులప్ప గుడి వీధికి చెందిన భవననిర్మాణ కార్మికుడు దొడ్డం నరేష్ (29)గా గుర్తించారు. పట్టణంలోని రామారావు కాలనీ రోడ్డులో ఉన్న దినకర్ వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసిన నరేష్ పక్కనున్న పర్మిట్ రూమ్‌లోకి వెళ్లి తాగుతూ అక్కడే పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఎంతసేపటికి లేవకపోవడంతో అక్కడివారు టూటౌన్ పోలీసులకు, ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నరేష్ అతిగా మద్యంతాగి మరణించినట్టు ప్రాథమికంగా భావిస్తున్నామని మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతికి కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

మద్యం అక్రమ కేసులో బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో విజయవాడ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వెన్ను నొప్పితో బాధపడుతున్నందున మంతెన సత్యనారాయణ ప్రకృతి వైద్యశాలలో వైద్యం చేయించుకునేందుకు అనుమతివ్వాలని ఆయన తరపు న్యాయవాది ఎం.వాణిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలాజీ కుమార్‌యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున న్యాయవాది వాణిరెడ్డి దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లపైనా కౌంటర్ దాఖలు చేయాలని డిఫెన్స్ న్యాయవాదులను ఆదేశిస్తూ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి విచారణను ఈ నెల 7వ తేదీకి వాయిదా వేశారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

మృతి చెందిన మల్లికార్జున, శ్రీనివాసులు

పెనగలూరు: అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరు పంచాయతీ, తిరునంపల్లి గ్రామ సమీపంలోని గుంజన నదిలో పడి ఇద్దరు మంగళవారం మృతి చెందారు. మండలంలోని నడిమి సిద్దవరం గ్రామానికి చెందిన దుగ్గబోయిన మల్లికార్జున (42), సింగనమల శ్రీనివాసులు (46), కోనేటి సుబ్బనరసయ్య చేపలు పట్టేందుకు తిరునంపల్లి వద్ద ఉన్న గుంజన నదిలోకి దిగారు. ఎత్తు ప్రాంతం నుంచి నదిలో లోతు లేనిచోటికి వెళ్లాలనుకున్నారు. కాలు జారి 15 అడుగుల లోతులో ఉన్న నీటిలో శ్రీనివాసులు పడిపోయాడు. అతన్ని రక్షించేందుకు మల్లికార్జున నీటిలోకి దిగడంతో శ్రీనివాసులు భయపడి మల్లికార్జున మెడను గట్టిగా పట్టుకున్నాడు. దీంతో బయటకు వచ్చేందుకు అవకాశం లేక ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. రక్షించాలని కేకలు వేయడంతో కోనేటి సుబ్బనరసయ్య కూడా వారిద్దరినీ రక్షించేందుకు నీళ్లలోకి దిగాడు. లోతు అధికంగా ఉండటంతో సుబ్బనరసయ్య లుంగీని శ్రీనివాసులు పట్టుకున్నాడు. దీంతో సుబ్బనరసయ్య కూడా మునిగిపోతాననే భయంతో లుంగీ వదిలించుకొని పైకి వచ్చాడు. భయపడిన సుబ్బనరసయ్య గట్టిగా కేకలు వేయగా స్థానికులు వచ్చేలోపు వారు మునిగిపోయారు. మల్లికార్జునకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసులుకు కుమారుడు ఉన్నాడు. రాజంపేట రూరల్ సీఐ రమణ, ఏఎస్ఐ రాముడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక్షక్.. నౌకాదళానికి రక్షక్!

తొలిసారిగా నేవల్ షిప్‌లో మహిళా సెయిలర్స్‌కు ప్రత్యేక వసతులు

- తద్వారా తొలి జెండర్- ఇన్‌క్లూజివ్ సర్వే నౌకగా గుర్తింపు
- 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఇక్షక్ సర్వే నౌక
- సముద్రజలాల్లో సర్వేతో పాటు విపత్తు సహాయకారిగానూ సేవలు
- ఇతర దేశాల నౌకల మ్యాపింగ్‌కు కీలకంగా మారనున్న ఇక్షక్
- అంతర్జాతీయ ప్రాదేశిక సరిహద్దులు నిర్ణయించడంలోనూ ముఖ్య భూమిక
- రేపు నౌకాదళ అమ్ములపొదిలోకి..

భారత నౌకాదళంలో 150కిపైగా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లున్నాయి. ఇప్పటి వరకు ఏ యుద్ధ నౌకలోనూ అతివలకంటూ ప్రత్యేక వసతులు లేవు. మొట్టమొదటి సారిగా మహిళా గౌరవానికి ప్రతీకగా నిలిచేలా సంధాయక్ క్లాస్ సర్వే నౌక ఐఎన్ఎస్ ఇక్షక్‌ని నిర్మించారు. ఒక నేవీ షిప్‌లో మహిళా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక వసతులు కల్పించడం ఇదే తొలిసారి. ఇది నౌకాదళంలో పెరుగుతున్న నారీశక్తికి నిదర్శనం. 80 శాతం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ సంధాయక్ క్లాస్ మూడో షిప్ ఇక్షక్.. నవంబర్ 6వ తేదీన భారత నౌకాదళ అమ్ములపొదిలో చేరనుంది.

- సాక్షి, విశాఖపట్నం

ఆత్మనిర్భర్ భారత్ దిశలో కీలక అడుగు...

భారత నావికాదళంలో దేశీయంగా నిర్మించిన ఈ బిగ్ సర్వే వెసెల్ ఐఎన్ఎస్ ఇక్షక్.. ఆత్మనిర్భర్ భారత్‌లో మరో కీలక అడుగు. ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఇక్షక్‌ని కొచ్చి నావల్ బేస్‌లో జాతికి అంకితం చేయనున్నారు. స్వదేశీ హైడ్రోగ్రాఫిక్ సర్వే ఎక్స్‌లెన్స్‌లో కొత్త అధ్యాయాన్ని లిఖించేలా కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని నిర్మించింది. డైరెక్టరేట్ ఆఫ్ షిప్ ప్రొడక్షన్, వార్‌షిప్ ఓవర్‌సీయింగ్ టీమ్ (కోల్‌కతా) ఈ నౌకా నిర్మాణాన్ని పర్యవేక్షించాయి. హైడ్రోగ్రాఫిక్ సర్వే కార్యకలాపాలతోపాటు.. మానవతా సహాయం, విపత్తు సహాయకారిగానూ.. అత్యవసర సమయాల్లో హాస్పిటల్ షిప్‌గా కూడా వ్యవహరించనుంది.

మహిళల కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్.!

భారత నౌకాదళ చరిత్రలో మహిళల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేసిన తొలి యుద్ధ నౌక ఇక్షక్. ఇప్పటి వరకూ ప్రతి యుద్ధ నౌకలో మహిళా అధికారులు, సెయిలర్స్‌కు పురుష సిబ్బందితో కలిసి పక్కపక్కనే విడిగా గదులు ఉండేవి. ఇక్షక్‌లో మాత్రం.. మహిళా సిబ్బంది కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్‌ని ఏర్పాటు చేశారు.

ఇక్షక్ అంటే...

ఇక్షక్ అంటే ది గైడ్.. దిక్సూచీ అని అర్థం. తెలియని మార్గాల్ని అన్వేషించడం.. నౌకాదళాన్ని సరైన దారిలో నడిపించడం.. తమ లక్ష్యాల్ని సురక్షితంగా చేరుకునేలా నావికులకు మార్గాన్ని నిర్దేశించడం. భారత దేశ సముద్ర శక్తిని మరింత బలోపేతం చేసేలా ఇక్షక్ నిర్మాణం జరిగింది. ఓడరేవులు, నావిగేషనల్ చానెల్‌లు, ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో కోస్టల్, డీప్ వాటర్ హైడ్రో-గ్రాఫిక్ సర్వే నిర్వహించడం, రక్షణ కోసం ఓషనోగ్రాఫిక్ డేటాను సేకరించడంలో ఇక్షక్ కీలక పాత్ర పోషించనుంది.

అడుగులు ఇలా...

1968 నుంచి సంధాయక్ సర్వే వెసల్ భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించి 2021లో సేవల నుంచి నిష్క్రమించింది. ఇండియన్ నేవీకి సర్వే నౌకలు అవసరమని భావించిన రక్షణ మంత్రిత్వ శాఖ.. 2017లో నాలుగు సంధాయక్ క్లాస్ సర్వే వెసల్స్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. రూ.2,435.15 కోట్లతో బిడ్‌ను జీఆర్ఎస్ఈ దక్కించుకుంది. అత్యాధునిక సాంకేతికతతో స్వదేశీ పరిజ్ఞానంతో ఈ నౌకల్ని నిర్మిస్తున్నారు. వీటిలో మొదటిది జే18 పేరుతో ఐఎన్ఎస్ సంధాయక్‌ని 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. జే 19 పేరుతో ఐఎన్ఎస్ నిర్దేశక్‌ను, జే23 పేరుతో ఇక్షక్‌ని 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో పూర్తి చేశారు. తర్వాత.. ఐఎన్ఎస్ సంశోధక్ షిప్ 2026 నాటికి భారత నౌకాదళంలో చేరాలన్నది ప్రణాళిక.

ఇక్షక్ సత్తా ఇదీ..

- పొడవు: 110 మీటర్లు
- బరువు: 3,400 టన్నులు
- వేగం: గంటకు 33 కిమీ (18 నాటికల్ మైళ్లు)
- సామర్థ్యం: 30 కిమీ వేగంతో ఏకధాటిగా 12 వేల కిమీ దూరం ప్రయాణించగలదు
- సంద్రంలో సత్తా: 25 రోజుల పాటు తీరానికి రాకుండా పహారా కాయగల సత్తా
- సిబ్బంది: 231 మంది
- ఆయుధ సంపత్తి: సీఆర్ఎన్91 నేవల్ గన్, హాల్ ధృవ్ ఎంకే-3 హెలికాప్టర్
- ఇన్‌బుల్ట్ సెన్సార్ శక్తి: అటానమస్ అండర్ వాటర్ వెహికల్ సెన్సార్, హైడ్రోగ్రాఫిక్ సెన్సార్ పరికరాలు, సముద్ర కాలుష్యాన్ని గణించే మార్పల్ వ్యవస్థ, రిమోట్ ఆపరేటెడ్ వెహికల్స్(ఆర్‌వోవీ), సైడ్ స్కాన్ సోనార్

నకిలీ మద్యం కేసులో ఏడుగురు నిందితుల కస్టడీకి అనుమతి

విజయవాడలీగల్: ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నమోదైన నకిలీ మద్యం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న రవి, శ్రీనివాసరెడ్డి, కల్యాణ్, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, తాండవ రమేష్‌బాబు, అల్లాభక్షును పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఆరో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆదేశాలు జారీచేశారు. ఈ కేసులో నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి ఐదు రోజులపాటు కస్టడీకి అనుమతించారు.

జోగి రమేష్‌కు ప్రత్యేక వసతులు

నకిలీ మద్యం కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి జోగి రమేష్‌కు జైలులో ప్రత్యేక వసతులు కల్పించాలని ఆదేశిస్తూ మంగళవారం 6వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆదేశాలు జారీచేశారు. ఆదివారం జోగి రమేష్ తరపు న్యాయవాదులు మన్మధరావు, యక్కంటి పుల్లారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి మాజీ మంత్రి హోదా కల వ్యక్తికి నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నకిలీ మద్యం కేసులో కౌంటర్లు వాయిదా

ఇదే కేసులో అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు, జోగి రమేష్, జోగి రామును కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్లపై డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి విచారణను ఈ నెల ఆరో తేదీకి వాయిదా వేశారు.

గ్రానైట్ యజమానులూ.. సమ్మె విరమించండి

మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమల సమస్యలను పరిష్కరిస్తామని, వెంటనే సమ్మె విరమించాలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర యజమానులకు విజ్ఞప్తి చేశారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రులకు సంఘం నేతలు వివరించారు. అన్ని గ్రేడ్‌ల ముడి సరుకుకు ఒకే రకమైన సీనరేజి చెల్లించడం ఇబ్బందవుతోందని చెప్పారు. సమ్మె వల్ల పరిశ్రమలపై ఆధారపడిన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని మంత్రి కోరారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి మైనింగ్ జేడీ, డీఎంజీవో, సీనరేజి వసూలు సంస్థ ప్రతినిధి, ప్రతి అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

PRESIDENCY UNIVERSITY
Established under Section 2(f) of UGC Act, 1956, Approved by AICTE, New Delhi | NAAC 'A' Accredited
BENGALURU
Invites Applications for January 2026
Professors, Associate Professors and Assistant Professors
SCHOOL OF COMPUTER SCIENCE AND ENGINEERING
AI and ML, Gen-AI, Agentic AI, Responsible AI, Data Science, IoT, AR and VR, Quantum Computing, Cloud Computing, Blockchain, Big Data, DevOps, Cyber Security and Digital Forensics, Robotics, Network Security, Mobile Computing, Game Development, MERN Stack, Visualisation, NLP, Fintech, Embedded and Decentralized Finance, Banking Technology, RUST Programing, Geonomics, Bioinformatics and Federated Learning.
SALARY
• Professor ₹ 1,80,000 p.m
• Associate Professor ₹ 1,50,000 p.m
• Asst. Professor ₹ 90,000 p.m
• Ph.D (Premier) ₹ 1,15,000 p.m
• M.Tech (Premier) ₹ 85,000 p.m
OTHER BENEFITS
• Research Grant & Incentives
• Provident Fund
• Gratuity • Free Transport
• Group Medical Insurance
• Group Accident Insurance
• Relocation Allowance
• Salary is not a constraint for exceptional candidates and is subject to eligibility criteria as per university norms.
• Career growth opportunities for performing candidates.
APPLY HERE
Careers-faculty@presidencyuniversity.in | +91-88673-27172

నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరి అరెస్ట్

స్పిరిట్ క్యాన్, 11 స్మార్ట్‌ఫోన్లు, రూ.17,400 నగదు స్వాధీనం

నిందితులకు 17 వరకు రిమాండ్ విధించిన కోర్టు

ములకలచెరువు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ పీటీఎం మండలంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారు ఆగకుండా వేగంగా వెళ్లడంతో వెంబడించి ఆపారు. అందులో ఉన్న నకిలీ మద్యం తయారీకి స్పిరిట్ సరఫరా చేసిన జినేష్‌ను, డ్రైవర్ శిబును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 35 లీటర్ల స్పిరిట్ క్యాను, 11 స్మార్ట్‌ఫోన్లు, కారు, రూ.17,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన జినేష్‌ను ఏ-24గా, డ్రైవర్ కె.శిబును ఏ-25గా చేర్చి తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వీరికి ఈ నెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఇప్పటి వరకు ఈ కేసులో నిందితుల సంఖ్య 25కు చేరింది.

బాలాజీ చెప్పడంతోనే స్పిరిట్ సరఫరా

ఇబ్రహీంపట్నానికి చెందిన ఏ.జనార్దన్‌రావుతో కలిసి ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి స్పిరిట్ సరఫరా చేయాలని బెంగళూరుకు చెందిన బాలాజీ తనను కోరినట్లు జినేష్ విచారణలో ఎక్సైజ్ అధికారులకు తెలిపాడు. దీంతో గోవా నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి ములకలచెరువుకు స్పిరిట్‌ను సరఫరా చేసినట్లు చెప్పాడు. గోవా నుంచి జినేష్ కారులోనే డ్రైవర్ కె.శిబు సహాయంతో స్పిరిట్ రవాణా చేసినట్లు విచారణలో తేలింది. గోవాలోని జేపీ డిస్టిలరీస్, రియల్ డిస్టిలరీస్ నుంచి స్పిరిట్ సరఫరా చేశారు. వీరు కేరళకు కూడా స్పిరిట్ రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. జినేష్‌పై కేరళలో సైతం స్పిరిట్ కేసులు నమోదైనట్లు సమాచారం.

స్పిరిట్ రవాణా చేసిన నిందితులను తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు

జయచంద్రారెడ్డి ఎక్కడ?

విదేశాల్లో, పక్క రాష్ట్రాల్లో ఉన్న నిందితులను అరెస్టు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు.. నకిలీ మద్యం తయారీ చేయించి, లాభాల్లో వాటాలు పంచుకున్న నాయకులను మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. నకిలీ మద్యం కేసులో ఏ-17 తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరపల్లి జయచంద్రారెడ్డిని, ఇతర నిందితులు గిరిధర్ రెడ్డి, జయచంద్రారెడ్డి పీఏ రాజేష్, వ్యక్తిగత అకౌంటెంట్ బి.అన్బురసులను మాత్రం అరెస్టు చేయలేదు. వీరిని అరెస్టు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీ పాత బ్యాంక్ అకౌంట్స్‌లో ఉన్న డబ్బుని మర్చిపోయారా?

మీ సొమ్ముని తిరిగి పొందడానికి ఆర్‌బిఐ మీకు సహాయపడుతుంది.
మీ బ్యాంకులో ఉన్న (2 సంవత్సరాలకు పైగా మరియు 10 సంవత్సరాల వరకు నిష్క్రియంగా ఉన్న) ఉపయోగంలో లేని ఖాతాలలోని డబ్బు / క్లెయిమ్ చేయని డిపాజిట్లు (10 సంవత్సరాలకు పైగా) ఆర్‌బిఐ యొక్క డిఇఏ ఫండ్‌కి బదిలీ చేయబడుతుంది. మీరు లేదా మీ చట్టపరమైన వారసులు ఎప్పుడైనా దాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.
మీ డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి 3 సులభమైన విధానాలు
1. మీ రెగ్యులర్ బ్రాంచ్ కాకపోయినా, ఏదైనా మీ బ్యాంక్ బ్రాంచ్‌ని సంప్రదించండి.
2. కెవైసి పత్రాలతో (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడి లేదా డ్రైవింగ్ లైసెన్స్) ఫారమ్‌ను సమర్పించండి.
3. ధృవీకరణ తర్వాత మీ డబ్బును వడ్డీతో సహా స్వీకరించండి.
మీ క్లెయిమ్ చేయని డిపాజిట్లను కనుగొనడానికి
మీ బ్యాంక్ వెబ్‌సైట్‌లో వెతకండి లేదా ప్రస్తుతం 30 బ్యాంకులను కలిగి ఉన్న ఆర్‌బిఐ యొక్క UDGAM పోర్టల్ (https://udgam.rbi.org.in) లో చూడండి.
అక్టోబర్ నుండి డిసెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించబడుతున్న అన్‌క్లెయిమ్డ్ ఆస్తులపై ప్రత్యేక శిబిరాలను సందర్శించండి.
ఆర్‌బిఐ అంటుంది... విషయాలు తెలుసుకోండి, జాగరూకంగా ఉండండి!
మరిన్ని వివరాల కోసం, https://rbikehtahai.rbi.org.inని సందర్శించండి
అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకు వ్రాయండి.
క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి
అధికారిక వాట్సాప్ నం. 9999041935
ప్రజా హితార్థం జారీ చేయబడింది
भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

ష్.. బయటకు మాట్లాడొద్దు

- ఎమ్మెల్యే కొలికపూడికి టీడీపీ క్రమశిక్షణ సంఘం సూచన
- విజయవాడ ఎంపీ అవినీతిపై లేఖ ఇచ్చిన కొలికపూడి
- కొలికపూడిపైనా ఆరోపణలు చేసిన ఎంపీ చిన్ని
- ఇద్దరితో విడివిడిగా మాట్లాడి సర్దుబాటు ప్రయత్నాలు
- ఈ సమయంలోనే పార్టీ కార్యాలయానికి వచ్చిన లోకేశ్

సాక్షి, అమరావతి: పార్టీకి సంబంధించి ఏ విషయం బహిరంగంగా మాట్లాడవద్దని, మీడియా, సోషల్ మీడియాలోనూ వాటి ప్రస్తావన తేవద్దని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌కి తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం సూచించినట్టు తెలిసింది. ఏవైనా అభ్యంతరాలు, ఇబ్బందులు ఉంటే తమకు చెప్పాలని స్పష్టం చేసినట్టు సమాచారం. ఎంపీ, ఎమ్మెల్యే మధ్య విభేదాలు ఇటీవల తీవ్రస్థాయికి చేరాయి. ఒకరిపై ఒకరు పలు ఆరోపణలు చేసుకున్నారు. తన వద్ద ఎమ్మెల్యే సీటు కోసం ఎంపీ కేశినేని చిన్ని రూ.5 కోట్లు తీసుకున్నట్టు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వెల్లడించడంతో టీడీపీ అధిష్ఠానం ఉలిక్కిపడింది. పార్టీకి సంబంధించిన మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయనే ఆందోళనతో చంద్రబాబు కొలికపూడితో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే మధ్య సర్దుబాటు చేయాలని క్రమశిక్షణ సంఘానికి సూచించారు. దీంతో సంఘం సభ్యులైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నేతలు వర్ల రామయ్య, పంచుమర్తి అనూరాధ, కొనకళ్ల నారాయణ మంగళవారం ఉదయం కొలికపూడిని పిలిచి మాట్లాడారు. పార్టీలో తనకు జరుగుతున్న అవమానాల గురించి కొలికపూడి వారి వద్ద ఏకరువు పెట్టినట్టు తెలిసింది. ఎమ్మెల్యేనైనా తనకు నియోజకవర్గంలో ఎటువంటి అధికారాలు లేకుండా చేశారని, నియామకాలు, కార్యక్రమాలు, పనులన్నింటిలో ఎంపీ జోక్యం చేసుకుంటున్నారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఎంపీ చిన్ని తిరువూరు నియోజకవర్గంలో చేసిన అవినీతి వ్యవహారాలు, తనకు తెలియకుండా చేపట్టిన పనులు, నియామకాలు వంటి అన్నింటి గురించి లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. ఆ లేఖ తీసుకున్న క్రమశిక్షణ సంఘం సభ్యులు ఇకపై ఏ విషయం బయట మాట్లాడకూడదని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు తెలిసింది. ఎంపీ తన నియోజకవర్గంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆయన ప్రశ్నించగా.. దానికి సమాధానం దాటవేసిన సభ్యులు.. పార్టీ చెప్పినట్టు వినాలని చెప్పారు. దీంతో కొలికపూడి ఆగ్రహంతో బయటకు వచ్చారు. తన అనుచరులతో కూడా మాట్లాడకుండా ఒంటరిగానే కారులో వెళ్లిపోయారు. ఆ తర్వాత కేశినేని చిన్ని కమిటీ సభ్యులను కలిసి తన వాదన వినిపించారు. తన పరిధిలోని ఎమ్మెల్యేలు కొందరు పార్టీకి నష్టం చేస్తున్నారని చెప్పారని, కొలికపూడికి స్థానిక పార్టీతో విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని చెప్పినట్టు తెలిసింది. ఇకపై ఇద్దరూ బహిరంగంగా మాట్లాడకూడదని చెప్పిన సంఘం నేతలు నివేదికను చంద్రబాబుకు ఇస్తామని, ఆ తర్వాత తుది నిర్ణయం ఉంటుందని తెలిపారు.

లోకేశ్ ఎంట్రీ

మరోవైపు తన నివాసంలో ప్రజాదర్బార్ పేరుతో ప్రజల నుంచి వినతులు తీసుకునే సీఎం కుమారుడు, మంత్రి లోకేశ్ మంగళవారం మాత్రం పార్టీ కార్యాలయానికి వచ్చి వినతులు తీసుకున్నారు. తన అనుయాయుడైన విజయవాడ ఎంపీ చిన్ని క్రమశిక్షణ సంఘం ఎదుట హాజరై వివరణ ఇచ్చే సమయంలో ఎన్నడూ లేనివిధంగా లోకేశ్ పార్టీ కార్యాలయానికి రావడం చర్చనీయాంశమైంది. చిన్నికి మద్దతుగానే ఆయన మంగళవారం తన కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది.

మన ఆలోచనలే మన శత్రువులైనా, స్నేహితులైనా!
మనస్సు రాగ ద్వేషాలకు అతీతంగా ఉన్నప్పుడు,
ఆనందం ఎప్పటికీ వదలని నీడలా మన వెంటే వస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 5 నవంబర్ 2025

పాఠాలు నేర్వని ప్రభుత్వం

ఎంతో భక్తి ప్రపత్తులతో ఆలయ సందర్శనకొచ్చేవారికి కనీస రక్షణ చర్యలు తీసుకోవటం ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వానికి చేతగాదని మరోసారి నిరూపణయింది. భక్తులందరూ పవిత్రంగా భావించే కార్తిక ఏకాదశి రోజైన శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెయిలింగ్ ఊడిపడి తొక్కిసలాట జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయిన తీరు ఆయన ఏలుబడికి అద్దం పడుతోంది. ఈ విషాద ఘటనలో 20 మందికి పైగా గాయపడ్డారు. వెనువెంటనే ఘటనాస్థలికొచ్చిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కొన ఊపిరితో ఉన్న కొందరికి సీపీఆర్ చేయటంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన చొరవ కారణంగానే అంబులెన్స్‌లు వచ్చి గాయపడినవారిని ఆస్పత్రులకు తరలించాయి. లేకుంటే మృతుల సంఖ్య ఇంకా పెరిగేది. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అధికారంలోకొచ్చాక ఇలాంటి దుర్ఘటన జరగటం ఇది మూడోసారి. ఈ ఏడాది జనవరిలో పుణ్యక్షేత్రమైన తిరుపతిలో వైకుంఠ ఏకాదశి రోజున టీటీడీ, ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయటంలో చూపిన నిర్లక్ష్యం పర్యవసానంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించారు. మరో 43 మంది గాయపడ్డారు. శతాబ్దాల చరిత్ర కలిగిన తిరుపతిలో ఇటువంటి దారుణం జరగటం అదే ప్రథమం. అటు తర్వాత మార్చిలో సింహాచల క్షేత్రంలో అక్షయ తృతీయ సందర్భంగా ఎంతో వేడుకగా జరిగే చందనోత్సవంలో తొక్కిసలాట చోటు చేసుకుని ఏడుగురు చనిపోయారు. 2015లో ఇదే చంద్రబాబు సీఎంగా ఉండగా ఆయన కారణంగా, ఆయన సమక్షంలో రాజమహేంద్రవరంలో పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి 29 మంది బలయిపోయారు.

అనుకోని దుస్సంఘటనలు జరిగినప్పుడు వెనువెంటనే బాధ్యులెవరో గుర్తించి చర్య తీసుకోవటానికి పాలకులు ఉద్యుక్తులవుతారు. బాబు ఒక్కరు మాత్రం కబురు తెలిసిన వెంటనే సాకుల కోసం వెదుకుతారు. ఇలాంటివి సర్వసాధారణమేనన్న తర్కానికి దిగుతారు. పుష్కరాలు మొదలుకొని తిరుపతి, సింహాచలం తొక్కిసలాటల వరకూ ఆయన బాణీ అదే. ఇప్పుడు కూడా దాన్నే తు.చ. తప్పకుండా పాటించారు. కాశీబుగ్గ ఆలయం ప్రైవేటు వ్యక్తిదట. ఆ రోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని పోలీసులకు సమాచారం లేదట. ఇంకా నయం... కార్తిక ఏకాదశి రోజున ఆలయాలకు భక్తులొస్తారను కోలేదని అనలేదు! ఇంతకూ తిరుపతి, సింహాచలంలో తొక్కిసలాటలు చోటుచేసుకున్న ప్రాంగణాలు ఎవరి అధీనం లోనివి? చాలాముందుగా తెలిసినా అక్కడ బాబు సర్కారు ఒరగబెట్టిందేమిటి? పోలీసుల సంగతలా ఉంచి అనుకోనిది జరిగితే ముందుకురికేందుకు అంబులెన్స్‌లూ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలనైనా అందుబాటులో ఉంచగలిగారా? మరి ఎవరిని వంచించటానికి ఈ మాటలు? టీడీపీ వందిమాగధ మీడియా ఆయన్ను మించిపోయింది. ఫలానా రోజొచ్చే పర్వదినం మళ్లీ జన్మలో రాదని సోషల్ మీడియాలో ఊదరగొట్టేవారు పెరిగి పోవటం వల్లే ఈ దురదృష్టకర సంఘటన జరిగిందట! పర్వదినాలేవో పంచాంగాలే చెబుతాయి. దేవదాయ శాఖ ఆలయమైనా, ప్రైవేటు ఆలయమైనా భక్తులు క్యూ కడతారు. చెప్పినా చెప్పకున్నా ఏర్పాట్లు చేయటం ప్రభుత్వ బాధ్యత.

చంద్రబాబు గుర్తించారో లేదోగానీ, తెలియదు... చెప్పలేదు అనే రోగానికి మూలం మరోచోట ఉంది. 'నలుగురు కూడిన కాడ నరలోకం యముడుండు' అని గద్దర్ ఒక పాటలో అన్నట్టు పదిమంది జమయితే పోలీసులు అనుమానంగా చూస్తారు. అది నిరసనైనా, ఉత్సవమైనా, ఊరేగింపైనా వారి స్పందన ఒకేలా ఉంటుంది. అంతమంది గుమిగూడటానికి ముందస్తు అనుమతులున్నాయా అని ఆరా తీస్తారు. తగిన చర్యలు తీసుకుంటారు. ఇంటెలిజెన్స్ విభాగం నిమగ్నమయ్యేది అలాంటి సమాచార సేకరణలోనే. మరి బాబు రక్షకభటులేం చేశారు? డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు సహాయచర్యల్లో పాల్గొంటుండగా ప్రత్యక్షమయ్యారు. రాజకీయ కక్ష సాధింపులకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసేచోట, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలయ్యేచోట ఇంతకన్నా మెరుగ్గా పోలీసులు వ్యవహరిస్తారని ఆశించలేం. ఇప్పటికైనా బాబు తెలివి తెచ్చుకుని సవ్యంగా పాలించటం మొదలెట్టాలి. జనం ప్రాణాలు అరచేత బట్టుకుని ఉత్సవాలకెళ్లే దురవస్థ నుంచి తప్పించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** పౌర్ణమి రా.7.13 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** అశ్విని ఉ.10.16 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.6.31, నుండి 8.01 వరకు, తదుపరి రా.7.15 నుండి 8.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.23 నుండి 12.08 వరకు, **అమృత ఘడియలు:** తె.4.10 నుండి 5.41 వరకు, **కార్తిక పౌర్ణమి.**

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.25
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

'గ్రహ' హింస

నువ్వు ప్రపంచాన్ని భుజంపై మోసే అట్లాస్ కాదు. ఈ గ్రహం నిన్ను మోస్తున్నదని గుర్తుంచుకోవడం మంచిది. మనకు అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకునే వినియోగం లేదా ఉత్పత్తి విధానాలలో మనం పాల్గొన్నప్పుడల్లా, మనం మన గ్రహంపై హింసకు పాల్పడుతున్నట్లే!

– వందనా శివ, పర్యావరణ కార్యకర్త

హార్స్ పవర్

పని చేయించే వాళ్లు కూడా పని చేసేవాళ్ల దగ్గర్నుంచి చాలా నేర్చుకోవాలి. పని చేసేవాళ్లు, పని చేయించే వాళ్లు ముఖ్యం కాదు. పని జరగటం ముఖ్యం. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అనేది చెత్త మాట. గుర్రంలా ప్రతి ఒక్కరూ నిరంతరం పని చేస్తూ ఉన్నప్పుడే దేశం పరుగు ఆగకుండా ఉంటుంది.

– సనే తకైచి, జపాన్ తొలి మహిళా ప్రధాని

విజయం మీదే!

మీరు ఏం చేయాలనుకుంటున్నారో, దానిని హృదయపూర్వకంగా చేయండి. దాని కోసం నిజంగా కష్టపడండి. ధ్యాసను మరల్చకండి. కొన్ని అంతరాయాలు ఉంటాయి, కానీ మీరు మీ పట్ల నిజాయతీగా, ఏకదీక్షతో ఉండగలిగితే, మీరు కచ్చితంగా విజయం సాధిస్తారు.

– విరాట్ కోహ్లీ, స్టార్ క్రికెటర్

రెండు పనులు

తేలికైన పని, ముఖ్యమైన పని అని రెండు ఉంటాయి. తేలికైన పని అసలు పనే కాదు కనుక దాని కోసం సమయం వృథా చేయకండి. ఇక ముఖ్యమైన పని. అందులోనే సవాళ్లు, ఆటంకాలు ఉంటాయి. కష్టమైనా, నష్టమైనా అదే నిజానికి ప్రయోజనకరమైన పని.

– ఎలాన్ మస్క్, బిజినెస్‌మేన్

ఆటకు ప్రేరణ



దూకుడుగా ఆడటం వల్ల కొన్ని ప్రమాదాలు ఉన్నాయి. అలాగే కొన్ని అనుకూలతలు కూడా! ప్లేయర్ జాగ్రత్తగా ఆడుతుంటే ఆట తన పటుత్వాన్ని కోల్పోతుంది. దాడి చేసినట్లు ఆడితే ప్రత్యర్థి ఆట బలహీనపడుతుంది. రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లు నాకు ప్రేరణ.

– ట్రావిస్ హెడ్, ఆస్ట్రేలియన్ క్రికెటర్

అవే కావచ్చు

తగని సమయం, తగని ప్రదేశం అంటూ ఉండవు. మనకు ఉన్న సమయంలోనే మనం ఉన్న స్థితిలోనే మనం ఎప్పుడూ ఉంటాం. బహుశా మనం ఉండాల్సిన సమయం, చోటు అవే కావచ్చు. సమయానికి, ప్రదేశానికి మన వల్ల మంచీ చెడే తప్ప, వాటి వల్ల మనకు కాదు.

– శశి థరూర్, ఎంపీ

నేర్చుకోవడమే నిత్యానందం

విశ్వ గురు

అమెరికాలోని నెబ్రాస్కా-లింకన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి ప్రఖ్యాత ఇన్వెస్టర్ **వారెన్ బఫెట్** చెప్పిన మాటల్లోని ముఖ్యాంశాలు:

ఎప్పుడైనా నేనిచ్చే సలహా ఒకటే. మనం చదువుకునే విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాకరమైనదే కావచ్చు. కానీ, అక్కడి ప్రొఫెసర్లు, వాతావరణం నచ్చనప్పుడు, అక్కడి నుంచి బయటకు వెళ్ళిపోయేందుకు వెనుకాడకూడదు. నేను పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూలులో రెండేళ్ళు చదివిన తర్వాత, అక్కడి పరిస్థితులు నచ్చక ఇదే నెబ్రాస్కా-లింకన్ యూనివర్సిటీకి వచ్చేశాను. ఈ యూనివర్సిటీలో ప్రతి నిమిషం ఆనందంతో గడిపాను. ఇక్కడే 1951లో గ్రాడ్యుయేట్ అయ్యాను. విద్యాలయం విషయంలోనే కాదు, చదువు పూర్తయ్యాక, ఉద్యోగం చేసే సంస్థల విషయంలో కూడా వాటి పేరు ప్రఖ్యాతులను పక్కనబెట్టి, మన మనసు చెప్పిన మాట ప్రకారం నడచుకోవాలి.

మొదట ఏదో ఓ కొమ్మ...

జీవితంలో సంతృప్తినిచ్చే, మనసారా కోరుకునే ఉద్యోగం మనకు మొదట్లోనే లభించకపోవచ్చు. అది ఎక్కడో ఉంటుంది. ఆరంభంలోనే ఆ అవకాశం లభించకపోవచ్చు. కానీ, రోజులు వెళ్ళదీయాలి కనుక, లభించిన ఉద్యోగాన్ని మొదట చేపట్టక తప్పదు. అలాగని, వచ్చిన దానితోనే సంతోషపడిపోకూడదు. మీరు అభిమానించని కంపెనీలో లేదా మీరు ఇష్టపడే వ్యక్తులు లేని చోట ఉండిపోయి అదే పనిలో కొనసాగాలని అనుకోవద్దు.

నచ్చిన ఉద్యోగంలో చేరండి. అది ఇచ్చే సంతృప్తి కోసం ఉద్యోగానికి వెళ్ళేందుకు ఉదయమే పక్క మీంచి లేచి కూర్చుంటారు. ఆ మేరకు నేను అదృష్టవంతుడిననే చెప్పుకోవాలి. ఇష్టపడే పనిలోకే రాగలిగాను. దానిని మించింది మరొకటి ఉండదని చెప్పగలను. చేస్తున్న పని అసలు పనే అనిపించదు. ఏరోజు కారోజు త్వరగా పనిలోకి దిగాలని అనిపిస్తుంది. ఉద్యోగాల వేట మొదలు పెట్టిన మొదటి రోజునే మనకు అటువంటిది దొరక్కపోవచ్చు. కానీ, ఎక్కడో ఉండే ఉంటుంది. దాని కోసం అన్వేషించాలి. దాన్ని సక్రమంగా నిర్వహించేందుకు సంసిద్ధులమై ఉండాలి. యజమానులు ఎటువంటివారిని నియమించాలని ఎదురు చూస్తున్నారో వారు కోరుకునే విధంగా మనం తయారు కావాలి. అప్పుడే వారు మనల్ని ఉద్యోగంలోకి తీసుకుంటారు. తక్షణ ఆర్థిక ప్రయోజనాలను పక్కనపెట్టి, ఒక్కోసారి జీతభత్యాలు లభించకపోయినా సరే, ఇష్టపడే వృత్తి వ్యాసంగాలనే చేపట్టాలి.

> పుస్తక పఠనం ద్వారా రకరకాల ఆలోచనా స్రవంతులను ఆకళింపు చేసుకోగలుగుతాం. చదవడంలో ఎంతో ఆనందం ఉంది. జీవితాన్ని అదే ఆసక్తికరంగా మారుస్తుంది.

కమ్యూనికేషన్ స్కిల్స్

కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యం. బాగా రాసే, బాగా మాట్లాడే కళను సంతరించుకోవాలి. నిన్న మనకు తెలియని చాలా విషయాలను నేడు తెలుసుకుని రోజుకు స్వస్తి పలికితే అంతకన్నా అద్భుతమైన కాలం ఇంకేముంటుంది? ప్రతిభావంతులైన విద్యార్థులను చూస్తే, నాకు ప్రపంచంపై ఆశావాదం రేకెత్తుతుంది. ఎదుగుదలపై నమ్మకం ఉంచి రంగంలోకి దిగాలనిపిస్తుంది. స్టాక్ మార్కెట్‌లో అది నన్ను 'బుల్లిష్'గా వ్యవహరించేటట్లు చేస్తుంది. మీరూ నాలాగానే జీవితం పొడవునా రకరకాల పరిస్థితులను ఎదుర్కోనున్నారు. నేను చూసిన మహా మాంద్యం లేదా రెండవ ప్రపంచ యుద్ధం, చవిచూసిన ఎత్తు పల్లాల లాంటి ఆశ్చర్యకర ఘటనలు మీకూ ముందు అనుభవంలోకి రావచ్చు. అంతిమంగా గెలుపు మీదే అవుతుంది. అయితే, ఏ రంగంలో రాణించడానికైనా కమ్యూనికేషన్ నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలి.

విజేతలుగా నిలుస్తామని అంటే అర్థం మనకి ప్రతి రోజు అద్భుతంగా గడుస్తుందని కాదు. ప్రపంచం ఎన్నటికీ అలా నడవదు. మరో దేశంలోనో, మరో కాలంలోనో ఉండి ఉంటే, రాణించి ఉండే వారమనుకోవడం తప్పు. ఉన్న చోటునే, ఉన్న పరిస్థితుల్లోనే పైకి ఎదిగేందుకు ప్రయత్నించాలి. నా ఉద్దేశం – అందరికీ అవకాశాలు తప్పకుండా వస్తాయి. కానీ, జీవితం అన్నాక ఎగుడు దిగుళ్ళు ఉంటాయి. అనారోగ్య సమస్యలో మరొకటో తలెత్తుతాయి. ప్రతి రోజూ ఎంతో కొంత కొత్త విజ్ఞానాన్ని సముపార్జించుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. ఈ ప్రపంచంలో ఎదగడానికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో గ్రహించి ఉంటారు. ఇక ముందు కూడా అదే ధోరణితో జీవితాన్ని కొనసాగించాలి.

నిరంతరం చదవాలి!

పుస్తకాలు చదవడాన్ని మించిన గొప్ప అలవాటు మరొకటి లేదు. అది వజ్రాయుధం లాంటిది. తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఉత్సుకత ఉండాలి. ఎవరో ఒక వ్యక్తితో మాత్రమే విందు ఆరగించే అవకాశం లభిస్తే, దాన్ని బతికివున్న వ్యక్తితో వినియోగించుకుంటారా లేక చనిపోయిన వారిలో ఎవరినైనా ఎంచుకొంటారా అని కొన్నిసార్లు కొందరు నన్ను అడుగుతూంటారు. దానికి, చదవడాన్నే సహచరుడిగా చేసుకుంటాననేది నా జవాబు. మనం బెంజమిన్ ఫ్రాంక్లిన్ పుస్తకాన్ని చదువుతూంటే, ఆయనతో కూర్చుని విందును ఆరగిస్తున్నట్లే లెక్క. ఆ మాటకొస్తే, ప్రపంచ చరిత్రలోని ఏ మహా వ్యక్తితోనైనా మనం గడపవచ్చు. నిజం చెప్పాలంటే, మనం వారితో చాలా సుదీర్ఘమైన విందు ఏర్పాటు చేసుకోవచ్చు. పుస్తక పఠనం ద్వారా మనం రకరకాల ఆలోచనా స్రవంతులను ఆకళింపు చేసుకున్న వారమవుతాం. నేను కాళ్ళున్న పుస్తకం లాంటివాడినని ఎవరో ఓసారి వ్యాఖ్యానించారు. నేర్చుకోవడంలో, చదవడంలో ఎంతో ఆనందం ఉంది. నేర్చుకోవడం జీవితాంతం సాగే ప్రక్రియ. జీవితాన్ని అదే ఆసక్తికరంగా మారుస్తుంది.

చదువుకోవడంలో లక్ష్యం కేవలం విషయ పరిజ్ఞానం సంపాదించడం కాదు. తోటివారితో ఎలా మెలగాలో తెలుసుకోవడం. వారితో స్నేహ సంబంధాలను ఏర్పరచుకోవడం. ఇక్కడ కాలేజీలో, అంతకుముందు స్కూల్లో మీరు కొందరితో స్నేహం చేసి ఉండవచ్చు. సన్మిత్రులు కూడా జీవితంలో ముఖ్యమే!

విజయానికి నిర్వచనం

వ్యాపారంలోనో, వృత్తి జీవితంలోనో, లేదా వ్యక్తిగత జీవితంలోనో విజయాన్ని లేదా సఫలత పొందడాన్ని ఎలా నిర్వచించుకోవాలనే ప్రశ్న కూడా ఎదురవుతుంది. అసలు జీవన సాఫల్యం అంటే ఏమిటి? ఇది గొప్ప ప్రశ్న. తొంభై ఏళ్ళు వచ్చేసరికి కుబేరులుగా మారిన వారిని నేను చాలా మందిని ఎరుగుదును. అలాగని వారి జీవితాలను విజయాలుగా అభివర్ణించలేం. వారి వారి రంగాల్లో చాలా ప్రఖ్యాతి వహించిన వారు కూడా నాకు తెలుసు. కానీ, వాటినీ విజయాలుగా భావించలేం. 70 ఏళ్ళు వచ్చేసరికి అందరూ ఇష్టపడే పురుషుడిని, లేదా స్త్రీని నేను ఎన్నడూ చూడలేదు. వారున్న హోదాలో కొనసాగాలని వారికి అనిపించవచ్చు. దాన్ని విజయంగా తప్ప, మరి ఏ విధంగానైనా అభివర్ణించవచ్చు.

> మరో దేశంలోనో, మరో కాలంలోనే ఉండి ఉంటే రాణించి ఉండేవారమనుకోవడం తప్పు. ఉన్న చోటునే, ఉన్న పరిస్థితుల్లోనే పైకి ఎదిగేందుకు ప్రయత్నించాలి.

మన పిల్లలు, జీవిత భాగస్వామి, సహోద్యోగుల ప్రేమను చూరగొంటే అది సఫలత అనిపించుకుంటుంది. అటువంటి వారిని తమ జీవితకాలంలో చూస్తూ వచ్చి 65 లేదా 70 ఏళ్ళ వయసుకు చేరినవారు జీవన సాఫల్యం పొందినట్లు లెక్క. ఎంతో ప్రజ్ఞాపాటవాలు ఉండి, సిరి సంపదలు, పేరు ప్రఖ్యాతులు గడించుకుని ఉన్న వారిని చాలా మందిని చూశాను. కానీ, వారిలో ఏదో వెలితి. నలుగురి ప్రేమనూ చూరగొనలేని జీవితం ఎంత గొప్పదైనా అది వట్టి డొల్ల కిందే లెక్క! ◆

విద్యావ్యవస్థలో ఏఐని ఎలా వాడుకోవాలి?

నేడు కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచవ్యాప్తంగా, విద్యారంగంలో పెనుమార్పులకు కారణమవుతోంది. అన్ని దేశాలూ తమ విద్యా వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నాయి. విద్యార్థుల సామర్థ్యాలు, బలహీనతలను విశ్లేషించి వారికి అనుగుణంగా పాఠ్యాంశాలను ఏఐ రూపొందించగలదనీ, ప్రతి విద్యార్థికీ వ్యక్తిగత అభ్యసన మార్గాన్ని సృష్టించగలదనీ అంటున్నారు. ఏఐ ఆధారిత సాధనాలు విద్యార్థుల పరీక్ష పత్రాలను స్వయంచాలకంగా మూల్యాంకనం చేసి తక్షణమే ఫీడ్ బ్యాక్ ఇవ్వగలవనీ, పాఠశాలల పరిపాలనలో సహాయపడటం ద్వారా ఉపాధ్యాయుల పనిభారాన్ని తగ్గించగలవనీ చెబుతున్నారు.

ఈ వాగ్దానాలు అన్నీ కాకపోయినా, కొన్ని నిజం కావచ్చు, కానీ వాటిని అమలు చేయడానికి కొన్ని మౌలిక సవాళ్లు ఉన్నాయి. వ్యవస్థలు పని చేయాలంటే భారీ మొత్తంలో డేటా అవసరం. ఈ డేటాను సేకరించడం, భద్రంగా ఉంచడం, దుర్వినియోగం కాకుండా చూడటం పెద్ద సవాలు. ప్రముఖ భాషాశాస్త్ర వేత్త నోమ్ చామ్‌స్కీ ఛాట్ జీపీటీ వంటి ఏఐ సాధనాలు విద్యార్థులు నేర్చుకోవడం తప్పించు కోవడానికి వాడే పద్ధతులని అంటారు.

ఏదైనా కొత్త విధానాన్ని అమలు చేయాలంటే దాని ప్రభావంపై కచ్చితమైన ఆధారాలు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో పర్సన లైజ్డ్ అండ్ ఎడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్) ప్రోగ్రామ్ అమలు సాక్ష్యాధారిత విధానానికి అద్భుతమైన ఉదాహరణ. 2019 నుండి 2023 వరకు అప్పటి సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేశారు.

నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ మైకెల్ క్రేమెర్, ఆయన బృందం యూనివర్సిటీ ఆఫ్ చికాగోలోని డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని మూల్యాంకనం చేశారు. 120 ప్రభుత్వ పాఠశాలల్లో 14 వేల మంది విద్యార్థులపై జరిగిన ఈ అధ్యయనం అద్భుతమైన ఫలితాలను చూపించింది. పీఏఎల్‌ను ఉపయోగించిన విద్యార్థులు కేవలం 17 నెలల్లో 1.9 సంవత్సరాల విద్యకు సమానమైన పురోగతిని సాధించారు. బాలికలు 2.31 సంవత్సరాల విద్యకు సమానమైన లాభం పొందగా, బాలురు 1.54 సంవత్సరాల లాభం పొందారు. తక్కువ స్థాయిలో ఉన్న విద్యార్థులు అత్యధిక లాభాలను పొందారు. ఇది విద్యా అసమానతలను తగ్గించడంలో పీఏఎల్ శక్తిని తెలియజేస్తుంది. ప్రతి విద్యార్థికీ సంవత్సరానికి ఖర్చు కేవలం రూ. 1,682 మాత్రమే.

ప్రొఫెసర్ క్రేమెర్ ఆంధ్రప్రదేశ్‌లో పీఏఎల్ అమలును భారతదేశంలో ఉత్తమ సాక్ష్యాధారిత ఉదాహరణగా ప్రశంసించారు. ఆయన భారతదేశంలో విద్యా సంక్షోభాన్ని పరిష్కరించడానికి తాను విధానకర్తగా ఉంటే పీఏఎల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తానని పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ తమ పాఠశాల వ్యవస్థల్లో కృత్రిమ మేధను అమలు చేయడం ప్రారంభించాయి. రెండు రాష్ట్రాలూ పీఏఎల్ విజయాన్ని సాక్ష్యాధారిత విధానంగా స్వీకరించి, ఏఐ కార్యక్రమాలను రూపొందించడంలో దీన్ని మార్గ దర్శకంగా తీసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో పీఏఎల్ విజయం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పిస్తుంది. సాక్ష్యాధారిత విధానాలు, కఠినమైన మూల్యాంకనం, శాస్త్రీయ పద్ధతులు నిజమైన విద్యా మార్పును సాధ్యం చేయగలవు. కృత్రిమ మేధ కేవలం ఒక సాధనం. సరైన నియంత్రణలు, స్పష్టమైన లక్ష్యాలు, నైతిక ప్రమాణాలతో ముందుకు సాగితే, ఏఐని విద్యారంగంలో నిజమైన మార్పునకు సాధనంగా మార్చవచ్చు.

– ఏటూరి సోమశేఖర్ శర్మ
విశ్రాంత జిల్లా విద్యా శాఖాధికారి, ఖమ్మం । 84640 98989

'షట్‌డౌన్' తెచ్చిన ఆహార సంక్షోభం

ఇన్ బాక్స్

ప్రస్తుతం అమెరికాలో ఆహార సంక్షోభం తలెత్తింది. ఈ మాట వినడానికే వింతగా ఉన్నా... వాస్తవం! అక్కడ ప్రస్తుతం 'షట్‌డౌన్' కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ షట్‌డౌన్ ప్రభావం అనేక రంగాలపై పడింది. తాజాగా వివిధ రాష్ట్రాలలో ఆహార సంక్షోభానికి దారి తీసింది. ప్రధానంగా వాణిజ్య రాజధాని అయిన న్యూయార్క్‌పై పడింది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆహార సాయం నిలిచిపోయింది. దీంతో ఆ రాష్ట్రం 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించింది. ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ అమెరికాలోని కోట్లాది మంది అల్పాదాయ కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ అల్పాదాయ కుటుంబాలకు జీవనాధారమైన 'సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' లేదా 'ఫుడ్ స్టాంప్స్' ప్రయోజనాలు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. అమెరికాలో ఈ ప్రోగ్రామ్ ద్వారా దాదాపు నాలుగున్నర కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. వీరిలో ఎక్కువమంది పేదవారే! ఇదిలా ఉంటే, నిధుల కొరత కారణంగా నవంబరు నెల ప్రయోజనాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నిలిపివేయాలని ఇటీవల రాష్ట్ర ఏజెన్సీలను అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కాగా ఆహార సంక్షోభాన్ని పరిష్కరించాలన్న చిత్తశుద్ధి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు లేదని గవర్నర్ కేథీ హోచుల్ ఆరోపించారు. చట్టబద్ధంగా ఆమోదించిన ఎమర్జెన్సీ ఫండ్‌ను విడుదల చేయడానికి ట్రంప్ సర్కార్ నిరాకరిస్తోందని కేథీ ఘాటు ఆరోపణలు చేశారు. ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడానికి అమెరికాలోని అనేక రాష్ట్రాలు సొంతంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఈ జాబితాలో లూసియానా, వెర్మంట్, న్యూ మెక్సికో ముందు వరుసలో ఉన్నాయి.

అమెరికా ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రతి ఏడాది తప్పనిసరిగా ఒక బడ్జెట్‌ను లేదా తాత్కాలిక ఖర్చులను అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందు అంటే అక్టోబరు ఒకటో తేదీలోగా కాంగ్రెస్ ఈ బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉంటుంది. అలా జరగకపోతే, ప్రభుత్వంలో అత్యవసరం కాని సేవలు తాత్కాలికంగా నిలిచిపోతాయి. దీనినే 'ప్రభుత్వ షట్‌డౌన్' అంటారు. వాస్తవానికి ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడాలనే సదుద్దేశంతో షట్‌డౌన్ చట్టాన్ని తొలి రోజుల్లో తీసుకువచ్చారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడాలనే నియమాన్ని అన్ని రాజకీయ పార్టీలూ పక్కన పెట్టి... తమ విధానపరమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి బడ్జెట్ ఆమోదాన్ని అడ్డుకుంటున్నాయి. అయితే సామాన్య అమెరికన్లు మధ్యలో నలిగి పోవడం గమనార్హం.

– ఎస్. అబ్దుల్ ఖాలిక్ । సీనియర్ జర్నలిస్ట్

అత్యంత ఖరీదైన కంపెనీ!

డేటా పాయింట్

ప్రపంచంలో 5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న మొట్టమొదటి కంపెనీగా అమెరికాకు చెందిన ఎన్‌విడియా అవతరించింది. 2023 మేలో దీని మార్కెట్ క్యాపిటలైజేషన్ లక్ష కోట్ల డాలర్లు. ప్రపంచంలో టాప్ కంపెనీలు...

మార్కెట్ క్యాపిటలైజేషన్ (లక్షల కోట్ల డాలర్లలో)

కంపెనీ	మార్కెట్ క్యాపిటలైజేషన్
ఎన్‌విడియా	5.12
ఆపిల్	4.01
మైక్రోసాఫ్ట్	4.0
ఆల్ఫాబెట్	3.26
అమెజాన్	2.45

(అక్టోబరు 29 నాటికి)

ఆధారం: బ్లూమ్‌బర్గ్

దేవ దీపావళి

చంద్రమా మనసో జాతః – చంద్రుడు (సృష్టికారకుడైన) విరాట్ పురుషుడి మనసు నుండి పుట్టాడు – అని ఋగ్వేద వాక్యం. అందుకే, సముద్రపు ఆటుపోట్లకూ, అమావాస్య – పూర్ణిమలకూ ఉన్న సంబంధం లాగే, భూమి మీద మనుషుల మనసుల పని తీరు తీవ్రతకూ, ఆకాశంలో చంద్రబింబం వృద్ధి క్షయాలకూ కాదనలేని సంబంధం కనిపిస్తుంది. మానసిక రోగ చికిత్సా నిపుణులు కూడా మద్దతునిచ్చే మాట ఇది.

నిండు పున్నమి దినాలలో మనిషి మనసుకు చురుకు ఎక్కువ. పున్నమి నాళ్ళలో, అటు రసభావాల వైపుగానీ ఇటు ఆధ్యాత్మికత వైపుగానీ మనసు ఎప్పటికంటే ఎక్కువ తీవ్రతతో స్పందిస్తుంది. అందుకే సాధకులకూ, భక్తులకూ, యోగులకూ పౌర్ణమి ప్రత్యేక విశిష్టత గల తిథి. అది మంత్రోపదేశాలకూ, ఉపాసనలకూ, తీవ్రమైన ధ్యానాలకూ మహత్తరమైన ముహూర్తం. పున్నమి అంటేనే పొంగిపోయే మనసు, శరత్కాల పూర్ణిమ అంటే మరీ ఉరకలెత్తుతుంది. శివకేశవులిరువురి అర్చనకూ సమానంగా ప్రశస్తమైనది కార్తిక పౌర్ణమి. ఆ పర్వ దినాన, మనసు పరుగునూ, చురుకునూ మంత్ర జపాల వైపు, ఇష్టదేవతారాధన వైపు మళ్ళిస్తే మరింత ఫలప్రాప్తి పొందవచ్చునని పెద్దల మాట.

కార్తిక పూర్ణిమ మనుషులకే కాదు, దేవతలకు కూడా పవిత్రమైన పర్వదినమని పురాణాలు చెబున్నాయి. ఆస్తికావళికి ఆధ్యాత్మిక రాజధాని అయిన కాశీ క్షేత్రంలో, కార్తిక పూర్ణిమను 'దేవ దీపావళి'గా పరిగణిస్తారు. వారణాసిలో గంగా తీరాన అన్ని ఘాట్‌లనూ దీపాలతో అలంకరించటంతో, గంగ ఒడ్డు లోకాతీతంగా ప్రకాశిస్తుంది. దేవతలు వారణాసికి వచ్చి గంగామాతను ఘనంగా అర్చించి వెళతారని ఆస్తికుల విశ్వాసం. కార్తిక దీపాలూ, జ్వాలాతోరణాలు, దేవ దీపావళుల లాంటి నైమిత్తిక సంప్రదాయాలతోనూ; అర్చనలూ, జపతపాలూ, అభిషేకాలూ, ధానధర్మాలతోనూ, ఆస్తికులు తమ మనసుకు నచ్చిన మార్గంలో, తమతమ ఇష్ట దేవతలను కొలుచుకొని, విశేషమైన అనుగ్రహం పొందటానికి అనుకూలమైన రోజు కార్తిక పూర్ణిమ. అలాగే, సాధకులు తమలో అనవరతం ప్రకాశించే ఆత్మజ్యోతి వైపు దృష్టి కేంద్రీకరించేందుకూ అది అనువైన రోజు.

– ఎం. మారుతి శాస్త్రి

రెండో దశ ఎస్‌ఐఆర్ ఆరంభం

తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రక్రియ

- డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితాలు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది జాబితాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) సర్వే మంగళవారం ప్రారంభమైంది. బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ) విధులు నిర్వర్తిస్తున్నారు, ఓటర్ల నుంచి వివరాలు సేకరిస్తున్నారని ఎన్నికల సంఘం తెలియజేసింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 4 దాకా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితాలు విడుదల చేస్తారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్పులు చేర్పులు అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాలు ప్రచురిస్తారు. మొత్తం 321 జిల్లాల్లో 1,843 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎస్‌ఐఆర్‌కు ఈసీ శ్రీకారం చుట్టింది. దాదాపు 51 కోట్ల మంది ఓటర్ల అర్హతను నిగ్గుతేల్చబోతున్నారు. ఈ క్రతువులో 5.3 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ), 10,448 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 321 మంది జిల్లా ఎన్నికల అధికారులు పాల్గొంటున్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 7.64 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్‌ఏ) బీఎల్‌ఓలకు సహకరిస్తారు. తొలి దశలో భాగంగా బిహార్‌లో ఎస్‌ఐఆర్ ఇటీవలే పూర్తయిన సంగతి తెలిసిందే. రెండో దశలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్తాన్, మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్, గోవా, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఎస్‌ఐఆర్‌ను ప్రారంభించినట్లు ఈసీ వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. అయితే, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అస్సాంలో ఎస్‌ఐఆర్ షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించలేదు. అస్సాంలో ప్రజల పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. అక్కడ ఎస్‌ఐఆర్ షెడ్యూల్‌ను ప్రత్యేకంగా ప్రకటించబోతున్నారు.

కేరళలో నేడు అఖిలపక్ష భేటీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యతిరేకించారు. ఓట్లు మాయం చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించడానికి బుధవారం అఖిలపక్ష భేటీ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. కేరళలో బీజేపీ మినహా అన్ని పార్టీలూ ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో రాజ్యాంగబద్ధత లేదని తమిళనాడు అధికార డీఎంకే తేల్చిచెప్పింది. ఎస్‌ఐఆర్ విషయంలో అక్టోబర్ 27న ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసింది. మరోవైపు తమిళనాడులో బీజేపీ మిత్రపక్షమైన ఏఐఏడీఎంకే ఎస్‌ఐఆర్‌ను స్వాగతించింది. ఉత్తరప్రదేశ్‌లో 'ఓట్ల్ నిర్వాచక్ నామావళి–మజ్‌బూత్ లోకతంత్ర్' థీమ్‌తో ఎస్‌ఐఆర్ ఆరంభమైంది.

పశ్చిమ బెంగాల్‌లో రగడ

ఎస్‌ఐఆర్ పట్ల పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ పార్టీ నేతలు, కార్యకర్తలు మంగళవారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట నిశ్శబ్దంగా ఓట్ల రిగ్గింగ్ జరుగుతోందని తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందే ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఏమిటని మండిపడ్డారు. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి తొత్తుగా మారిందని విమర్శించారు. కోల్‌కతాలో జరిగిన ఎస్‌ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం పాల్గొన్నారు. ఈ ప్రక్రియను ఆపాలంటూ నినదించారు. రాజకీయ దురుద్దేశంతోనే ఎస్‌ఐఆర్ ప్రారంభించారని మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పడగొడతామని హెచ్చరించారు. ఒక్క ఓటరుకు అన్యాయం జరిగినా సహించే ప్రసక్తే లేదన్నారు.

రాజు టుంటమ్‌ఖామన్ బంగారు మాస్క్

తెరుచుకున్న మ్యూజియం

ఫారో రామ్సెస్-2 విగ్రహం

కైరో: వేల సంవత్సరాల ఈజిప్ట్ ఘన చరితను కళ్లకు కట్టినట్లు తెలిపే అత్యంత అరుదైన పురాతన వస్తువులతో సిద్ధమైన కైరోలోని గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియానికి సందర్శకులు పోటెత్తుతున్నారు. సాధారణ సందర్శకుల కోసం మొదటిసారిగా మంగళవారం మ్యూజియం తలుపులు తెరిచారు. దీంతో ప్రతి గ్యాలరీలోనూ పెద్ద సంఖ్యలో జనం గుమిగూడి ఈజిప్ట్ నాగరికత సంబంధ 50 వేలకుపైగా పురాతన వస్తువులను తదేకంగా చూస్తూ తన్మయత్వాన్ని పొందుతున్నారు. కేవలం ఒక దేశ నాగరికతకు పురాతన వస్తువులను ప్రదర్శించే ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియంగా ఇది ఇప్పటికే రికార్డ్ నెలకొల్పింది. వేల సంవత్సరాల క్రితం మరణించిన యువ ఈజిప్ట్‌రాజు టుటెంఖమెన్‌కు సంబంధించిన సమాధి 1922లో అనూహ్యంగా బయల్పడగా అందులోని ముఖ స్వర్ణ తాపడంసహా 5,000కుపైగా వస్తువులను తొలిసారిగా సందర్శకుల కోసం ప్రదర్శనకు ఉంచారు. వీటిని చూసేందుకు జనం ఎగబడుతున్నారు. మమ్మీలా మార్చాక అతని ముఖంపై కప్పిన ఈ బంగారు మాస్క్ నిజంగా అద్భుతంగా ఉందని గ్రీస్ నుంచి వచ్చిన పర్యాటకుడు నికొలస్ వోల్గరాకిస్ చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో రైళ్ల ఢీ

- గూడ్స్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు
- 8 మంది మృతి
- 14 మందికి గాయాలు
- బిలాస్‌పూర్ సమీపంలో ఘటన

బిలాస్‌పూర్: గూడ్స్‌ను ప్యాసింజర్ రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో లోకో పైలట్ సహా 8 మంది చనిపోయారు. 14 మంది గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ సమీపంలో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. మెము(మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్) రైలు కొర్బాలోని గెవ్రా నుంచి పొరుగునే ఉన్న బిలాస్‌పూర్ వైపు వెళుతోంది. గటోరా–బిలాస్‌పూర్ స్టేషన్ల మధ్య ఉండగా మెము రైలు ముందు వెళ్తున్న గూడ్స్‌ను ఢీకొట్టింది. రెడ్ సిగ్నల్ పడినప్పటికీ ప్యాసింజర్ రైలు 70 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు మెలికలు తిరిగిపోయిన ప్యాసింజర్ రైలు బోగీ ఒకటి గూడ్స్ రైలు వ్యాగన్లపైకి ఎక్కింది. ఘటనలో లోకో పైలట్, ఏడుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. అసిస్టెంట్ లోకో పైలట్ రష్మీరాజ్ తీవ్రంగా పడ్డారు. గూడ్స్ రైలు గార్డ్ ఆఖరి క్షణంలో బయటకు దూకి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. నుజ్జయిన రైలు బోగీలో చిక్కుకున్న మరో ఇద్దరు లేదా ముగ్గురిని వెలుపలికి తీసేందుకు భారీ యంత్ర సామగ్రి, గ్యాస్ కట్టర్లతో ప్రయత్నాలు చేస్తున్నామని బిలాస్‌పూర్ కలెక్టర్ సంజయ్ అగర్వాల్ తెలిపారు. క్షతగాత్రులను బిలాస్‌పూర్‌లోని అపోలో, ఛత్తీస్‌గఢ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సీఐఎంఎస్)లో చేర్పించామన్నారు. 14 మందికిగాను ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. రైళ్లు ఢీకొని ఒక్కసారిగా వచ్చిన శబ్ధంతో ఉలిక్కి పడిన సమీప గ్రామస్తులు అక్కడికి చేరుకుని, రక్షణ చర్యల్లో పాలుపంచుకున్నారన్నారు. రైల్వే శాఖ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, సాధారణ గాయాలైన వారికి రూ.లక్ష అందజేస్తామని ప్రకటించింది. ఘటనకు దారి తీసిన కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైల్వే సేఫ్టీ కమిషనర్ స్థాయిలో సవివర దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపింది. గూడ్స్ రైలు, రెడ్ సిగ్నల్ స్పష్టంగా కనిపిస్తున్నా లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులను వాడటంలో విఫలమవడంపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. సహాయక, ట్రాక్ పునరుద్ధరణ చర్యలను రైల్వే ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని, స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం కారణంగా హౌరా–ముంబై సెక్షన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గూడ్స్ బోగీపైకి ఎక్కిన ప్రయాణికుల బోగీ

రికార్డు స్థాయి విజయం తథ్యం

- బిహార్‌లో జంగిల్‌రాజ్ నేతలకు ఘోర పరాభవం తప్పదు
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- బీజేపీ మహిళా కార్యకర్తలతో సంభాషణ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమికి ఈసారి రికార్డు స్థాయి విజయం కట్టబెట్టాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. గత 20 ఏళ్లలో ఏన్నడూ లేనట్టి అద్భుతమైన విజయం ఈ ఎన్నికల్లో సాధించబోతున్నామని చెప్పారు. జంగిల్‌రాజ్ మనుషులకు ఘోరమైన పరాభవం తప్పదని పునరుద్ఘాటించారు. ఇద్దరు యువరాజులు రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల మద్దతు పొందడానికి తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన యువరాజు ఛత్ పూజలను అవమానించాడని మండిపడ్డారు. ప్రధాని మోదీ మంగళవారం బిహార్ బీజేపీ మహిళా కార్యకర్తలతో నమో యాప్ ద్వారా వర్చువల్‌గా సమావేశమయ్యారు. పార్టీ విజయం కోసం మహిళా కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నారని ప్రశంసించారు. బిహార్‌లో ఇటీవల పలు బహిరంగ సభల్లో పాల్గొన్నా నని, మహిళలు అత్యధికంగా హాజరయ్యారని చెప్పారు. ఒక సభకు మించి మరో సభ జరిగిందన్నారు. ఎన్డీయేకు మహిళల ఆదరణ మరింత పెరిగిందని సంతోషం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఎన్డీయే విజయం పట్ల తనకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. ఎవరూ ఊహించలేని భారీ విజయం సాధించబోతున్నామని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో పేదలు, దళితులు, మహా దళితులు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని మోదీ పేర్కొన్నారు. మహిళల సాధికారతకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. వారి జీవనం మరింత సులభతరంగా మారేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సుపరిపాలన, చట్టబద్ధమైన పాలన అమల్లో ఉన్నప్పుడే మహిళలు అభివృద్ధి సాధించడానికి అవకాశాలు ఉంటాయని వివరించారు. ఎన్డీయే పాలనలో ఆడబిడ్డల ప్రగతికి పెద్దపీట వేశామన్నారు. బిహార్ మహిళలు నేడు స్వయం ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారని ప్రశంసల వర్షం కురిపించారు.

ప్రావిన్స్‌ల అధికారాల్లో కోత

రాజ్యాంగ సవరణకు పాక్ సర్కార్ సిద్ధం

ఇస్లామాబాద్: ప్రావిన్స్‌లకున్న అధికారాల్లో కత్తెర వేసేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు మంగళవారం వెల్లడించింది. 27వ రాజ్యాంగ సవరణకు మద్దతు తెలపాలని ప్రభుత్వం తనను సంప్రదించిందంటూ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ ఎక్స్‌లో చేసిన పోస్టుపై రాజ్యాంగ సవరణ అంటూ వార్తలు వస్తున్న వేళ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. త్వరలోనే 27వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని ఎగువసభ సెనేట్‌లో ఆయన తెలిపారు. రాజ్యాంగ నియమాలు, చట్టాలకు లోబడే ఈ సవరణ ఉంటుందన్నారు. అయితే, ప్రతిపాదిత సవరణపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని, దీనిని అడ్డుకుంటామని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పీటీఐ పార్టీ సెనేటర్ అలీ జఫార్ స్పష్టం చేశారు.

ఫిలిప్పీన్స్‌లో 'కల్మెగి' విధ్వంసం

- వివిధ ఘటనల్లో 40 మంది మృతి
- కూలిన సహాయక చర్యల హెలికాప్టర్
- ఇళ్ల పైకప్పులపై చిక్కుకున్న ప్రజలు
- వరద నీటిలో తేలియాడిన కార్లు

మనీలా: ఫిలిప్పీన్స్‌ను 'కల్మెగి'తుపాను హడలెత్తిస్తోంది. దేశ మధ్య ప్రాంతంలో సెబు, ఈస్టర్న్ సమర్, గుయిమరస్, బొహోల్, పలవన్ ప్రావిన్స్‌లపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. కనీసం 40 మంది చనిపోయినట్లు అధికారులు మంగళవారం సాయంత్రం తెలిపారు. సెబు ప్రావిన్స్‌లో అత్యధికంగా మరణాలు సంభవించాయన్నారు. ప్రభావిత ప్రాంతాల నుంచి పూర్తి సమాచారం అందాల్సి ఉందన్నారు. వరద చుట్టుముట్టడంతో ఇళ్లపైకప్పులపైకి జనం చేరి, అక్కడే చిక్కుబడి పోయారు. రక్షించాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. వరదల కారణంగా చెత్తాచెదారం రోడ్లపైకి భారీగా చేరడంతో ముందుకు కదలడానికి వీల్లేని పరిస్థితులున్నాయని అధికారులు అంటున్నారు. వరద ఉధృతి తగ్గేదాకా తామేమీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీళ్లలో కార్లు తేలియాడుతున్నాయన్నారు. గుయిమరస్ ప్రావిన్స్‌లో గంటకు 180 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న భీకర గాలులతో వందలాదిగా ఇళ్లపై కప్పులు లేచిపోయాయని స్థానికులు తెలిపారు. ఈస్టర్న్ సమర్‌లోని హొమొన్‌హొన్‌లో 300 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రావిన్స్‌లో వరదలు సంభవించకున్నా, ఈదురుగాలులు మా త్రం జనాన్ని భయపెట్టాయి. మరో ఘటన, దక్షిణ ప్రాంత అగుసన్ డెల్ సుర్ ప్రావిన్స్‌లో మానవతా సాయం అందించేందుకు బయలుదేరిన సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. అందులో ఐదుగురు మిలిటరీ సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్ జాడ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెప్పారు. అందులోని వారి క్షేమ సమాచారం తెలియాల్సి ఉంది. కల్మెగి నేపథ్యంలో ప్రభుత్వం ముందు జాగ్రత్తగా సుమారు 4 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సముద్రంలో అలలు మూడు మీటర్ల వరకు ఎగసిపడవచ్చని, అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించింది. ఫెర్రీలను నిలిపివేయడంతో దీవుల మధ్య రాకపోకలు సాగించే 3,500 మంది ప్రయాణికులు వంద పోర్టుల్లో ఎక్కడివారక్కడే నిలిచిపోయారు. 186 దేశీయ విమానసర్వీసులను అధికారులు రద్దు చేశారు. దక్షిణ చైనా సముద్ర తీర దేశం ఫిలిప్పీన్స్‌లో ఏటా 20 వరకు తుపాన్లు సంభవిస్తుంటాయి. ఇవికాకుండా భూకంపాలు, అగ్నిపర్వతాలు బద్దలవ్వడం సర్వసాధారణం.

భారతీయులే టార్గెట్

- తాత్కాలిక వీసాల తిరస్కరణకు కెనడా చట్టసవరణ?
- ఇమిగ్రేషన్ విభాగానికి మూకుమ్మడి తిరస్కరణ అధికారాలు
- ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం భారత విద్యార్థి వీసాల తిరస్కరణ

న్యూఢిల్లీ: కెనడాలో ప్రభుత్వం మారినా, ప్రధాని మారినా భారత వ్యతిరేక విధానాల్లో ఏ మార్పూ రాలేదు. భారతీయుల వీసాలను తిరస్కరించటమే లక్ష్యంగా ఆ దేశం వలస, ఆశ్రయ చట్టానికి సవరణలు ప్రతిపాదించటమే అందుకు ఉదాహరణగా నిలుస్తోంది. కెనడా ప్రభుత్వం ఇటీవల ఆ దేశ ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు మరిన్ని అధికారాలు కట్టబెట్టేలా చట్ట సవరణకు అనుమతి ఇచ్చినట్టు సీబీసీ న్యూస్ సంస్థ వెల్లడించింది. ఇమిగ్రేషన్, రిఫ్యూజీ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ), కెనడా బోర్డర్ సర్వీస్ ఏజెన్సీ (సీబీఎస్‌ఏ) నుంచి సేకరించిన పత్రాలను విశ్లేషించి సీబీసీ న్యూస్ ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం తాత్కాలిక నివాస వీసాల (టీఆర్‌వీ)ను గంపగుత్తగా తిరస్కరించేందుకు ఇమిగ్రేషన్ విభాగానికి అధికారాలు దఖలుపడేలా చట్టసవరణ ప్రతిపాదించారు. ఇందులో ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ పౌరులనే టార్గెట్ చేస్తూ ఈ మార్పులు ప్రతిపాదించారని సీబీసీ కథనంలో పేర్కొంది. ఎవరిదైనా వీసా తిరస్కరించాలంటే దానిపై ప్రత్యేకంగా విచారణ జరిపి, దుర్వినియోగం అయ్యిందని తేలితే చర్యలు తీసుకుంటారు. కానీ, ఇకపై ఒక్కో కేసును కాకుండా మూకుమ్మడిగా వీసాలను తిరస్కరించేందుకు ఈ మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు. కెనడా ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో భారతీయ విద్యార్థుల నుంచి వచ్చిన వీసా దరఖాస్తుల్లో 74 శాతం దరఖాస్తులను తిరస్కరించిందని రిపోర్టులు చెబుతున్నాయి. అదే నెలలో చైనా నుంచి వచ్చిన విద్యార్థి వీసాల్లో 24 శాతం మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. 2023 ఆగస్టులో భారతీయ విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 32 శాతం మాత్రమే.

పెరుగుతున్న ఆశ్రయ దరఖాస్తులు

కొన్నేళ్లుగా భారత్ నుంచి కెనడాల్లో ఆశ్రయం కోసం దరఖాస్తులు పెరుగుతున్నాయి. 2024లో అంతర్జాతీయ విద్యార్థుల నుంచి కెనడాకు 20,245 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో భారత్, నైజీరియా నుంచే అధికంగా ఉన్నాయి. 2023 మేలో భారత్ నుంచి ఆశ్రయం కోరుతూ వచ్చిన విద్యార్థుల దరఖాస్తులు 500 వరకు ఉండగా, 2024 జూలై నాటికి నెలకు 2,000లకు పెరిగాయి. వీటికి అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ఇమిగ్రేషన్ చట్టంలో సవరణలు ప్రతిపాదించినట్టు సీబీసీ పేర్కొంది. కెనడా నిర్ణయంపై వలసల హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కెనడా ప్రభుత్వం తన ప్రయత్నాలను మానుకోవాలని దాదాపు 300 సంఘాలు విజ్ఞప్తి చేశాయి. చట్ట సవరణ అమలైతే ప్రస్తుతం అమెరికా నుంచి విదేశీయులను గెంటివేస్తున్నట్టుగానే కెనడా నుంచి కూడా విదేశీయులను మూకుమ్మడిగా గెంటేస్తారని ఇమిగ్రేషన్ న్యాయవాదులు ఆందోళన వ్యక్తంచేశారు.

పోక్సో చట్టం దుర్వినియోగం

సుప్రీంకోర్టు ఆందోళన

న్యూఢిల్లీ: మన స్పర్థలున్న భార్య భర్తలు, పరస్పర సమ్మతితో సహజీవనం చేస్తున్న జంటలు నమోదు చేస్తున్న కేసుల్లో పోక్సో చట్టం దుర్వినియోగ మవుతోందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పోక్సో చట్టం తీవ్రతను, అందులోని నిబంధనలపై బాలురు, పురుషుల్లో మరింత అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం వ్యాఖ్యా నించింది. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కఠిన శిక్షలపై ప్రజల్లో అవగాహన పెంచి బాలికలు, మహిళల మనుగడకు అనువైన సమాజంగా దేశాన్ని తీర్చిదిద్దాలంటూ న్యాయవాది ఆబాద్ హర్షద్ పాండా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలుచేశారు. ఈ కేసును ధర్మాసనం మంగళవారం విచారించింది. ''ఈ అంశంలో స్పందన తెలపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, విద్యా, ప్రసార, సమాచార శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేట్‌లకు నోటీసులు జారీచేశాం. అన్ని రాష్ట్రాలు స్పందించాల్సి ఉంది. ఆ తర్వాతే కేసును విచారిస్తాం'' అంటూ ధర్మాసనం కేసును డిసెంబర్ రెండో తేదీకి వాయిదావేసింది.

రేపే బిహార్ తొలి పరీక్ష

121 అసెంబ్లీ స్థానాల్లో ముగిసిన హోరాహోరీ ప్రచారం

మొదటి దశ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం

తేజస్వీ 'ఉద్యోగ' హామీకి, నితీశ్ 'శాంతిభద్రతల'కు మధ్య పోరు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ప్రచార ఘట్టానికి తెరపడింది. తొలి దశలో భాగంగా గురువారం 121 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. తొలి దశ ఎన్నికలు జరిగే స్థానాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. చివరిరోజు ఇటు ఎన్డీయే, అటు మహాగఠ్‌బంధన్ అగ్రనేతలు సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ ముఖ్య నేతలు ఎన్డీయే తరఫున... ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మహా కూటమి తరఫున చివరి అస్త్రాలను సంధించారు. తేజస్వీ యాదవ్ '10 లక్షల ఉద్యోగాల' హామీతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయగా, నితీశ్ కుమార్ తనదైన శైలిలో జంగిల్ రాజ్‌ను గుర్తుచేస్తూ లాలూ ప్రసాద్ యాదవ్ పాలనపై విమర్శలు గుప్పించారు.

తలరాతను నిర్ణయించనున్న తొలి దశ

బిహార్ ఎన్నికల్లో పార్టీల భవితవ్యాన్ని తొలి దశ ఎన్నికలే నిర్ణయించనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే ఈ 121 స్థానాల్లోనే ఆర్జేడీ, జేడీ(యూ) బలాబలాలు పరీక్షకు నిలవనున్నాయి. ఆర్జేడీ తన 'ముస్లిం–యాదవ్' సమీకరణాన్ని పటిష్టం చేసుకుందో లేక నితీశ్ కుమార్ తన 'ఈబీసీ, మహాదళిత్' ఓటు బ్యాంకును నిలబెట్టుకున్నారో లేదో మొదటి దశ ఎన్నికలే స్పష్టం చేస్తాయి.

అందరి కళ్లూ చిరాగ్‌పైనే

ఈ ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేయగల ఏకైక అంశం 'చిరాగ్ ఫ్యాక్టర్'. ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, ప్రధాని నరేంద్ర మోదీకి జై కొడుతూనే సీఎం నితీశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తున్న చిరాగ్ పాశ్వాన్(ఎల్‌జేపీ–రామ్ విలాస్).. ఈ తొలి దశలో అత్యంత కీలకంగా మారారు. జేడీ(యూ) పోటీ చేస్తున్న దాదాపు అన్ని స్థానాల్లో ఎల్‌జేపీ–రామ్ విలాస్ తమ అభ్యర్థులను నిలబెట్టింది. ఈ అభ్యర్థులు జేడీ(యూ) ఓటు బ్యాంకును భారీగా చీల్చే అవకాశం కనిపిస్తోంది. ఈ ఓట్ల చీలిక నేరుగా మహాగఠ్‌బంధన్ అభ్యర్థుల గెలుపునకు దారితీస్తుందని విశ్లేషకుల అంచనా.

తొలి దశ ముఖచిత్రం

మొత్తం నియోజకవర్గాలు 121	జిల్లాల సంఖ్య: 16 (దక్షిణ బిహార్‌లోని కీలక జిల్లాలు)
పోలింగ్ తేదీ: నవంబర్ 6 (గురువారం)	బరిలో ఉన్న మంత్రులు: 8 మంది

పోటాపోటీ ఇక్కడే

తొలి దశలో నితీశ్ కేబినెట్‌లోని 8 మంది మంత్రులతో సహా పలువురు ఉద్ధండుల భవితవ్యం తేలనుంది.

- **ఇమామ్‌గంజ్:** మాజీ సీఎం జితన్‌రామ్ మాంఝీ (హిందూస్తానీ అవామ్ మోర్చా) భవితవ్యాన్ని తేల్చనున్న ప్రతిష్టాత్మక స్థానం.
- **జముయి:** అంతర్జాతీయ షూటర్ శ్రేయసి సింగ్ (బీజేపీ) రాజకీయ అరంగేట్రం చేస్తున్న స్థానం.
- **గయా టౌన్:** బీజేపీ కంచుకోటలో మంత్రి ప్రేమ్ కుమార్ మరోసారి బరిలో ఉన్నారు.
- **బాంకా:** మంత్రి రామ్ నారాయణ్ మండల్ (బీజేపీ), మాజీ మంత్రి జైప్రకాశ్ నారాయణ్ యాదవ్ (ఆర్జేడీ) మధ్య ముఖాముఖి పోరు.

ప్రభావిత అంశాలు

- ఈ ఎన్నికల మొత్తంలో రాజకీయ చర్చను నిర్దేశించిన ఏకైక అంశం ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టి. తాము అధికారంలోకి వస్తే 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తొలి కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించడం కులాలకు అతీతంగా యువతను ఆకర్షిస్తోంది.
- 15 ఏళ్ల నితీశ్ కుమార్ పరిపాలనపై ప్రజల్లో సహజంగానే కొంత వ్యతిరేకత కనిపిస్తోంది. దీన్ని తమకు అనుకూలంగా మలచుకోవడానికి విపక్ష కూటమి తీవ్రంగా యత్నించింది.
- ఎన్డీయేకు ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాయే అతిపెద్ద బలం. నితీశ్‌పై ఉన్న వ్యతిరేకతను మోదీ ఇమేజ్‌తో అధిగమించాలని బీజేపీ వ్యూహరచన చేసింది.
- నితీశ్ కుమార్ తన ప్రచారంలో ప్రధానంగా అభివృద్ధి, శాంతి భద్రతల గురించే ప్రస్తావించారు. రాష్ట్రానికి 'జంగిల్‌రాజ్' నుంచి విముక్తి కల్పించానని చెప్పారు. ప్రతి గ్రామానికీ విద్యుత్, రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించానని గుర్తుచేశారు.
- నితీశ్ కుమార్ 'అభివృద్ధి' ప్రచారాన్ని తిప్పికొట్టడానికి ప్రతిపక్షాలు ప్రాధాన్యం ఇచ్చాయి. రాష్ట్రంలోనే పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు ఉంటే బిహార్ బిడ్డలు ఇతర రాష్ట్రాలకు ఎందుకు వలస వెళ్తున్నారని ప్రశ్నించాయి.

ఆ 10 శాతం ఆర్మీని శాసిస్తోంది

రాహుల్ వివాదాస్పద వ్యాఖ్య

ఔరంగాబాద్/పట్నా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్ తొలిదశ ఎన్నికల ప్రచారపర్వం కొద్ది గంటల్లో ముగుస్తుందనగా వివాదాలవేడి రాజేశారు. మంగళవారం బిహార్‌లోని కుటుంబా నియోజ కవర్గంలో రాహుల్ ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశంలోని 90 శాతం జనా భాకు సైన్యంలో, అగ్రగామి సంస్థల్లో తగు ప్రాధా న్యత దక్కట్లేదని ఆరోపించారు. ''మీరు నిశితంగా పరిశీలిస్తే దేశ జనాభాలో 90 శాతం మంది వెను కబడిన వర్గాలు, దళితులు, మహా దళితులు, అత్యంత అణగారిన వర్గాలు, మైనారిటీలే. వీరిలోనూ 90 శాతం మంది అత్యంత వెనుకబడిన వర్గాలు, గిరిజనులే. ఇక దేశంలోని అత్యంత పెద్ద 500 కంపెనీల్లోని ఉన్నతోద్యోగుల జాబితాను పరిశీలిస్తే ఇందులో ఒక్కరు కూడా దళితుడు, వెనుకబడిన వర్గాల వ్యక్తులు కనబడరు. ఆ ఉద్యోగాల్లో సమాజంలోని మిగతా 10 శాతం జనాభాకు చెందిన వ్యక్తులే ఉంటారు. ఉద్యోగాలన్నీ వీళ్లవే. ఇవి చాలదన్నట్లు భార త ఆర్మీని సైతం ఈ 10 శాతం వర్గమే శాసిస్తోంది. దేశంలోని మిగతా 90 శాతం జనాభాకు ఇక్కడ ఎలాంటి ప్రాతినిధ్యం లభించట్లేదు'' అని రాహుల్ అన్నారు.

అది నకిలీ డిగ్రీ పట్టా

మోదీ డిగ్రీ చదవలేదని, ఆయన వద్ద నకిలీ డిగ్రీ పట్టా ఉందని రాహుల్ చెప్పారు. ''ప్రాచీన భారతదేశంలో ఇదే బిహార్ ప్రాంతంలో విశ్వ విఖ్యా త విశ్వవిద్యాలయాలు నలందలో ఉండేవి. చైనా, జపాన్, కొరియాల నుంచి కూడా విద్యాభ్యాసం కోసం విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఎగబడేవారు. ఆనాటి ఘన చరితపై మోదీకి పెద్దగా ఆసక్తిలే దనుకుంటా. అందుకే నకిలీ డిగ్రీ పట్టా పుచ్చుకుని మోదీ తిరుగుతున్నారు'' అని రాహుల్ ఎద్దేవాచేశారు.

కృష్ణాజిల్లా ఆకుమర్రు లాకు వద్ద దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలించటానికి వెళ్తున్న వైఎస్ జగన్

కృష్ణాజిల్లా నిడుమోలు వద్ద భారీగా తరలివచ్చిన రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

దయలేని బాబు.. దగా పాలన

వ్యవసాయం దండగ.. రైతు వేస్ట్.. అన్న మైండ్ సెట్ మారాలి

ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం

మోంథా తుపాను ప్రభావిత ప్రాంత పర్యటనలో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

ఆకుమర్రు లాకు వద్ద పొలంలోకి వెళ్లి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

కృష్ణా జిల్లా ఆకుమర్రు లాకు నుంచి సాక్షి ప్రతినిధి

'రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందో లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తుపాను దెబ్బకు పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు దృష్టిలో వ్యవసాయం అనేదే దండగ.. రైతు అనే వాడు వేస్ట్.. అందుకే ఆయన హయాంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం, రైతుల విషయంలో చంద్రబాబు మైండ్‌సెట్ మార్చుకోవాలి.. రైతులు రాష్ట్రానికి వెన్నెముక అని గుర్తించాలి. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వ తీరు మారకపోతే బాధితుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది' అని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టిగా హెచ్చరించారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. మంగళవారం ఆయన కృష్ణా జిల్లాలో మోంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. పంట పొలాల్లో దిగి.. బాధిత రైతులతో మమేమకవుతూ జరిగిన పంట నష్టం గురించి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన తామున్నామంటూ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకుమర్రు లాకు వద్ద బాధిత రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతు కన్నీరు పెడితే ఏ ప్రభుత్వానికైనా అరిష్టం అని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. 'మోంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లండన్ పోతాడు.. ఆయన కొడుకు ఆస్ట్రేలియా నుంచి వచ్చి క్రికెట్ మ్యాచ్ చూడటానికి ముంబై పోతాడు.. రైతుల విషయంలో ఈ ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదు' అని ఎత్తిచూపారు. పంటలు దెబ్బ తిన్న ప్రతీ రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, పంటల బీమా పరిహారం కూడా ఇవ్వాలని, ప్రస్తుత రబీ సీజన్ నుంచైనా ఉచిత పంటల బీమాను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గత 18 నెలల్లో సంభవించిన విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ.600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

18 నెలల్లో ఒక్క రైతుకైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా?

➤ రైతు పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఒకసారి మారుమూల ప్రాంతాలకు వెళ్లాలి. క్షేత్రస్థాయిలో తిరిగితేనే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. ఈ ప్రభుత్వం రైతుల విషయంలో ఎంత నిర్దాక్షిణ్యంగా, ఎంత నిర్దయగా వ్యవహరిస్తుందో చెప్పడానికి శతకోటి ఉదాహరణలు ఉన్నాయి. మోంథా తుపాను దాదాపు 25 జిల్లాలపై ప్రభావం చూపింది.

➤ అటు గోదావరి జిల్లాల నుంచి శ్రీకాకుళం వరకు, ఇటు కృష్ణా నుంచి కర్నూలు వరకు దాని ప్రభావం కన్పించింది. దాదాపుగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. నిజంగా ఎప్పుడూ ఊహించని విధంగా పంటలు నష్టపోయిన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వరి పంటకే ఎక్కువగా 11 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. పత్తి, మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంటలు మరో నాలుగు లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

➤ వరి పంట గింజలు పాలు పోసుకున్న దశలో తుపాను విరుచుకుపడింది. తీవ్రమైన గాలులు, వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతింది. చంద్రబాబు 18 నెలల పాలనలో దాదాపు 16 సార్లు తుపానులు, వరదలు, అకాల వర్షాలు, కరువు వంటి వైపరీత్యాల వల్ల రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ 18 నెలల్లో ఏ రైతుకైనా ఒక్క సారైనా ఒక్క రూపాయి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా? ఏ రైతుకైనా ఒక్కసారైనా పంటల బీమా పరిహారం (ఇన్సూ్యరెన్స్) ఇచ్చారా? అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తా అని హామీ ఇచ్చి.. రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.ఐదు వేలతో సరిపెట్టారు.

➤ ఇన్‌పుట్ సబ్సిడీ రూపాయి రాలేదు. ఇన్సూ్యరెన్స్ రాలేదు. చివరికి ఎరువులు బ్లాకులో కొనుక్కోవాల్సిన పరిస్థితుల్లోకి రైతులు వెళ్లిపోయారు. రూ.266కు దొరకాల్సిన యూరియా కట్టను ఏకంగా రూ.500, రూ.600 చొప్పున బ్లాకులో కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అవసరాన్ని బట్టి బ్లాకులో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఇలా కష్టాల సాగు చేసిన రైతులు తాము పండించిన పంటను అమ్ముదామంటే ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర రాని పరిస్థితి. కనీసం మద్దతు ధరకు కూడా కొనే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది ధాన్యం 75 కేజీల బస్తాకు మద్దతు ధర ప్రకారం రూ.1,750 రావాల్సి ఉండగా, రైతుల చేతికొచ్చింది మాత్రం కేవలం రూ.1,350 మాత్రమే. చంద్రబాబు హయాంలో ప్రతి అడుగులోనూ రైతు నష్టపోతూనే ఉన్నాడు.

నాడు ప్రతి రైతుకు భరోసా

➤ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో వారిపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని ఐదేళ్ల పాటు అమలు చేసి అండగా నిలిచింది. మూడున్నర ఎకరాలున్న రైతులు సైతం దాదాపు రూ.70 వేలు, రూ.66 వేలు చొప్పున గతంలో బీమా పరిహారం డబ్బులు అందుకున్న పరిస్థితులను ఇక్కడి రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

➤ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజు ఏ రైతు ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. విపత్తుల వేళ పంట నష్టం జరిగితే ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని ఏ రోజు ఏ రైతు ఆ ఐదేళ్లలో అధైర్య పడలేదు. కారణం.. పంట నష్టం జరిగితే జగనన్న ఉన్నాడు.. పైసా భారం పడకుండా తమ పంటకు బీమా చేయించాడని, తమకు డబ్బులొస్తాయని ధైర్యంగా ఉండేవారు. ప్రతి రైతుకు భరోసా ఉండేది.


PPD Farmers
only admins can send messages

మంథా తుఫాన్ కారణంగా పంట నష్టం జరిగింది.
కావున నష్టపోయిన రైతులందరూ ఈ క్రింద తెలిపిన పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయం వద్ద వెంటనే ఇవ్వగలరు.
1. ఆధార్
2. 1B xerox
3. కౌలు గుర్తింపు కార్డు
4. బ్యాంక్ పాస్ పుస్తకం xerox.
ఈ పత్రాలు సమర్పించిన వారి పొలాలకు మాత్రమే పంట నష్టం జాబితా తయారు చేయబడును. **ఆఖరి తేదీ అక్టోబర్ 31** కావున శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల లోపు తీసుకొచ్చిన డాక్యుమెంట్స్ మాత్రమే స్వీకరించబడతాయి తరువాత ఇచ్చిన డాక్యుమెంట్స్ తీసుకోబడవు

ఇట్లు
రైతు సేవ కేంద్రం
వ్యవసాయ శాఖ
9:12 AM

దయచేసి రైతులు గమనించగలరు, ఇప్పుడు పంట నష్టం చేయించిన రైతులకి తరవాత ధాన్యం రైతు సేవా కేంద్రం కొనుగోలు చేయబడదు .
3:37 PM

అక్టోబర్ 31 లోపు పంట నష్టం వివరాలను తెలపాలంటూ రైతులకు ప్రభుత్వం పంపిన మెసేజ్, పంట నష్టం వివరాలు నమోదు చేయించుకున్న రైతుల ధాన్యాన్ని రైతు సేవాకేంద్రాల్లో కొనుగోలు చేయబోమని పెట్టిన మరో మెసేజ్

➤ ఏదైనా విపత్తు వేళ పంటలకు నష్టం వాటిల్లితే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు ఇస్తాడనే ధైర్యం ఉండేది. ఆ డబ్బులతో మరుసటి సీజన్‌లో పెట్టుబడి పెట్టుకోవచ్చనే ధైర్యం ఉండేది. సీజన్ మొదలయ్యే సరికే ప్రతి రైతుకు ఓ భరోసా ఉండేది. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున ఇస్తారన్న నమ్మకం ఉండేది.

➤ ఆర్బీకే వ్యవస్థ అనేది రైతులను చేయి పట్టి నడిపించే వ్యవస్థగా ఉండేది. ప్రతీ రైతు వేసిన పంటకు ఈ క్రాప్ జరిగేది. ఆర్బీకే పరిధిలోనే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్.. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులకు అందుబాటులో ఉండే వారు. సచివాలయాలతో అనుసంధానం చేసి వలంటీర్లతో కలిసి రైతులను చేయిపట్టి నడిపించేవారు. ప్రతి రైతును.. అతను సాగు చేసిన పొలంలో నిలబెట్టి జియో ట్యాగ్ చేసి ఈ క్రాప్ బుకింగ్ చేసే వారు. తద్వారా పంటకు ఎప్పుడు, ఏ ఇబ్బంది వచ్చినా రైతుకు ప్రభుత్వం తోడుగా నిలబడేది.

ధరలు పతనమైన ప్రతిసారి ప్రభుత్వ జోక్యం

➤ ఆర్బీకే పరిధిలో ఏ రైతుకైనా గిట్టుబాటు ధర రాని పరిస్థితి ఉండేది కాదు. ఆర్బీకే పరిధిలో ఏ పంటను ఏ రేటుకు కొనుగోలు చేసేది రైతులకు తెలియజేసే వాళ్లం. ఆ రేట్ల కంటే తక్కువగా పడిపోతే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. మద్దతు ధరల వివరాలు ఆర్బీకేలో ప్రదర్శించేవాళ్లం.

➤ ఎక్కడ ఏ పంట రేటు తగ్గినా వెంటనే ఆర్బీకే అసిస్టెంట్ నుంచి ఎలెర్ట్ వచ్చేది. మార్క్‌ఫెడ్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో ఉన్న జేసీలు వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకునే వారు. ధరలు పడిపోయిన పంటలను కొనుగోలు చేసి, మార్కెట్‌లో పోటీని తీసుకొచ్చి రైతుకు తోడుగా నిలబడేవారు. ఇందుకోసం కంటిన్యూస్ మానిటరింగ్ అండ్ అగ్రికల్చర్ ప్రైస్ అండ్ ప్రొడ్యూస్ (సీఎం యాప్) అనే యాప్ ఆర్బీకే అసిస్టెంట్ చేతిలో ఉండేది.

➤ ఈ యాప్ ద్వారా గ్రామ స్థాయిలో ధరలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ప్రతి రైతుకు బాసటగా నిలిచే వారు. ఇలా ఐదేళ్లలో ధర లేని సమయంలో రూ.7,800 కోట్లు ఖర్చు చేసి కనీస మద్దతు ధరలకు ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. ఇందుకోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశాం.

➤ అప్పట్లో రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసేవాళ్లం. తద్వారా రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేశాం. దాదాపు 85 లక్షల మంది రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఉచితంగా పంటల బీమా అమలు చేశాం. 54.55 లక్షల మంది రైతులకు ఇన్సూ్యరెన్స్ కింద రూ.7,800 కోట్లు జమ చేశాం.

➤ ప్రస్తుతం చంద్రబాబు హయాంలో కేవలం 19 లక్షల మంది మాత్రమే ఇన్సూ్యరెన్స్ చేయించుకున్నారు. అది కూడా బ్యాంక్ రుణాలు తీసుకున్న వారు. మరి ప్రీమియం చెల్లించని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటి? ఈ విపత్కర పరిస్థితుల్లో వారికి పంటల బీమా పరిహారం అందకుండా చేయడం దుర్మార్గం కాదా?

ఈ-క్రాప్‌ను గాలికొదిలేశారు..

■ ఏదైనా విపత్తు సంభవించినప్పుడు ఈ క్రాప్ అనేది రైతులకు శ్రీరామ రక్షగా నిలబడుతుంది. అలాంటిది ఈ ప్రభుత్వ హయాంలో ఈ–క్రాప్ తెరమరుగైపోయింది. పంట పొలంలో రైతులను నిలబెట్టి, జియో ట్యాగ్ చేసి, వారి ఫొటోతీసి అప్లోడ్ చేసే పరిస్థితి ఉండేది. ఈ రోజు ఈ–క్రాప్ నిర్వచనం మార్చేశారు. ఈ–క్రాప్ చేశామంటే చేశామన్నట్టుగా ఉంది. టీడీపీ వాళ్లయితే ఉన్న భూమి కంటే ఎక్కువగా సాగు చేసినట్టు చూపిస్తున్నారు.

■ ఇందుకు బాపట్ల జిల్లాయే ఉదాహరణ. ఈ జిల్లాలోని పర్చూరులో 112 శాతం, జే.పంగలూరులో 114 శాతం.. బల్లికురవలో 115 శాతం.. వేటపాలంలో 117 శాతం.. చీరాలలో 122 శాతం.. చినగంజాంలో 128 శాతం చొప్పున ఈ–క్రాప్ నమోదైనట్టుగా చూపించారు. అంటే ఉన్న భూమి కన్నా సాగైన భూమి ఎక్కువగా ఉందా? ఉన్నభూమి 100 శాతమైతే 128 శాతం విస్తీర్ణంలో సాగైనట్టు చూపిస్తున్నారు. అదెలా సాధ్యం! ఈ–క్రాప్‌ను ఏ విధంగా నీరుగారుస్తున్నారో ఇంతకంటే ఉదాహరణలు కావాలా?

ఇదేం విడ్డూరం.. ఒక్క రోజు ముందు ప్రొసీడింగ్సా..!?

➡ తుపాన్‌తో నష్టపోయిన రైతులు ఆశ్చర్యం కలిగించే విషయాలు చెబుతున్నారు. మీ పొలంలో ఎన్యూమరేషన్ చేయడానికి ఎవరైనా వచ్చారా? అని అడిగితే.. ఈ పొలంలోకే కాదు రాష్ట్రంలో దెబ్బతిన్న ఏ పొలంలోకి, ఏ రైతు దగ్గరకు ఎన్యూమరేషన్ చేసేందుకు ఎవరూ రాలేదన్న మాట విన్పిస్తోంది. కృష్ణా జిల్లా కలెక్టర్ అక్టోబర్ 30వ తేదీన ప్రొసీడింగ్స్ (ఉత్తర్వులు చూపిస్తూ) ఇచ్చారు.

➡ ఎన్యూమరేషన్ ఆఫ్ క్రాప్ డేమేజ్, సోషల్ ఆడిట్ 31వ తేదీ కల్లా పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఒక్క రోజులో ఎన్యూమరేషన్, సోషల్ ఆడిట్ అయిపోవాలట! ఎలా సాధ్యమో మీరే చెప్పండి. పైగా ఈ గడువులోగా చేయకపోతే యాక్షన్ తీసుకుంటామని ఇదే ప్రొసీడింగ్స్‌లో స్పష్టం చేశారు. క్రాప్ డామేజ్, ఎన్యూమరేషన్, సోషల్ ఆడిట్, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అంతా పూర్తి చేసి తుది జాబితాలను 1వ తేదీకల్లా వ్యవసాయ శాఖ డైరెక్టరేట్‌కు పంపాలని పేర్కొన్నారు.

➡ ఈ ఆదేశాలు చూస్తుంటే ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారో తెలుస్తోంది. ఎన్యూమరేషన్ అనేది ఎవరూ పంట పొలాల వద్దకు వచ్చి చేసే పరిస్థితి లేదు. గాలులు, తుపాను వల్ల ధాన్యం సుంకు విరిగిపోయింది. ఎన్యూమరేషన్ చేసేటప్పుడు ఏ అధికారి అయినా సరే పొలంలో అడుగు పెట్టాలి. వరి కంకులను చూడాలి. సుంకు (పుప్పొడి) రాలిపోయిందా? లేదా? అన్నది పరిశీలించాలి. ఎన్యూమరేషన్ ప్రక్రియలో ఈ విషయాన్ని స్పష్టంగా రాయాలి. సుంకు రాలిపోతే పాలు పోసుకునే పరిస్థితి ఉండదు. జర్మినేషన్ ప్రాసెస్ ఆగిపోతుంది. తద్వారా తాలు గింజలు ఏర్పడతాయి. ఈ వాస్తవాలు పరిశీలించేందుకు పొలాల వద్దకు వెళ్లకుండానే ఎన్యూమరేషన్ అయిపోయిందంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? ఇదేనా రైతులకు మేలు చేసే విధానం?


Enumeration of Agricultural crop damages more than 33% in yield loss, sand casting and soil erosion by the field functionaries-Formation of teams for enumeration – Certain instructions to the Team members – Orders - Issued - Regarding.

Ref.:
1) G.O.Ms.No.1 of the Rev (DM-II) Department, dated 07.01.2025
2) Preliminary crop damage report received from the concerned Mandal Agricultural Officers.
3) AGC02-26025/15/2025 Dt.30-10-2025 of the Director of Agriculture, A.P. Guntur
4) Office Note Rc No C4/ 325/2025 Dt 30.10.2025 submitted by the Joint Director of Agriculture, Krishna Machilipatnam.

enumeration and care should be taken if the farmer is not covered in Kharif, 2025 e-Panta due to technical reasons the names of such farmers should still be considered for damage assessment. The details of these farmers and their crops must subsequently be recorded in Kharif, 2025 e-Panta before submitting the final lists for future reference and processing

6. Enumeration of crop damage & social audit should be completed by 31.10.2025 & any grievances shall be redressed immediately.
7. The final proposals for input subsidy must be submitted to this office along with the list of beneficiaries through the approval of the District Collector by 01.11.2025

జాబితాల రూపకల్పనకు కేవలం 24 గంటలు సమయం మాత్రమే ఇస్తూ ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్

ధాన్యం కొనబోమని బ్లాక్ మెయిల్ చేస్తారా?

☛ ఎన్యూమరేషన్ కోసం ఎందుకు పొలం వద్దకు రాలేదని ఏ రైతు అయినా అడిగితే వారిని వెటకారం చేసి మాట్లాడుతున్నారు. పైగా ప్రతి రైతుకు వ్యవసాయ శాఖాధికారి నుంచి తాము చెప్పిన పత్రాలు (ఆధార్, 1బి జిరాక్స్, కౌలు గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం) సమర్పించిన వారి పొలాల్లో మాత్రమే పంట నష్టం పరిశీలించి జాబితాలో పెడతామని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా కూడా చెప్పిస్తున్నారు. అదీ అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా తీసుకొస్తేనే స్వీకరిస్తామని, లేదంటే ఆ పత్రాలు స్వీకరించం అని తెగేసి చెబుతున్నారు.

☛ మరొక వైపు 'దయచేసి రైతులు గమనించగలరు. ఇప్పుడు పంట నష్టం చేయించుకున్న రైతుల నుంచి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయబడదు' అని నిర్దయగా మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎవరైనా అడిగితే వాళ్ల ధాన్యం కొనుగోలు చేయరట! అంటే బ్లాక్ మెయిల్ చేస్తున్నారా?

☛ ఎక్కడైనా తుపాను వచ్చినపుడు ప్రభుత్వం మానవత్వం ప్రదర్శించాలి. నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకునేందుకు ముందుకు రావాలి. పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ), పంటల బీమా పరిహారం (ఇన్సూ్యరెన్స్) వచ్చేలా చేయాలి. అంతే కాకుండా వారి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టాలి. అది ఇస్తే ఇది ఇవ్వం.. ఇది ఇస్తే అది ఇవ్వం.. అని చెబుతూ రైతులను బెదిరించడం దారుణం. దీన్నిబట్టి ఈ ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో భయం ఉండేది..

➡ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి తుపానులు వచ్చే ముందు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించే వాళ్లం. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జిల్లా యంత్రాంగం కలిసి పనిచేసేది. కొత్త జిల్లాల ఏర్పాటుతో కలెక్టర్ల పరిధి తగ్గించాం. తక్కువ నియోజకవర్గాలకు ఎక్కువ మంది కలెక్టర్లు, జేసీలు వచ్చారు. ఇలాంటి విపత్తుల వేళ ప్రాణ నష్టం జరగకుండా కచ్చితమైన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే వాళ్లం. కలెక్టర్ల చేతుల్లో కావాల్సినంత డబ్బులు పెట్టేవాళ్లం. ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా దగ్గరుండి చూసుకోమని చెప్పే వాళ్లం.

➡ వారం.. పది రోజుల టైం ఇస్తున్నాం.. ఎన్యూమరేషన్ పక్కాగా, పారదర్శకంగా చేయాలని చెప్పేవాళ్లం. తర్వాత ముఖ్యమంత్రి హోదాలో నేను ఏదో ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు కలెక్టర్ పనితీరు ఎలా ఉంది.. పంట నష్టం కోసం ఎన్యూమరేషన్ ఎలా జరిగింది.. అన్ని సదుపాయాలు మీకు కల్పించారా.. లేదా.. వంటి వివరాలు ప్రజలను అడిగి తెలుసుకునే వాణ్ని. ఏ ఒక్కరైనా అధికారులు బాగా చేయలేదని చెబితే ఉద్యోగం పీకేస్తామని గట్టిగా చెప్పే వాళ్లం. అందువల్ల అధికారుల్లో ఒక భయం ఉండేది.

➡ ఇలాంటి విపత్తుల వేళ కలెక్టర్లతో పాటు ఎమ్మెల్యేలు ప్రభావిత ప్రాంతాల్లో తిరిగే వారు. వారం, పది రోజుల తర్వాత నేను వెళ్లే వాడిని. పరిస్థితిని అంచనా వేసే వాళ్లం. ముఖ్యమంత్రి వస్తాడేమో అనే భయంతో ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా కలెక్టర్లు పనిచేసే వారు. ఈ రోజు ప్రభుత్వ పనితీరు చూస్తుంటే.. ప్రభుత్వం ఉందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి.

➡ రైతుకు నష్టం వచ్చినా, కష్టం వచ్చినా పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. ఇంతటి విపత్కర పరిస్థితులు జరిగినప్పుడు ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఏం చేస్తున్నాడంటే.. ఒకరోజు చాపర్‌లో అలా అలా తిరుగుతాడు. మరుసటి రోజు లండన్ పోతాడు. ఆయన కొడుకు ఆస్ట్రేలియా నుంచి వస్తాడు.. మరుసటి రోజు ముంబైలో క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి పోతాడు. ఇక్కడ రైతుల పరిస్థితి ఏడవ లేక.. కడుపులో బాధ తట్టుకోలేక కొట్టుమిట్టాడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం. ఏ ఒక్క కౌలు రైతుకు కౌలు కార్డులు ఇవ్వడం లేదు. ఇస్తే వాళ్లకు పరిహారం ఇవ్వాల్సి వస్తుందనే దురాలోచనతో ఉన్నారు.

ఎందుకు లెక్కలు తక్కువ చేసి చూపిస్తున్నారు?

➜ ఎన్యూమరేషన్ లెక్కలు ఎందుకు తక్కువ చేసి చూపిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు? తుపాను వల్ల దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఇంత పంట నష్టం ఎప్పుడు జరగలేదని మీ ఎల్లో మీడియాలో, మీ గెజిట్ పేపర్ ఈనాడులోనే తొలుత రాశారు. ఇప్పుడు ఎందుకు తగ్గించి రాస్తున్నారు? ఎన్యూమరేషన్ చేసేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు? ఎందుకు రైతులకు తోడుగా నిలబడలేకపోతున్నారు? పైగా ఎన్యూమరేషన్ చేస్తే మీ పంటను కొనుగోలు చేయం అని ఎందుకు భయపెట్టిస్తున్నారు? రైతుకు మంచి చేయాల్సిన ప్రభుత్వం ఎందుకు నష్టం చేసే కార్యక్రమాలు చేస్తోంది?

➜ మీ తప్పిదం వల్ల రైతులకు పంటల బీమా పరిహారం (ఇన్సూ్యరెన్స్) డబ్బులు రావడం లేదు. ఇన్సూ్యరెన్స్ డబ్బులు కట్టి ఉండి ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా నష్టపోయిన ప్రతి రైతుకు కనీసం రూ.25 వేలకు పైగా పరిహారం వచ్చేది. మీ తప్పిదం వల్ల వారికి ఈ పరిహారం అందకుండా పోయింది. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేయడం వల్ల నష్టం జరిగింది. కాబట్టి ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూ్యరెన్స్ డబ్బులు కూడా వచ్చేలా చేయాల్సిన బాధ్యత మీదే. అలా చేయాలని రైతుల తరఫున డిమాండ్ చేస్తున్నాం. 18 నెలల్లో 16 సార్లు రైతులు నష్టపోయారు. మీరు తగ్గించి, కోతలేసి వేసిన లెక్కల ప్రకారమే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.600 కోట్లు ఇవ్వాలి. ఆ బకాయిలు కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. రబీ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింప చేయాలని కోరుతున్నా.

కృష్ణాజిల్లా నిడుమోలు వద్ద జనసందోహం

కృష్ణాజిల్లా నిడుమోలు వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మచిలీపట్నం హైవే రోడ్డుపై మంగళవారం రాత్రి ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

ఎవరూ వచ్చి చూసింది లేదు..

పడిపోయిన పంటలను చూడమన్నా.. ఒక్కరూ రావట్లేదు

వైఎస్ జగన్ ఎదుట వరి పొలాల్లో అన్నదాతల ఆక్రోశం..

సాక్షి ప్రతినిధి, విజయవాడ, నెట్‌వర్క్: 'తుపాను వల్ల దెబ్బతిన్న మా పంటలను చూడటానికి రావాలని కోరినా.. ఎవరూ రావట్లేదు. ఇప్పుడు దెబ్బతిన్న పంటలను జాబితాలో రాసుకుంటే.. రేపు ధాన్యం కొనుగోలు చేయబోమని చెబుతున్నారు. బయట వ్యాపారులకు అమ్ముకోమంటున్నారు. గత 18 నెలల కాలంలో ఒక్క రూపాయి ఇన్‌పుట్ సబ్సిడీ వేసింది లేదు. తాలు ధాన్యంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అవనిగడ్డ నియోజకవర్గంలో చేపట్టిన పర్యటన రోడ్ షోలా సాగిందే గానీ రైతులకు ఒనగూడింది ఏమీ లేదు..' అంటూ అన్నదాతలు నిర్వేదం వ్యక్తం చేశారు. రైతుకు కష్టమొచ్చినప్పుడు ప్రభుత్వం పట్టించుకోకపోతే.. వ్యాపారులు పట్టించుకుంటారా? అని ఆక్రోశించారు. వైఎస్ జగన్ హయాంలో క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించి, విపత్తులతో పంటలు దెబ్బతిన్న ప్రతిసారి సహాయం అందించిందని.. ఇప్పుడు కూటమి సర్కారు రైతులనే కట్టుకోమంటోందని, వంద మంది రైతుల్లో ఎనిమిది మంది కూడా ఇన్సూరెన్స్ కట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పట్టించుకున్న వారే లేరని, మీరే యాత్రల ద్వారా ఈ ప్రభుత్వం మెడలు వంచి కనువిప్పు కలిగించాలని వేడుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా తుపాన్ బాధిత ప్రాంతాల పర్యటనలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గం రామరాజుపాలెం, ఆకుమర్రు లాకుల వద్ద రైతులతో మాట్లాడారు. పంట పొలాల్లోకి దిగి స్వయంగా నష్టాన్ని పరిశీలించి వారిని ఓదార్చారు.

రైతు పరసా వెంకటేశ్వరరావుతో వైఎస్ జగన్ సంభాషణ ఇలా...

రైతు: నమస్తే సార్... నాకు మూడు ఎకరాలుంది
వైఎస్ జగన్: మూడు ఎకరాల పరిస్థితి ఏమిటి?
రైతు: ఎకరానికి రూ.35 వేలు పెట్టుబడి పెట్టా... యూరియా అందలా
వైఎస్ జగన్: యూరియా బ్లాక్‌లో కొనుక్కోవాల్సి వచ్చింది!
రైతు: ఇన్‌పుట్ సబ్సిడీ రావట్లేదు...
వైఎస్ జగన్: ఇన్‌పుట్ సబ్సిడీ రావటం లేదు. ఈ రెండేళ్ల కాలంలో చంద్రబాబు వచ్చాక ఇన్సూరెన్సు ఇచ్చిందీ లేదు.
రైతు: చేను పడిపోతే వచ్చి చూసిన అధికారి లేడు
వైఎస్ జగన్: చేను పడిపోయినా ఏ ఒక్క అధికారీ వచ్చి చూడలేదు. పొలంలోకి వచ్చి చూసింది లేదు.
రైతులు: లోపలకు అయితే అనుకోవచ్చు... రోడ్డు పక్కనే ఉన్నా వచ్చి రాసింది లేదు.

రామరాజుపాలెంలో వరి పొలంలో దిగి రైతులకు వైఎస్ జగన్ ఓదార్పు..

వైఎస్ జగన్: పంట నష్టం నమోదు చేశారా?
రైతు ఓడుబోయిన బ్రహ్మకృష్ణ: రాయలేదు సార్..
వైఎస్ జగన్: సుంకు విరిగి పోయింది. దాని వల్ల పాలు పోసుకునే పరిస్థితి లేదని చెప్పినా కూడా రాయలేదా..?
రైతు: రాయలేదు సార్...! నాకు మీ ప్రభుత్వంలో 3.18 ఎకరాలకు రూ.66,780 డబ్బులు పడ్డాయి
వైఎస్ జగన్: మన ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా ఉండటం వల్ల మీకు రూ.66,780 పడ్డాయి. ఈ రోజు కనీసం పొలాలకు వచ్చి ఎన్యూమరేషన్ చేసే వాడు లేడు. ఎన్యూమరేషన్ అనేది జరగలేదు. సుంకు పోయిందని చెప్పినా కూడా ఎవరూ రాలేదా?
రైతు: రాలేదు సార్...
వైఎస్ జగన్: ఎన్యూమరేషన్ ఎందుకు చేస్తారంటే.. సుంకు ఉందా లేదా? ఇవన్నీ చూడటానికే..! సుంకు పోయింది కాబట్టి దిగుబడి రాదు. అందుకు ఎన్యూమరేషన్ చేయాలి.
రైతు: ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి అయింది సార్...యూరియా బస్తా బ్లాక్‌లో రూ.500 పెట్టి కొన్నా. మీ ప్రభుత్వంలో రూ.270కి ఎక్కడ పడితే అక్కడ యూరియా కట్టలు దొరికాయి సార్.
వైఎస్ జగన్: రూ.260...270 పెట్టి కొనాల్సింది... రూ.500 పెట్టి కొనుక్కున్నారు. పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు చొప్పున అన్నదాతా సుఖీభవ ఇస్తామన్నారు. ఎంత ఇచ్చారు? రెండేళ్లకు రూ.40 వేలకు ఎంత వచ్చింది?
రైతు: రూ.5 వేలు ఇచ్చారు సార్.
వైఎస్ జగన్: రూ.40 వేలు అని చెప్పి.. రూ.5 వేలు ఇచ్చారు. ఈ 18 నెలలు కాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఏమైనా ఇచ్చారా..? ఒక్కసారైనా వచ్చిందా?
రైతు: ఏమీ రాలేదు సార్.
వైఎస్ జగన్: ఒక్కసారి కూడా రాలా..? ఈ–క్రాప్ కూడా చేయడం లేదు!
రైతు: నిరుడు కూడా మునిగిపోతే పట్టించుకోలేదు.
వైఎస్ జగన్: లాస్ట్ టైం పోయినా కూడా పట్టించుకోలేదు... ఇప్పుడు కూడా పట్టించుకోలేదు...! ఇది వరుసగా రెండోసారి...! ఈ ప్రభుత్వంలో పట్టించుకునే నాథుడు లేడు. మన ప్రభుత్వంలో సమయానికి రైతు భరోసా వచ్చింది. ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది. యూరియా బస్తా కూడా తక్కువ రేటుకే ఆర్బీకేల ద్వారా రూ.270కే ఇచ్చాం.
రైతు: మీ ప్రభుత్వంలోనే నాకు కౌలు కార్డు వచ్చింది సార్...
వైఎస్ జగన్: ఈ ప్రభుత్వంలో కౌలు కార్డు ఇవ్వలేదా...?
రైతు: లేదు సార్.

లోటు స్పష్టంగా కనపడుతోందయ్యా...!

రామరాజుపాలెం వద్ద దెబ్బతిన్న వరి కంకులను పరిశీలించి నష్టం గురించి తెలుసుకుంటున్న వైఎస్ జగన్

మచిలీపట్నంటౌన్: 'నువ్వు లేని లోటు స్పష్టంగా కనపడుతోందయ్యా..! నిన్ను కోల్పోయి ఎంతో తప్పు చేశాం. ఈసారికి మన్నించయ్యా..' అంటూ కృష్ణా జిల్లా గూడూరు మండలం రామరాజుపాలేనికి చెందిన రైతు సాయిబాబు వైఎస్ జగన్ ఎదుట ఆక్రోశించాడు. 'మీరు సీఎంగా ఉన్న సమయంలో రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలన సాగించారు. ప్రస్తుతం ఆ తేడా మాకు ఎంతో స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొన్నాడు. తనకు నాలుగు ఎకరాల పొలం ఉందని, వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా కింద రూ.72 వేలు అందాయని గుర్తు చేసుకున్నాడు. ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తే ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయదని అధికారులు చెబుతున్నారని, ఇదెక్కడి అన్యాయమో తమకు అర్థం కావటం లేదని వాపోయాడు. ఆకుమర్రు లాకు సమీపాన నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించిన అనంతరం రైతులు సాయిబాబు, గణేశన రమేష్‌బాబు, దేసు ప్రసాద్‌తో వైఎస్ జగన్ మాట్లాడారు.

జగన్: తుపాన్ తర్వాత ఎవరైనా అధికారి వచ్చారా?
రైతు సాయిబాబు: రాలేదన్నా..
జగన్: మనిషి వచ్చి చూసి రాసుకోవడం ఇంపార్టెంట్.. సుంకు ఉందా? పాలు పోసుకుంటుందా.. లేదా? అన్నది అప్పుడే తెలుస్తుంది. ఇన్‌పుట్ సబ్సిడీ అడిగితే.. పంటలు కొనుగోలు చేయబోమని చెప్పారా?
రైతులు: రైతుకు పంట నష్ట పరిహారం ఇస్తే.. ధాన్యం కొనుగోలు చేయబోమని చెబుతున్నారు.
జగన్: చంద్రబాబు వచ్చి రెండు సంవత్సరాలు..! రెండు సీజన్లు అయిపోయాయి.. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఏరోజూ రాలేదు. పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామన్నారు. అన్నదాతా సుఖీభవ కింద రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాలి. ఎంత ఇచ్చారు?
రైతులు: రూ.5,000 ఇచ్చారు.
జగన్: మిగిలిందంతా ఎగరగొట్టారు. అన్నదాతా సుఖీభవ లేదు.. ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. ఎరువుల రేటు ఎలా ఉంది?
రైతులు: యూరియా బ్లాక్‌లో అమ్మారు.
జగన్: యూరియా ఎంతకు కొన్నారు?
రైతు సాయిబాబు: మూడు రోజులు తపస్సు చేసి యూరియా కట్ట రూ.1200కు కొన్నాం అన్నా..!
రైతు రమేష్ బాబు: యావరేజ్ మీద రూ.650, రూ.700కి కొన్నాం.
జగన్: రూ.260 ఖరీదు చేసే కట్టను.. రూ.600 – రూ.700 దాకా కొనాల్సి వచ్చింది. పంటలకు కనీసం గిట్టుబాటు ధరైనా వస్తోందా?
రైతులు: అదీ లేదన్నా..!
జగన్: గత సంవత్సరం బస్తా ఎంతకు అమ్మారు?
రైతులు: సార్వాలో బస్తా వడ్లు రూ1250 – రూ.1300కి అమ్మేమన్నా..!
జగన్: రూ.1750కి అమ్మాల్సిన ధాన్యాన్ని రూ.1300కి అమ్మారు..
రైతు సాయిబాబు: ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తీసుకెళ్లా.. తేమ శాతం ఎక్కువగా ఉందని, తాలు ఉందని కటింగ్‌లు చేసుకుంటూ పోయి మా చేతికి రూ.1,300 ఇచ్చారు.
జగన్: ఎకరాకు పెట్టుబడి ఎంత పెట్టారు?
రైతులు: ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల పెట్టుబడి పెట్టాం.
జగన్: ఇప్పుడు ఎన్ని బస్తాలు వచ్చేలా ఉంది?
రైతులు: పది బస్తాలు కూడా వస్తాయో లేదోనయ్యా..! కంకిలో 25 శాతం గింజలు కూడా వచ్చేలా లేవు.
జగన్: వారు (ప్రభుత్వం) చేసిన సాయం ఏమీ లేదు.. కనీసం తుపాన్ వచ్చిన రోజైనా ఆదుకుందా?
రైతులు: సర్పంచ్ మమ్మల్ని తీసుకెళ్లి భోజనాలు పెట్టారు.
జగన్: మన ప్రెసిడెంట్ రాజు పెట్టించారు.. వాళ్లేమీ పెట్టలేదుగా!
రైతు సాయిబాబు: మమ్మల్ని ఆదుకునే వారు లేరు. ఎరువులు బ్లాక్‌లో కొన్నాం. గత ఐదు సంవత్సరాల్లో పంటల బీమా మీరు ఎలా చేశారో కూడా మాకు తెలియదు. మాది రూపాయి ఖర్చు లేదు. నాకు సబ్సిడీ పడింది. మొత్తం రూ.72 వేలు వచ్చాయి. ఇవాళ ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టలేదు. కడదాం అని వెళితే టైం అయిపోయిందన్నారు.
రైతు రమేష్ బాబు: మీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇన్సూరెన్స్ కట్టాలనే మాట కూడా మర్చిపోయాం సార్..
జగన్: మన ప్రభుత్వ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సమయానికి వచ్చేది. పెట్టుబడికి రైతు భరోసా ఇచ్చేవాళ్లం.
రైతు రమేష్ బాబు: ఇవాళ కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది..
రైతు సాయిబాబు: మీరున్న ఐదు సంవత్సరాలు ధైర్యంగా వడ్లు అమ్ముకున్నాం. మిల్లర్ల వద్దకు తీసుకువెళ్లి అమ్మాం.
రైతు రమేష్ బాబు: ఇప్పుడు వడ్లు మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు

ఆకుమర్రు లాకు వద్ద దెబ్బతిన్న పొలాన్ని పరిశీలించేందుకు వెళుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కానూరు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం కోసం పోటీపడుతున్న యువత

గోపువానిపాలెం వద్ద భారీగా తరలివచ్చిన రైతులు, ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం

జగనన్నకు ఓ చెల్లెమ్మ హారతి...

గూడూరు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉయ్యూరు వద్ద కాన్వాయ్ ఆపి రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

శ్రీచరణి

ఇంట్లో నాతోనే క్రికెట్ ఆడేది!

చిన్నప్పటినుంచి అథ్లెటిక్స్ అంటే శ్రీచరణికి ప్రాణం. జాతీయ స్థాయిలో ఖోఖో ఆడింది. కానీ, క్రికెట్ అంటేనే చాలా ఇష్టం. ఇంట్లో క్రికెట్ ఆడతానని అలిగేది. తన తండ్రి కూడా అథ్లెటిక్స్ ఆడమని చెప్పారు. కానీ, నేను మాత్రం శ్రీచరణికి తోడుగా నిలిచి క్రికెట్‌ను ప్రోత్సహించాను. నాతోనే ఇంట్లో క్రికెట్ ఆడేది. ఇప్పుడు ఏకంగా వరల్డ్ కప్ గెలుపులో కీలకంగా నిలవడం మాకెంతో గర్వకారణం. ఇక మా సంతోషానికి హద్దులు లేవు.

– నల్లపురెడ్డి రేణుక (శ్రీచరణి తల్లి)

తండ్రిగా చెప్పుకోవడానికిగర్వంగా ఉంది..

ఉమెన్స్ వరల్డ్ కప్‌లో అదరగొట్టిన భారత్ క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణి తండ్రిగా చెప్పుకోవడానికి నాకు చాలా గర్వంగా ఉంది. నా కూతురు వరల్డ్ కప్‌లో క్రికెట్ ఆడుతుంటే చాలా సంతోషంగా ఉంది.

– నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీచరణి తండ్రి

మహిళల ప్రపంచ కప్ పోటీల్లో సాటిలేని ప్రతిభ కనబర్చి వైఎస్సార్ కడప జిల్లా పేరును ప్రపంచ పటంలో నిలిపిన శ్రీచరణి వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రంపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖర రెడ్డి, రేణుక దంపతుల కుమార్తె. తండ్రి ఆర్టీపీపీలో ఎలక్ట్రికల్ ఫోర్‌మన్. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో చదివింది. హైదరాబాద్ లేపాక్షి జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసింది. ప్రస్తుతం వీఎన్‌పల్లె వీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ క్రికెట్‌లో విశేష ప్రతిభ కనబరుస్తోంది.

అండర్-19 నుంచి భారత జట్టు స్థాయికి..

తొలుత శ్రీచరణి 2017–18లో జిల్లా అండర్–19 జట్టుకు ఎంపికైంది. అప్పటినుంచి ఇంక వెనక్కి తిరిగి చూడలేదు. అదే ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. జిల్లాకు చెందిన క్రికెట్ శిక్షకులు ఖాజా మొయినుద్దీన్, మధుసూదన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్నో మెళకువలు నేర్చుకుంది. ఆ తర్వాత..

- 2021లో అండర్–19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా–సి జట్టుకు ప్రాతినిధ్యం వహించి నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది.
- శ్రీచరణి ఆట నైపుణ్యం గుర్తించిన డబ్ల్యూపీఎల్ ప్రతినిధులు ఢిల్లీ క్యాపిటల్స్‌కు రూ.55 లక్షలతో ఎంపిక చేసుకున్నారు.
- ఏప్రిల్ 27 నుంచి మే 11 వరకు జరిగిన శ్రీలంక ముక్కోణపు వన్డే సీరీస్ క్రికెట్ టోర్నీకి నల్లపురెడ్డి శ్రీచరణి తొలిసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.
- లండన్‌లో జరిగిన టీ–20 టూర్‌కు భారత జట్టు తరపున ఎంపికైంది.
- ప్రస్తుతం ఐసీసీ మహిళ విభాగంలో భారత జట్టు తరపున ప్రపంచకప్‌లో నిలకడగా రాణించింది. ఈ టోర్నీలో 14 వికెట్లు తీసి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రెండో బౌలర్‌గా ఘనత సాధించింది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..

చిన్నప్పటి నుంచి ఆటలపై మక్కువ చూపే శ్రీచరణి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. మొదట్లో అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న శ్రీచరణి ఆ తర్వాత క్రికెట్‌పై ఆసక్తి చూపుతుండడంపై అమ్మానాన్నలు సందేహించారు. కానీ, క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన మామ కిశోర్‌కుమార్‌రెడ్డి శ్రీచరణిని ప్రోత్సహించారు. సరదాగా మొదలుపెట్టిన క్రికెట్ ఇప్పుడు శ్రీచరణికి సర్వస్వం అయింది. ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు ఎందులోనైనా రాణించగలరని శ్రీచరణి రుజువు చేసింది.

– మోపూరు బాలకృష్ణారెడ్డి.
సాక్షి ప్రతినిధి, కడప

పిల్లల ప్రతిభను ప్రపంచం కంటే ముందు తల్లిదండ్రులే గుర్తించాలి.
గోరుముద్దల్లో ఉత్సాహం.. వేలు పట్టి నడిపే నడకలో ప్రోత్సాహం
అందించినప్పుడే పిల్లలు పులుల్లా మారతారు...
చిరుతల్లా కదలాడతారు.
తల్లిదండ్రులు అమ్మాయిలను చదివించి...
ఉద్యోగాలు చేయించడం వరకు ఆలోచిస్తారు.
కానీ, క్రీడల్లో కొనసాగమని చెప్పడం తక్కువ.
మన మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ విజయం
సాధించడం చూసి ఇకపై పెద్ద మార్పు రావచ్చు.
ఈ జట్టులోని అమ్మాయిలను తల్లిదండ్రులు
ప్రోత్సహించిన తీరు చూస్తే ‘క్రీడాకారిణి కావాలని ఉంది’ అని
ఏ అమ్మాయి కోరినా తల్లిదండ్రులు తప్పక
‘మేమున్నాం’ అనే రోజులు వచ్చేశాయి.

అమ్మానాన్నలూ గెలిచారు

‘పిల్లల ఇష్టాలు కనిపెట్టి, వారు ఎంచుకున్న మార్గంలో వెళ్లేలా ప్రోత్సహించడం, తగిన స్వేచ్ఛను ఇస్తూ, సపోర్ట్‌గా ఉండటం పేరెంట్స్ నిర్వర్తించాల్సిన పనులు’ అంటారు ఇండియన్ విమెన్ క్రికెటర్ అరుంధతీరెడ్డి తల్లి భాగ్యరెడ్డి. మహిళా క్రికెట్‌లో వరల్డ్ కప్ కైవసం చేసుకున్న మన భారత జట్టులో భాగమైన ఫాస్ట్ బౌలర్ **అరుంధతి రెడ్డి** హైదరాబాద్ వాసి. ఈ విజయోత్సవ ఆనందంలో కూతురి కల గురించి అమ్మగా భాగ్య రెడ్డి పంచుకున్న విషయాలు..

దిసీజ్ ఫర్ యూ..!

తల్లి భాగ్యరెడ్డితో అరుంధతీరెడ్డి

‘‘ఫైనల్స్ చూడటానికి ముంబయ్ వెళ్లి, ఈ రోజే వచ్చాను. మ్యాచ్ గెలవగానే ‘అమ్మా.. దిస్ ఈజ్ ఫర్ యు’ అని చెప్పింది నా బిడ్డ. ఆ క్షణంలో పొందిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఈ గెలుపును ఇప్పుడు మా కుటుంబం అంతా ఎంజాయ్ చేస్తున్నాం. చిన్నప్పుడు తన అన్న రోహిత్, ఇతర కజిన్స్‌తో కలిసి గల్లీలో క్రికెట్ ఆడేది. టీవీలో క్రికెట్ చూసేది. స్పోర్ట్స్‌లో చాలా చురుకుగా ఉండేది. నేను వాలీబాల్ స్టేట్ ప్లేయర్‌ని. స్పోర్ట్స్ అంటే ఇష్టం ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా నా కలలను నెరవేర్చుకోలేకపోయాను. నా కూతురుకి ఉన్న ఇష్టాన్ని కాదనకూడదు అనుకున్నాను.

క్రికెట్ ఫస్ట్..

మేముండేది సైనిక్‌పురిలో. ప్రైవేట్ స్కూల్ టీచర్‌ని. మధ్యతరగతి కుటుంబం. స్పోర్ట్స్‌లో అరుంధతికి ఉన్న ఇష్టాన్ని చూసి, పన్నెండేళ్ల వయసులో స్పోర్ట్స్ సెంటర్‌లో చేర్పించాను. ఉదయం నాలుగు గంటలకే స్పోర్ట్స్ సెంటర్‌కి వెళ్లిపోయేవాళ్లం. అక్కణ్ణుంచి స్కూల్. మళ్లీ సాయంత్రం ఇద్దరం గ్రౌండ్‌కి వెళ్లిపోయేవాళ్లం. క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూనే ఓపెన్ లో టెన్త్ ఎగ్జామ్స్ రాసింది. 15 ఏళ్లకే అండర్ –19 హైదరాబాద్ జట్టుకు ఎంపికయ్యింది. ఫాస్ట్ బౌలర్ గా పేరు తెచ్చుకుంది.

పెద్ద కల ఉంటే త్యాగాలు ఎన్నో...

2017లో రైల్వేలో చేరింది. అక్కడ ఉంటూనే చాలా విషయాల పట్ల అవగాహన ఏర్పరుచుకుంది. అండర్ 23 జోనల్ టోర్నమెంట్ లో రాణించింది. మళ్లీ ఒక దశలో క్రికెట్– జాబ్ .. దేనిని ఎంచుకోవాలనే నిర్ణయం వచ్చింది. ఓ రోజు తన నిర్ణయం క్రికెట్ మాత్రమే అని చెప్పింది. నేనూ ‘సరే’ అన్నాను. రెండేళ్ల కిందట జాబ్ మానేసి పూర్తి సమయాన్ని ప్రాక్టీస్‌కే కేటాయించింది. ప్రాక్టీస్‌లో భాగంగా కుటుంబంలో ఎన్నో సంతోష సమయాలలో తను దూరంగా ఉండాల్సి వచ్చేది. ఈ రోజు దేశాన్ని గెలిపించిన జట్టులో నా బిడ్డ ఉందంటే... చాలా ఆనందంగా ఉంది.

ధైర్యమే పెద్ద సపోర్ట్

అరుంధతికి క్రికెట్‌తో పాటు పాటలు పాడటం అంటే చాలా ఇష్టం. సమయం దొరికితే మెలోడీస్ ను చాలా ఇష్టంగా పాడుతుంది. అమ్మాయిలకైనా, అబ్బాయిలకైనా వారి జీవితాన్ని వారు ఎంచుకునే స్వేచ్ఛ వారికే ఇవ్వాలి. పెద్దలుగా మనం కనిపెడుతూ ఉండాలి. పిల్లల ఆసక్తితో ఎంచుకున్న మార్గంవైపు మనకు తెలిస్తే ఏవైనా సూచనలు ఇవ్వాలి. లేదంటే, ధైర్యంగా వెళ్లు అని చెప్పాలి. ఈ ఏడాది పిల్లలను స్పోర్ట్స్ అకాడమీలో చేర్చాం. వచ్చే ఏడాదికి పెద్ద ప్లేయర్ అయిపోవాలని వారిపై ఒత్తిడి తీసుకురావద్దు. అది సాధ్యం కాదు కూడా. ఎంచుకున్న దానిపైన అంకితభావం, క్రమశిక్షణ, సాధన ఉండాలి. మా అమ్మాయి ఆలోచన ఎప్పుడూ క్రికెట్ వైపు ఉండేది. మా కుటుంబం అంతా ఆమె వైపు ఉన్నాం. నా కలలను పిల్లల ద్వారా తీర్చుకోవాలి అనుకోలేదు. నా జీవితంలో ఎదురైన స్ట్రగుల్స్‌ని ఎప్పుడూ పిల్లల ముందు చెప్పలేదు. నా జర్నీలో మా అమ్మ నాకు పెద్ద మోరల్ సపోర్ట్. నా కూతురు ఎదుగుదలలో నేను కూడా అంతే. ఎంచుకున్న మార్గం వైపు ధైర్యంగా వెళ్లమనే చెబుతుంటాను. ఈ రోజు ఆ సక్సెస్‌ను చూస్తున్నాం’’ అంటూ ఆనందంగా వివరించారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
నవంబర్ 4న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,21,110	1,24,060	1,22,460	1,24,060	1,20,080	1,22,730
బంగారం (22 క్యారెట్లు)	1,11,090	1,12,250	1,12,250	1,15,620	1,11,140	1,12,500
వెండి	1,50,000	1,51,200	1,65,000	1,51,200	1,50,000	1,65,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

ధన పిశాచి సర్‌ప్రైజ్ చేస్తుంది

– నిర్మాత ప్రేరణ అరోరా

‘‘నేను హిందీలో సినిమాలు చేస్తున్నప్పటికీ నాకు తెలుగు సినిమాలు, తెలుగు సంస్కృతి అంటే చాలా ఇష్టం. రామ్‌చరణ్‌గారి ‘ఆరెంజ్’ చిత్రం చూశాను. అప్పట్నుంచి తెలుగు సినిమాలను ఫాలో అవుతున్నాను. ఇండియన్ సినిమాకి తెలుగు పరిశ్రమ గొప్ప చిత్రాలను అందించింది. తెలుగులో సినిమా చేయాలనే నా కల ‘జటాధర’ సినిమాతో నెరవేరడం హ్యాపీగా ఉంది. ప్రేక్షకులకు మంచి అనుభూతినిచ్చే చిత్రం ఇది’’ అని చెప్పారు నిర్మాత ప్రేరణ అరోరా. సుధీర్‌బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ ‘జటాధర’. ఈ ద్విభాషా (తెలుగు, తమిళ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రేరణ అరోరా మాట్లాడుతూ– ‘‘ఫ్యామిలీ అంశాలు, ఎమోషన్స్, మైథలాజికల్, సూపర్ నేచురల్ విషయాలు, ఆశ, అత్యాశ... ఇలా అన్ని అంశాలు ‘జటాధర’లో చక్కగా కుదిరాయి. సుధీర్‌గారు చేసిన క్యారెక్టర్, ఆయన పెర్ఫార్మెన్స్ ఆడియన్స్‌కు గుర్తుండిపోతాయి. సోనాక్షీ సిన్హాగారు చేసిన ధన పిశాచి క్యారెక్టర్ ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్రకు సోనాక్షినే పర్ఫెక్ట్ చాయిస్. సుధీర్‌బాబు–సోనాక్షిల మధ్య వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌లు అలరిస్తాయి. శిల్పాగారి క్యారెక్టర్ కాస్త నెగటివ్ షేడ్స్‌తో ఉంటుంది. ఇంకా ఈ చిత్రంలో అనంత పద్మనాభ స్వామి దేవాలయం, నాగబంధం, పిశాచి బంధం, బ్లాక్ మ్యాజిక్ వంటి అంశాలను చూపించాం. ఈ సినిమాకు సీక్వెల్ లేదా ప్రీక్వెల్ ఉండే స్కోప్ ఉంది. తెలుగులో ఓ పెద్ద హీరోతో సినిమా చేయనున్నాం’’ అని చెప్పారు.

ఆర్కియాలజిస్ట్ దక్ష

మీనాక్షీ చౌదరి

ఇక్కడున్న ఫొటో చూశారుగా! ఆర్కియాలజిస్ట్ దక్ష ఆ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అక్కడ ఏం జరిగింది? దక్షకు ఎలాంటి క్లూస్ దొరికాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. నాగచైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్. బి నిర్మిస్తున్న చిత్రం ‘ఎన్‌సీ 24’ (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో హీరోయిన్ మీనాక్షీ చౌదరి ఆర్కియాలజిస్ట్ దక్ష పాత్రలో నటిస్తున్నారని వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ‘‘ఈ చిత్రంలో మీనాక్షి పాత్ర కీలకంగా ఉంటుంది. నటనకు స్కోప్ ఉన్న క్యారెక్టర్ ఇది’’ అని యూనిట్ పేర్కొంది.

శివతో పెద్ద స్టార్‌ని చేశారు

నాగార్జున

నాగార్జున, రామ్‌గోపాల్ వర్మ

‘‘‘శివ’ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ప్రేమతో వచ్చిన మీ అందరికీ (ఫ్యాన్స్) ధన్యవాదాలు. ఈ సినిమాని మీ తల్లిదండ్రులు థియేటర్స్‌లో చూసుంటారు. ఇప్పుడు అదే ప్రేమతో మీరూ వచ్చారు. 36 ఏళ్ల క్రితం నాతో ‘శివ’ సినిమా తీసి, నన్ను పెద్ద స్టార్‌ని చేసిన నా మిత్రుడు రామ్‌గోపాల్ వర్మకి థ్యాంక్స్. మంగళవారం ఉదయం ‘శివ’ చూశాను. అద్భుతంగా అనిపించింది’’ అన్నారు నాగార్జున. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగార్జున, అమల జోడీగా నటించిన చిత్రం ‘శివ’. అన్నపూర్ణ స్టూడియోస్‌పై అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర నిర్మించిన ఈ సినిమా 1989 అక్టోబర్ 5న విడుదలైంది. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఏళ్ల సందర్భంగా సరికొత్త 4కె డాల్బీ అట్మాస్‌లో ఈ నెల 14న ‘శివ’ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా అక్కినేని అభిమానుల సమక్షంలో రీ రిలీజ్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. నాగార్జున మాట్లాడుతూ– ‘‘దాదాపు 6 నెలల పాటు రాము చాలా ప్రేమతో ఇష్టపడి ప్రతి సౌండ్ ట్రాక్‌ని మళ్లీ ఒరిజినల్ సినిమా చేసినట్టుగా అద్భుతంగా డిజైన్ చేశాడు. శివ ఈజ్ ఫరెవర్. మరో 36 ఏళ్ల తర్వాత కూడా ‘శివ’ని మళ్లీ మీ ముందుకు తీసుకురావాలని కోరుకుంటున్నాను. ‘శివ’కి ముందు ‘శివ’కి తర్వాత అని రాజమౌళిగారు అన్నట్టు ‘శివ’ ఎప్పటికీ నిలిచిపోతుంది’’ అని చెప్పారు. 36 ఏళ్ల తర్వాత మేమిద్దరం (నాగార్జున, వర్మ) ఒకే వేదికపై ఇలా మీ ముందు రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లాడతామని ఎప్పుడూ ఊహించలేదు. ఇది చాలా గొప్ప అనుభూతి. రీ రిలీజ్ కోసం కొత్త టెక్నాలజీని ఉపయోగించాం. మీకు చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. చిరంజీవిగారు చెప్పినట్టు సినిమా ఉన్నంత వరకు ‘శివ’ చిరంజీవిలా చిరస్మరణీయం’’ అని రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు.

హిందీ రిలీజ్ గురించి అడుగుతున్నారు

– హీరో ఆది సాయికుమార్

అర్చన, ఆది సాయికుమార్, యుగంధర్ ముని

‘‘సినిమాలోని కంటెంట్ బాగుంటేనే ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్ ఉన్న మా ‘శంబాల’ ఏ ఒక్కరినీ నిరాశపరచదు. మా చిత్రాన్ని ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను’’ అని ఆది సాయికుమార్ అన్నారు. ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ ‘శంబాల: ఏ మిస్టికల్ వరల్డ్’. అర్చన అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ కీలక పాత్రలు చేస్తున్నారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌కు మంచి స్పందన లభించిందని చిత్రబృందం పేర్కొంది. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ‘‘మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన ప్రభాస్‌గారికి థ్యాంక్స్. ఈ ట్రైలర్ చూసి, రానాగారు మెచ్చుకుని, తన వంతుగా సాయం చేస్తానని చెప్పారు. కొంత మంది హిందీ రిలీజ్ గురించి అడుగుతున్నారు. ఇంకా మాకు సపోర్ట్‌గా నిలిచిన దుల్కర్, సందీప్ కిషన్, కిరణ్ అబ్బవరం, సహకరించిన నిర్మాతలు వంశీ, ప్రమోద్, ప్రసాద్ అన్నలకు ధన్యవాదాలు. రాజీపడకుండా నిర్మించిన నిర్మాతలకు లాభాలు రావాలని కోరుకుంటున్నా’’ అన్నారు. ‘‘థియేటర్స్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన చిత్రమిది’’ అని యుగంధర్ ముని చెప్పారు.

జైన్స్ నాని, రాజేశ్, గణేశ్, కిరణ్ అబ్బవరం, గడ్డం ప్రసాద్‌కుమార్, శివ బొమ్మకు

చిన్న చిత్రాలను ఆదరించండి

– తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

‘‘యంగ్ అండ్ డైనమిక్ టీమ్ కలిసి ‘కె–ర్యాంప్’ సినిమాను రూపొందించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను నేను కోరేది ఒక్కటే... చిన్న చిత్రాలను ఆదరించండి. ‘కె–ర్యాంప్’ లాంటి టీమ్‌కు ప్రేక్షకుల ఆదరణ, ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నాను’’ అని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జోడీగా నటించిన చిత్రం ‘కె– ర్యాంప్’. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 18న విడుదలైంది. ఈ సినిమా మూడో వారంలోనూ సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతూ రూ. 40 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు యూనిట్ పేర్కొని, ‘కె–ర్యాంప్’ ర్యాంపేజ్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్ల గణేశ్ అతిథులుగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ‘‘నాకు ‘కె–ర్యాంప్’కి మించి ఇంకా పెద్ద సక్సెస్‌లు రావొచ్చు. కానీ ఈ సినిమా మాత్రం ఎప్పటికీ ప్రత్యేకంగా మిగిలిపోతుంది’’ అని తెలిపారు. ‘‘కె–ర్యాంప్’ మా టీమ్ అందరి విజయం’’ అన్నారు జైన్స్ నాని. ‘‘‘కె–ర్యాంప్’ హిట్ అవుతుందని ఓ ఈవెంట్‌లో తొడగొట్టి చెప్పాను. ప్రేక్షకులు మా నమ్మకాన్ని నిజం చేస్తూ బ్లాక్ బస్టర్ సక్సెస్ ఇచ్చారు’’ అని రాజేశ్ దండ చెప్పారు.

బ్లాక్ బస్టర్ హిట్ ఖాయం

– మంచు మనోజ్

‘‘ఒక పల్లెటూరులో జరిగిన వాస్తవ ఘటనలతో రూపొందిన చిత్రం ‘రాజు వెడ్స్ రాంబాయి’. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. అలాగే బోలెడన్ని అవార్డ్స్ వస్తాయి’’ అని హీరో మంచు మనోజ్ చెప్పారు. అఖిల్ ఉడ్డెమారి, తేజస్విని జంటగా సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన చిత్రం ‘రాజు వెడ్స్ రాంబాయి’.

మనోజ్, మౌనిక, తేజస్విని, అఖిల్

డా. నాగేశ్వర రావు పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్, డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్‌సూన్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించిన ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ నెల 21న విడుదల చేస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ మూవీ నుంచి ‘రాంబాయి నీ మీద నాకు...’ అంటూ సాగే పాటను హీరో మంచు మనోజ్, ఆయన సతీమణి భూమా మౌనిక చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. మంచు మనోజ్ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా రిలీజ్ తర్వాత సాయిలుకు బెదిరింపు కాల్స్ వస్తాయి. అప్పుడు తనకు సపోర్ట్‌గా నేనుంటాను’’ అన్నారు. ‘‘గతించిన చరిత్రకు, ప్రస్తుత చరిత్రకు మా సినిమా ఓ సాక్ష్యం’’ అన్నారు వేణు ఊడుగుల. ‘‘మా సినిమా చూస్తున్నవాళ్లకు తమ ప్రేమ గుర్తుకొస్తుంది’’ అన్నారు సాయిలు. ‘‘సూపర్ హిట్ ఆల్బమ్ అనే మాట మా సినిమాతో మళ్లీ వినిపిస్తుందని నమ్ముతున్నాం’’ అని పేర్కొన్నారు రాహుల్ మోపిదేవి.

వినోదాల జిగ్రీస్

‘జిగ్రీస్’ పోస్టర్

కృష్ణ బూరుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘జిగ్రీస్’. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వంలో కృష్ణ వోడపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. సయ్యద్ కమ్రాన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి ‘మీరేలే...’ అంటూ సాగే మెలోడి పాటని డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా విడుదల చేయించారు. హరీష్ రెడ్డి ఉప్పుల సాహిత్యం అందించిన ఈ పాటని ఏక్‌నాథ్ పాడారు. ‘‘యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘జిగ్రీస్’. స్నేహం, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ ఉంటుంది. ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్‌ని ‘మీరేలే...’ పాట అద్భుతంగా చూపిస్తుంది’’ అన్నారు మేకర్స్.

మూడు ప్రేమకథలు

సన్నీ అఖిల్, రెహానా

‘అయోధ్య రామయ్య, చెప్పాలని ఉంది, జోరుగా హుషారుగా..’ వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహేశ్‌చంద్ర తెరకెక్కించిన కొత్త చిత్రానికి ‘పిఠాపురంలో..’ అనే టైటిల్ ఖరారైంది. ‘అలా మొదలైంది’ అన్నది ఉపశీర్షిక. సన్నీ అఖిల్, రెహానా, డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించారు. దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. మహేశ్ చంద్ర మాట్లాడుతూ– ‘‘కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథా చిత్రమిది. ఈ చిత్రంలో మూడు జంటల ప్రేమకథలను, ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లని చూడొచ్చు. కథను నమ్మి, ఈ సినిమా తీశాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 54,483 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 44,533 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆలయానికి విరాళం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి ఆలయానికి మంచికలపూడికి చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు కుమారుడు రూ.లక్ష విరాళం అందించారు.

ప్రాతః కాల అభిషేకాలు



భట్టిప్రోలు: పెదపులివర్రులోని శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి వారికి మంగళవారం 14వ పర్వదినాన ప్రాతః కాలంలో అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

అమ్మవారికి గాజులతో అలంకరణ

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఉయ్యాల సేవ చేశారు. దేవాలయంలో కనువిందుగా జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. పుచ్చ శైలజ భక్త బృందం ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులు రాఘవేంద్ర శివ వరప్రసాద్, ఆలయ ఈవో హరిప్రసాద్, వెంకన్న మాస్టారు పాల్గొన్నారు.

శివాలయంలో కార్తిక పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వాహన పూజలు నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

డాక్టర్ సుమితా శంకర్‌కు విశిష్ట అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ అల్యూమ్నీ ఆఫ్ నార్త్ అమెరికా నుంచి సీనియర్ కన్సల్టెంట్ ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్‌కు డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం అవార్డు ఫర్ రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ – 2025 ప్రదానం చేశారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఇందులో జింకానా అవార్డులను బహూకరించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ చేతుల మీదుగా డాక్టర్ సుమితా శంకర్ అందుకున్నారు. 2004లో కూడా ఇదే అవార్డు అందుకున్న ఆమెకు ఇది రెండోసారి లభిస్తున్న ప్రత్యేక గౌరవం. ఈ సందర్భంగా డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ 2024లో బ్లాక్ బక్ పయనీర్ రీసెర్చ్ అవార్డును కూడా అందుకున్నట్లు వెల్లడించారు. డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం అవార్డు ప్రతి సంవత్సరం జింకానా ద్వారా ప్రదానం చేస్తున్నారని, వైద్య పరిశోధనలో విశిష్ట కృషి చేసిన వారిని గౌరవించడమే దీని లక్ష్యమని తెలిపారు.

పల్నాటి ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

కారెంపూడి: ఈ నెల 19 నుంచి 23 వరకు జరగనున్న పల్నాటి వీరారాధన ఉత్సవాల నిర్వహణపై గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి డీఎస్పీ వెంకట నారాయణ మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు జరగనున్న కారెంపూడిలో ట్రాఫిక్ సమస్యపై చర్చించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు వివరించారు. మంచినీరు, వైద్యం, పారిశుద్ధ్య పరిరక్షణ ఇతర సౌకర్యాల కల్పనపై కార్యాచరణను కారెంపూడి తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ కసిన్యా నాయక్ వివరించారు. సమావేశంలో పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

జ్వరం.. కలవరం



గుంటూరు రూరల్ మండలానికి చెందిన పదో తరగతి విద్యార్థిని గత నెల 16న జ్వరంతో చికిత్స పొందుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మరణించింది. ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్తూ ఆడుతూ పాడుతూ ఉంటే బిడ్డ కళ్లెదుటే చనిపోవటాన్ని ఆ కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోయారు. గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినా మరణించడంతో షాక్‌కు గురయ్యారు. జ్వరం రాగానే అశ్రద్ధ చేయకుండా తక్షణమే అర్హత ఉన్న వైద్యులను సంప్రదించాలి. త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేయించి చికిత్స అందించడం వల్ల మరణాలను ఆపవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- ముందస్తు వైద్య పరీక్షలతో కట్టడి
- అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి
- జిల్లాలో అధికంగా నమోదు
- 750 మందికి టైఫాయిడ్ జ్వరాలు
- మలేరియా బాధితులు ఐదుగురు
- డెంగీ బాధితులు 88 మంది
- భయపెడుతున్న మెలియాయిడోసిస్

జీజీహెచ్‌లో పరీక్ష కోసం రక్తం సేకరిస్తున్న సిబ్బంది

గుంటూరు మెడికల్: జిల్లాలో జ్వరాల కేసులు ప్రతిరోజూ నమోదవుతున్నాయి. గుంటూరు జీజీహెచ్‌లో పలువురు చికిత్స కోసం వస్తున్నారు. పలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా చికిత్స కోసం వస్తున్న వారి సంఖ్య రోజూ పెరుగుతూనే ఉంది. పెద్దవారే కాకుండా పిల్లలు సైతం విష జ్వరాల బారిన పడటంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాధితుల లెక్కలు కూడా రికార్డుల్లో నమోదు కావటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 750 మంది టైఫాయిడ్, ఐదుగురు మలేరియా, 88మంది డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తదితర వ్యాధులు వచ్చాక ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకోవటం కంటే ముందుస్తుగా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. శారీరక శుభ్రతతో పాటు ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

వర్షాలతో వ్యాధులు ప్రారంభం

వర్షాలు వస్తే వ్యాధుల సీజన్ ప్రారంభమైనట్లే. జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తూ ఉండటంతో ఏదో ఒక ప్రాంతంలో ఎక్కువగా జ్వరాల కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యానికి ఢోకా ఉండదు. లేకపోతే అనారోగ్యం బారిన పడక తప్పదు. వర్షాలు కురిసేటప్పుడు దోమలు బాగా పెరిగి వ్యాధులను కలుగజేస్తాయి. దోమ చిన్నదే కాని దాని కాటు వల్ల వచ్చే వ్యాధులు మాత్రం ఎక్కువ. డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులన్నీ దోమలు కుట్టడం ద్వారానే వస్తాయి. వర్షా కాలంలో వ్యాధులన్నీ కూడా దోమకాటు వల్లే వస్తుంటాయి.

భయపెడుతున్న మెలియాయిడోసిస్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు ఇప్పటికీ సరైన కారణాలు తేలలేదు. మెలియాయిడోసిస్ వల్ల కొందరు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. వర్షాకాలంలో ప్రబలే ఈ వ్యాధి సోకిన వారిలో అధిక జ్వరం ఉంటుంది. బరువు తగ్గటం లేదా పెరగటం, రాత్రి వేళలో ఒళ్లంతా బాగా చెమటలు పడతాయి. దీర్ఘ కాలంగా దగ్గు ఉంటుంది. దగ్గితే రక్తం పడుతుంది. కడుపు నొప్పి, ఛాతీ నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పి, తలనొప్పి, మూర్ఛలు ఉంటాయి.

జీజీహెచ్‌లో రక్త పరీక్షల కోసం వేచిఉన్న రోగులు

వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దోమల నియంత్రణ కోసం ఇంటి లోపల, బయటా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి.
- ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు , పాత టైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి.
- ఎయిర్ కూలర్‌లలో, పూల కుండీలలో నీటిని మూడు రోజులకు ఒకసారి మార్చాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు మూతలు బిగించాలి.
- వారానికి ఒకసారి నీటి గుంటల్లో కిరోసిన్, మడ్డి ఆయిల్ చల్లించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
- దోమ తెరలు తప్పనిసరిగా వాడాలి.

అశ్రద్ధ చేయకూడదు

జ్వరం రాగానే కంగారు పడకుండా ఉండాలి. అలాగని అశ్రద్ధ చేయకూడదు. ఏ జ్వరమో తెలియకుండా మాత్రలు వేసుకోకూడదు. ఇన్‌ఫెక్షన్స్ వల్ల కూడా వస్తుంది. మొదటి అర్హత కల్గిన వైద్యుల వద్ద వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ఏ జ్వరమో తేలిన తర్వాతే మందులు వాడాలి. జ్వరం తగ్గడం కోసం వైద్యులు రాసే మందులు వాడాలే తప్పా షాపులకు వెళ్లి నేరుగా కొనుక్కొని వాడరాదు. దీనివల్ల సైడ్ ఎఫెక్ట్‌లు వచ్చే ప్రమాదం ఉంది.

–డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, గుంటూరు

నియంత్రణకు ప్రత్యేక చర్యలు

జిల్లా వ్యాప్తంగా దోమల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది సీజనల్ జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జ్వరం సోకిన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఇంటింటికి ఫీవర్ సర్వే చేసి ముందస్తు జాగ్రత్తలు వివరిస్తున్నాం. జ్వర పీడితులకు తక్షణమే వైద్య సహాయాన్ని అందిస్తున్నాం. దోమకాటుతో జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడటం చాలా ఉత్తమం.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

స్కానింగ్‌లో

దోపిడీకి అడ్డుకట్ట

- ఇన్ పేషెంట్లకే ఎంఆర్ఐ స్కానింగ్
- అదికూడా హెచ్‌ఓడీలు సిఫార్సు చేయాలి
- తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్షాళనకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎంఆర్ఐ యూనిట్ స్కానింగ్‌లో దోపిడీపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. స్కానింగ్ పకడ్బందీగా జరిగేలా నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత విభాగం నిర్వాహకులను సంజాయిషీ కోరుతూ సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి నోటీసులిచ్చారు. దీంతో పాటు ప్రైవేటు డాక్టర్లు సిఫార్సు చేసిన రోగులకు స్కానింగ్ చేయకుండా అడ్డుకట్ట వేశారు. తాజా నిర్ణయం ప్రకారం ఇకపై ఎంఆర్ఐ అవసరమై ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇన్‌పేషెంటుగా అడ్మిట్ చేసుకుని, ఒకరోజు తర్వాత చేస్తారు. అదికూడా సంబంధిత విభాగం హెచ్‌ఓడీ రిఫర్ చేయాలి. దానిపై ఆసుపత్రి ఆర్ఎంఓ/ సూపరింటెండెంట్ సంతకం తీసుకోవాలి. ఆ తర్వాతే చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాత్రి డ్యూటీల్లో కొందరు డాక్టర్లు కొందరు విశ్రాంత గదులకే పరిమితమవుతుండటంపై అధికారులు దృష్టి సారించారు. క్యాజువాలిటీ డ్యూటీ డాక్టర్లతో మంగళవారం సాయంత్రం సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సమావేశమయ్యారు. క్యాజువాలిటీకి వచ్చిన ప్రతి రోగికీ సత్వరం చికిత్స అందించాల్సిందేనని, విశ్రాంత గదులకు పరిమితం కారాదని స్పష్టంగా చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన రోగికి చికిత్స చేయాలని, అవసరమైతే ఇన్‌పేషెంటుగా చేర్చుకోవాలని ఆదేశించారు. ఏదొక కారణంపై వైద్యం నిరాకరించటం తగదని తెలిపారు. ఫిర్యాదులొస్తే ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వైద్యుల మధ్య శత్రుత్వం తగదు

వైద్య విద్యార్థులకు యాప్రాన్, ఐడీ కార్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారిడాక్టర్ రమణ

- ఐక్యతతో వృత్తిలో రాణించాలి
- జింకానా ప్రెసిడెంట్ డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు
- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు
- ఘనంగా వైట్ కోట్ సెర్మని

గుంటూరు మెడికల్: రోజురోజుకూ వృత్తిలో పోటీ పెరిగి వైద్యుల మధ్య శత్రుత్వం పెరుగుతోందని, యువ వైద్యులు కలిసికట్టుగా వృత్తిలో రాణించాలని జింకానా కో–ఆర్డినేటర్, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు చెప్పారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్ డే , వైట్ కోట్ సెర్మనీ జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ కోయ మాట్లాడుతూ ఒకరికొకరు సోదర భావంతో మెలగాలని తెలిపారు. విజ్ఞానం పెంచుకుని వృత్తిలో రాణించాలని సూచించారు. ప్రతి వైద్య విద్యార్థికీ జీవితంలో మరుపురాని రోజులా వైట్‌కోట్ సెర్మని నిలిచిపోతుందని చెప్పారు.

- గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ వైద్యులు అనైతిక పోటీకి వెళ్లకుండా ఎథిక్స్ పాటించాలని చెప్పారు.
- గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారీ మాట్లాడుతూ వైట్ కోట్ వేసుకోవడం ఫ్యాషన్ కాదని, అది బాధ్యతకు ప్రతీక అని చెప్పారు. కొత్తగా ధరించిన విద్యార్థులతో హిపోక్రటీస్ ప్రమాణం చేయించారు. వైద్య విద్యార్థులు వృత్తి విలువలు, నైతికతలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.
- డాక్టర్ యశ్వి రమణ, ముఖ్య అతిథి డాక్టర్ కోయ రామకోటేశ్వరరావులు విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. జింకానా అవార్డులను పలువురు రీసెర్చ్ వైద్యులకు అందజేశారు . కార్యక్రమంలో పలువురు బోధనా సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఫ్రెషర్స్‌కు స్వాగతం పలుకుతూ సీనియర్ వైద్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- యూరియా పంపకంలో వివాదం
- కుర్చీలు, కంప్యూటర్లు ధ్వంసం
- పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదుతో కేసు నమోదు

కొట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

గుంటూరు రూరల్: తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎరువుల కోసం ఎగబడుతున్నారు. ప్రభుత్వం పంపిణీలో విఫలం చెందింది. తెలుగు తమ్ముళ్లు బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో మంగళవారం యూరియా పంపకంలో చెలరేగిన వివాదం చివరికి కుమ్ములాటకు దారి తీసింది. రెండు గ్రూపులు పరస్పర దాడులు చేసుకున్నాయి. పంచాయతీ కార్యాలయంలోని ఫర్నీచర్ ధ్వంసమైంది.

క్యూ కట్టిన రైతులు

వింజనంపాడుకు 20 టన్నుల యూరియా వచ్చిందని తెలిసిన రైతులు పంచాయతీ ఆఫీసుకు క్యూ కట్టారు. గ్రామానికి చెందిన రైతు ముప్పవరపు శ్రీనివాసరావు పొలం పాస్ బుక్‌లు తీసుకుని పంచాయతీ కార్యాలయానికి వెళ్లాడు. ఏఏవో రైతుల నుంచి పాస్‌బుక్‌లు చూసి ఎరువులను రాస్తున్నారు. గతంలో శ్రీనివాసరావు తీసుకున్నాడని, మరలా వచ్చాడని అదే గ్రామానికి చెందిన పొందూరి వెంకటేశ్వరరావు గొడవకు దిగాడు. ఇద్దరూ చెలరేగి కార్యాలయంలోనే కొట్లాటకు దిగారు. వారికి సర్ది చెప్పేందుకు కొందరు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వివాదం మరింత పెరిగి కార్యాలయంలోని కంప్యూటర్లు, కుర్చీలు ధ్వంసమయ్యాయి. సిబ్బంది పంపిణీ ఆపేయడంతో రైతులకు ఎరువు అందకుండా పోయింది.

విస్తుపోయిన అధికారులు

అధికారం చేతిలో ఉందని తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొట్లాటలకు దిగడంతో అధికారులు సైతం విస్తుపోయారు. కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసమైందని పంచాయతీ కార్యదర్శి శారద, మహిళా పోలీస్ రమ్య పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమానాయక్ సిబ్బందితో అక్కడకు వచ్చి పరిస్థితిని గమనించారు. అధికారుల ఫిర్యాదు మేరకు ముప్పవరపు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. సరిపడా ఎరువులను సైతం అందించలేక రైతులపైనే కేసులు పెడతారా ? అంటూ గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు.

తుక్కుతుక్కుగా కాలం చెల్లిన వాహనాలు

- 15ఏళ్లు దాటితే రీసైక్లింగ్ తప్పనిసరి
- దక్షిణ భారతదేశంలో తొలిసారిగా గుంటూరులో యూనిట్ ఏర్పాటు
- స్క్రాప్ చేయించుకున్న వారికి 20 నుంచి 25శాతం వరకు రాయితీ ప్రకటన
- ఇప్పటికీ అమలు కానీ పరిస్థితి
- త్వరలో వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్న నిర్వాహకులు

కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 15 సంవత్సరాలు దాటిన ఏ వాహనం అయినా స్క్రాప్ (తుక్కు) చేయించాల్సిందే. మెకానిక్ దగ్గరో మాయాబజార్ లేదా ఆటోనగర్ వంటి ప్రాంతాల్లో చేయిస్తే తలనొప్పి తప్పదు. వాహనం స్క్రాప్ అయినా మనకు సంబంధించిన వివరాలు ధ్వంసం అవ్వవు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటు చేసిన స్క్రాప్ యూనిట్ ద్వారా వాహనాన్ని డిస్పోజల్ చేయించాలి. దీనిద్వారా మనకు వాహనంపై ఎటువంటి హక్కు లేదని, తుక్కు చేయబడిందని పూర్తిస్థాయిలో ఆధారిత సర్టిఫికెట్ జారీ అవుతుంది. దీనివల్ల వాహన యజమానులకు కూడా ఎంతో మేలు చేకూరే అవకాశాలున్నాయి.

బుడంపాడులోని హిందూస్థాన్ స్క్రాప్ రీసైక్లింగ్ హబ్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు రూరల్ మండలం బుడంపాడు పరిసర ప్రాంతాల్లో 2023లో హిందూస్తాన్ రీసైక్లింగ్ స్క్రాప్ హబ్‌ను ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, అన్ని అనుమతులు తీసుకుని రీ సైక్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో డీటీసీగా పనిచేసిన షేక్ కరీంతో పాటు ఒంగోలు డీటీసీలు, జేటీసీలు పూర్తిస్థాయిలో అన్ని పర్యవేక్షించిన అనంతరం అనుమతులు జారీ చేశారు. తొలుత వాహనాలు పెద్దగా రాకపోయినా ఇప్పుడు గణనీయంగా మార్పు వచ్చింది. ఈ రెండేళ్లలో ఇప్పటి వరకు 709 ప్రభుత్వ ద్విచక్ర వాహనాలు, 15 డిఫెన్స్, పూర్తిగా పక్కన పడేసినవి 1,588, ప్రైవేట్ బైక్‌లు 53 ధ్వంసం చేశారు. ప్రభుత్వానికి చెందిన కార్లు, నాలుగు చక్రాల వాహనాలు, లారీలు 1,248, పూర్తిగా పక్కన పడేసినవి 28, డిఫెన్స్ వాహనాలు 26, ప్రైవేట్‌వి 83 వాహనాలను ఇప్పటికి తుక్కు చేశారు.

కేంద్ర ప్రభుత్వం జీవో జారీ

పాత వాహనాలను స్వచ్ఛందంగా, అధికారికంగా స్క్రాప్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ 2021లో జీవో 653 (ఈ)ను కేంద్ర ప్రభుత్వం జారీ చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. 15 సంవత్సరాలు కాలం చెల్లిన ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు, ప్రమాదాల్లో పూర్తిస్థాయిలో దెబ్బతిన్నవి, వాహనదారులు వినియోగించకుండా పక్కన పడేసిన వాటితో పాటు ప్రభుత్వ, స్థానిక సంస్థల, కార్పొరేషన్లు, ఆర్టీసీ బస్సులను సైతం స్క్రాప్ వంపాల్సిందేనని స్పష్టం ఆదేశాలు జారీ చేసింది.

స్క్రాప్ తర్వాత ప్రభుత్వ పత్రం

ప్రభుత్వం నుంచి అనుమతుల అనంతరం పూర్తిస్థాయిలో బుడంపాడు పరిసర ప్రాంతంలో మూడు ఎకరాల సువిశాలమైన ప్రదేశంలో రూ. 2.50 కోట్లతో నిర్వాహకులు రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. సాంకేతికంగా, మ్యాన్యువల్‌గా సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారు.

వాహనాల పార్ట్‌లను తీస్తున్న సిబ్బంది

హబ్‌కు వాహనాన్ని పంపి స్క్రాప్ చేయించటం ద్వారా ప్రభుత్వ పత్రం అందజేయడంతో పాటు మార్కెట్ ధర ప్రకారం ఇంజిన్, ఇతర సామగ్రికి వెలకట్టి వాహనదారుడికి అందజేస్తారు. నూతన వాహనాన్ని కొనుగోలు చేసిన సమయంలో 20 నుంచి 25 శాతం వరకు రాయితీ పొందే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. దీతో పాటు ఉచిత ఉచిత రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ అండ్ వెహికల్స్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్‌వీఎస్ఎఫ్) ద్వారా పూర్తిస్థాయిలో వెహికల్ సమాచారాన్ని అందజేస్తారు. తొలి రోజుల్లో పెద్దగా సంస్థపై అవగాహన లేకపోయినప్పటికీ, ఇప్పుడు అధిక సంఖ్యలో వాహనాలు వస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. స్క్రాప్ అనంతరం పొందే సర్టిఫికెట్‌కు మూడు సంవత్సరాల పాటు కాల పరిమితి ఉంటుంది.

కేంద్రం ఇచ్చినా.. స్పందించని రాష్ట్రం

కేంద్ర ప్రభుత్వం రీసైక్లింగ్ యూనిట్ ద్వారా స్క్రాప్‌కు చేయించుకున్న వాహనాలకు సంబంధించి 20 నుంచి 25 శాతం వరకు నూతన వాహనాల కొనుగోలులో రాయితీ ఇచ్చే ప్రక్రియను తీసుకుని వచ్చింది. ఇదే వ్యవస్థలు పలు రాష్ట్రాల్లో కొనసాగడంతో వాహనదారులకు రాయితీలు అందుతున్నాయి. అయితే, ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎటువంటి ప్రకటన, జీవోని జారీ చేయని పరిస్థితుల్లో వాహనదారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్క్రాప్ తరువాత రీసైక్లింగ్ యూనిట్ నుంచి వచ్చే ధ్రువపత్రం కాలపరిమితి మూడేళ్లు కావటం, ఈలోగా పరిమితి ముగిస్తే, రాయితీ అందనే భావనలో ఉన్నారు. సంస్థ నిర్వాహకులు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులను కలిసి విన్నవించామని చెబుతున్నారు.

సరికొత్త మిషనరీ, వ్యవస్థ

రీసైక్లింగ్ హబ్ ద్వారా వాహనాన్ని తుక్కు చేయడానికి అనేక రకాల పరికరాలను అందుబాటులోకి నిర్వాహకులు తీసుకు వచ్చారు. డీ పొల్యూషన్, ఆయిల్ పొల్యూషన్ పంప్స్, స్క్రాప్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉన్నాయి. ముందుగా కాలం తీరిన వాహనం వెళ్లిన తరువాత పార్ట్‌లు విభజిస్తారు. ముఖ్యంగా దీనిలో అత్యంత ముఖ్యమైనది డీ రిస్కింగ్, బెల్ట్ డిటెన్సనర్, ఎయిర్ బ్యాగ్ డిప్లయిర్స్, హీల్ పాపర్స్ వంటి పనులను డీ రిస్కింగ్ ద్వారా చేస్తారు. అనంతరం డీ మ్యాండ్లింగ్ ద్వారా కంప్రెసర్ ఎయిర్, షేల్స్ వంటి పనులు చేసి ఆఖరికి రీసైక్లింగ్‌కు పంపుతారు. స్క్రాప్ బైయింగ్ మిషన్ ద్వారా ఇనుప సామగ్రిని తుక్కుతుక్కు చేసేస్తారు. కచ్చితంగా వాహనానికి రిజిస్ట్రేషన్ ఉంటే మాత్రమే స్క్రాప్‌కు అనుమతినిస్తారు.

నిబంధనలకు అనుగుణంగానే స్క్రాపింగ్



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇక్కడ స్క్రాపింగ్ పనులు జరుగుతాయి. రిజిస్ట్రేషన్ ఉన్న వెహికల్స్ మాత్రమే 15 సంవత్సరాలు దాటిన అనంతరం వాటిని స్క్రాప్ చేసి సర్టిఫికెట్ అందజేస్తాం. ఆ నంబర్ ప్లేట్, ఛాసిస్ నంబర్ వినియోగించుకునే అవకాశం ఎవరికీ ఉండదు. వీటితో పాటుగా ప్రమాదాల్లో తీవ్రంగా దెబ్బతిన్నవి, వాహనం వద్దనుకున్న వారికి స్క్రాప్ చేసి మార్కెట్ రేటు ప్రకారం వాహనదారుడు అనుకూలతని బట్టి అందజేస్తాం. ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంస్థల వాహనాలను సైతం రీస్లైకింగ్ చేస్తాం. రాయితీ అంశంపైన ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నాం. అతి త్వరలోనే అది కూడా వచ్చే అవకాశం ఉంది.

–పఠాన్ అబ్దుల్ రెహమాన్ ఖాన్

క్లుప్తంగా

కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా

కొరిటెపాడు(గుంటూరు): పత్తి రైతులు 2025–26 పంట సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కి పత్తి అమ్ముదానికి గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ ఐఓఎస్ స్టోర్‌లో అందుబాటులో ఉన్న 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అంతే కాకుండా సీసీఐ కేంద్రం ఎంపిక చేసిన పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. సీసీఐ కేంద్రాలకు నాణ్యతతో కూడిన ఆరబెట్టిన పత్తిని తీసుకువస్తే మద్దతు ధర క్వింటాకు రూ.8,110లు పొందాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

దివ్యాంగులకు ఉచిత మోటారు వాహనాలు

ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): జిల్లాలో దివ్యాంగులకు ఉచిత మోటారు వాహనాల(మూడు చక్రాలు) పంపిణీకై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.దుర్గాభాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 70 శాతం, అంతకంటే ఎక్కువ లోకో మోటార్ వికలాంగత కలిగి ఉండి.. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఈ నెల 25వ తేదీలోగా www. apdascac. ap. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్): 2025–26 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఉపకారం వేతనాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9, 10 తరగతి, ఇంటర్ చదువుతున్న అర్హులైన ఓబీసీ/ఈబీసీ విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు ఎన్ఎస్‌పీ(నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8885177788 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆరుగురు సబ్-ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : జిల్లాలో ఆరుగురు సబ్-ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న డీవీ సుధాకర్‌రావు నగరంపాలెం పోలీస్ స్టేషన్ (పీఎస్) కు, వీవీ రమణారెడ్డిని మహిళా పీఎస్‌కు, ఎస్‌కేఎస్ఎం సుభానీని నల్లపాడుకు, షేక్ నజీర్ సాహెబ్ పాతగుంటూరుకు, బి.జగన్మోహనరావు తాడేపల్లికి, ఉమెన్ పీఎస్‌లో ఉన్న కె. తరంగిణి మంగళగిరి టౌన్‌కు పోస్టింగు ఇచ్చారు.

పార్టీల సహకారంతో పారదర్శక ఓటరు జాబితా

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: రాజకీయ పార్టీల సహకారంతోనే పారదర్శకమైన ఓటర్ లిస్టు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహతో కలిసి వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనపై అభ్యంతరాలను రాజకీయ పార్టీల వెంటనే సంబంధిత ఈఆర్వోలకు లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ తుది ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆమోదం కోసం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి పంపిస్తారన్నారు. నియోజకవర్గాల వారీగా ఈఆర్వోలు 1200 ఓటర్లు కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేసి ఏర్పాటు చేసిన అదనపు పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ప్రాంతాల మార్పులు, కేంద్రాల పేర్లు సవరణల ప్రతిపాదనలను సమావేశంలో వివరించారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు తెలిపారు. సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, డీఆర్వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీ కుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓటులేసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

స్టేడియంలో శునకాల స్వైర విహారం

- ఆందోళనలో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్, క్రీడాకారులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

స్టేడియంలో వాకింగ్ ట్రాక్ లోపల, బయట కుక్కలు

స్టేడియం సెక్యూరిటీ ఎక్కడా..?

లక్ష్మీపురం: గుంటూరు నగర నడి బొడ్డులోని బృందావన్ గార్డెన్స్‌లో నగరపాలక సంస్థ అధికారుల ఆధీనంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. స్టేడియంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే సమయంలో ఆ ట్రాక్‌పై కుక్కలు సంచరిస్తూ వాకర్స్‌ను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్కోసారి వాకర్స్‌పైకి ఎగబడుతూ గాయపరిచేస్తున్నాయి. ఇంతకుముందు దాడులు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని వాకర్స్, క్రీడాకారులు చెబుతున్నారు. ఈ స్టేడియంకు నిత్యం ప్రముఖ వ్యాపారులు, డాక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులే కాకుండా వృద్ధులు, చిన్నారులు, మహిళలు వందలాది మంది వస్తుంటారు. అయితే ఇటీవల కుక్కల సంచారం ఎక్కువవడంతో స్టేడియానికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్టీఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, మహిళ, పురుషుల జిమ్, స్కేటింగ్, టెన్నిస్, స్విమ్మింగ్ కోర్టులు ఉన్నాయి. స్టేడియంలో ముగ్గురు, స్విమ్మింగ్ పూల్ వద్ద ఒక్కరు మాత్రమే సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. గతంలో స్టేడియంలో ఎనిమిది మంది, స్విమ్మింగ్ పూల్‌లో ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్ ఉండేవారు. కానీ ప్రస్తుతం స్టేడియం మొత్తానికి గాను నలుగురు మాత్రమే సెక్యూరిటీ గార్డ్స్ ఉండటం వల్ల పర్యవేక్షణ లోపం ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి స్టేడియంలో సంచరిస్తున్న కుక్కలను పట్టుకోవాలని వాకర్స్, క్రీడాకారులు కోరుతున్నారు.

జోగి రమేష్ అరెస్ట్ అక్రమం

అఖిలభారత వడ్డెర సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): మాజీ మంత్రి జోగి రమేష్‌ను నకిలీ మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేశారని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్ ధ్వజమెత్తారు. బీసీల ఎదుగుదలను చంద్రబాబు ఓర్చుకోలేరని విమర్శించారు. గుంటూరు నగరంలోని నల్లచెరువులో ఉన్న సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యం కేసులో అసలు నిందితులైన వారి నుంచి ఉద్దేశ్యపూర్వకంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరును చెప్పించి, అరెస్ట్ చేయటం కేవలం కూటమి ప్రభుత్వ కుట్రేనన్నారు. దీనిపై బీసీ సంఘాలు, పెద్దలు పెద్ద ఎత్తున ఉద్యమించటంతో పాటు, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుమల ఏడుకొండల స్వామి, సింహాచలం అప్పన స్వామి, కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులు చనిపోయిన పాపం కూటమి ప్రభుత్వానికి తగులుతుందన్నారు. జోగి రమేష్ అరెస్టును వడ్డెర సంక్షేమ సంఘం పూర్తిగా ఖండిస్తుందని స్పష్టం చేశారు.

బిలియర్డ్స్ అండ్ స్నూకర్ పోటీల్లో స్నూకర్ విజేత శుభశర్మ

నేడు బిలియర్డ్స్ ఫైనల్స్

శుభశర్మ, రన్నరప్ శంకర్‌రావులకు బహుమతి ప్రదానం చేస్తున్న అఫ్రోజ్ ఖాన్, మైనేని

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నగరంలోని ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత 13 రోజుల నుంచి ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన స్నూకర్ ఫైనల్స్‌లో కాకినాడకు చెందిన శుభశర్మ విజేతగా నిలవగా, ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ క్రీడాకారుడు ఎస్.శంకర్‌రావు రన్నర్‌గా నిలిచాడు. పి.కిషోర్ తృతీయస్థానం సాధించాడు. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పఠాన్ అఫ్రోజ్ ఖాన్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. క్లబ్ నుంచి ఎందరో క్రీడాకారులు రాణించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో క్లబ్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీలు కూడా నిర్వహించాలని కోరారు. పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు(అజార్) మాట్లాడుతూ గత 13 రోజులుగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 270 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. క్రీడాకారులకు భోజన వసతి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజేతలకు రూ.1.35 లక్షల నగదు బహుమతితో పాటు, ట్రోఫీలను అందజేశామన్నారు. బిలియర్డ్స్ ఫైనల్స్ బుధవారం జరుగుతుందని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వర రావు, కోశాధికారి ఏల్చూరు వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుశీల్, పాండురంగారావు, శివాజీ, జి.స్వరాజ్ రావు, యు.అనిల్, ఎంపీ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 20.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 1.4 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..పెదనందిపాడు 6.8, కాకుమాను 6.6, కొల్లిపర మండలంలో 5.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

క్యూఎస్ ఏషియా ర్యాంకింగ్స్‌లో ఏపీలో ఏఎన్‌యూ టాప్

ఏఎన్‌యు(పెదకాకాని): క్యూఎస్ ఏషియా సంస్థ ప్రకటించిన యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 761–770 స్థానంలో నిలిచి ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీల్లో ట్యాప్ ర్యాంగ్‌లో నిలిచింది. అలానే ఆంధ్రయూనివర్సిటీ, జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలు 801–850 ర్యాంక్, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ 851– 900 ర్యాంక్, శ్రీకృష్ణ యూనివర్సిటీ 1001–1100 ర్యాంక్‌లు సాధించాయి. 2025– 26 విద్యా సంవత్సరానికి గాను ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

15న ద్వితీయ హిందూ మహిళా దీపోత్సవం

తెనాలి: గతేడాది పట్టణంలో నిర్వహించిన హిందూ మహిళా దీపోత్సవం తరహాలోనే ద్వితీయ హిందూ మహిళా దీపోత్సవాన్ని ఈనెల 15వ తేదీన 1008 మంది మహిళలతో నిర్వహించనున్నట్టు హిందూ చైతన్యవేదిక నాయకులు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును మంగళవారం స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు శ్రీవాసవి దేవస్థానం నుంచి పురవీధుల్లో ఊరేగింపుగా గంగానమ్మపేటలోని పాత శివాలయం వరకు చేరుకుంటుందని చెప్పారు. అక్కడ దీపాలను పెట్టి ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. తెనాలి పరిసరాల్లోని హిందూ మహిళలు హాజరుకావాలని కోరారు. సంయోజక్ మూర్తి, శారద, జిల్లా సంయోజక్ రమాదేవి, శ్రీను, విశ్వహిందూ పరిషత్ నుంచి రామాంజనేయులు, విజయలక్ష్మి, మారుతి రావెల, ధనలక్ష్మి, జయ, రమణమ్మ, పూజిత, నాగలక్ష్మి, లీల, తన్నీరు శ్రీనివాసు పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన ఐదుగురిపై చీటింగ్ కేసు

సత్తెనపల్లి: తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన ఐదుగురు వ్యక్తులపై పట్టణ పోలీస్ స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన గణపా ఉషారాణికి ఏడున్నర సెంట్ల స్థలం ఉండగా ఆ స్థలానికి అదే గ్రామానికి చెందిన గలభా రాములు, గలభా రాఘవమ్మ, గలభా శ్రీనివాసరావు, గలభా గోవిందమ్మ, గలభా వెంకట్రావులు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సత్తెనపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై ఉషారాణి సత్తెనపల్లి సబ్ రిజిస్టార్‌ను కలిసి ఫిర్యాదు చేయగా ఆయన జరిగిన రిజిస్ట్రేషన్ పై విచారణ జరిపి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని నిర్ధారించుకున్నారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ అశోక్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఐదుగురుపై పట్టణ ఎస్ఐ జె శ్రీనివాసరావు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న విజయవాడలో బీసీల రాష్ట్రస్థాయి సమావేశం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఎన్నికల ముందుకు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 9వ తేదీన విజయవాడలోని రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా.. ముందుగా కుల గణన చేయడం తప్పనిసరన్నారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ విజయవాడలో జరిగే విస్తృత స్థాయి సమావేశానికి అన్ని జిల్లాల నుంచి బీసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘ గౌరవ అధ్యక్షుడు కన్నా మాస్టారు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలా మణికంఠ, బీసీ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు అరెస్ట్

పేకాటరాయుళ్ల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్లు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి హరిజనవాడ కరకట్ట వెంబడి పుష్కర కాలనీ సమీపంలో మంగళవారం పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ టీమ్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు, 11 సెల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ. 69,200 నగదును సీజ్ చేశారు. అనంతరం ఎస్‌బీ సీఐ శ్రీహరి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వీరిని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా, సీఐ వీరేంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రతాప్ కేసు నమోదు చేశారు. రేకుల షెడ్డులో ఓ మహిళ ఈ పేకాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీ వారికి వచ్చిన సమాచారం మేరకు ఈ దాడి జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా తాడేపల్లి పట్టణ పరిధిలో ఉండవల్లి – తాడేపల్లి రోడ్డులో భారీగా శిబిరం ఏర్పాటు చేసి మరీ పేకాట నిర్వహిస్తున్నా.. పోలీసులు పట్టీపట్టనట్లు ఉంటున్నారని స్థానికులు తెలిపారు. వారికి పోలీసుల అండదండలు ఉండబట్టే పట్టించుకోవడం లేదని చర్చించుకుంటున్నారు.

పాలడుగులో భారీ చోరీ

రూ.10 లక్షల విలువైన బంగారం, రూ.40 వేల నగదు అపహరణ

దుండగులు పగలగొట్టిన బీరువా

మేడికొండూరు: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున మేడికొండూరు మండలంలోని పాలడుగు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆమతి వీరయ్య గ్రామంలోని సిరిపురం రోడ్‌లో నివసిస్తున్నారు. మాలధారణ చేసిన వీరయ్య ఇంటిదగ్గర్లో ఒక గదిలో ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి ఎవరూ లేకుండా ఉండడాన్ని గమనించిన ఆగంతకులు ఇంట్లోకి చొరబడి బీరువాను పగలగొట్టారు. బీరువాలోని రూ.10లక్షల విలువ చేసే బంగారు తాడు, నల్లపూసల గొలుసు, బంగారు గొలుసు మొత్తం 86 గ్రాముల ఆభరణాలతోపాటు, రూ.40 వేలు నగదు అపహరించుకుని వెళ్లారు. సమాచారం తెలుసుకున్న మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు.

అనుకున్నదొక్కటి...అయినది ఒకటి

- తక్కువ ధరకు వెండి ఇప్పిస్తానని తెనాలి వ్యాపారి టోకరా
- రూ. 7 లక్షలు నష్టపోయిన మార్టూరు యువకుడు

మార్టూరు: మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు వెండి ఇస్తానంటూ తెనాలిలో ఓ వ్యాపారి పది మందికి బురిడీ కొట్టగా అందులో మార్టూరుకు చెందిన ఓ యువకుడు సుమారు 7లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఈ విషయం ప్రస్తుతం తెనాలిలోని వ్యాపార వర్గాల్లో అంతర్గతంగా సంచలన కలిగించింది. అయితే, మార్టూరుకు చెందిన ఓ యువ వ్యాపారి బాధితుడు కావడం వెలుగులోకి వచ్చింది. మార్టూరుకు చెందిన ఓ యువ వ్యాపారికి తెనాలి పట్టణానికి చెందిన మరొక వ్యాపారస్తుడితో గతంలో పరిచయం ఉంది. ఇటీవల బంగారం, వెండి ధరలు బాగా పెరిగిన సంగతి తెలిసిందే. కిలో వెండి ధర బహిరంగ మార్కెట్లో రెండు లక్షల రూపాయలు ఉన్నప్పుడు తెనాలి వ్యాపారి మార్టూరు యువకుడికి వల విసిరి నమ్మ బలికాడు. కిలో వెండి లక్షా నలభై వేల రూపాయలు కు ఇప్పిస్తానని చెప్పడంతో నమ్మిన మార్టూరు యువకుడు తెనాలి వెళ్లి రూ.1,40,000 తెనాలి వ్యాపారికి అందించి కిలో వెండి తెచ్చుకున్నాడు. ఆ తరువాత రెండోసారి తెనాలి వ్యాపారి అసలు పథకం రచించాడు. తన వద్ద మరో ఐదు కిలోల వెండి ఉంది కావాలా? అని అడగటంతో మొదట అంతా సాఫీగా సజావుగా జరగటంతో మార్టూరు యువకుడు సరే అన్నాడు. ఈ క్రమంలో తెనాలి వ్యాపారి నేరుగా 7 లక్షలు రూపాయలు నగదుతో ప్రయాణం చేయటం మంచిది కాదు.. తనకు ఆన్‌లైన్‌లో పంపించవలసిందిగా కోరాడు. అతను చెప్పిందే తడవుగా చెప్పిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో తెనాలి వ్యాపారికి మార్టూరు యువకుడు పంపించాడు. తనకు రావలసిన వెండి తీసుకు రావటానికి తెనాలి వెళ్లి సదరు వ్యాపారికి మార్టూరు యువకుడు ఫోన్ చేశాడు. అయితే, అప్పటికే అతను పదిమందిని నిలువునా మోసం చేసి పారిపోయినట్లు తెలిసి మార్టూరు వ్యాపారి బిక్క మొహం వేశాడు. జరిగిన మోసం మరెవ్వరికి తెలియదు అని ఎవరికి వారే అనుకుంటున్న బాధితులు మోసగాడి కోసం నమ్మకంగా తెలిసిన వారి ద్వారా ప్రయత్నాలు ముమ్మరంగానే చేస్తున్నారు. అందులో భాగంగా తెనాలికి చెందిన బాధితుల ద్వారా మార్టూరు బాధితుడి గురించిన సమాచారం వెలుగు లోకి రావడం విశేషం.

జేఎన్‌టీయూఎన్ నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట రూరల్: అసంపూర్తిగా మిగిలిన జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కాకానిలోని కళాశాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి సందర్శించారు. ప్రాంగణంలోని భవనాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలోని రెండు బాయ్స్, రెండు గర్ల్స్ హాస్టల్స్ భవనాలతోపాటు గర్ల్స్ హాస్టల్‌కు కాంపౌండ్‌వాల్, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు.

పల్నాడు-ఏ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు



పల్నాడు బి జోన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పి ఎక్సమస్ జాన్

కార్యదర్శిగా ఎన్నికైన అనిల్ కుమార్

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు ఏ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షులుగా ఎ.ఇమ్మానియేలురాజు, గౌరవాధ్యక్షులుగా కె.డానియేల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహన్‌కుమారి, కోశాధికారిగా కె.జ్ఞానరత్నం, మహిళా కార్యదర్శిగా ఎస్ఎస్ఎస్ఎల్ కాత్యాయనిలను ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రకియను ఏపీపీఈటీ అండ్ ఎస్ఏపీఈ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు బీఐ స్వర్ణరాజు నిర్వహించారు. ఏ జోన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఈ నూతన కమిటీని అభినందించారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం 'బి' జోన్ ఎన్నిక..

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం(బి జోన్) అధ్యక్షులుగా పి.ఎక్సమస్ జాన్, కార్యదర్శిగా అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. మండలంలోని కంభంపాడు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా పీఈటీ అండ్ పీడీ అసోసియేషన్ అధ్యక్షులు బి సువర్ణరాజు నేతృత్వంలో కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఆర్థిక కార్యదర్శులుగా బత్తుల వేణు, గౌరవాధ్యక్షులు గొట్టిపాటి కర్తయ్య, మహిళా సెక్రటరీగా అంజమ్మ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో క్రీడా అభివృద్ధి కోసం విద్యార్థులకు మంచి శిక్షణనిచ్చి క్రీడల్లో ప్రగతిని సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, రత్తయ్య, శ్రీను, రవి, భూషణం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



జె.పంగులూరు: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రామకూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ వలి(37) తన డాబా మీద నీళ్ల పైపును కిందకు వేయటానికి డాబా ఎక్కాడు. పైనున్న పైపు కిందకు వేయబోగా ప్రమాద వశాత్తు నీళ్ల పైపు కరెంటు సర్వీస్ వైరుకు తగిలి షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వలికి భార్య జాన్‌బీ, ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 148

కొమ్ములు : 33 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,500	12,500	12,500

కాయలు : 115 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,950	13,000	12,800

మొత్తం అమ్మకాలు : 111.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ఆస్తి, వ్యాపారం, ప్రాజెక్ట్, చెక్కులుపై పెద్ద మొత్తంలో రుణాలు సులభమైన వాయిదా & తిరిగి చెల్లింపు, ఏజెంట్లకు మంచి కమీషన్ ఇవ్వబడును. కాల్ చేయండి 9092692403 చెన్నై

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ GVK సంస్థ నందు గుంటూరు జిల్లాలో లేడీ టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ కలదు. Cont: 8340855728, 7730997214

■ గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qual: 10th-డిగ్రీ, టైం: 9 AM - 5-30 PM, Sal: 9000 ✆ 99893 98775

■ కేర్‌టేకర్స్ చిల్డ్రన్స్ కేర్ (మెడికల్)- జీ: 18 వేలు, ఇంటివంట భార్యాభర్తలు- జీ: 18+18 వేలు, వార్డెన్స్- డిగ్రీ PG జీ: 18 వేలు. భోజన వసతి కలదు. 9885466598

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్ వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ కేర్ టేకర్స్ (జీతం: మగ 20 వేలు; ఆడ 18 వేలు), నర్సులు (25 వేలు). పేషంట్ ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కావలెను. Eminence హోమ్ కేర్ విజయవాడ. ✆ 97018 57559, 78158 35561

■ మాచర్ల లోని గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పని చేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పి.జి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు మాచర్ల లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: Ph: 7893794796, 7207494496, 8121294296, 7337394396

■ ప్రముఖ Ltd కంలో సూపై, Asts, స్టోర్ ఇంచార్జి, డ్రైవర్స్ ITI Dip, B.Tech All Ex ఆర్మీ కావలెను, రూం+భో PF+ ESI జీ: 18-32 వేలు. ✆ 91007 91079

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు 7075167663 7075167541

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు

క్లుప్తంగా

పోరాట యోధుల స్ఫూర్తి ఎనలేనిది

ఫిరంగిపురం: స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న త్యాగధనుల స్ఫూర్తి ఎనలేనిదని హెచ్‌ఎం ఇమ్మాన్యుయేల్ అన్నారు. నుదురుపాటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్య్రపోరాటం మరి రాజ్యాంగ దినోత్సవం వరకు అంశంపై జాతీయ స్వాతంత్య్ర పోరాటం, త్యాగధనుల చిత్రప్రదర్శన మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. దేశనాయకుల చిత్రప్రదర్శన ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు దివి కమల్‌మోహన్ వారి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి భరోసా

మేడికొండూరు: మేడికొండూరులో గత నెలలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం పల్నాటి శివశంకర్ కుటుంబాన్ని ఆందోళనకు గురి చేసింది. ఘటన గురించి తెలుసుకున్న మేడికొండూరు తహసీల్దార్ గాలం రాఘవరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. తక్షణ సహాయం కింద బాధితులకు అవసరమైన నిత్యావసరాలను అందజేశారు. వంట పాత్రలు, దుస్తులు, దుప్పట్లు, తాత్కాలిక నివాసం కోసం టెంట్ సామగ్రి, నిత్యావసర సరుకులు అందజేశారు. పీఆర్వో జోజప్ప సాగర్, రెవెన్యూ సిబ్బంది, రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో తొలగించిన 35 మంది గార్డెనింగ్ వర్కర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎయిమ్స్ వైద్యశాల రోడ్డులో కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి బాజీ, ఆటో యూనియన్ నేత షేక్ ఖాజా, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని 13వ వార్డులో మంగళవారం గ్యార్మీ పండుగను ముస్లింలు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నవజీవన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి హాజరయ్యారు. స్థానిక నేతలు వేమారెడ్డిని శాలువాతో సత్కరించారు. మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, 13వ వార్డు అధ్యక్షుడు సయ్యద్ హుజరత్ అలీ, నాయకులు షేక్ బాబు, ససీముల్లా, రషీద్‌ఖాన్, షబ్బీర్, మొహిద్దీన్ ఖాన్, బిజిలి, సయ్యద్ గౌస్, అమీర్‌ఖాన్, బబ్లీ, నందాని, మాదాల గోపి, కరిముల్లా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

తాడేపల్లి రూరల్: బాలబాలికలు చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాల అలవర్చుకోవాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్య అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని కొలనుకొండలో ఆర్‌సీఎం చర్చి వద్ద డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులకు బాధ్యతలు, విధుల గురించి వివరిస్తూ ఎన్నికైన పార్లమెంట్ మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కో ఆర్డినేటర్ అనూష , గుడ్ షెపర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, అనూష, ఇశ్రాయేల్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు కట్టా సామ్రాజ్యం పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత



దుగ్గిరాల: దుగ్గిరాల మండల స్థాయిలో పెద పాలెంలో జరిగిన చెకుముకి పోటీల్లో ఈమని జెడ్పీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విద్యార్థులు హర్షనందిని, మహిమ, కీర్తన, నిహారిక లను హెచ్.ఎం అల్లం ఝాన్సీ వాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య విద్యపై చిత్తశుద్ధి లేని కూటమి

వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో వైద్యవిద్యపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. మండల పరిధిలోని ఆత్మకూరులో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ పేదలకు వైద్యవిద్యను దూరం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. జగనన్న ప్రజాపాలన అందిస్తే కూటమి ప్రభుత్వం దుర్మార్గ పాలనను సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కోటి సంతకాల ఉద్యమంతో కూటమి ప్రభుత్వ కుట్రలను ఎండగడదామని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు న్యాయం చేకూరుతుందన్నారు. పేద మధ్యతరగతి మెడికల్ విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. పీపీపీ విధానాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్షులు నాగిరెడ్డి కృష్ణ, ఉపాధ్యక్షులు విజయ్, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు కోటేశ్వరరావు, ఎస్.బాబు, మండల ఆర్టీఐ విభాగ అధ్యక్షులు రాంబాబు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, యూత్ అధ్యక్షులు ప్రేమ్‌చంద్, బుజ్జిబాబు, నీలిమ, యేసుబాబు, బండి అంకమ్మయ్య, కె. యేసుబాబు, పాల్గొన్నారు.

ఆత్మకూరులో సంతకాలు సేకరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

మంగళగిరి పరిధిలో..

మంగళగిరి నగర పరిధిలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు మాదాల గోపీ కృష్ణ, మేకతోటి హర్ష, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, సందీప్, గోపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ మంగళవారం రేవేంద్రపాడు గ్రామంలో జోరుగా కొనసాగింది. దుగ్గిరాల మండల అధ్యక్షులు టి.శివగోపయ్య, జిల్లా యువజన విభాగం కమిటీ మెంబరు వై.మురళి ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, ఎస్.రవి, కె.శ్రీను, సుబ్బారావు, సాంబశివరావు, రాము, బాజి, సలీమ్, కిరణ్, నరేంద్ర, సుధాకర్, బి.కిరణ్ పాల్గొన్నారు.

వాడవాడలా సంతకాల సేకరణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో వాడవాడలా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి పట్టణంలోని 10వ వార్డు, 8వ వార్డు, 23వ వార్డుల్లో వాటి అధ్యక్షులు గోపనబోయిన రాజశేఖర్, చిలుకూరి శివ, రాగిపిండి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 8 వార్డులో దర్శి రమేష్, పిల్లి శామ్యేల్, ఏసుబాబు, బొడ్డబోయిన మాణిక్యాలరావు, ఎలిసేల్ జాన్‌బాబు, సిరిపల్లి వెంకటేశ్వరరావు, మేరుగ చిట్టిబాబు, 10వ వార్డులో చిట్టిమళ్ల సుబ్బారావు, వేల్పుల ఎలీషా, చంద్రశేఖర్, ఉదర కనకరాజు, చిలుకూరి సురేష్, నాగార్జున, గుడిపూడి సాయి, వేల్పుల జీవరత్నం, 23వ వార్డులో వై. మల్లికార్జునరెడ్డి, నాగేంద్ర, శ్రవణ్‌కుమార్, గోవర్ధన్, గొల్లి రమణయ్య, కొండా రామకృష్ణారెడ్డి, పుల్లగూర్ల తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వేల్పుల నాగేశ్వరరావు, కొప్పుల తిరుము, నరేంద్ర, వై. శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థులకు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న నేతలు

రేవేంద్రపాడులో..

10వ వార్డులో..

8వ వార్డులో..

23వ వార్డులో ..

ఆటలతో జీవన ప్రమాణాల పెంపు

తాడేపల్లి రూరల్: విద్యార్థులు ఆటల్లో పాల్గొనడంతో జీవన ప్రమాణాలు పెరుగుతాయని బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బాలోత్సవం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఈనెల 29,30 తేదీల్లో మంగళగిరి అరవింద మోడల్ స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసం వెంకట ప్రసాద్, శాంతిరెడ్డి, ప్రగడ రాజశేఖర్, మోహనరావు, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు ఉపాధ్యాయుడికి పురస్కారం

మేడికొండూరు: మేడికొండూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్ హనీఫ్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఉర్దూ భాషాభివద్ధికి, విద్యాబోధనకు ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ, ఆయన్ను జాతీయ పురస్కారం వరించింది. ఈ ఉత్తమ అవార్డు వచ్చినందుకు మంగళవారం డీఈవో రేణుకాదేవి ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్ హనీఫ్‌ను సన్మానించారు.

బిర్సా జయంతి

దుగ్గిరాల: చిన్న వయసులోనే అమరుడైన మన్యం వీరుడు బిర్సా ముండా భూమి కోసం, భుక్తికోసం, బ్రిటీషు వారిపై పులి బిడ్డలా పోరాడారని హెచ్‌ఎం శోభాదేవి అన్నారు. మంగళవారం దుగ్గిరాల జెడ్పీ బాలికల పాఠశాలలో బిర్సా 151వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శివ పార్వతి, సంధ్యా రాణి, ఉమారాణి, గీతా లక్ష్మి, సురేష్, శంకర్, కుమారి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణకు కరాటేను నేర్చుకోవాలని ఏపీ జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రవిబాబు పేర్కొన్నారు. రత్నాల చెరువు వద్ద జాతీయ సేవాపతకం ఆధ్వర్యంలో మంగళవారం బాలల భద్రత – మన బాధ్యత అంశంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వీయ రక్షణలో అనుసరించాల్సిన కీలక అంశాలను రవిబాబు వివరించారు. ఆయన మాట్లాడుతూ కరాటే కేవలం దాడి చేయడానికి కాదని, ప్రమాదంలో ఉన్నప్పుడు తమను తాము తప్పించుకుని, అవసరమైతే దాడిని అడ్డుకునేవిధంగా ఉండాలన్నారు. నిర్మల ఫార్మసీ కళాశాల మహిళా విభాగం కో ఆర్డినేటర్ రత్నమంజుల మాట్లాడుతూ చిన్నారులపై జరిగే వేధింపుల నిర్మూలన, అప్రమత్తత, పోక్సో చట్టాన్ని వివరించారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను తెలియజేయడాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నరేష్‌బాబు, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ పాముల రెడ్డి, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు సాత్విక, మనోజ్ఞ, తనుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవిబాబు

కౌలు రైతులకూ నష్టపరిహారం

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ

తాడేపల్లి రూరల్: మోంథా కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో సీపీఎం ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ నేత నాగపోగు విజయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ ఇటీవల అధిక వర్షాలు, భారీ వర్షాలే కాకుండా మోంథా తుఫాన్ ప్రభావంతో కౌలు రైతులు వేసిన పంటలు నీటమునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంటనష్టం అంచనా వేసి నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నేతలు కాజా వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, కంచర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సంఘ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి భవన్‌లో మహాసభల కరపత్రాలను నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నారిన నాగేశ్వరరావు, కోట బాబూరావు, డి.వి. భాస్కరరెడ్డి, మేరి, ఆదాం, అనిత పాల్గొన్నారు.

మేడికొండూరు: మేడికొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమావేశం జరిగింది. సమావేశానికి మండల ఆశా వర్కర్ల సీఐటీయూ నాయకురాలు గౌస్య అధ్యక్షత వహించారు. సీఐటీయా యూనియన్ జిల్లా నేత సాంబశివరావు, కౌలు రైతు సంఘ జిల్లా నేత బొట్ల రామకృష్ణ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

ప్రజాసమస్యల పరిష్కారానికే సిటిజన్ ఫోరం

మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సిటిజన్ ఫోరం ఏర్పాటు చేసినట్లు పిల్లలవైద్య నిపుణులు కేవీఎస్ సాయిప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీజేపీ అండ్ డీఎల్‌డీ డిగ్రీ కళాశాలలో సిటిజన్ ఫోరం ఏర్పాటు సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి నగరంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 15 సంవత్సరాల క్రితం ప్రజా ఆరోగ్యవేదిక ఆధ్వర్యంలో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి సమగ్ర సాధన కమిటీ ఏర్పాటు చేసి పోరాటాల ఫలితంగా 100 పడకల ఆసుపత్రిని సాధించామన్నారు. ఐదుగురితో సిటిజన్ ఫోరం ఆర్గనైజింగ్ కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా సాయిప్రసాద్, కో కన్వీనర్‌గా దామర్ల వెంకట నరసింహం, సభ్యులుగా సిందే బాలకృష్ణ, సింహాద్రి శ్రీనివాసరెడ్డి, వి.వి. ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో మంగళగిరి మండల ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు, జేవీ రాఘవులు, ఎస్.ఎస్. చెంగయ్య, వెంకటేశ్వరరావు, రామ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం ప్రారంభం

తాడికొండ: తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన కార్యాలయాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోలీసులకు కోటి రూపాయలు వరకు బీమా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, డీజీపీ హరీష్ గుప్తా, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు శ్రీనివాసరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత

ఆటల్లో.. విద్యార్థులు మేటి

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తదితరులు

కబడ్డీ పోటీకి ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

చినకాకాని జెడ్పీ హైస్కూల్‌లో ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సత్తాచాటుతున్న 'తాడేపల్లి' విద్యార్థులు

తాడేపల్లి రూరల్: ఏ ఆటైనా ఏ పోటీ అయినా స్థానిక విద్యార్థులు సత్తా చాటుతున్నారు. కబడ్డీనా.. రగ్బీనా ఇతర క్రీడలు దేనిలోనైనా ప్రావీణ్యం చూపుతున్నారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న రగ్బీ క్రీడా పోటీలకు వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా రగ్బీ పోటీలు అండర్ 14, అండర్ 17 బాలబాలికల పోటీలు జిల్లా పరిషత్ పాఠశాల పెదకాకాని మండలం వెనిగండ్లలో ఈనెల 3వ తేదీన రగ్బీ గుంటూరు జిల్లా ఎంపికలు జరిగాయని తెలిపారు. వడ్డేశ్వరం జెడ్పీ ఉన్న పాఠశాల విద్యార్థులు అండర్ 17 విభాగంలో బాలికలు ఎం. భువనేశ్వరి భాయి, డి. సాయిలూ, కె. ప్రియదుర్గ, యస్. శ్యామల, అండర్ 17 బాలుర విభాగంలో ఎస్‌కే బాజీ, 9వ తరగతి విద్యార్థులు అండర్ 14 విభాగంలో కె. పవన్ నాయక్, దివ్యలు 8వ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, సతీష్‌కుమార్‌లను ఎస్ఎంసీ చైర్మన్ షేక్ బాషీరా, కాట్రగడ్డ మధు, ఈపూరి కోటయ్య, మాజీ సర్పంచ్ రంగా షరీఫ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కబడ్డీ పోటీల్లో..

కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంట ఉన్న గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికైనట్లు మంగళవారం స్కూల్ కరస్పాండెంట్ రెవ. ఫాదర్ ఆరోగ్యదాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం గుంటూరు బీఆర్ స్టేడియంలో నిర్వహించిన 35వ సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన ఎస్. భవ్య, ఒ. విష్ణు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ సుగంధన్, స్కూల్ క్యాంపస్ ఇన్‌చార్జి రెవ. ఫాదర్ సెబ్యాస్టియన్, ఫిజికల్ ట్రైనర్స్ కె. అజయ్‌కుమార్, సురేష్ తదితరులు అభినందించారు.

మంగళగిరి టౌన్: వెనిగండ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన అండర్ 17, అండర్ 14 సెలక్షన్స్‌కు బాలబాలిక రగ్బీ జిల్లాస్థాయి పోటీలకు మంగళగిరి మండలం చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17 బాలికలవిభాగంలో జాహ్నవి, అలేఖ్యలు ఎంపిక కాగా, బాలుర విభాగంలో మణిధర్ జట్టులో చోటు దక్కించుకున్నారు. మరో ఇద్దరు క్రీడాకారులు నవీన్, జగన్‌లను స్టాండ్‌బై ప్లేయర్లుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

కేఎల్‌యూలో ఐబీఎం క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఐబీఎం క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ 2025 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఐబీఎం క్వాంటం సహకారంతో వారం రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ జగన్నాతరావు మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐబీఎం రీసెర్చ్ ఇండియా, అనుతంత్ర, భారతదేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల నుండి ప్రముఖ వ్యక్తులు హాజరయ్యారని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెన్సింగ్, మెటీరియల్స్‌లో పరిశోధన సైన్స్, పరిశ్రమ భవిష్యత్తును పునర్నిర్వచించగలదని ఆయన తెలిపారు. అడ్వైజరీ రీసెర్చ్ సైంటిస్ట్, ఐబీఎం రీసెర్చ్ నుండి ఇండియా ధీరజ్ మదన్, రీసెర్చ్ సైంటిస్ట్, ఐబీఎం ఇండియా రీసెర్చ్ ల్యాబ్ డాక్టర్ దేబాస్మిత భౌమిక్, ఐబీఎం క్వాంటం ఇండియా లీడ్ డాక్టర్ ఎల్. వెంకట సుబ్రహ్మణ్యం, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ టెక్నికల్ స్టాఫ్ మెంబర్ గుంచా మాలిక్, సిఇఒ అనుతంత్ర, డాక్టర్ జయకుమార్ వైద్య శంకర్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ డాక్టర్ రాఘవేంద్రలు ప్రసంగించారని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కొల్లా భాను ప్రకాష్ నాయకత్వంలో సమన్వయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో ఛ్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, ప్రో వీసీలు డాక్టర్ ఛేవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోవియట్ విప్లవంతో కార్మికులకు వసతులు

దుగ్గిరాల: మొట్టమొదటి శ్రామిక రాజ్యం సోవియట్ విప్లవంతో కార్మిక వర్గానికి పని గంటలు, పనిలో వసతుల కల్పన లభించాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో నవంబర్ 7న గుంటూరు విజ్ఞాన మందిరంలో జరగనున్న సభని జయప్రదం చేయాలని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. వెంకటేశ్వరరావు, బాలస్వామి, ఉదయరాజు, పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
కుంచనపల్లి బ్రాంచి
అరవింద స్కూల్ ప్రక్కన, కె.ఎల్.యు. రోడ్డు, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఏపీ-522501

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు అనుబంధం -IV-ఎ (రూల్ 6 (2) & 8 (6) చూడగలరు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత (లు), తనఖాదారు (లు) మరియు హామీదారు (లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకోబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ఆశ్రయం లేకుండా" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు)/ సెక్యూర్డ్ ఆసెట్స్/లు/ బకాయిలు/రిజర్వ్ ధర /ఇ-వేలం తేదీ & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారుల పేర్లు & చిరునామా	తనఖాపెట్టబడిన స్థిరాస్తుల వివరములు	బకాయి మొత్తము	రిజర్వుధర, ధరావత్తు & బిడ్ పెంపుదల	స్వాధీనం యొక్క స్వభావము సంకేతాత్మకం / భౌతికం
శ్రీమతి వెంకటలక్ష్మి మంజూష సింగలూరి, భర్త : శ్రీ సింగలూరి వెంకటేష్, ఇ/ఎస్. ఫ్లాట్ నెం. 406, 4వ అంతస్తు, అన్నపూర్ణ రెసిడెన్సీ, హర్ష ఎలైట్ ఎదురుగా, కుంచనపల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522501.	షెడ్యూల్–ఎ : గుంటూరు జిల్లా, మంగళగిరి ఎస్ఆర్ఓ, తాడేపల్లి మండలం, కొలనుకొండ గ్రామ పంచాయితీ మరియు గ్రామం, ఆర్.ఎస్.నెం. 81/8 ప్లాట్ మొత్తం 499.44 చ.గజాలు లేదా 417.58 చ.మీటర్ల విస్తీర్ణంలోని ఆస్తి నందు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 49.44 చ.గజాలు లేదా 41.34 చ.మీటర్ల విస్తీర్ణంలోని ఆస్తి. (మొత్తం 567.0 చ.గజాల ఆస్తిలో 67.56 చ.గజాలు ఆస్తిని రోడ్డు విస్తరణకు విడిచిపెట్టగా మిగిలిన ఆస్తి 499.44 చ.గజాలు మాత్రమే ఉన్నది.) హద్దులు : తూర్పు : కాట్రగడ్డ రామకోటేశ్వరరావు గారి ఆస్తి, పడమర : కాట్రగడ్డ రామకోటేశ్వరరావు గారి ఆస్తి, ఉత్తరం : ఇరిగేషన్ కెనాల్, దక్షిణం : పంచాయితీ రహదారి. పై సరిహద్దుల మధ్య మొత్తం 499.44 చ.గజాలు లేదా 417.58 చ.మీ. విస్తీర్ణంలోని ఆస్తి నందు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 49.44 చ.గజాలు లేదా 41.34 చ.మీటర్ల	రూ. 24-09-2024 నాటికి బకాయి మొత్తం : రూ. 29,22,721.02/- (అక్షరాలా ఇరవై తొమ్మిది లక్షల ఇరవై రెండు వేల ఏడు వందల ఇరవై ఒక్క రూపాయల రెండు పైసలు మాత్రమే) + ది. 24-09-2024 నుండి వర్తించు వడ్డీ + ఇతర ఛార్జీలు, ఖర్చులు, ఛార్జీలు & ఖర్చులు మొ॥	రిజర్వు ధర : రూ. 32,44,000/- ధరావత్తు : రూ. 3,24,400/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 20,000/- ఈ వేలం తేదీ & సమయం : ది. 05-12-2025 మ॥ 2 గం. నుండి సా॥ 6 గం. వరకు (10 ని. అపరిమిత స్వయం పొడిగింపుతో) మరిన్ని వివరాలకు క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి.	భౌతికంగా ఆస్తి తనిఖీ యొక్క తేదీ & సమయం తేదీ : 29-11-2025 నుండి 03-12-2025 ఉ॥ 11 గం. నుండి 4 గం. వరకు (with prior appointment only)

విస్తీర్ణంలోని ఇంటి స్థలము మరియు దానికి చెందిన అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.
షెడ్యూల్–బి : పైన తెలిపిన షెడ్యూల్–ఎ ఆస్తి నందు నిర్మించిన 'సుకీత నిలయం' అపార్ట్‌మెంట్ నందు అప్రూవ్డ్ ప్లాన్ ప్రకారం 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 502, రెగ్యులరైజేషన్ ప్లాన్ ప్రకారం ఫ్లాట్ 4వ అంతస్తులోని నెం. 406, దానికి చెందిన అసెస్‌మెంట్ నెం. 1143025686, డోర్ నెం. 21-4-46/406. హద్దులు : తూర్పు : ఖాళీ స్థలము – సెట్‌బ్యాక్, పడమర: ఖాళీ స్థలము – సెట్‌బ్యాక్, ఉత్తరం : ఖాళీ స్థలము– సెట్‌బ్యాక్, దక్షిణం : ఖాళీ స్థలము. సెట్‌బ్యాక్ కొంత వరకు మరియు లిఫ్ట్ & మెట్లు కొంత వరకు. పై సరిహద్దుల మధ్య ప్లింత్ ఏరియా 860.34 చ.అ.లు మరియు 125 చ.అ.లు కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి 92.0 చ.అ.లు కామన్ ఏరియా తో ఒక ఫ్లాట్ దానికి చెందిన అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

అమ్మకం యొక్క పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ https://www.bankofbaroda.in/e-auction నందు పొందుపరచబడిన లింకును చూడండి. మరియు ఆక్షన్ పోర్టల్ Baanknet.com నందు కూడా చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి టెలి ఫోన్ నెం. 0863-2232513 & మొబైల్ నెం. 8977513968 నందు సంప్రదించవచ్చును.

ప్రదేశం : కుంచనపల్లి, తేది : 04-11-2025 — చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
519	166
83,459	25,598

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,441	▽	393
డోజోన్స్	47,083	▽	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,708	△	6
డాక్స్	23,939	▽	194
షాంఘై	3,960	▽	16
నికాయ్	51,497	▽	914

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.09	89.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.87	117.81
€	యూరో	ఎస్‌బీఐ	100.65	103.42
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.25	59.14
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.62	69.34
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.76	24.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.25	24.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.57	13.39

గోపీచంద్ హిందూజా కన్నుమూత

- అనారోగ్యంతో లండన్ ఆస్పత్రిలో మరణం
- హిందూజా గ్రూప్ విస్తరణలో ముఖ్య పాత్ర
- అశోక్ లేల్యాండ్ టర్న్ అరౌండ్‌లో కీలకం



లండన్: వ్యాపార దిగ్గజం, బ్రిటన్‌లో అత్యంత సంపన్నుడు గోపీచంద్ పి. హిందూజా (85) కన్నుమూశారు. గత కొద్ది వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న గోపీచంద్, లండన్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచినట్లు ఆయన కుటుంబానికి సన్నిహిత వర్గాలు తెలిపాయి. హిందూజాకు భార్య (సునీత), ఇద్దరు కుమారులు (సంజయ్, ధీరజ్), ఒక కుమార్తె (రీటా) ఉన్నారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరొందిన గోపీచంద్ 1940లో జన్మించారు. ఆటోమోటివ్, ఎనర్జీ, బ్యాంకింగ్, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో తమ గ్రూప్‌ను అగ్రగామిగా విస్తరించిన నలుగురు హిందుజా సోదరుల్లో ఆయన రెండో వారు. 2023లో అన్న శ్రీచంద్ హిందూజా మరణానంతరం 35 బిలియన్ పౌండ్ల గ్రూప్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు.

విజనరీ వ్యాపారవేత్త..

ముంబైలోని జైహింద్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ (1959) అనంతరం తమ కుటుంబానికి టెహ్రాన్‌లో ఉన్న ట్రేడింగ్ వ్యాపారాన్ని నిర్వహించడం ద్వారా జీపీ తన కెరియర్ ప్రారంభించారు. ఆయన సారథ్యంలో 1984లో గల్ఫ్ ఆయిల్‌ని, ఆ తర్వాత 1987లో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశీ ఆటోమోటివ్ సంస్థ అశోక్ లేల్యాండ్‌ను గ్రూప్ కొనుగోలు చేసింది. అప్పట్లో అశోక్ లేల్యాండ్‌లో పెట్టుబడి తొలి భారీ ఎన్నారై ఇన్వెస్ట్‌మెంట్‌గా నిల్చింది. భారతీయ కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన టర్న్ అరౌండ్ గాథగా నిల్చిపోయేలా కంపెనీని తీర్చిదిద్దడంలో జీపీ కీలకంగా వ్యవహరించారు. ఇక విద్యుత్, మౌలిక రంగాల్లోకి హిందూజా గ్రూప్ ప్రవేశించడంలోనూ ముఖ్య పాత్ర పోషించారు.

బోఫోర్స్ మరకలు..

స్వీడన్‌కి చెందిన గన్నుల తయారీ సంస్థ ఏబీ బోఫోర్స్‌కి భారత్‌లో కాంట్రాక్టులు ఇప్పించేందుకు రూ. 64 కోట్లు అక్రమంగా కమీషన్లు తీసుకున్నట్లు జీపీతో పాటు ఆయన ఇద్దరు సోదరులపై (శ్రీచంద్, ప్రకాశ్) ఆరోపణలు వచ్చాయి. అయితే, 2005లో ఢిల్లీ హైకోర్టు వాటిని కొట్టివేసింది. కార్పెట్లు, టీ, సుగంధ ద్రవ్యాల ట్రేడింగ్‌తో సింధూ ప్రాంతంలో (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) పరమానంద్ 1914లో హిందూజా వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఇరాన్‌కి వెళ్లి, అక్కడి నుంచి వ్యాపారాన్ని విస్తరించారు. ప్రస్తుతం తాజా ది సండే టైమ్స్ రిచ్ లిస్టులో గోపీచంద్ హిందూజా కుటుంబం 35.3 బిలియన్ పౌండ్ల సంపదతో బ్రిటన్‌లోనే అత్యంత సంపన్న కుటుంబంగా అగ్రస్థానంలో ఉంది. భారతీయులకు చెందిన ఏకైక స్విస్ బ్యాంక్ 'బ్యాంకీ ప్రైవీ' కూడా హిందూజా సామ్రాజ్యంలో భాగమే. పెద్దన్న శ్రీచంద్ మరణానంతరం వ్యాపారాధిపత్యం కోసం కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు మొదలయ్యాయి. ప్రస్తుతానికి అవి సద్దుమణిగినట్లు కుటుంబం చెబుతున్నప్పటికీ, విభేదాలు కొనసాగుతూనే ఉన్నట్లు తెలుస్తోంది.

ఎస్‌బీఐ భళా

- క్యూ2 లాభం రూ. 21,137 కోట్లు
- వడ్డీ ఆదాయం రూ. 42,984 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 21,137 కోట్లను తాకింది. యస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా లభించిన రూ. 4,593 కోట్లు ఇందుకు దోహదపడ్డాయి. స్టాండెలోన్ నికర లాభం సైతం 10 శాతం ఎగసి రూ. 20,160 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 18,331 కోట్లు ఆర్జించింది. కాగా.. రుణాల్లో 12.7 శాతం వృద్ధి నేపథ్యంలోనూ నికర వడ్డీ ఆదాయం 3 శాతమే పుంజుకుని రూ. 42,984 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్రంగా 0.17 శాతం బలహీనపడి 2.97 శాతాన్ని తాకాయి. అంచనాలకు అనుగుణంగా పూర్తి ఏడాదికి 3 శాతం మార్జిన్లు సాధించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ శెట్టి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వడ్డీయేతర ఆదాయం 30 శాతం జంప్ చేసి రూ. 19,919 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ. 1,29,141 కోట్ల నుంచి రూ. 1,34,979 కోట్లకు బలపడింది.

> మొత్తం బిజినెస్ రూ. 100 లక్షల కోట్లను తాకింది. ఆస్తుల రీత్యా ఎస్‌బీఐ ప్రపంచంలో 43వ ర్యాంకులో నిలుస్తోంది. వీటిలో ఎంఎస్‌ఎంఈ విభాగం రూ. 25 లక్షల కోట్లను ఆక్రమిస్తోంది.
>
> – సీఎస్ శెట్టి, చైర్మన్, ఎస్‌బీఐ

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు బీఎస్‌ఈలో 0.7% లాభంతో రూ. 957 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 959 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది.

రుణ నాణ్యత ఓకే

ప్రస్తుత సమీక్షా కాలంలో ఎస్‌బీఐ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.13 శాతం నుంచి 1.73 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.53 శాతం నుంచి 0.42 శాతానికి దిగివచ్చాయి. ఇవి గత రెండు దశాబ్దాలలోనే కనిష్టమని శెట్టి వెల్లడించారు. అయితే తాజా స్లిప్పేజీలు రూ. 4,754 కోట్లకు పరిమితమైనప్పటికీ.. మొత్తం ప్రొవిజన్లు రూ. 4,505 కోట్ల నుంచి రూ. 5,400 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం బ్యాంక్ బ్రాంచీల సంఖ్య 23,050కు చేరగా.. పూర్తి ఏడాదిలో మరో 500 జత చేసుకోనున్నట్లు శెట్టి తెలియజేశారు. జీఎస్‌టీ రేట్ల సవరణల తదుపరి రుణాలకు ప్రధానంగా ఆటో రంగంలో డిమాండ్ భారీగా పుంజుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సెక్యూరిటీలలో రూ. 3.5 లక్షల కోట్ల మిగులు పెట్టుబడులున్నట్లు తెలియజేశారు. వీటికితోడు ఇటీవల సమీకరించిన రూ. 25,000 కోట్ల మూలధనంతో రూ. 12 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసే వీలున్నట్లు వివరించారు.

హ్యుందాయ్ వెన్యూ సరికొత్త వెర్షన్

ధర రూ. 7.89 లక్షల నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ తాజాగా తమ కాంపాక్ట్ ఎస్‌యూవీ వెన్యూకి సంబంధించిన కొత్త వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 7.89 లక్షలనుంచి ప్రారంభమవుతుంది. లేటెస్ట్ వెన్యూని అభివృద్ధి చేయడంపై రూ. 1,500 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు, పుణేలో కొత్తగా ప్రారంభించిన ప్లాంటులో మాత్రమే దీన్ని ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొంది. 2028 నాటికి ఈ ప్లాంటు స్థాపిత సామర్థ్యం 2.5 లక్షల యూనిట్లుగా ఉంటుందని హ్యుందాయ్ మోటార్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, వచ్చే ఏడాది జనవరిలో ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్న తరుణ్ గర్గ్ తెలిపారు. ఇప్పటివరకు 7 లక్షలకు పైగా వెన్యూ వాహనాలను విక్రయించినట్లు చెప్పారు. దేశీయంగా కస్టమర్లు చిన్న కార్లకు తగ్గకుండా కాంపాక్ట్ ఎస్‌యూవీలకు అప్‌గ్రేడ్ అవుతున్నారని గర్గ్ చెప్పారు. తమ మొత్తం అమ్మకాల్లో ఎస్‌యూవీల వాటా 71 శాతంగా ఉందని, 2030 నాటికి ఇది 80 శాతానికి చేరుతుందని ఆయన పేర్కొన్నారు. 2030 నాటికి రూ. 45,000 కోట్ల పెట్టుబడులతో, 26 కార్లను ప్రవేశపెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఎంఅండ్ఎం లాభం జూమ్

క్యూ2 రూ. 3,673 కోట్లు

న్యూఢిల్లీ: వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 28 శాతం జంప్ చేసి రూ. 3,673 కోట్లను తాకింది. వ్యవసాయ విభాగం అమ్మకాలు, పీఎల్ఐ లబ్ధి తదితరాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,867 కోట్లు ఆర్జించింది. గత క్యూ2లో భూమి విక్రయం సాధించిన ఆర్జనను మినహాయిస్తే తాజాగా లాభం 28% బలపడినట్లు కంపెనీ తెలిపింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 37,924 కోట్ల నుంచి రూ. 46,106 కోట్లకు ఎగసింది. స్టాండెలోన్ టర్నోవర్ 21% వృద్ధితో రూ. 35,080 కోట్లను తాకింది. నికర లాభం 18% పుంజుకుని రూ. 4,521 కోట్లను తాకింది. ఎల్ఎంఎం, ఎంఈఏఎల్‌తో మొత్తం వాహన విక్రయాలు 13% ఎగసి 2.62 లక్షలకు చేరాయి.

ఎంఅండ్ఎం షేరు 1% లాభంతో రూ. 3,582 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 519 పాయింట్లు మైనస్

- 25,600 స్థాయి దిగువకు నిఫ్టీ
- ఐటీ, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో స్టాక్ మార్కెట్ రెండు వారాల కనిష్టానికి దిగివచ్చింది. ఐటీ, మెటల్, వినిమయ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. ఫలితంగా సెన్సెక్స్ 519 పాయింట్లు నష్టపోయి 83,459 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 166 పాయింట్లు కోల్పోయి 25,598 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం లాభాలతో మొదలైనప్పటికీ.., అదే జోరును రోజంతా కొనసాగించలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 566 పాయింట్లు కోల్పోయి 83,413 వద్ద, నిఫ్టీ 185 పాయింట్లు పతనమై 25,578 వద్ద కనిష్టాన్ని తాకాయి. ఆసియాలో దక్షిణ కొరియా, జపాన్, హాంగ్‌కాంగ్ స్టాక్ సూచీలు నష్టాలతో ముగిశాయి. యూరప్ మార్కెట్లు 1% పతనమయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు అరశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల ఇండెక్సుల్లో యుటిలిటీస్ 1.56%, మెటల్ 1.40%, కమోడిటీస్ 1.11%, ఐటీ 1.06%, విద్యుత్ 0.99%, రియల్టీ 0.83% పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.69%, 0.26 శాతం నష్టపోయాయి.
- టైటాన్ షేరు 2% లాభపడి రూ.3,813 వద్ద స్థిరపడింది. క్యూ2లో కంపెనీ లాభం 59% వృద్ధితో షేరుకు కొనుగోలు మద్దతు లభించింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- క్యూ2లో నికరలాభం రెట్టింపుతో ఎయిర్‌టెల్ షేరు 2% పెరిగి రూ.2,113 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

త్వరలోనే మూడో భారీ ఎకానమీగా భారత్!	ఇండిగోకు భారీ నష్టాలు

నేడు మార్కెట్లకు సెలవు

గురునానక్ జయంతి సందర్భంగా నేడు దేశీ స్టాక్ మార్కెట్లకు సెలవు. కమోడిటీ మార్కెట్లు సాయంత్రం నుంచి పనిచేస్తాయి.

సాక్షి స్పోర్ట్స్

రవూఫ్‌పై 2 మ్యాచ్‌ల నిషేధం

ఆసియా కప్ టి20 టోర్నీలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన భారత్, పాక్ క్రికెటర్లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. భారత సైన్యం విమానాలను పాక్ కూల్చివేసినట్లుగా భారత్‌తో జరిగిన రెండు వేర్వేరు లీగ్ మ్యాచ్‌లలో రవూఫ్ సైగలు చేశాడు. ఈ రెండు సంఘటనలకు కలిపి 4 డీమెరిట్ పాయింట్లు అతని ఖాతాలో చేరడంతో 2 మ్యాచ్‌ల నిషేధం పడింది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి, రెండు వన్డేలకు దూరం కావడంతోపాటు రవూఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా పడింది. తొలి లీగ్‌లో మన విజయాన్ని సైనికులకు అంకితం ఇస్తున్నట్లు వ్యాఖ్యానించిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై 30 శాతం జరిమానా పడింది. విమానం కూలినట్లుగా సైగ చేసిన బుమ్రా, అర్ధసెంచరీ తర్వాత తుపాకీ తరహాలో బ్యాట్‌ను గురి పెట్టిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌ల ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ చేరగ... అభ్యంతరకర సైగలు చేసిన భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై మాత్రం ఐసీసీ ఎలాంటి చర్యా తీసుకోలేదు.

అభిరథ్ రెడ్డి 175 నాటౌట్

- రంజీ ట్రోఫీ సీజన్‌లో హైదరాబాద్‌కు తొలి విజయం
- హిమాచల్ ప్రదేశ్‌పై 344 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్

నాదౌన్: రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో హైదరాబాద్ జట్టు తొలి విజయాన్ని అందుకుంది. హిమాచల్ ప్రదేశ్ జట్టుతో మంగళవారం ముగిసిన గ్రూప్ 'డి' మూడో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. 344 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 8/0తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు... 75.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 347 పరుగులు సాధించింది. ఓపెనర్ అభిరథ్ రెడ్డి (200 బంతుల్లో 175 నాటౌట్; 19 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించి హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. వన్‌డౌన్ బ్యాటర్ రాహుల్ రాధేశ్ (127 బంతుల్లో 66; 8 ఫోర్లు)తో కలిసి అభిరథ్ రెడ్డి రెండో వికెట్‌కు 145 పరుగులు జోడించాడు. రాధేశ్ అవుటయ్యాక కెప్టెన్ రాహుల్ సింగ్ (24; 2 ఫోర్లు), హిమతేజ (25 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్), తనయ్ త్యాగరాజన్ (25 బంతుల్లో 29; 2 ఫోర్లు) సహకారంతో అభిరథ్ హైదరాబాద్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. మూడో వికెట్‌కు రాహుల్ సింగ్‌తో 74 పరుగులు జోడించిన అభిరథ్.... నాలుగో వికెట్‌కు హిమతేజతో 53 పరుగులు... ఐదో వికెట్‌కు తనయ్‌తో 47 పరుగులు జత చేశాడు. హిమాచల్ జట్టు బౌలర్లలో ఆర్యమాన్ సింగ్ మూడు వికెట్లు తీశాడు. తొలి రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకున్న హైదరాబాద్‌జట్టు ఈ గెలుపుతో తమ ఖాతాలో ఆరు పాయింట్లు వేసుకుంది. హిమాచల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు చేయగా... హైదరాబాద్ జట్టు 278 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన హిమాచల్ 303 పరుగులు చేసి హైదరాబాద్‌కు 344 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్రూప్ 'డి'లో మూడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ జట్టు పది పాయింట్లతో ముంబై జట్టుతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆంధ్ర గెలుపు బోణీ

- ఒడిశాపై ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం
- రాణించిన స్పిన్నర్లు సౌరభ్ కుమార్, విజయ్

సౌరభ్ కుమార్

కటక్: తొలి రెండు లీగ్ మ్యాచ్‌లను 'డ్రా'తో సరిపెట్టుకున్న ఆంధ్ర క్రికెట్ జట్టు రంజీ ట్రోఫీలో తొలి విజయం నమోదు చేసింది. ఒడిశా జట్టుతో మంగళవారం ముగిసిన గ్రూప్ 'ఎ' మూడో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫాలోఆన్ ఆడుతూ ఓవర్‌నైట్ స్కోరు 190/2తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా జట్టు 104.2 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. రెండు వికెట్లకు 198 పరుగులతో పటిష్టంగా కనిపించిన ఒడిశా జట్టు చివరి ఎనిమిది వికెట్లను 80 పరుగుల తేడాలో కోల్పోయింది. ఓపెనర్ గౌరవ్ చౌధురీ (80; 10 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ సందీప్ పట్నాయక్ (63; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. మూడో వికెట్‌గా గౌరవ్ అవుటయ్యాక ఒడిశా ఇన్నింగ్స్ తడబడింది. ఈసారి ఆంధ్ర జట్టుకు ఆడుతున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఎడంచేతి వాటం స్పిన్నర్ సౌరభ్ కుమార్ 47 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... ఆఫ్ స్పిన్నర్ త్రిపురాణ విజయ్ 89 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. కావూరి సాయితేజ, శశికాంత్, పృథ్వీరాజ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 475 పరుగులు చేయగా... ఒడిశా తొలి ఇన్నింగ్స్‌లో 151 పరుగులకు ఆలౌటైంది. ఇన్నింగ్స్ తేడాతో గెలిచినందుకు ఆంధ్ర జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి. ఈ మ్యాచ్‌లో 69 పరుగులు చేయడంతోపాటు ఆరు వికెట్లు పడగొట్టిన సౌరభ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అమోల్ శిక్షణ అమూల్యం

కోచ్‌గా మజుందార్ ప్రత్యేక ముద్ర

- ప్రపంచకప్ విజయంలో కీలకపాత్ర
- కొత్తగా టీమ్‌ను తీర్చిదిద్దిన వైనం

సాక్షి క్రీడా విభాగం

అమోల్ మజుందార్‌కు క్రికెట్ మైదానంలో ఆటగాడిగా ఘనమైన రికార్డులు ఉన్నాయి... దేశవాళీ క్రికెట్‌లో ముంబై, అస్సాం, ఆంధ్ర జట్లకు ఆడి టన్నుల కొద్దీ పరుగులు సాధించాడు... కానీ అందరూ కలలుగనే అంతర్జాతీయ క్రికెటర్ స్థాయి మాత్రం అతనికి దక్కలేదు. వేర్వేరు కారణాలతో ఒక్కసారి కూడా భారత జట్టు తరఫున ఆడే అవకాశం రాలేదు. కెరీర్‌లో చెలరేగుతున్న అతని అత్యుత్తమ దశలో భారత జట్టు దిగ్గజాలతో నిండిపోవడంతో పాటు కాసింత కలిసి రావాల్సిన చోట అదృష్టం మొహం చాటేసింది. అయితే ఆటగాడిగా ప్రస్థానాన్ని ముగించి తన అనుభవాన్ని మరో రూపంలో ప్రదర్శించుకునేందుకు అతను సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో కోచ్‌గా మారిన మజుందార్ దశాబ్ద కాలం తర్వాత తన కెరీర్‌లో అత్యుత్తమ క్షణాలను అనుభవిస్తున్నాడు. భారత మహిళల క్రికెట్ జట్టును తొలిసారి విశ్వవిజేతగా నిలిపిన శిక్షకుడిగా అతను తన పేరును లిఖించుకున్నాడు. గత రెండేళ్ల ఈ ప్రయాణంలో అతను ఎన్నో ప్రతికూలతలను దాటి టీమ్‌ను శిఖరానికి చేర్చాడు. వచ్చే మంగళవారం తన 51వ పుట్టిన రోజును జరుపుకోనున్న అమోల్ ఇప్పుడు మహిళల క్రికెట్ జట్టు కొత్త ప్రస్థానానికి దిక్సూచిలా నిలిచాడు.

మారిన ఆటశైలి...

'మా లక్ష్యాలు ఏమిటో స్పష్టంగా నిర్దేశించుకున్నాం. మన ప్లేయర్లు ఆటలో దూకుడు పెంచాల్సి ఉంది. నిర్భీతిగా ఆడే ఆటను నేను ఎప్పుడైనా ప్రోత్సహిస్తాను. అదే మన శైలి కావాలి. ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌కు చాలా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. ఈ విషయంలో ఎలాంటి సడలింపులు ఉండవు. నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ప్రమాణాలను పాటిస్తూ ఏడాదిలో మూడుసార్లు ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతాయి. మ్యాచ్‌లు లేని సమయంలో నిరంతరాయంగా ప్రత్యేక క్యాంప్‌లతో సాధన కొనసాగుతుంది. కొత్తగా జట్టులోకి వచ్చేవారందరికీ మంచి అవకాశాలు కల్పిస్తాం'... భారత మహిళల జట్టు కోచ్‌గా ఎంపికైన తర్వాత అమోల్ మజుందార్ తన మొదటి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలివి. ఇప్పటి వరకు ఒక లెక్క, ఇకపై ఒక లెక్క అంటూ పాత గణాంకాలను తాను పట్టించుకోనని, కొత్తగా మళ్లీ మొదలు పెడుతున్నట్లుగా భావిస్తానని కూడా మజుందార్ చెప్పాడు. వరల్డ్ కప్‌లో భారత ప్లేయర్ల ప్రదర్శనను చూస్తే తాను చెప్పిన ప్రతీ అంశంపై అతను పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాడని అర్థమవుతుంది. మన ప్లేయర్ల ఫిట్‌నెస్ గతంలో ఎన్నడూ లేనంత అద్భుతంగా ఉందనేది చూడగానే అర్థమవుతోంది. అన్నింటికి మించి బ్యాటింగ్‌లో దూకుడు పెరిగింది. భారీ స్కోర్లు నమోదు చేయడమే కాదు, ఛేదనలో కూడా మన టీమ్ ఎంత బాగా ఆడగలదో పలుమార్లు రుజువైంది. తమ శ్రమ వెనక కోచ్ ఉన్నాడని ప్లేయర్లు పదే పదే చెప్పడం విశేషం.

ముంబైలో ఛత్రపతి శివాజీ విమానాశ్రయం సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత జట్టు కోచ్ మజుందార్‌కు కేక్ తినిపిస్తున్న ఓపెనర్ స్మృతి మంధాన. పక్కనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్

ఓటమి తర్వాత ప్రణాళికలతో...

అయితే కోచ్‌గా మజుందార్ బాధ్యతలు స్వీకరించగానే ఒక్కసారిగా ఫలితాలు రాలేదు. మజుందార్ కోచ్‌గా వచ్చిన తర్వాత మొదటి సవాల్ టి20 వరల్డ్ కప్ రూపంలో వచ్చింది. ఇందులో మన జట్టు కనీసం సెమీఫైనల్‌కు కూడా అర్హత సాధించలేదు. జట్టులో దూకుడు రాకపోగా కీలక క్షణాల్లో పాత తడబాటు పోలేదని కోచ్‌కు అర్థమైంది. అయితే అతను ఒక్కసారిగా టీమ్‌లో భారీ మార్పులు కోరుకొని గందరగోళంగా మార్చలేదు. ముందుగా 25 మందితో తన కోర్ టీమ్‌ను ఎంచుకున్నాడు. వన్డే వరల్డ్ కప్‌కు ఏడాది సమయం ఉన్న నేపథ్యంలో పక్కాగా ప్రణాళికలు రూపొందించాడు. నాటి టీమ్‌లో ఉన్నవారిలో 9 మంది ఇప్పుడు వరల్డ్ కప్ గెలిచిన టీమ్‌లో కూడా ఉన్నారు. గాయాలతో మిగతా ఆటగాళ్లు దూరమయ్యారు తప్ప.. లేదంటే అమోల్ ప్రణాళికల్లో అందరికీ వరల్డ్ కప్ బాధ్యతలు ప్రత్యేకంగా ఉన్నాయి. సాధ్యమైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడేలా బోర్డును ఒప్పించడంతో పాటు మిగతా సమయమంతా ప్లేయర్లు జాతీయ క్రికెట్ అకాడమీలోనే రాటుదేలారు. దాని ఫలితం ఇప్పుడు కనిపించింది.

రంజీ ప్లేయర్‌గా...

జాగ్రత్తగా నడిపిస్తూనే...

'జెమీమాను తుది జట్టు నుంచి తప్పించడం మేం తీసుకున్న కఠిన నిర్ణయం. జట్టు సమతూకం కోసం అలా చేయక తప్పలేదు'... ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు జెమీమాను దూరం పెట్టిన తర్వాత జట్టు కోచ్ మజుందార్ ఇచ్చిన వివరణ ఇది. ఆ సమయంలో అతను చాలా ఇబ్బంది పడినట్లు, అబద్ధం చెబుతున్నట్లు అతని మాటల్లోనే కనిపించింది. నిజానికి జెమీమా తొలి 4 మ్యాచ్‌లలో 2 డకౌట్లు సహా 65 పరుగులే చేసింది. దీన్ని బట్టి చూస్తే ఆమెకు ఒక హెచ్చరికలా ఇది సహేతుక నిర్ణయమే. కానీ దానికీ అతను జాగ్రత్తగా వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఒక మహిళల టీమ్‌ను పురుష కోచ్ నడిపించడంలో ఉండే ప్రతికూలతల్లో ఇది కూడా ఒకటని విశ్లేషకుల అభిప్రాయం. వారినుంచి అత్యుత్తమ ఆటతీరును రాబట్టడంతో పాటు ప్రోత్సహిస్తూ, ఎక్కడా మానసికంగా కుంగిపోకుండా జట్టును నడిపించడం కూడా కోచ్ బాధ్యతే అవుతుంది. ఈ విషయం మజుందార్‌కు బాగా తెలుసు. తుది జట్టులో స్థానం విషయంలో తనకంటే ముందు భారత మహిళల జట్టుకు కోచ్‌గా ఉన్న తన మాజీ సహచరుడు, మరో ముంబైకర్ రమేశ్ పొవార్, సీనియర్ మిథాలీ రాజ్ మధ్య ఎంత పెద్ద వివాదం రేగిందో ప్రపంచం చూసింది. ఇలాంటి అంశాలను జాగ్రత్తగా చూసుకుంటూనే మజుందార్ తన బాధ్యతను నెరవేర్చాడు. సాధారణంగా ఆటగాడిగా సాధించని ఘనతలు కోచ్‌గా అందుకోవాలని చాలా మంది కోరుకుంటారు. తమ పట్టుదలతో వాటిని నిజం చేసుకొనే కొద్ది మంది జాబితాలో ఇప్పుడు అమోల్ చేరాడు.

మాజీ మంత్రి రజినికి ఎలాంటి చెల్లింపులూ చేయలేదు

- ఆమె పీఏలతో మాకు ఎలాంటి సంబంధం లేదు
- తప్పుడు ఆరోపణలతో వేధిస్తే ఆత్మహత్యే శరణ్యం
- బత్తుల శ్రీగణేష్ తమ్ముడు కుమారస్వామి సెల్ఫీ వీడియో

చిలకలూరిపేట: మాజీ మంత్రి విడదల రజినికి గాని, ఆమె పీఏలు రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డిలకుగాని తన అన్న బత్తుల శ్రీగణేష్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఉద్యోగాల కోసం రజిని, ఆమె పీఏలకు మా అన్న ద్వారా కొందరు డబ్బులు చెల్లించినట్టు కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని శ్రీగణేష్ తమ్ముడు బత్తుల కుమారస్వామి మంగళవారం సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇలాంటి ఆరోపణలతో తమ కుటుంబాన్ని వేధిస్తున్న వారి పేర్లు రాసి ఆత్మహత్యకు పాల్పడతామని ఆ వీడియోలో పేర్కొన్నారు. ఆయన ఏమన్నారంటే ..

''మా అన్న బత్తుల శ్రీగణేష్‌కు దోర్నాలకు చెందిన తోట శివకృష్ణకు ఏళ్లుగా పరిచయం ఉంది. మా అన్నకు మద్యం తాగించి శివకృష్ణ, చిలకలూరిపేటకు చెందిన ఎస్‌కే సుభాని, తన్నీరు వెంకటేశ్వర్లు చెక్కులు, కాగితాలపై సంతకాలు పెట్టించుకున్నారు. ఏడాది కిందట చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సుభాని, వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయగా, శ్రీ గణేష్‌ను పోలీసులు తీసుకెళ్లారు. పోలీసులు రాజీ చేసుకోవాలని సూచిస్తే నేను కూడా సాక్షి సంతకం పెట్టి మా అన్నను విడిపించుకువచ్చాను ఆ తర్వాత కూడా సుభాని, వెంకటేశ్వర్లు నూజెండ్లలోని మా అమ్మ వాళ్ల ఇంటికి తాగి వచ్చి మా అన్న తల పగలగొట్టారు. తిరిగి ఆరు నెలల కిందట కూడా మా అన్నను స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల ముందే సుభాని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మేం నరసరావుపేట కోర్టులో ఐపీ దాఖలు చేశాం. మా అన్నకు ఆరోగ్యం బాగా లేక, ఊళ్లో ఉండలేక హైదరాబాద్‌కు వెళ్లి ఉంటున్నాడు. మాజీ మంత్రి విడదల రజిని, ఆమె పీఏలకు మా అన్న ద్వారా ఉద్యోగాల కోసం డబ్బు చెల్లించినట్టు కొందరు చేసున్న ఆరోపణలు అవాస్తవం. మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్న తోట శివకృష్ణ, సుభాని, వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు రాసి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇది గమనించి పోలీసులు తగు న్యాయం చేయాలి.'' అని కుమార్‌స్వామి తన ఆవేదనను వ్యక్తం చేశారు.

అల్లూరి జిల్లాలో కంపించిన భూమి

- జంగాలమెట్టలో కూలిన ఇంటి గోడలు
- తల్లీబిడ్డలకు తృటిలో తప్పిన ప్రమాదం
- రిక్టర్ స్కేల్‌పై 3.7 మాగ్నిట్యూడ్ నమోదైనట్టు ప్రకటన
- విశాఖ నగరంలోనూ స్వల్ప ప్రకంపనలు

జి.మాడుగుల ఏరియాలో ప్రకంపనలు

జంగాల మెట్టలో నేలకూలిన గోడలు

సాక్షి, పాడేరు/విశాఖపట్నం: అల్లూరి జిల్లాలో మంగళవారం భూమి కంపించింది. ఏజెన్సీ ప్రాంతంలో భూమి కంపించడం ఇదే మొదటిసారి. జి.మాడుగుల మండలంలోని జంగాలమెట్ట, గొప్పువీధి, సింగర్భ, ఉభలగరువుతో పాటు లంబసింగికి వెళ్లే దారిలోని వంజరి ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున భూమి కంపించినట్టు స్థానికులు తెలిపారు. నిద్రపోతున్న సమయంలో భూమి ఒక్కసారిగా అదరడంతో వారంతా భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి కిందపడటంతో ఆ శబ్దాలకు ఒక్కసారిగా నిద్ర లేచారు. జంగాలమెట్టలో భూమి కంపించడంతో గుంటా కొండమ్మ ఇంటి మట్టిగోడలు కూలాయి. ఆ సమయంలో కొండమ్మతో పాటు ఆమె కుమార్తెలు నిద్రిస్తున్నారు. భూమి కదలినట్టు అనిపించిన వెంటనే మట్టిగోడలు కూలిపోయాయని, భయంతో బయటకు పరుగుతీశామని కొండమ్మ తెలిపింది. మట్టిగోడలు బయటకు కూలడంతో తల్లీబిడ్డలకు పెద్ద ప్రమాదం తప్పింది. జి.మాడుగుల ప్రాంతంలో తెల్లవారుజాము 4.19 గంటల సమయంలో చోటుచేసుకున్న భూ ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 3.7 మాగ్నిట్యూడ్‌గా నమోదైనట్టు అధికారులు ప్రకటించారు.

ఉలిక్కిపడ్డ విశాఖ

విశాఖ నగరంలోనూ భూమి స్వల్పంగా కంపించింది. ఆరిలోవ, మధురవాడ, డాబా గార్డెన్స్, ఓల్డ్ సిటీ, బీచ్ రోడ్డు, అల్లిపురం, జ్ఞానాపురం, మల్కాపురం పారిశ్రామిక ప్రాంతంలో గుర్తించగలిగే స్థాయిలో ఈ భూ ప్రకంపనలున్నట్టు అక్కడి ప్రజలు తెలిపారు. ఇళ్లలో మంచాలు, కబ్ బోర్డుల నుంచి వస్తువులు దొర్లిపడ్డ చోట మరింత ఆందోళన చెందారు.

విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల వద్ద 10 కి.మీ. లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు భూకంపాలు, వల్కనోలపై అధ్యయనం చేస్తున్న వల్కనో డిస్కవరీ సంస్థ వెల్లడించింది.

ప్రేమ వ్యవహారం బెడిసి బాలుడి ఆత్మహత్య

నెల్లూరు (క్రైమ్): ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని వెంకటేశ్వరపురం ఇస్లాంపేటకు చెందిన వెంకయ్య, సుజాత దంపతుల కుమారుడు రోహిత్ (17) 8వ తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం కూలీ పనులకు వెళ్తున్నాడు. సమీప ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు రోహిత్ తల్లిదండ్రులకు చెప్పారు. వారు మందలించడంతో రోహిత్ అప్పటి నుంచి ఆమె జోలికి వెళ్లడంలేదు. అయితే, సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రోహిత్ మద్యం తాగి బాలిక ఇంటి వద్దకు వెళ్లి రచ్చ చేశాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు అతడిని పట్టుకుని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న రోహిత్ తండ్రి వెంకయ్య బంధువులతో కలిసి స్టేషన్‌కు వెళ్లి పూచీకత్తుపై కుమారుడిని ఇంటికి తీసుకొచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున రోహిత్ ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. వెంకయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో అమ్మకానికి రక్తం

- రేట్ల నిర్ధారణ చేస్తూ ఉత్తర్వులు జారీ

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగుల కోసం దాతలు రక్తాన్ని ఇస్తుంటారు. స్వచ్ఛందంగా, రక్త దాన శిబిరాల ద్వారా రక్తం దానం చేస్తుంటారు. ప్రభుత్వ ఆస్పత్రులు ఆ రక్తాన్ని భద్రపరిచి, అవసరమైన పేద రోగులకు ఉచితంగా ఎక్కించాలి. కానీ, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్)లో ఈ రక్తాన్ని ప్రైవేటు ఆసుపత్రులకు అమ్ముకునేందుకు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు జీజీహెచ్‌లో ఉన్న బ్లడ్‌ను ప్రైవేటు ఆసుపత్రులకు అమ్ముకునేందుకు రక్తం ఒక యూనిట్ ధర రూ. 1050గా నిర్ధారించారు. ప్యాక్‌డ్ రెడ్ సెల్స్ ఒక యూనిట్ రూ. 1050, ప్లేట్‌లెట్లు కాన్సంట్రేట్ యూనియన్ రూ. 300, ఫ్రష్ ఫ్రోజన్ ప్లాజ్మా యూనిట్ రూ. 300గా ధరలు నిర్ణయించారు. ఈ వ్యవహారంపై పేద రోగులు, బంధువులు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. జీజీహెచ్‌కు వచ్చిన పేద రోగులకు రక్తం, ప్లాజ్మా, రెడ్‌సెల్స్, బ్లడ్ కాంపోనెంట్స్ ఉచితంగా ఇవ్వాల్సిన అధికారులు.. రక్తం అందుబాటులో లేదని, బయట కొనుక్కోవాలంటూ సిఫార్సు చేస్తున్నారు. పేద రోగుల బంధువులు, ఆసుపత్రికి వచ్చిన వారి చేత ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొనిపిస్తున్నారు.

గతంలో ఇలాగే అమ్మేసుకున్నారు

జీజీహెచ్ అధికారులు గతంలోనూ ఇలానే రక్తాన్ని అమ్మేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జీజీహెచ్‌లో బ్లడ్ అమ్ముకున్న విషయం మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో అమ్మిన బ్లడ్ ద్వారా వచ్చిన డబ్బులో కొంత ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి (హెచ్‌డీఎస్) కేటాయించి, మిగతా సొమ్మును నొక్కేశారు. ఈ విషయంపై మీడియాలో కథనాలు రావడంతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రక్తాన్ని అమ్మవద్దని చెప్పారు. అమ్మిన రక్తానికి వచ్చిన డబ్బును మెక్కేసిన వారిపై విచారణ చేయించాలని, జీజీహెచ్ బ్లడ్ బ్యాంకులో ఆడిట్ చేయించాలని ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలేమీ పని చేయలేదు.



04/11/2025

From
Medical officer
Blood Centre
GGH, Guntur

To
The Superintendent
Government General Hospital
Guntur.

Respected sir,

Sub:- Government Blood centre-GGH-Guntur, request to payment option for Blood and Blood products in E Hospital Next Gen-Req.Reg.

Blood centre GGH, Guntur, to allow collection of Blood processing charges service charges for giving Blood and Blood components to outside Hospitals for emergency and life saving purpose as per the Government norms.

We request you to give orders to the concerned Authorities to provide an option in the E hospital next gen to pay charges (Hospital Development society account) to those who take from Blood and Blood products in Blood centre, GGH to outside hospitals.

Option Name: service charges/Blood processing charges

1.Whole Blood	Rs:1050/ unit
2.Packed Red cells(PRBC)	Rs:1050/Unit
3. Platelet Concentrate	Rs:300/unit
4.Fresh Frozen plasma(FFP)	Rs:300/Unit

Thanking you sir,

బ్లడ్ అమ్మకం ఉత్తర్వులు

వీకావేరి బస్సు ప్రమాదంపై పోస్టు పెట్టిన వ్యక్తికి నోటీసులు

ముల్లా బిలాల్

సింహాద్రిపురం: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త ముల్లా బిలాల్‌కు మంగళవారం కర్నూలు జిల్లా పోలీసులు నోటీసులు అందజేశారు. వీ కావేరి బస్సు ప్రమాదానికి కారణమైన బైకర్‌కు అర్ధరాత్రి సమయంలో కల్తీ మద్యం ఎక్కడ దొరికిందోనని ముల్లా బిలాల్ పోస్టులో పలు ప్రశ్నలు సంధించారు. దీనిపై పోలీసులు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో విచారణకు హాజరు కావాలన్నారు. లేకపోతే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు.

డిసెంబర్ 5న పీఎం కుసుమ్ టారిఫ్‌పై బహిరంగ విచారణ

ఈనెల 20 వరకూ అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, అమరావతి: పీఎం కుసుమ్ పథకంలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయావసరాలకు ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న 3,725 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు టారిఫ్ నిర్ణయంపై వచ్చే నెల 5న బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మంగళవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో డిస్కంల ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సూచనలు ఈనెల 20లోగా కమిషన్ సెక్రటరీ ఈ మెయిల్‌కు పంపాలని సూచించింది. వచ్చిన అభ్యంతరాలపై డిస్కంలు ఈనెల 29లోగా సమాధానమివ్వాలని ఆదేశించింది. అనంతరం డిసెంబర్ 5న కర్నూలులోని కోర్టు హాలులో ఉదయం 11 గంటల నుంచి ఫీడర్ సోలరైజేషన్ టారిఫ్‌పై బహిరంగ విచారణ నిర్వహిస్తామని కమిషన్ తెలిపింది.

ఎస్సీ, ఎస్టీలు గళం విప్పితే గొంతులు కోసేస్తారా!

- సోమిరెడ్డి అవినీతిని ప్రశ్నిస్తే చంపేస్తారా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

గోపాల్‌ను పరామర్శిస్తున్న టీజేఆర్ సుధాకర్‌బాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టీడీపీ అవినీతి, అక్రమాలు, దాష్టీకాలపై ఎస్సీ, ఎస్టీలు మాట్లాడితే గొంతులు కోస్తారా, వారి ఇళ్లపై దాడులు చేస్తారా? చంద్రబాబు ప్రభుత్వంలో ఈ సామాజిక వర్గాలకు మాట్లాడే హక్కు లేదా, కూటమి పార్టీ నేతలే మాట్లాడాలా? అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. టీడీపీ గూండాల హత్యాయత్నంలో తీవ్రంగా గాయపడి నెల్లూరు అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బదనాపురి గోపాల్‌ను మంగళవారం పలు ఎస్టీ సంఘాల నాయకులతో కలిసి కాకాణి, సుధాకర్‌బాబు పరామర్శించారు. గోపాల్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా టీజేఆర్ సుధాకర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ గోపాల్‌పై దాడిని తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు మాట్లాడే హక్కు లేదా అని, కూటమి పార్టీ నేతలే మాట్లాడాలా అని ప్రశ్నించారు. గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన గూండాలు దర్జాగా, నిర్భయంగా బయట తిరుగుతున్నా.. పోలీసులు అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. సోమిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే వెంకటాచలం సర్పంచ్‌పై రీకాలింగ్ ఎన్నికకు గోవర్ధన్‌రెడ్డి చేసిన చాలెంజ్‌ను స్వీకరించాలన్నారు. సోమిరెడ్డి తాను అవినీతికి పాల్పడ లేదని, డబ్బులు వసూలు చేయలేదని దేవుని ఎదుట ప్రమాణానికి సిద్ధమేనా అని ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ప్రజల తీర్పు కోరుతామని, వెంకటాచలం సర్పంచ్ అక్రమ తొలగింపు విషయంలో న్యాయస్థానానికి వెళ్తామన్నారు. సోమిరెడ్డి నిజమైన నాయకుడు అయితే ఇప్పటికి ఇప్పుడు స్వచ్ఛందంగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని, ఎవరికి ఎంత ప్రజాదరణ ఉందో బయట పడుతుందన్నారు.

మొక్కుబడిగా కేసు పెట్టి వదిలేశారు..

కాకాణి మాట్లాడుతూ గోపాల్‌పై జరిగిన హత్యాయత్నం జిల్లా ప్రజలను ఉలిక్కిపడేలా చేసిందన్నారు. గోపాల్ దంపతులపై దాడి చేసి, గొంతు కోయడానికి యత్నించడం దారుణమన్నారు. దాడి జరిగి రెండు రోజులు కావస్తున్నా.. నిందితులపై పోలీసులు మొక్కుబడిగా కేసులు పెట్టి వదిలేశారు తప్ప, చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఎస్పీ స్పందించి, దోషులపై కఠిన చర్యలు తీసుకొని, శాంతిభద్రతలను కాపాడాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఆసక్తి వ్యక్తీకరణ (EoI)
EoI No.04/RWS&S/CE.III/Bulk Flow Meters/2025, తేది:04-11-2025
ఎలక్ట్రోమాగ్నిటిక్ ఫ్లో మీటర్స్ (బల్క్ ఫ్లో మీటర్స్) సరఫరా కొరకు తయారీదారులు/ అధీకృత సరఫరాదారులు/ డీలర్ల ఎంప్యానల్‌మెంట్ కొరకు EoI కోరబడుతున్నది. పాల్గొనగోరు ఏజెన్సీలు డాక్యుమెంట్‌ను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం www.apeprocurement.gov.in నుండి 05-11-2025 నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. సంప్రదించాల్సిన మొబైల్ నం.9100120515.
సం/- చీఫ్ ఇంజినీర్-III, RWS&S, విజయవాడ
DIPR RO No.17949/CL/Advt/1/1/2021-22, Dt: 04-11-2025

తమ అభిమాన నేత కోసం హారతి పళ్లెంతో ఎదురుచూస్తున్న మహిళలు, అభిమానులు

చిన్నారిని ఆప్యాయంగా ముద్దాడుతూ...

వైఎస్ జగన్‌ను చూసి సంతోషంతో కేరింతలు కొడుతున్న అక్కచెల్లెమ్మలు

జగనన్నను చూసిన ఆనందంలో..

కృష్ణా తీరం.. జన తరంగం

జననేత జగన్‌కు అడుగడుగునా బ్రహ్మరథం • పర్యటన ఆసాంతం ఉవ్వెత్తున ఎగసిన ప్రజాభిమానం

గుండెలపై కకావికలమైన పంటను చూసి పుట్టెడు శోకంతో ఉన్న పుడమితల్లి పరవశించింది. కన్నీళ్లతో కుంగికృశించిన హృదయాలు నేనున్నానంటూ చాచిన ఆపన్నహస్తాన్ని మురిపెంగా ముద్దాడాయి. సర్కారు ఆంక్షలు సంకెళ్లు తెంచి.. సదా తమ క్షేమాన్నే కాంక్షించే అభిమాన నేతను హత్తుకునేందుకు ఉవ్విళ్లూరాయి. కష్టాల్లో కానరాని ఏలికలపై ధ్వజమెత్తిన ప్రజాపతికి జయజయధ్వానాలు పలికాయి. నీ వెంటే మేమంటూ మండుటెండనూ లెక్కచేయక గళమెత్తి నినదించాయి. కృష్ణా తీరం జనతరంగమై ఉప్పొంగింది. జన హృదయ విజేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా నీరాజనం పలికింది.

సాక్షి, అమరావతి: మోంథా తుపాను ధాటికి విలవిల్లాడిన రైతులను పరామర్శించేందుకు మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కృష్ణా జిల్లా పర్యటన దిగ్విజయంగా సాగింది. తమ కన్నీళ్లు తుడిచేందుకు వచ్చిన జననేతకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా ఆయనకు ఘన స్వాగతం పలికారు. పల్లెల్లో మహిళలు రోడ్లకిరువైపులా నిలబడి పూలవర్షం కురిపించారు. అడుగడుగునా ఆంక్షలు పెట్టినా, రోడ్లు, కూడళ్లు, సరిహద్దుల్లో బారికేడ్లు పెట్టి.. తాళ్లతో దారులు మూసేసినా ప్రజలు వెనుకడుగు వేయలేదు. మండుటెండను సైతం లెక్కచేయక మొక్కవోని పట్టుదలతో ముందుకురికారు. అభిమాన నేతకు గోడు వెళ్లబోసుకునేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. మోంథా తుపానుతో నష్టపోయిన పంట పొలాలను వైఎస్ జగన్‌కు చూపించి ఆదుకోవాల్సిన సర్కారు పెద్దలు ఇప్పటివరకూ పట్టించుకోలేదని కన్నీరు మున్నీరయ్యారు. సమస్యలు చెప్పుకుని ఓదార్పు పొందారు. పంటలు నష్టపోయి పుట్టెడు దుఃఖంలో ఉంటే పరిహారం తీసుకుంటే దెబ్బతిన్న పంటను కొనడం కుదరదని సర్కారు బెదిరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలను ఆసాంతం సావధానంగా విన్న జననేత అధైర్యం వద్దని తానున్నానని భరోసా ఇవ్వడంతో కొండంత అండగా ఉందని సాంత్వన పొందారు.

గుమ్మడి కాయలతో దిష్టి తీస్తున్న అక్కచెల్లెమ్మలు

• తాడేపల్లి నుంచి ఉదయం కారులో బయలుదేరిన వైఎస్ జగన్‌కు విజయవాడలోనే ప్రజలు దారికి ఇరువైపులా బారులుతీరి జయజయధ్వానాలు పలికారు. పటమటలో మహిళలు గుమ్మడి కాయలతో జననేతకు దిష్టి తీశారు. భారీగా తరలి వచ్చిన కార్యకర్తలు పూల వర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. కానూరులో రైతులు, మహిళలు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈడుపుగల్లు, గోశాల వద్ద జగన్‌ను కలిసిన మహిళా రైతులు, తుపానుతో నష్టపోయిన అరటి, వరి పంటలను చూపించారు. ఈ సందర్భంగా పూర్తిగా పనికి రాకుండా పోయిన వరి కంకులను వైఎస్ జగన్ పరిశీలించారు. ఆకునూరు సెంటర్‌లో వైఎస్ జగన్‌ను కలిసిన కల్లుగీత కార్మికులు తమ కష్టాలు వెళ్లబోసుకున్నారు. గండిగుంటలో వైఎస్ జగన్‌పై మహిళలు పూలుజల్లి ఘనస్వాగతం పలికారు. గోపువానిపాలెంలో మహిళలు, వృద్ధులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి గజమాలలతో జగన్‌కు స్వాగతం పలికారు. నిడమోలు, తరకటూరులో దారికి ఇరువైపులా ప్రజలు బారులు తీరారు. వారికి అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు. ఆయనకు పామర్రులోనూ రైతులు పాడైపోయిన పంటలను చూపించారు. పెడన నియోజకవర్గం, గూడూరు వద్ద మహిళలు జయహో జగనన్న అంటూ నినదించారు. రామరాజుపాలెంలోనూ వైఎస్ జగన్‌కు పంట పొలాలను చూపి రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆకుమర్రు లాకు వద్ద స్వయంగా వరి చేలో దిగిన జగనన్నతో రైతులు ముఖాముఖి మాట్లాడి మురిసిపోయారు. తమ బాధలు వినే నాయకుడు వచ్చాడని పరవశించిపోయారు. సీతారామపురం గ్రామానికి చేరుకున్న జగన్‌కు మహిళలు హారతులు పట్టారు. అక్కడి నుంచి బీవీ తోటకు బయలుదేరిన జగన్ వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

70 కి.మీ. ప్రయాణానికి 7 గంటలకు పైగా

అడుగడుగునా ప్రజలు నీరాజనం పలకడంతో వైఎస్ జగన్ పర్యటన నెమ్మదిగా ముందుకు సాగింది. 70 కిలోమీటర్ల దూరానికి 7 గంటలకు పైగా సమయం పట్టిందంటే జగన్‌పై ప్రజాభిమానం ఏస్థాయిలో ఉప్పొంగిందో ఊహించుకోవచ్చు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు

పామర్రు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ కృష్ణాజిల్లా పర్యటనలో ఆయన కాన్వాయ్‌తో పాటు వస్తున్న పార్టీ నేతల కార్లను పోలీసులు అడ్డుకున్నారు. తాము అధినేత వెంట వెళ్తే తప్పేంటని ప్రశ్నించిన నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించారు. ఈ ఘటన మొవ్వ మండలం కూచిపూడి స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. జగన్ కాన్వాయ్‌తో పాటుగా బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు తన అనుచరులతో కలిసి మూడు కారుల్లో కాన్వాయ్‌తో పాటు వస్తున్నారు. వారిని నిడుమోలు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అశోక్ బాబు, పోలీసుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. తమ విధులకు ఆటంకం కల్పించారంటూ అశోక్‌బాబు, ఆయన అనుచరులపై మొవ్వ ఎస్సై కె.ఎన్.విశ్వనాథ్ కేసులు పెట్టారు.

డ్రోన్‌తో నిఘా

పెనమలూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పర్యటనలో పోలీసులు ఆంక్షలు విధించటమే కాకుండా అడుగడుగునా నిఘా పెట్టారు. పెనమలూరు మండల పరిధిలోని పలు గ్రామాల కూడళ్ల మీదుగా జగన్ పర్యటన జరిగిన సమయంలో పోలీసులు డ్రోన్‌లు పెట్టి చిత్రీకరించారు. ప్రతి సెంటర్‌లో డ్రోన్‌లు ఏర్పాటు చేశారు.

‘ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటనే తిరిగి ఇవ్వండి’

సాక్షి, అమరావతి: నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులివ్వకుండానే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్రంలోని ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు, వర్సిటీలను ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ హెచ్చరించింది. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఉద్దేశపూర్వకంగా కాలేజీలు తీసుకుంటే రూ.15 లక్షల జరిమానా విధిస్తూ గుర్తింపును రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామని హెచ్చరించింది. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని కళాశాలలను ఆదేశించింది. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవడం, కమిషన్ నిర్దేశించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లు తెలిపింది. ‘చదువు పూర్తి చేసిన తర్వాత కూడా విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇలాంటి అనైతిక చర్యలతో విద్యార్థుల ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు అడ్డుకోవడం సరికాదు’ అని మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

వసతి గృహంలో కీచకపర్వం

బాలురపై వాచ్‌మన్ లైంగిక దాడి

తిరుపతి క్రైం: తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో వాచ్‌మన్ సాగిస్తున్న కీచకపర్వం వెలుగులోకి వచ్చింది. హాస్టల్‌లో ఉంటున్న బాలురపై వాచ్‌మన్ లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం స్థానికంగా సంచలనం సృష్టించింది. బాధిత బాలురలో ఒకరి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారెడ్డి కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల పిల్లలు ఉంటూ చదువుకుంటున్నారు. ఇక్కడ రాత్రి వాచ్‌మన్‌గా పని చేస్తున్న హరిగోపాల్ తన లైంగిక వాంఛలు తీర్చుకునేందుకు హాస్టల్‌లోని బాలురపై కన్నేశాడు. ఈ నెల రెండో తేదీ రాత్రి ఏడో తరగతి చదువుతున్న ఒక బాలుడిని, మరొక బాలుడిని హరిగోపాల్ బెదిరించి ఒక గదిలోకి తీసుకువెళ్లాడు. మొదట ఏడో తరగతి చదువుతున్న బాలుడిపై, ఆ తర్వాత మరో బాలుడిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధిత పిల్లల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తమ పిల్లలు మూడో తేదీన ఫోన్ చేసి చెప్పారని, వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చామని, ఆయన సూచనలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

స్పోర్ట్స్ వర్సిటీ పెట్టాలి: సీపీఎం

వి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: జాతీయ, అంతర్జాతీయంగా క్రీడలకు పెరుగుతున్న ఆదరణ రీత్యా మన రాష్ట్రంలో వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారికి అత్యుత్తమ శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా క్రీడా వర్సిటీలు స్థాపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్‌కు రాసిన లేఖను శ్రీనివాసరావు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్న మూడు క్రీడా పాఠశాలల్లో విజయనగరం కేంద్రాన్ని మూసివేశారు. మిగతా రెండు అంతంత మాత్రమే నడుస్తున్నాయి. స్టేడియాల్లో తగినంత మంది కోచ్‌లు కూడా లేరు. వాస్తవిక పరిస్థితిని పరిశీలించి క్రీడా శిక్షణ సమర్థంగా నడిచేలా చర్యలు తీసుకోవాలి’ అని పేర్కొన్నారు.

మచిలీపట్నంలో సామాన్య ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

విజయవాడ పటమటలో ప్రజలను, అభిమానులపై పోలీసుల జులుం

గూడూరులో నిబంధనల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

అడుగుకో ఆంక్ష... రోడ్డుకో బారికేడ్!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పోలీసుల ఓవర్ యాక్షన్

ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కడికక్కడ కుయుక్తులు

ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ జగన్ పర్యటన దిగ్విజయం

గుడివాడ రూరల్: నాయకులకు నోటీసులు... కార్యకర్తలపై ఆంక్షలు... ప్రజలకు అడ్డంకులు... మొత్తంగా పర్యటనను విఫలం చేయడానికి కుయుక్తులు..! కానీ, అశేష జనం ముందు... వారి అభిమానం ముందు ఇవేమీ నిలవలేదు...! పోలీసులను అడ్డపెట్టుకుని ప్రభుత్వం పన్నిన పన్నాగాలు విఫలమయ్యాయి. కృష్ణా జిల్లాలో మోంథా తుపాను బాధిత రైతులను పరామర్శించి, వారి పంట పొలాల పరిశీలనకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమం దిగ్విజయమైంది. జగన్ పర్యటనను విఫలం చేయడమే లక్ష్యంగా ముందుగానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల ఇంచార్జిలు, ముఖ్య నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, మండల, గ్రామ నాయకులను బెదిరించింది. తద్వారా జన సమీకరణ జరగకుండా అడ్డుకోవాలని ఎత్తు వేశారు. అయితే, ఇవేవీ ఫలించలేదు. పైగా ప్రజలు భారీగా, స్వచ్ఛందంగా తరలి వస్తుండడంతో ఇక ఓవర్ యాక్షన్‌కు దిగారు. దీనికి గోపువానిపాలెం ఘటన సరైన ఉదాహరణ. జగన్ వస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు గోపువానిపాలెం అడ్డ రోడ్డుకు చేరుకోగా పోలీసులు బారికేడ్లు, రోప్‌లతో అడ్డగించారు. రోడ్డు మార్జిన్‌లో నిల్చుని ఉన్నా చెదరగొట్టారు. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ సంగతి తెలిసిన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అక్కడకు వచ్చి ఎందుకు ఇన్ని ఆంక్షలు విధిస్తున్నారు? అంటూ ప్రశ్నించారు. అయితే, సమాధానం ఇవ్వకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. దీంతో కైలే అనిల్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పమిడిముక్కల సీఐ తీరుపై మండిపడ్డారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం సరి కాదని హెచ్చరించారు.

దారులు మూసి.. చెక్‌పోస్టులు పెట్టి...

వైఎస్ జగన్‌ను చూసేందుకు అభిమానులు కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లతో పాటు కాలినడకన తండోపతండాలుగా తరలిరావడంతో కూటమి ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపింది. వందలమందిని మోహరించి బారికేడ్లు, తాళ్లతో చెక్‌పోస్టులు పెట్టి అడ్డంకులు సృష్టించింది. వైఎస్ జగన్ పర్యటించే గ్రామాలకు ఉన్న అన్ని దారులను మూసివేయించింది. రామరాజుపాలెం, ఆకుమర్రు, సీతారామపురం, ఎస్ఎన్ గొల్లపాలెంలో మాత్రమే పర్యటించాలంటూ వైఎస్ జగన్‌కు సైతం షరతులు విధించింది. 500 మంది, 10 వాహనాలకు మాత్రమే అనుమతి అంటూ అధికార దర్పం చూపించింది.

ప్రధాన కూడళ్లు జనసంద్రం... పోలీసుల అవాక్కు

రైతులు వైఎస్ జగన్‌ను కలవకుండా భారీగా బలగాలను మోహరించినా, రోప్ పార్టీలతో అడ్డుకునే ప్రయత్నం చేసినా, ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదంటూ ఎక్కడికక్కడ నిలిపివేసినా ప్రధాన కూడళ్లు జనసంద్రంగా మారడం చూసి పోలీసులు అవాక్కయ్యారు. మరోవైపు కూటమి పాలనలో తమకు జరుగుతున్న అన్యాయాలు, ఎదురవుతున్న నిర్లక్ష్యంపై రైతులు, ప్రజలు జగన్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. కాగా, రైతులు, ప్రజలు, అభిమానులు పోటెత్తడంతో వైఎస్ జగన్ పర్యటన ఉదయం 9.45కు మొదలై సాయంత్రం 5 గంటల వరకు సాగింది.

మచిలీపట్నం, గూడూరుల్లోనూ...

మచిలీపట్నంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నాయకులు, కార్యకర్తలు వైఎస్ జగన్ రాక కోసం వేచి ఉండగా బందరు డీఎస్పీ చప్పిడి రాజా ఇంతమంది ఇక్కడ ఉండొద్దంటూ చెదరగొట్టారు. బైక్‌లపై ర్యాలీగా కార్యకర్తలు, అభిమానులు వచ్చే క్రమంలో తాళాలు లాక్కునేందుకు ప్రయత్నించారు. మధ్యాహ్నం బ్రిడ్జి నీడ కింద ఉండగా ఇక్కడ ఉండొద్దని ఇనగుదురు సీఐ అత్యుత్సాహం ప్రదర్శించారు. వాహనాల పెగ్గులు తీసేయమని సిబ్బందికి హుకుం జారీ చేశారు. దీంతో పోలీసుల అత్యుత్సాహంపై మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ నేత పేర్ని కిట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు.

• ప్రజలు, అభిమానులు మచిలీపట్నం వైపు వెళ్లకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి దారి మళ్లించారు. డ్రోన్ కెమెరాలతో వీడియోలు తీస్తూ పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారు. అంతకుముందు తాడిగడపలోనూ రైతులు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వస్తున్న యువతను ఆపి తాళాలు లాక్కున్నారు. మచిలీపట్నం, సుల్తాన్‌నగర్, ఎస్ఎన్ గొల్లపాలెంలో బారికేడ్లు పెట్టి ప్రజలను వెళ్లనివ్వలేదు. దీంతో రైతులు పొలాల నుంచి నడుచుకుంటూ జగన్ వద్దకు చేరుకున్నారు. గండిగుంట, నెప్పల్లి సెంటర్‌లో పోలీసులు ఆటంకాలు కల్పించారు. జగన్ కాన్వాయ్‌తో పాటు వస్తున్న వాహనాలను నిలిపివేశారు. పామర్రు, బల్లిపర్రుకు భారీగా చేరుకున్న రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు ఆపేశారు. మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారి నుంచి రామరాజుపాలెం వైపు ఎవరినీ రానివ్వకుండా అడ్డరోడ్డ వద్ద బారికేడ్లను పెట్టారు.

• పెడన నియోజకవర్గం గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు నుంచి గ్రామంలోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు పెట్టారు. బందరు వైపు నుంచి సీతారామపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై బారికేడ్లతో ఓవర్‌యాక్షన్ చేశారు. కనీసం బైక్‌లనూ అనుమతించలేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

• తుపాను కారణంగా నీట మునిగిన పంట పొలాలకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు.

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి వరికోటి అశోక్‌బాబును అదుపులోకి తీసుకుని, ఆయనవెంట వచ్చిన వాహనాలతో పాటు స్టేషన్‌కు తరలించారు. సీతారామపురంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ జెండాలతో ఆ పార్టీ కార్యకర్తలు కవ్వించారు. అయినా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రతిఒక్కరూ అత్యంత సంయమనం పాటించారు.

ఉపాధ్యాయినులూ.. ఇది తగునా..!

ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూడండి. బక్కెట్లతో నీటిని మోసుకెళుతున్న చిన్నారులు గుంటూరు జిల్లా కాకుమాను మండలం గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. అక్కడ నీటి ఎద్దడి ఉండటంతో ఇదిగో టీచర్లు వారితో ఇలా నీళ్లు మోయించుకుంటున్నారు. మంగళవారం హాస్టల్ నుంచి ప్రిన్సిపల్ క్వార్టర్స్‌లో ఉండే ఉపాధ్యాయులకు నిండైన నీళ్ల బక్కెట్లును మోసుకెళుతూ విద్యార్థులు కనిపించారు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉండే తల్లిదండ్రులు గురుకులాల్లో ఉన్నత విద్యాబుద్ధులు నేర్పుతారని తమ పిల్లలను పంపిస్తుంటే, ఇక్కడి ఉపాధ్యాయులు మాత్రం ఇలా పిల్లలతో చాకిరీ చేయించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

– ప్రత్తిపాడు

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల ఆత్మహత్య

• చిత్తూరు సీతమ్స్ కాలేజీ భవనంపై నుంచి దూకి ఒకరు...

• తిరుపతి చదలవాడ కళాశాలలో ఉరి వేసుకుని మరొకరు బలవన్మరణం

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వేర్వేరు ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మంగళవారం ఆత్మహత్యలు చేసుకున్నారు. చిత్తూరు నగర శివారు మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల భవనంపై నుంచి దూకి ఒకరు, తిరుపతి సమీపంలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల టెర్రస్‌పై ఉరివేసుకుని మరొకరు బలన్మరణాలకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు... చిత్తూరు నగరంలోని 6వ వార్డు సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రుద్ర (19) అనే యువకుడు సీతమ్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీ.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతను మంగళవారం మధ్యాహ్నం 3.05 గంటల సమయంలో కళాశాలలోని మెకానికల్ విభాగం భవనం మూడో అంతస్తు నుంచి దూకేశాడు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరిన రుద్రను కాలేజీ నిర్వాహకులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు సహచర విద్యార్థులు తెలిపారు. తరగతులు జరుగుతుండగానే రుద్ర మూడో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడడం కళాశాలలో కలకలం రేపింది. రుద్ర మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని అతని తల్లి తులసి, కుటుంబ సభ్యులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. సీసీ టీవీ ఫుటేజీలను చూపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఇదే కళాశాలలో బీ.టెక్ మూడో సంవత్సరం చదువుతున్న నందిని అనే విద్యార్థిని అక్టోబర్ 31వ తేదీన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. తీవ్రంగా గాయపడిన ఆమె తమిళనాడులోని సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన మరువకముందే వారం రోజుల వ్యవధిలోనే మరో విద్యార్థి కళాశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన రుద్ర

సాయిచంద్ మృతదేహం

హాస్టల్ టెర్రస్‌పై ఉరి వేసుకుని...

నెల్లూరు స్టోన్ హౌజ్ పేటకు చెందిన సాయిచందు (20) తిరుపతి సమీపంలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అతను మంగళవారం కళాశాల హాస్టల్ భవనం టెర్రస్‌పై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మరణించాడు. కళాశాల యాజమాన్యం ఫీజు కోసం సోమవారం సాయిచందు తండ్రికి ఫోన్ చేశారు. మరుసటిరోజే అతను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

• రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురం వేదికగా జరుగుతాయని, రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న క్రీడాకారులను ఆయా కలెక్టర్లు రిలీవ్ చేసి పోటీలు విజయవంతం చేసేందుకు సహకరించాలని రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిసారిగా రాయలసీమలో అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం వేదికగా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాగుబడి

స్వాతి కార్తె: నవంబర్ 5 వరకు
విశాఖ కార్తె: 6 నుంచి

వరి, గోధుమ, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు తదితర పంటల దిగుబడి, ఉత్పత్తి వ్యయంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయి. 1960 నుంచి 2023 మధ్యకాలంలో సాగు భూముల విస్తీర్ణం, భూసారం తగ్గిపోవటం, ఎరువుల వాడకం, పంట దిగుబడుల్లో వివిధ దేశాల మధ్య ఎన్నెన్నో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. అందుకు గల కారణాలేమిటి? వ్యవసాయం, ఆహార భద్రతల విషయంలో భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? అధిక జనాభా భారంతో ఉండే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయంలో ఇప్పటికీ దిగుబడులు పెంచుకోవటానికి గల అవకాశాలు, మార్గాలేమిటి? ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఏ.ఓ.) తాజాగా ప్రకటించిన గణాంకాలతో ప్రత్యేక కథనం.



ధాన్యపు పంటలు: ప్రపంచ దేశాల్లో 1961-2023 మధ్యకాలంలో గోధుమ, వరి, మొక్క జొన్న, చిరుధాన్యాలు తదితర ధాన్యపు పంటలకు సంబంధించి హెక్టారుకు పెరిగిన ఉత్పాదకత వివరాలు టన్నుల్లో. భారత్: 0.95(1961)-3.63(2023). ఆస్ట్రేలియా:1.08-3.23, చైనా:1.19-6.42. బ్రెజిల్: 1.35-5.34. అమెరికా: 2.52-8.33.



వరి: ప్రపంచ దేశాల్లో 1961-2023 మధ్యకాలంలో వరి పంటకు సంబంధించి హెక్టారుకు పెరిగిన ఉత్పాదకత వివరాలు టన్నుల్లో. భారత్: 1.54(1961)-4.32(2023). ఆస్ట్రేలియా:5.9-9.52, చైనా:2.04-7.14. బ్రెజిల్: 1.7-6.94. అమెరికా: 3.82-8.57.



ఒక దేశంలో ఒక పంటకు గరిష్టంగా ఎంత దిగుబడి సాధించే అవకాశం ఉంది? రైతులు ప్రస్తుతం ఎంత తీస్తున్నారు? ఈ రెండిటి మధ్య వ్యత్యాసాన్నే దిగుబడి అంతరం(ఈల్డ్ గ్యాప్) అంటారు. హెక్టారులో వరి దిగుబడిని భారత్ 0.4, చైనా 0.61, రష్యా 3.61, అల్జీరియా 7.57 టన్నుల వరకు పెంచుకునే అవకాశం ఉంది. అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా ఇప్పటికే పూర్తిస్థాయి ఉత్పాదకత సాధించాయి. అందుకే ఈ దేశాల ఈల్డ్ గ్యాప్ సున్నాగా ఉంది.

దిగుబడుల్లో అంతరాలెందుకు?

12,000 సంవత్సరాల క్రితం వ్యవసాయం ప్రారంభమైంది. అప్పటి నుండి నాగరికతలను నిలబెట్టడంలో భూమి కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం, ప్రపంచ ఆహార సరఫరాలో 95 శాతానికి పైగా భూమి ఆధారంగా జరిగే వ్యవసాయం ద్వారానే వస్తోంది. 2022లో వ్యవసాయ రంగం ప్రపంచవ్యాప్తంగా 89.2 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది (మొత్తం ఉపాధిలో 26.2 శాతం). పొలాల బయట ఆహార రవాణా, నిల్వ, పంపిణీ (ఆహార వ్యవస్థల)కి సంబంధించిన పనులు, ఉద్యోగాలలో ప్రపంచ శ్రామిక శక్తిలో అదనంగా 13 శాతం మంది నిమగ్నమై ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. భూమి విస్తీర్ణం, పశువుల సంఖ్య, ఆదాయాల పంపిణీని బట్టి చిన్న, సన్నకారు రైతులను గుర్తించే ప్రమాణాలు దేశాన్ని బట్టి మారుతుంటాయి. ఒక దేశంలో 2 హెక్టార్ల భూమి ఉన్న రైతులు చిన్న, సన్నకారు రైతులైతే.. మరొక దేశంలో 50 హెక్టార్లున్న వారు చిన్న రైతులు. ఒక దేశంలో వార్షికాదాయం 1,500 డాలర్ల ఆదాయం ఉండే వారు చిన్న, సన్నకారు రైతులైతే.. మరొక దేశంలో 2,50,000 డాలర్లు వార్షిక ఆదాయం వున్న వారు కావచ్చు.

2 శాతం తగ్గిన వ్యవసాయ భూమి

ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఏ.ఓ.) ఇటీవలే ప్రకటించిన 2023 నాటి గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా మొత్తం భూభాగంలో వ్యవసాయ భూమి (అంటే.. స్వల్పకాలిక పంటలు పండించే వ్యవసాయ యోగ్యమైన భూమి, శాశ్వత / దీర్ఘకాలిక తోటలు సాగు చేసే భూమి కలిపి) విస్తీర్ణం 12 శాతం మాత్రమే. శాశ్వత పచ్చిక భూములు, పచ్చిక బయళ్ళు మొత్తం భూమిలో నాలుగింట ఒక వంతు ఆక్రమించగా, అడవులు మూడింట ఒక వంతు ఆక్రమించాయి. 2001 – 2023 మధ్య, ప్రపంచ వ్యవసాయ భూమి విస్తీర్ణం నికరంగా 7.5 కోట్ల హెక్టార్ల (2 శాతం) తగ్గింది.

1961 – 2020 మధ్య ప్రపంచ వ్యవసాయ భూమిలో కేవలం 8 శాతం విస్తరణతో వ్యవసాయ ఉత్పత్తిలో నాలుగు రెట్ల పెరిగింది. పంటల ఉత్పాదకతలో గణనీయమైన మెరుగుదలను ఇది సూచిస్తోంది. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ఆహార లభ్యతకు ఢోకా లేదు. నేడు కొరత సమస్య కాదు. ఆహారాన్ని పొందగలిగే స్థోమత లేకపోవటం, అశాంతి, యుద్ధాలతో ఆహార పంపిణీ సమస్యలు ఎదురవుతున్నాయి. వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలలో చారిత్రకంగా నమోదైన పురోగతితో ఆహార భద్రత, పేదరికం తగ్గింపు, ఆర్థిక అభివృద్ధికి ప్రాథమికంగా కనిపించింది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులు గణనీయంగా భిన్నంగా మారుతూ ఉంటాయి.

తీవ్రంగా పెరిగిన ఉత్పాదకాల వాడకం

ఒకే రకం పంట దిగుబడుల విషయంలో వివిధ దేశాల్లో చాలా ఎక్కువ స్థాయిలో తారతమ్యాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వ్యవసాయంలో ఉత్పాదకత ధోరణులను విశ్లేషించేటప్పుడు నికర వ్యవసాయ ప్రాంతం, దిగుబడులను పరిగణనలోకి తీసుకుంటారు. కానీ అధిక దిగుబడులు ఉత్పాదకాల వాడకం తీరుపై ఆధారపడి ఉంటాయి. స్థానిక వ్యవసాయ వాతావరణ పరిస్థితులు, విత్తనం, ఎరువులు, పురుగుమందులు, నీటిపారుదల సదుపాయాలు వంటి జీవభౌతిక ఉత్పాదకాలతో పాటు శ్రమ, పెట్టుబడులను బట్టి పంటల ఉత్పాదకతను, ఉత్పాదక సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. వ్యవసాయంలో భూమి పాత్రను అర్థం చేసుకోవడానికి వీటన్నిటినీ అర్థం చేసుకోవటం అవసరం. ఉత్పాదకాల వినియోగించే తీవ్రత స్థాయి, సాంకేతిక ఆవిష్కరణలు, మెరుగైన నిర్వహణను బట్టి దిగుబడుల్లో తారతమ్యాలు వస్తాయి. అందువల్ల, ఎరువులు, యంత్రాలు లేదా మానవ శ్రమ మరింత ఎక్కువ స్థాయిలో వెచ్చించటం వల్లనే దిగుబడి పెరుగుదల నమోదైందని గుర్తించాల్సి ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా ఆహారోత్పత్తి వృద్ధిలో సాగు భూమి విస్తీర్ణం పెరుగుదల చాలా తక్కువ పాత్ర పోషించిందని, అయితే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పంట భూముల విస్తరణే ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉందని ఎఫ్ఎఓ చెబుతోంది.

దిగుబడుల్లో అంతరాలు

దిగుబడి పెరుగుదలలో విజయం సాధించినప్పటికీ.. సాధిస్తున్న దిగుబడిలో దేశాల మధ్య అంతరాలు కొనసాగుతున్నాయి. దిగుబడి అంతరం అంటే? ఒక నిర్దిష్ట వాతావరణంలో ఒక పంటకు గరిష్ఠంగా సాధించగల దిగుబడికి, అక్కడి రైతులు ప్రస్తుతం సాధిస్తున్న వాస్తవ దిగుబడికి మధ్య వ్యత్యాసాన్నే దిగుబడి అంతరం అంటారు. దిగుబడి పెరుగుదలలో గతంలో విజయాలు సాధించినప్పటికీ, అనేక దేశాలు, అనేక పంటలలో గణనీయమైన దిగుబడి అంతరాలు ఉన్నాయి.

సగటు కమతం విస్తీర్ణం: 1960-2000 మధ్య కాలంలో వివిధ దేశాల్లో సగటు పొలం విస్తీర్ణం హెచ్చుతగ్గుల తీరు హెక్టార్లలో. భారత్:2.7-1.3, ఆస్ట్రేలియా:1,840-3,240, బ్రెజిల్:74.9-72.8, అమెరికా:122.6-178.4, కెనడా:145.2-273.4.

1961-2022 మధ్య రసాయనిక ఎరువుల వాడకం పెరిగిన తీరు.. హెక్టారుకు కిలోలలో.. భారత్:2-178, చైనా:7-336, ఆస్ట్రేలియా:33-87, అమెరికా:37-108, కెనడా:11-109.



ఉత్పాదకతలో ఆస్ట్రేలియా రారాజు

ఉదాహరణకు.. వరిలో (హెక్టారుకు టన్నుల్లో) 2023లో ఆస్ట్రేలియా 9.52 టన్నుల దిగుబడి సాధిస్తే, భారత్ 4.32, అమెరికా 8.57, చైనా 7.14, బ్రెజిల్ 6.94 టన్నుల దిగుబడి సాధించింది. ఈ అంతరాలు గత 63 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. 1961లో వరి దిగుబడిలో అత్యధికంగా ఆస్ట్రేలియా 5.9 టన్నులతో నంబర్ వన్‌గా నిలిచింది. 9.52 టన్నులతో ఇప్పటికీ ఆ స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. భారత్ 1.54 టన్నుల నుంచి 4.32 టన్నులకు పెంచుకోగలిగింది. చైనా వరి దిగుబడులు మన కన్నా ఎక్కువ శాతం పెరిగాయి. 1961లో 2.04 టన్నులున్న చైనా వరి ధాన్యం దిగుబడి 2023 నాటికి 7.14 టన్నులకు పెరిగింది. అమెరికా 3.82 టన్నుల నుంచి 8.57 టన్నులకు పెంచుకోగలిగింది.

వ్యవసాయ భూమి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో సమర్థవంతంగా ఉపయోగించుకోవటంలో కొన్ని దేశాలు వెనుకబడటం కూడా ఈ స్థాయిలో దిగుబడి అంతరాలు ఏర్పడటానికి కారణమని ఎఫ్.ఏ.ఓ. చెబుతోంది. ముఖ్యంగా, ఈ అంతరాలకు జీవ భౌతిక కారణాలు మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక, సంస్థాగత పరిమితులు కూడా కారణమవుతున్నాయి. పెరిగిన ఎరువుల ధరలు, గిట్టుబాటుకాని పంటల ధరలు, రుణం లేదా బీమా సదుపాయాలు అంతగా అందకపోవటం, కౌలుదారుల్లో అభద్రత.. వేర్వేరు దేశాల్లో దిగుబడుల అంతరాలు కారణమవుతున్నాయని ఎఫ్.ఏ.ఓ. తెలిపింది.

భూసార క్షీణతతో 170 కోట్ల మందికి ముప్పు

మనుషుల పనుల కారణంగా భూసారం నష్టపోతోంది. ఈ కారణంగా పంట దిగుబడులు తగ్గుతున్నాయి. సుమారు 170 కోట్ల మంది నివసిస్తున్న భారత్ తదితర ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఈ ముప్పు ఏర్పడిందని ఎఫ్.ఎ.ఓ. నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న అధిక జనాభా గల దేశాలకు ఈ ముప్పు ఉంది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యానికి, వ్యవసాయ ఉత్పాదకతకు ఈ నిశ్శబ్ద సంక్షోభం గొడ్డలి పెట్టుగా మారిందని ఎఫ్.ఏ.ఓ. హెచ్చరిస్తోంది.

– నిర్వహణ:

పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

2023లో వరి దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 4.32, ఆస్ట్రేలియా: 9.52, ఈజిప్టు: 8.72, అమెరికా: 8.57, పెరు:8.07, చైనా: 7.14, బ్రెజిల్: 6.94.



2023లో గోధుమ దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 3.52, ఈజిప్టు: 7.19, మెక్సికో: 6.2, చైనా: 5.78, జపాన్: 4.72.

2023లో పండ్ల దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్:15.11, ఇండోనేషియా:27.06, దక్షిణాఫ్రికా:24.55, ఈజిప్టు: 20.94, అమెరికా:20.91, కజకిస్తాన్:19.54, బ్రెజిల్: 18.39.



2023లో పత్తి దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 1.27, ప్రపంచం:2.3, చైనా:6.64, మెక్సికో:4.52, బ్రెజిల్:4.39, ఆస్ట్రేలియా:3.79, పెరు:2.86, అమెరికా:2.84.



2023లో మొక్కజొన్న దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 3.54, ప్రపంచం:5.96, అమెరికా:11.25, ఇండోనేషియా:8.07, ఈజిప్టు:7.51, రష్యా:6.92, చైనా:6.53.



2023లో పప్పుధాన్యాల దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 0.74, ప్రపంచం:0.98, ఈజిప్టు:4.24, ఆస్ట్రేలియా:2.07, అమెరికా:1.97, రష్యా:1.95, చైనా:1.86.



2023లో కూరగాయల దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో).. భారత్: 15.81, ప్రపంచం:20.07, అమెరికా:36.64, ఇరాన్:29.59, రష్యా:29.36, జపాన్:27.6, చైనా:26.14, బ్రెజిల్:25.79.

మూడో భారీ ఎకానమీగా భారత్!

త్వరలోనే సాధిస్తాం..
- మన సామర్థ్యాలపై మనకు నమ్మకం ఉండాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: అత్యంత వేగంగా ఎదుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ త్వరలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఎకానమీగా ఆవిర్భవిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. వివిధ అంశాల్లో భారత్ చాలా వేగంగా ముందుకు దూసుకెళ్తోందని ఆమె పేర్కొన్నారు. 2014లో పదో స్థానంలో ఉన్న భారత్ క్రమంగా అయిదు, నాలుగో స్థానాలకు ఎదిగిందని, త్వరలోనే మూడో స్థానానికి చేరుతుందని చెప్పారు. భారతీయులంతా తమ సామర్థ్యాలపై, దేశ ఆర్థిక సామర్థ్యాలపై నమ్మకం కలిగి ఉండాలని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ (డీఎస్ఈ) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సూచించారు. బైటి వ్యక్తుల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. '140 కోట్ల జనాభా గల మన దేశాన్ని నిర్జీవ ఎకానమీగా ఎవరైనా ఎలా అనగలరు? బైటి నుంచి ఎవరైనా ఏవైనా మాట్లాడొచ్చు గాక, కానీ మన కృషి, మన విజయాలను మనం తక్కువ చేసుకోరాదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి కృషి చేస్తున్న మనందరికీ మనం సొంతంగానే లక్ష్యాలను సాధించగలమనే ఆత్మవిశ్వాసం ఉండాలి' అని మంత్రి చెప్పారు. వృద్ధి సాధనలో టెక్నాలజీ చాలా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. సాంకేతిక లేకపోయి ఉంటే స్థలం, కార్మిక శక్తి, పెట్టుబడులు నిరుపయోగంగా ఉండేవని వివరించారు.

చిన్న రైతు పొలాన్ని గుర్తించడం నుంచి కొత్త మోడల్స్‌ను అత్యంత వేగంగా కృత్రిమ మేథ తీర్చిదిద్దుతున్న తయారీ రంగం వరకు అన్నింటా సాంకేతికత కీలకంగా ఉంటోందని మంత్రి చెప్పారు. కృత్రిమ మేథ వల్ల ఉద్యోగాలు పోతాయని కొందరిలో ఆందోళన నెలకొన్నప్పటికీ మరికొందరు మాత్రం ఏఐని ఉపయోగించి దీర్ఘకాలిక సవాళ్లను పరిష్కరిస్తున్నారని తెలిపారు. భారత్‌లో పరిశోధనలు నిర్వహించడంపై, వర్ధమాన దేశాలకు అనువైన మోడల్స్‌ను రూపొందించడంపై మరింతగా దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు.

ద్రవ్య లోటు లక్ష్యాన్ని సాధిస్తాం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతానికి పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పక సాధించగలదని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 2024–25లో 4.8 శాతంగా ఉన్న ద్రవ్య లోటును ఈసారి 4.4 శాతానికి (సుమారు రూ. 15.69 లక్షల కోట్లు) పరిమితం చేయాలని బడ్జెట్‌లో ప్రభుత్వం నిర్దేశించుకుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల ఆర్థిక సమ్మిళితత్వం, జాతీయ ప్రయోజనాల లక్ష్యాలకు భంగం వాటిల్లుతుందన్న ఆందోళనలను ఆమె తోసిపుచ్చారు. బ్యాంకులను జాతీయీకరణ చేసి 50 ఏళ్లు గడిచినా ఆర్థిక సమ్మిళితత్వ విషయంలో ఆశించిన ఫలితాలు కనిపించలేదని..వాటిని ప్రొఫెషనల్ విధానంలో తీర్చిదిద్దిన తర్వాత నుంచి చక్కని ఫలితాలు కనిపిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో జియస్ ఇండియా ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్: ఆప్టికల్స్ దిగ్గజం జియస్ ఇండియా హైదరాబాద్‌లో తమ ఏడో క్వాలిటీ ఎక్సలెన్స్ సెంటర్‌ని ప్రారంభించింది. సుమారు 4,500 చ.అ. విస్తీర్ణంలో ఇది ఏర్పాటు కాగా మరో 1,500 చ.అ. మేర దీన్ని విస్తరించనున్నట్లు సంస్థ బిజినెస్ హెడ్ అవీన్ పద్మప్రభ తెలిపారు. ఇందులో కోఆర్డినేట్ మెజరింగ్ మెషిన్స్, 3డీ స్కానర్లు, ఎక్స్–రే పరికరాలు మొదలైనవి ఉంటాయని పేర్కొన్నారు. తమ సొల్యూషన్స్‌ని మరింత శక్తివంతం చేసేందుకు ఏఐ ఫీచర్లను కూడా చేరుస్తున్నట్లు వివరించారు.

40 మిలియన్ డాలర్ల సమీకరణలో కెల్టన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐ ఆధారిత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవల సంస్థ కెల్టన్ టెక్ సొల్యూషన్స్ 40 మిలియన్ డాలర్లు సమీకరించనుంది. ఇందుకోసం ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ)ని జారీ చేయనుంది. ఇటీవలే యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ గ్లోబల్ ప్రోగ్రాంలకు జనరేటివ్ ఏఐ ఆధారిత అప్లికేషన్స్‌ని రూపొందించేందుకు ఎంపికైనట్లు సంస్థ సీఈవో కరణ్‌జీత్ సింగ్ తెలిపారు. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న లిస్టెడ్ కంపెనీ కెల్టన్‌కి అమెరికా, యూరప్, ఆసియా–పసిఫిక్‌వ్యాప్తంగా కార్యకలాపాలు ఉన్నాయి. 1,800 మంది పైగా సిబ్బంది.. తయారీ, రిటైల్ తదితర రంగాల్లో క్లయింట్లు ఉన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-11-2025

విశాఖ	570–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585–00
విజయవాడ	575–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	570–00
వరంగల్	572–00
రిటైల్ ధర	6.30

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,810.00	2.3
BHARTIARTL	2,110.00	1.74
BAJFINANCE	1,054.70	1.11
M&M	3,584.30	1
HDFCLIFE	742.8	0.92

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	278.8	-3.19
ETERNAL	313.5	-2.82
ADANIENT	2,399.90	-2.72
TMPV	407	-2.4
HINDALCO	830.85	-1.93

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,881
ఎన్ఎస్ఈ	1,03,984
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,68,445
ఎఫ్ఐఐ	- 6,769
డీఐఐ	+ 7,068

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.75	$ 61.05
బ్రెంట్	64.56	$ 64.89

స్పెషాలిటీ స్టీల్‌కు మరో విడత ప్రోత్సాహకాలు

- పీఎల్ఐ 1.2 పథకం ప్రారంభం
- మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం

న్యూఢిల్లీ: స్పెషాలిటీ స్టీల్ తయారీలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో కేంద్ర సర్కారు మరో విడత ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)ను తీసుకొచ్చింది. దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, దిగుమతులను తగ్గించడం ఈ పథకం ఉద్దేశ్యం. 'పీఎల్ఐ 1.2' పథకాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రారంభించారు. ఈ పథకం కింద మొదటి రెండు విడతల్లో స్పెషాలిటీ స్టీల్ రంగంలోకి రూ.43,874 కోట్ల పెట్టుబడులకు హామీలను పొందినట్టు మంత్రి చెప్పారు. వీటి ద్వారా 14.3 మిలియన్ టన్నుల కొత్త స్పెషాలిటీ స్టీల్ తయారీ సామర్థ్యం దేశీయంగా ఏర్పాటవుతుందన్నారు. 2025 సెప్టెంబర్ నాటికి రూ.22,973 కోట్ల పెట్టుబడులు రాగా, 13,284 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్టు చెప్పారు. రక్షణ, ఏరోస్పేస్, ఇంధనం, ఆటోమొబైల్, ఇన్‌ఫ్రాలోకి వినియోగించే అధిక విలువ కలిగిన, ఉన్నత శ్రేణి స్టీల్ తయారీని ప్రోత్సహించేందుకు 2021 జూలైలో పీఎల్ఐ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి రెండు విడతల పీఎల్ఐ పథకానికి మంచి స్పందన లభించినట్టు చెప్పారు. అధిక శ్రేణి స్టీల్ తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మలిచేందుకు పీఎల్ఐ 1.2ను తీసుకొచ్చినట్టు వెల్లడించారు. సూపర్ అలాయ్స్, సీఆర్‌జీవో స్టీల్, స్టెయిన్‌లెస్ స్టీల్ లాంగ్, ఫ్లాట్ ఉత్పత్తులు, టైటానియం అలాయ్స్, కోటెడ్ స్టీల్ విభాగాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పథకం సాయపడుతుందన్నారు. ప్రస్తుత కంపెనీలతోపాటు కొత్త కంపెనీలకు పీఎల్ఐ 1.2 అవకాశాలు కల్పిస్తుందన్నారు. దేశ అవసరాలకే కాకుండా ప్రపంచ మార్కెట్లకు సరఫరా చేసేందుకు ఈ పథకాన్ని చేపట్టినట్టు మంత్రి కుమారస్వామి చెప్పారు.

చాట్‌జీపీటీ గో ఉచిత యాక్సెస్ అందుబాటులోకి

న్యూఢిల్లీ: భారతదేశవ్యాప్తంగా 'చాట్‌జీపీటీ గో'కి 12 నెలల పాటు ఉచిత యాక్సెస్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఓపెన్‌ఏఐ వెల్లడించింది. పరిమిత కాల ఆఫర్ కింద నవంబర్ 4 నుంచి భారత్‌లోని యూజర్లకు ఏడాది పాటు ఎలాంటి రుసుములు లేకుండా చాట్‌జీపీటీ గో ప్లాన్‌ను కంపెనీ ప్రవేశపెట్టింది. మరోవైపు, దీన్ని యాక్టివేట్ చేసుకోవడంలో సమస్యలు వస్తున్నట్లు పలువురు యూజర్లు మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యాక్టివేషన్ కాకుండా పదే పదే రూ. 1 చొప్పున యూపీఐ డెబిట్ అవుతుండటం, పేమెంట్ స్క్రీన్ మీద అప్లికేషన్లు నిల్చిపోవడం, చెల్లుబాటయ్యే యూపీఐ ఐడీలకు సంబంధించి కూడా ఎర్రర్‌లు వస్తుండటం మొదలైన సమస్యలు వీటిలో ఉన్నాయి. అటు, అనూహ్యమైనంత ట్రాఫిక్‌తో సిస్టమ్స్‌పై భారీగా భారడం వల్ల ఇలా జరిగిందంటూ కంపెనీ వివరణనిచ్చింది. ఓపెన్‌ఏఐ సూచనల ప్రకారం చాట్‌జీపీటీ గోని 12 నెలల పాటు ఉచితంగా పొందాలంటే ఫీజు ఏమీ లేకపోయినప్పటికీ, పేమెంట్ మెథడ్‌ని (క్రెడిట్ కార్డ్ లేదా యూపీఐ) యాడ్ చేయాలి. దీనితో ప్రతి బిల్లింగ్ సైకిల్‌కి నామమాత్రంగా రూ. 1 చొప్పున చార్జీ విధించే కంపెనీ, దాన్ని తక్షణం రీఫండ్ చేస్తుంది. ప్రమోషన్ వ్యవధి ముగిసిపోయిన తర్వాత ఆటోమేటిక్ బిల్లింగ్‌కి మారేందుకు ఇది ఉపయోగపడుతుంది. యూజర్లు వద్దనుకుంటే ఉచిత పీరియడ్ ముగిసేలోపే వైదొలగవచ్చు.

మాటిమాటికీ.. బ్రేక్‌డౌన్‌లేంటి..

ఎంసీఎక్స్‌లో సాంకేతిక లోపాలపై సెబీ చీఫ్ పాండే అసహనం

ముంబై: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో పదే పదే సాంకేతిక సమస్యలు వస్తుండటంపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే అసహనం వ్యక్తం చేశారు. తాజా సమస్యను అధ్యయనం చేసిన మీదట అవసరమైతే సెబీ స్వయంగా తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఇలాంటి విషయాల్లో సెబీ ప్రామాణికమైన ప్రోటోకాల్స్‌ను పాటిస్తుందని పాండే పేర్కొన్నారు. 'జూలైలో ఒకసారి సమస్య వచ్చింది. ఇదిగో ఇప్పుడు మరొకటి. ఇలా మాటిమాటికీ సమస్యలు వస్తుండటం సరికాదు' అని ఆయన చెప్పారు. డిజిటలీకరణ వేగవంతం అవుతున్న నేపథ్యంలో వ్యాపారాలకు అంతరాయాలు తలెత్తకుండా మార్కెట్ ఇంటర్మీడియరీలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, క్లయింట్ల డేటా..కీలకమైన మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లకుండా సైబర్ సెక్యూరిటీపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పాండే పేర్కొన్నారు. గత నెల ఎంసీఎక్స్‌లో పెద్ద స్థాయిలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ట్రేడింగ్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే.

ఎన్‌సీఎల్‌ఏటీలో వాట్సాప్‌కి పాక్షిక ఊరట

న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌ఏటీ) మెసేజింగ్ యాప్ వాట్సాప్‌నకు పాక్షిక ఊరట లభించింది. అడ్వర్టైజింగ్ అవసరాల కోసం మాతృ సంస్థ మెటా ప్లాట్‌ఫాంనకు అయిదేళ్ల పాటు డేటా పంచుకోరాదంటూ సీసీఐ ఇచ్చిన ఆదేశాలను ఎన్‌సీఎల్‌ఏటీ పక్కన పెట్టింది. అయితే, కంపెనీపై విధించిన రూ. 213 కోట్ల పెనాల్టీని సమర్థించింది. వైదొలిగేందుకు సరైన ఆప్షన్ ఇవ్వకుండా వాట్సాప్‌ను వాడాలంటే విస్తృతమైన డేటాను చేసుకోవాల్సి ఉంటుందంటూ యూజర్లపై ఒత్తిడి తేవడం సరి కాదని ఎన్‌సీఎల్‌ఏటీ వివరించింది. ఎన్‌సీఎల్‌ఏటీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వాట్సాప్ మాతృ సంస్థ మెటా తెలిపింది. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీ అప్‌డేట్ వల్ల ప్రజల వ్యక్తిగత మెసేజీల గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని పేర్కొంది.

వైట్ కాలర్ జాబ్స్ తగ్గాయ్

- అక్టోబర్‌లో 9 శాతం తక్కువగా నమోదు
- విద్య, ఫైనాన్స్, బీపీవోలో సానుకూలం
- ఏఐ, ఎంఎల్ నిపుణులకు భారీ డిమాండ్
- నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ వెల్లడి



ముంబై: కార్యాలయ ఉద్యోగ నియామకాలు (వైట్ కాలర్) అక్టోబర్ నెలలో తగ్గుముఖం పట్టాయి. క్రితం ఏడాది ఇదే నెలలో నియామకాలతో పోల్చి చూస్తే 9 శాతం తగ్గినట్టు నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది. దసరా – దీపావళి పండుగ సెలవులు నియామకాలపై ప్రభావం చూపించినట్టు తెలిపింది. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు, నియామక సంస్థల శోధన ఫలితాల ఆధారంగా 'నౌకరీ డాట్ కామ్' ప్రతి నెలా జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదికను విడుదల చేస్తుంటుంది.

- అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, విద్య, బీపీవో/ఐటీఈఎస్ రంగాల్లో నియామకాలు సానుకూల వృద్ధిని చూశాయి. అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్‌లో 15 శాతం పెరగ్గా.. విద్యా రంగంలో 13 శాతం, బీపీవో/ఐటీఈఎస్‌లో 6 శాతం చొప్పున అధికంగా నియామకాలు జరిగాయి.
- విద్యా నియామకాల పరంగా హైదరాబాద్‌లో అత్యధికంగా 47 శాతం వృద్ధి కనిపించింది. ఆ తర్వాత చెన్నైలో 34 శాతం, బెంగళూరులో 31 శాతం చొప్పున పెరిగాయి.
- కృత్రిమ మేథ(ఏఐ) మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) నిపుణులకు డిమాండ్ క్రమంగా పెరుగుతూనే ఉంది. అక్టోబర్‌లో వీటికి సంబంధించి నియామకాలు 33 శాతం పెరిగాయి. ముఖ్యంగా మెషిన్ లెర్నింగ్ నియామకాలు వరకే చూస్తే 139 శాతం వృద్ధి కనిపించింది. వివిధ రంగాల్లో పెరుగుతున్న ఏఐ నిపుణుల అవసరాలను ఇది తెలియజేస్తోంది.
- ఐటీ రంగంలో 15 శాతం, బ్యాంకింగ్‌లో 24 శాతం చొప్పున అక్టోబర్‌లో నియామకాలు తగ్గాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో బ్లాక్‌చైన్, క్రిప్టోకరెన్సీ వంటి టెక్నాలజీలపై పనిచేసే కంపెనీల్లో నియామకాలు 60 శాతం అధికంగా నమోదయ్యాయి.
- సెర్చ్ ఇంజనీర్లకు 62 శాతం డిమాండ్ అధికంగా కనిపించింది. మెడికల్ బిల్లర్/కోడర్‌కు 41 శాతం, ట్రాన్సిషన్ మేనేజర్లకు 35 శాతం, తయారీ ఇంజనీర్లకు 32 శాతం చొప్పున డిమాండ్ నెలకొంది.

క్యూ2 ఫలితాలు

ఏఈఎల్ లాభం హైజంప్ | రూ. 3,199 కోట్లు

- రైట్స్ ఇష్యూకి బోర్డు ఓకే
- రూ. 25,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఈఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 84 శాతం జంప్‌చేసి రూ. 3,199 కోట్లను తాకింది. అనుకోని లాభాలు ఇందుకు సహకరించాయి. ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్(అదానీ విల్మర్)లో మైనారిటీ వాటా విక్రయం ద్వారా రూ. 2,456 కోట్లు అందుకుంది. అంబుజాతో అదానీ సిమెంటేషన్ విలీనం ద్వారా మరో రూ. 615 కోట్లు జమయ్యింది. అయితే వీటిని మినహాయిస్తే కోల్ ట్రేడింగ్ విభాగం నీరసించడంతో లాభాలు ప్రభావితమయ్యాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 1,742 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 23,196 కోట్ల నుంచి రూ. 21,844 కోట్లకు నీరసించింది. దీనిలో కోల్ ట్రేడింగ్ ఆదాయం 29 శాతం క్షీణించి రూ. 6,843 కోట్లకు పరిమితమైంది. కాగా.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ. 25,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. విమానాశ్రయాలు, శుద్ధ ఇంధన ప్రాజెక్టులతోపాటు మౌలిక రంగ పోర్ట్‌ఫోలియో భారీ విస్తరణకు రైట్స్ నిధులు వెచ్చించనుంది. వెరసి కంపెనీ చరిత్రలోనే అత్యధికస్థాయిలో నిధుల సమీకరణకు తెరతీయనుంది. అయితే ఇంతక్రితం 2023లో రూ. 20,000 కోట్లు సమీకరించినప్పటికీ యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల నేపథ్యంలో ఎఫ్‌పీవోను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2% నష్టంతో రూ. 2,419 వద్ద ముగిసింది.

అదానీ పోర్ట్స్ లాభం జూమ్ | రూ. 3,120 కోట్లు

న్యూఢిల్లీ: మౌలిక రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 3,120 కోట్లను తాకింది. లాజిస్టిక్స్, మెరైన్, అంతర్జాతీయ కార్యకలాపాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,413 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,372 కోట్ల నుంచి రూ. 10,004 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 4,433 కోట్ల నుంచి రూ. 6,104 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 27 శాతం పుంజుకుని రూ. 5,550 కోట్లను తాకింది. 50 ఎంటీపీఏ సామర్థ్యంగల ఆస్ట్రేలియాలోని ఎన్‌క్యూఎక్స్‌టీ పోర్ట్ టెర్మినల్‌ను కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతించినట్లు అదానీ పోర్ట్స్ వెల్లడించింది. నేచురల్ డీప్‌వాటర్, మల్టీయూజర్ ఎక్స్‌పోర్ట్ టెర్మినల్ ఇది. ఈ కాలంలో కొత్తగా 9 మెరైన్ వెస్సల్స్‌ను కొనుగోలు చేసింది. దీంతో మొత్తం వెస్సల్స్ సంఖ్య 127కు చేరింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో రూ. 6,462 కోట్ల పెట్టుబడులు వెచ్చించినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు బీఎస్ఈలో దాదాపు యథాతథంగా రూ. 1,444 వద్ద ముగిసింది.

నిరాశ పరిచిన ఇండియన్ హోటల్స్ | 45 శాతం తగ్గిన లాభం



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.318 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.583 కోట్లతో పోల్చి చూస్తే 45 శాతం తగ్గింది. ఇదే కాలంలో ఆదాయం మాత్రం రూ.1,826 కోట్ల నుంచి రూ.2,041 కోట్లకు వృద్ధి చెందింది. ముఖ్యంగా వ్యయాలు రూ.1,502 కోట్ల నుంచి రూ.1,672 కోట్లకు పెరిగిపోయాయి. తాజ్ బ్రాండ్‌తోపాటు మరెన్నో బ్రాండ్లపై ఐహెచ్‌సీఎల్ హోటళ్లను నిర్వహిస్తుండడం గమనార్హం. కొత్తగా 26 హోటళ్లను ప్రారంభించామని, దేశవ్యాప్తంగా నిర్వహణలోని హోటళ్ల సంఖ్య 250ను అధిగమించినట్టు, నిర్వహణ గదులు 25,000కు చేరినట్టు ఐహెచ్‌సీఎల్ ఎండీ, సీఈవో పునీత్ ఛత్వాల్ తెలిపారు. క్లార్క్స్ గ్రూప్‌తో భాగస్వామ్యం ద్వారా 14 హోటళ్లు తమ విక్రయ, పంపిణీ నెట్‌వర్క్ కిందకు వచ్చినట్టు చెప్పారు. అర శాతం నష్టంతో బీఎస్ఈలో కంపెనీ షేరు రూ.763 వద్ద ముగిసింది.

ఇండిగోకు భారీ నష్టాలు | రూ. 2,582 కోట్లు

న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్ విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలు భారీగా పెరిగి రూ. 2,582 కోట్లను తాకాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 987 కోట్ల నష్టం ప్రకటించింది. ప్రధానంగా ఫారెక్స్ నష్టాలు(డాలరు ఆధారిత ఫ్యూచర్ ఆబ్లిగేషన్స్), పెరిగిన వ్యయాలు ప్రతికూల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. వీటిని మినహాయిస్తే రూ. 104 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 17,759 కోట్ల నుంచి రూ. 19,600 కోట్లకు జంప్ చేసింది. దీనిలో ప్రయాణికుల టికెట్ల ఆదాయం 11 శాతం వృద్ధితో రూ. 15,967 కోట్లకు చేరింది. అద్దెలు, విమాన రిపేర్లు, నిర్వహణ వ్యయాలు 19 శాతం పెరిగి రూ. 3,263 కోట్లను తాకాయి. విదేశీ మారక నష్టాలు రూ. 2,892 కోట్లుగా నమోదయ్యాయి. వెరసి మొత్తం వ్యయాలు 18 శాతంపైగా పెరిగి రూ. 22,081 కోట్లను తాకాయి. కాగా.. డిసెంబర్‌లో తొలిసారి లాంగ్ రేంజ్ ఎయిర్‌బస్ ఏ321ను ప్రవేశపెట్టే వీలున్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్ఈలో 1% నీరసించి రూ. 5,635 వద్ద ముగిసింది.

బెర్జర్ పెయింట్స్ మిశ్రమ పనితీరు | లాభం 23 శాతం డౌన్

న్యూఢిల్లీ: బెర్జర్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో (క్యూ2) మిశ్రమ పనితీరు చూపించింది. లాభం 23 శాతానికి పైగా తగ్గగా, ఆదాయం రెండు శాతం వృద్ధి చెందింది. రూ.2,827 కోట్ల ఆదాయానికి, రూ.206 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఆదాయం రూ.2,774 కోట్లు, లాభం రూ.267 కోట్ల చొప్పున ఉన్నాయి. ఎక్స్‌టీరియర్ ఉత్పత్తుల అమ్మకాలు మెరుగ్గా లేకపోవడం, బ్రాండ్ నిర్మాణంపై అధిక పెట్టుబడులు వెచ్చించడం లాభాల క్షీణతకు దారితీసినట్టు సంస్థ ఎండీ, సీఈవో అభిజిత్ రాయ్ తెలిపారు. వర్షాకాలం సీజన్ ఎక్కువ రోజుల పాటు కొనసాగడం అమ్మకాలపై ప్రభావం చూపించినట్టు చెప్పారు. అయినప్పటికీ ఆదాయంలో సానుకూల వృద్ధిని సాధించినట్టు చెప్పారు. కంపెనీ వ్యయాలు 6% ఎగసి రూ.2,589 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు ధర స్వల్ప పెరుగుదలతో రూ.537 వద్ద ముగిసింది.

సుజ్లాన్ లాభం జూమ్ | ఆరు రెట్లు అధికం

న్యూఢిల్లీ: సుజ్లాన్ ఎనర్జీ సెప్టెంబర్ త్రైమాసికంలో బలమైన పనితీరు సాధించింది. లాభం ఆరు రెట్లు పెరిగి రూ.1,279 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.200 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం ఇదే కాలంలో రూ.2,121 కోట్ల నుంచి రూ.3,897 కోట్లకు వృద్ధి చెందింది. మా వద్ద 6.2 గిగావాట్ల ఆర్డర్‌బుక్ ఉంది. ప్రాజెక్టు నిర్వహణ, అభివృద్ధిని వేరు చేయడం ద్వారా అమ్మకాలను గణనీయంగా పెంచుకోగలం''అని సుజ్లాన్ గ్రూప్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి తెలిపారు. దేశ పవన విద్యుత్ మార్కెట్‌లో 2025–26లో 6 గిగావాట్ల ఇన్‌స్టలేషన్లు, 2026–27లో 8 గిగావాట్ల ఇన్‌స్టలేషన్లు ఉండనున్నట్టు సుజ్లాన్ గ్రూప్ సీఈవో జేపీ చలసాని తెలిపారు. స్థిరమైన, లాభదాయక వృద్ధిని కొనసాగిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీఎస్ఈలో సుజ్లాన్ షేరు ధర ఒకటిన్నర శాతం లాభంతో రూ.60 వద్ద ముగిసింది.

హర్మన్‌ప్రీత్‌కు చోటు లేదు

- ఐసీసీ వరల్డ్ కప్ టీమ్ ప్రకటన
- కెప్టెన్‌గా లారా వోల్‌వార్ట్

దుబాయ్: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ప్రదర్శనను బట్టి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'ను ప్రకటించింది. ఫైనల్ మ్యాచ్ ఆడిన భారత్, దక్షిణాఫ్రికా జట్ల నుంచి కలిపి ఆరుగురికి ఈ టీమ్‌లో చోటు లభించింది. టీమ్‌కు కెప్టెన్‌గా లారా వోల్‌వార్ట్ (దక్షిణాఫ్రికా)ను ఎంపిక చేశారు. సారథిగా హర్మన్‌ప్రీత్ కౌర్ టీమిండియాను విజేతగా నిలిపినా... కెప్టెన్సీతో పాటు బ్యాటింగ్‌లోనూ చెలరేగి 571 పరుగులు కూడా చేసిన వోల్‌వార్ట్‌కు ఐసీసీ ఓటు వేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' దీప్తి శర్మ, 434 పరుగులు చేసిన స్మృతి, సెమీస్‌లో చెలరేగిన జెమీమాలకు భారత్ నుంచి ఈ టీమ్‌లో అవకాశం దక్కింది. జట్టులోని స్థానాల ప్రకారం ఎంపిక చేసిన 12 మంది సభ్యుల ఈ టీమ్‌లో ముగ్గురు ఆస్ట్రేలియానుంచి, ఇద్దరు ఇంగ్లండ్ నుంచి ఉండగా, ఒక పాకిస్తాన్ ప్లేయర్‌ను కూడా ఎంపిక చేశారు.

ఐసీసీ జట్టు వివరాలు: 1. లారా వోల్‌వార్ట్ (కెప్టెన్–దక్షిణాఫ్రికా), 2. స్మృతి మంధాన (భారత్), 3. జెమీమా రోడ్రిగ్స్ (భారత్), 4. మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా), 5. యాష్లీ గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), 6. దీప్తి శర్మ (భారత్), 7. అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా), 8. నదైన్ డిక్లెర్క్ (దక్షిణాఫ్రికా), 9. సిద్రా నవాజ్ (వికెట్ కీపర్–పాకిస్తాన్), 10. అలానా కింగ్ (ఆస్ట్రేలియా), 11. సోఫీ ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), 12. నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్).

బిగ్‌బాష్ లీగ్‌కు అశ్విన్ దూరం



చెన్నై: భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్) బరిలోకి ఇప్పుడప్పుడే దిగే అవకాశం లేదు. ఈ స్పిన్నర్ ఎంతో ఉత్సాహంగా ఆడేందుకు సిద్ధమవుతుండగా ఊహించని గాయం అతన్ని వెనక్కి లాగుతోంది. సిడ్నీ థండర్ తరఫున ఆడేందుకు ఒప్పందం కూడా కుదుర్చుకున్నాడు. అయితే చెన్నైలో ప్రాక్టీస్ చేస్తుండగా అతని మోకాలుకు గాయమైంది. ఈ గాయం అశ్విన్‌ను బాగా ఇబ్బంది పెడుతోంది. ఇది మానేందుకు చాలా సమయం పట్టడంతో బీబీఎల్ 15వ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని తనే ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. బిగ్‌బాష్ సీజన్ కోసం సిరీయస్‌గా సన్నద్ధమవుతుండగా ఇలా జరగడం, టోర్నీ మొత్తానికి దూరమవడం బాధగా ఉందని పేర్కొన్నాడు. బీబీఎల్ టి20 మ్యాచ్‌లు వచ్చే నెల 14 నుంచి జరుగనున్నాయి. గాయం కారణంగా ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగే 'హాంకాంగ్ సిక్సస్' టోర్నీలో సైతం అతను బరిలోకి దిగడం లేదు. అతని స్థానంలో రాబిన్ ఉతప్పను తీసుకున్నారు.

అర్జున్ శుభారంభం

- రెండో రౌండ్ తొలి గేమ్‌లో పెట్రోవ్ మార్టిన్‌పై గెలుపు
- గుకేశ్, ప్రజ్ఞానంద, హరికృష్ణ గేమ్‌లు 'డ్రా'

పనాజీ: టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన భారత నంబర్‌వన్, ప్రపంచ ఆరో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ ప్రపంచకప్ చెస్ టోర్నీలో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ ఆడుతున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తొలి గేమ్‌లో గెలుపొందాడు. బల్గేరియా గ్రాండ్‌మాస్టర్ పెట్రోవ్ మార్టిన్‌తో మంగళవారం జరిగిన తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడుతూ అర్జున్ 37 ఎత్తుల్లో విజయం సాధించాడు. పెట్రోవ్‌తో నేడు జరిగే రెండో గేమ్‌ను అర్జున్ 'డ్రా' చేసుకుంటే మూడో రౌండ్‌కు అర్హత సాధిస్తాడు. భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, దీప్తాయన్ ఘోష్, విదిత్ సంతోష్ గుజరాతి, కార్తీక్ వెంకటరామన్, అరవింద్ చిదంబరం, నిహాల్ సరీన్, ఇనియన్, కార్తికేయన్ మురళీ, ఎస్‌ఎల్ నారాయణన్, ప్రాణేశ్, రౌనక్ సాధ్వాని తమ ప్రత్యర్థులతో జరిగిన రెండో రౌండ్‌లోని తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్నారు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ప్రణవ్ తన ప్రత్యర్థి టారీ ఆర్యన్ (నార్వే)పై 41 ఎత్తుల్లో గెలుపొందగా... సూర్యశేఖర గంగూలీ (భారత్) 37 ఎత్తుల్లో మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) చేతిలో, అరోణ్యక్ ఘోష్ (భారత్) 30 ఎత్తుల్లో లెవోన్ అరోనియన్ (అమెరికా) చేతిలో ఓడిపోయారు.

గుకేశ్–నొగెర్‌బెక్ కాజీబెక్ (కజకిస్తాన్) గేమ్ 84 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద–తెముర్ కుయ్‌బోకరోవ్ (ఆస్ట్రేలియా) గేమ్ 60 ఎత్తుల్లో... దీప్తాయన్ ఘోష్–నెపోమ్‌నిషి (రష్యా) గేమ్ 30 ఎత్తుల్లో... విదిత్–ఓరో ఫాస్టినో (అర్జెంటీనా) గేమ్ 28 ఎత్తుల్లో... కార్తీక్ వెంకటరామన్–అరవింద్ గేమ్ 55 ఎత్తుల్లో... నిహాల్ సరీన్–స్టామాటిస్ (గ్రీస్) గేమ్ 90 ఎత్తుల్లో... పెంటేల హరికృష్ణ–అర్సెని నెస్తోరోవ్ (రష్యా) గేమ్ 30 ఎత్తుల్లో... ఇనియన్–నుగుయెన్ థాయ్ డాయ్ వాన్ (చెక్ రిపబ్లిక్) గేమ్ 45 ఎత్తుల్లో... కార్తికేయన్ మురళీ–ఇదానీ (ఇరాన్) గేమ్ 76 ఎత్తుల్లో... నారాయణన్–వితియుగోవ్ (ఇంగ్లండ్) గేమ్ 57 ఎత్తుల్లో... ప్రాణేశ్–దిమిత్రిజ్ కొలార్స్ (జర్మనీ) గేమ్ 34 ఎత్తుల్లో... రౌనక్–రాబర్ట్ హోవ్‌నాసియన్ (అర్మేనియా) గేమ్ 67 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.

నయా నంబర్‌వన్ వోల్‌వార్ట్

- 'టాప్' ర్యాంక్ కోల్పోయిన స్మృతి
- ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: భారత వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టాప్ ర్యాంక్ చేజారింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆమె నంబర్‌వన్ నుంచి రెండో స్థానానికి పడిపోయింది. అలాగని ఆమె ఆటతీరు పేలవంగా ఏమీ లేదు. కానీ దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్‌వార్ట్ సూపర్ ఫామ్ వల్లే స్మృతి ర్యాంక్‌లో మార్పు వచ్చింది. భారత మహిళల జట్టు ఈ ఆదివారం గెలిచిన వన్డే ప్రపంచకప్‌లో సఫారీ కెప్టెన్ వోల్‌వార్ట్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. సెమీఫైనల్, ఫైనల్లో వరుస సెంచరీలు సహా టోర్నీ అసాంతం రాణించిన ఆమె 571 పరుగులు చేసింది. మహిళల మెగా ఈవెంట్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. దీంతో సఫారీ కెప్టెన్ మూడు నుంచి టాప్ ర్యాంక్‌కు దూసుకొచ్చింది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో అజేయ శతకంతో భారత్‌ను టైటిల్ పోరులో నిలిపిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ టాప్–10లోకి ఎగబాకింది. ఆమె ఏకంగా 9 స్థానాలు మెరుగుపర్చుకొని పదో ర్యాంక్‌కు చేరింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాలుగు స్థానాలు ఎగబాకి 14వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన దీప్తి శర్మ మూడు నుంచి నాలుగో ర్యాంక్‌కు చేరింది.

భారత 'ఎ' జట్టు కెప్టెన్‌గా జితేశ్ శర్మ

న్యూఢిల్లీ: రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. విదర్భకు చెందిన జితేశ్ శర్మ భారత 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రంజీ ప్లేయర్ షేక్ రషీద్ స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు. దోహాలో ఈనెల 14 నుంచి 23 వరకు జరిగే ఈ టోర్నీలో భారత్, ఒమన్, యూఈఏ, పాకిస్తాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్, అఫ్గానిస్తాన్, శ్రీలంక 'ఎ' జట్లు పాల్గొంటాయి.

భారత 'ఎ' జట్టు: జితేశ్ శర్మ (కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, నేహల్ వధేరా, నమన్ ధీర్, సూర్యాంశ్ షెడ్గే, రమణ్‌దీప్ సింగ్, హర్ష్ దూబే, అశుతోష్ శర్మ, యశ్ ఠాకూర్, గుర్‌జప్‌నీత్ సింగ్, విజయ్ కుమార్ వైశాఖ్, యుధ్‌వీర్ సింగ్, అభిషేక్ పొరెల్, సుయశ్ శర్మ. స్టాండ్‌బై: గుర్నూర్ సింగ్ బ్రార్, కుమార్ కుశాగ్ర, తనుశ్ కొటియాన్, సమీర్ రిజ్వీ, షేక్ రషీద్.

భారీ విజయంతో కర్ణాటక బోణీ

తిప్పేసిన మోసిన్ ఖాన్

- రెండో ఇన్నింగ్స్‌లో 184 పరుగులకే కేరళ ఆలౌట్
- రంజీ ట్రోఫీ రౌండప్

తిరువనంతపురం: స్పిన్నర్ మోసిన్ ఖాన్ (6/29) తిప్పేయడంతో రంజీ ట్రోఫీలో కర్ణాటక భారీ విజయం సాధించింది. కేరళ సొంతగడ్డపై జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో కర్నాటక ఇన్నింగ్స్ 164 పరుగుల తేడాతో కేరళపై ఘనవిజయం సాధించింది. ఈ సీజన్‌లో కర్ణాటక జట్టుకిది తొలి గెలుపు. సౌరాష్ట్ర, గోవాలతో జరిగిన గత రెండు మ్యాచ్‌లు కూడా 'డ్రా'గానే ముగిశాయి. డబుల్ సెంచరీతో భారీస్కోరుకు బాట వేసిన కర్ణాటక బ్యాటర్ కరుణ్ నాయర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మంగళవారం 10/0 ఓవర్ నైట్ స్కోరుతో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కేరళ... సొంతగడ్డపై కనీసం 200 పరుగులైనా చేయలేకపోయింది. ఫాలోఆన్ ఆడిన కేరళ 79.3 ఓవర్లలో 184 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ కృష్ణప్రసాద్ (33; 5 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడాడు. మిగతా టాపార్డర్ బ్యాటర్లు నిధీశ్ (9), అక్షయ్ చంద్రన్ (0)లను పేసర్ విద్వత్ కావేరప్ప వరుస బంతుల్లో అవుట్ చేయడంతోనే కేరళ పతనం మొదలైంది. కెప్టెన్ అజహరుద్దీన్ (15)ను శిఖర్ పెవిలియన్ చేర్చగా మిగతా బ్యాటర్లకు మోసిన్ స్పిన్ ఉచ్చు బిగించడంతో కేరళ క్రమం తప్పకుండా వికెట్లను కోల్పోయింది. నిజానికి 140 పరుగులకే 9 వికెట్లను కోల్పోయిన కేరళ 150 పరుగుల్లోపే ఆలౌట్ ఖాయమనిపించింది. అయితే ఆఖరి వరుస బ్యాటర్ ఇడెన్ ఆపిల్ టామ్ (68 బంతుల్లో 39 నాటౌట్; 7 ఫోర్లు) చేసిన పోరాటంతో కర్ణాటక విజయం కాస్త ఆలస్యమైంది. మిగతా మ్యాచ్‌ల్లో గ్రూప్ 'ఎ'లో జార్ఖండ్ ఇన్నింగ్స్ 196 పరుగుల తేడాతో నాగాలాండ్‌పై జయభేరి మోగించింది. వడోదరలో వర్షం వల్ల బరోడా, ఉత్తర ప్రదేశ్ మ్యాచ్‌లో అసలు టాస్ కూడా పడలేదు. మ్యాచ్ పూర్తిగా వర్షార్పణమైంది. 'బి'లో సౌరాష్ట్ర–మహారాష్ట్ర, పంజాబ్–గోవా, మధ్యప్రదేశ్–చండీగఢ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

మోసిన్ ఖాన్

విహారి, మురాసింగ్‌ల పోరాటంతో...

అగర్తలా: హనుమ విహారి (253 బంతుల్లో 141; 19 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ మణిశంకర్ మురాసింగ్ (130 బంతుల్లో 102 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు)ల పోరాటంతో త్రిపుర డ్రాతో గట్టెక్కడమే కాదు... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కూడా సంపాదించింది. దీంతో గ్రూప్ 'సి'లో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో త్రిపుర కీలకమైన 3 పాయింట్లను ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 273/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన త్రిపుర 103.2 ఓవర్లలో 385 పరుగుల వద్ద ఆలౌటైంది. తద్వారా బెంగాల్ (336)పై తొలి ఇన్నింగ్స్‌లో 49 పరుగులు ఆధిక్యం లభించింది. మూడో రోజే విహారి శతక్కొట్టగా, ఆఖరి రోజు మురాసింగ్ వన్డేను తలపించే విధంగా ధాటిగా ఆడి సెంచరీ సాధించాడు. ఇద్దరు ఎనిమిదో వికెట్‌కు 116 పరుగులు జోడించారు. విహారి అవుటయ్యాక టెయిలెండర్ రాణా దత్త (27; 4 ఫోర్లు) కూడా మురాసింగ్‌కు అండగా నిలిచాడు. బెంగాల్ బౌలర్లలో భారత వెటరన్ సీమర్ షమీకి ఒక్క వికెట్ కూడా దక్కలేదు. కైఫ్ 4, ఇషాన్ పొరెల్ 3 వికెట్లు తీశారు. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన బెంగాల్ 25 ఓవర్లలో 3 వికెట్లకు 90 పరుగులు చేసింది. షహబాజ్ అహ్మద్ (51 నాటౌట్) అర్ధసెంచరీ సాధించాడు.

శ్రమించి గెలిచిన హరియాణా

అహ్మదాబాద్: గ్రూప్ 'సి'లో గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో సులువైన 62 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు కూడా హరియాణా తెగ కష్టపడింది. చివరకు 6 వికెట్లు కోల్పోయి ఈ ఆరు పదుల లక్ష్యాన్ని ఛేదించి గెలిచింది. మొత్తానికి గ్రూప్ 'సి'లోనే కాదు... ఈ సీజన్‌లోనే అన్ని గ్రూపుల్లో ఆడిన మూడు మ్యాచ్‌లు గెలిచిన ఏకైక జట్టుగా హరియాణా 'హ్యాట్రిక్' విజయాలు సాధించింది. మంగళవారం 113/8 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 60.4 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌటైంది. ఇంకో 24 పరుగులు చేసి మిగిలిన 2 వికెట్లు కోల్పోయింది. రవి బిష్ణోయ్ (2)ని పార్థవత్స (2/38), క్షితిజ్ పటేల్ (37; 2 ఫోర్లు)ను నిఖిల్ కశ్యప్ (4/59) అవుట్ చేయడంతో ఇన్నింగ్స్ ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగుల ఆధిక్యం పొందిన హరియాణా ముందు కేవలం 62 పరుగుల లక్ష్యమే ఉంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా టాప్–6 బ్యాటర్లు లక్ష్యయ్ (1), అంకిత్ (1), శాండిల్యా (3), నిశాంత్ (13), అమన్ (3), ధీరు సింగ్ (13)లను గుజరాత్ బౌలింగ్ త్రయం విశాల్ (3/23), సిద్ధార్థ్ దేశాయ్ (2/25), బిష్ణోయ్ (1/13) మూకుమ్మడిగా అవుట్ చేయడంతో 43 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. పార్థ్ వత్స (14 నాటౌట్), యశ్‌వర్ధన్ (13 నాటౌట్) అజేయంగా నిలువడంతో హరియాణా 4 వికెట్ల తేడాతో గెలిచి నిట్టూర్చింది. ఇదే గ్రూప్ 'సి'లో జరిగిన మ్యాచ్‌లో బౌలర్ల అద్భుత ప్రతిభతో ఉత్తరాఖండ్ 17 పరుగుల తేడాతో సర్వీసెస్‌పై గెలుపొందింది. 123 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఆఖరి రోజు 71/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సర్వీసెస్ 48.4 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. 34 పరుగులు మాత్రమే చేసి మిగతా సగం (5) వికెట్లను కోల్పోయింది. మయాంక్ మిశ్రా (5/45), సుచిత్ (2/12), అవనీశ్ (2/27) సర్వీసెస్ బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు.

త్వరలో తెలుగు ప్రీమియర్ లీగ్

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో 60 వేదికల్లో 600 జట్లతో తెలుగు ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) క్రికెట్ టోర్నీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ లీగ్‌కు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. టీపీఎల్ నిర్వాహకులైన జూపర్ ఎల్ఈడీ సంస్థ ప్రతినిధులు మంగళవారం మంత్రిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి లీగ్ విశేషాలను వివరించారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా క్రమశిక్షణ గల క్రీడాకారులుగా, బాధ్యయుత పౌరుడిగా తయారు చేసే శక్తి క్రీడలకు ఉందని శ్రీహరి అన్నారు. క్రికెట్‌తో పాటు ఏదో ఒక క్రీడలో యువత రాణించాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ కూడా అలవడుతుందని చెప్పారు. 'సే నో టూ' డ్రగ్స్ ప్రచారాన్ని యువతలోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ టీపీఎల్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం లీగ్ నిర్వాహక సంస్థ జూపర్ ఎల్ఈడీ డైరెక్టర్ ఒ.రమేశ్ మాట్లాడుతూ తమ సీఎస్ఆర్ నిధులతో ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ లీగ్‌ను కేవలం వినోదం కోసం నిర్వహించకుండా సమాజంలో ఆరోగ్య భద్రత, ఫిట్‌నెస్, క్రీడలపై అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 80 లక్షలు అని ఆయన చెప్పారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి

పాకిస్తాన్‌దే తొలి వన్డే

- రెండు వికెట్లతో దక్షిణాఫ్రికాపై విజయ
- రాణించిన సల్మాన్, రిజ్వాన్

ఫైసలాబాద్: కొత్త వన్డే కెప్టెన్ షాహిన్ అఫ్రిది నేతృత్వంలో పాకిస్తాన్ శుభారంభం చేసింది. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో పాక్ రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు క్వింటన్ డి కాక్ (71 బంతుల్లో 63; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), డ్రి ప్రిటోరియస్ (60 బంతుల్లో 57; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు చేయగా, కార్బిన్ బాష్ (41) రాణించాడు. పాక్ బౌలర్లలో నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 8 వికెట్లకు 264 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సల్మాన్ ఆగా (71 బంతుల్లో 62; 5 ఫోర్లు, 1 సిక్స్), మొహమ్మద్ రిజ్వాన్ (74 బంతుల్లో 55; 6 ఫోర్లు) హాఫ్ సెంచరీలు నమోదు చేయగా...ఫఖర్ జమాన్ (45), సయీమ్ అయూబ్ (39) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లగా...రెండో వన్డే రేపు ఇదే మైదానంలో జరుగుతుంది.

సల్మాన్, రిజ్వాన్

అంతరిక్షంలో వేడివేడి చికెన్

సొంత అంతరిక్ష కేంద్రంలో పొగరాని ఓవెన్‌ను పరీక్షించిన చైనా

చికెన్, మటన్‌ను రుచిచూసిన చైనా వ్యోమగాములు

న్యూయార్క్: అంతరిక్ష కేంద్రం. ఏ చిన్న పాటి నిప్పురవ్వ అంటుకున్నా రోదసీలోనే అంతా అంటుకుని అగ్నిగోళంగా మండి పోయే అత్యంత సున్నిత ప్రాంతం. అలాంటి అంతరిక్ష కేంద్రంలోనూ వేడివేడి చికెన్ వింగ్స్‌ను అది కూడా ఎలాంటి పొగరాని ప్రత్యేక ఓవెన్‌ను వండుకుని చైనా వ్యోమగాములు చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలోని ఓ ప్రైవేట్ స్పేస్‌స్టేషన్‌లో ఇలా ఓవెన్‌లో చికెన్‌ను వండుకుని తినడం ఇదే తొలిసారి. అసలు అంతరిక్ష కేంద్రంలో వంటచేయడం కూడా ఇదే ప్రప్రథమం. తాము అభివృద్ధిచేసిన స్పేస్ కిచెన్ సాంకేతికతను చైనా ఇలా విజయవంతంగా పరీక్షించింది. పరీక్షించడమేకాదు పనిలోపనిగా ఆ వేడివేడి చికెన్‌ను వ్యోమగాములంతా తిని భారరహిత స్థితిలో మాంసాహార వంటకంలోని మజాను ఆస్వాదించారు. ఇందుకు తియాంగాంగ్ స్పేస్‌స్టేషన్ వేదికైంది. కనీసం 500 సార్లు భూమి మీద విస్తృతస్థాయిలో పరీక్షించాక దానిని తియాంగాంగ్ స్పేస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

తాజాగా ఆహారం దిశగా పయనం

వ్యోమనౌక ద్వారా తీసుకొచ్చిన అతిశీతల ఆహార పదార్థాలకు మళ్లీ వేడి చేసి తినడానికి బదులుగా అప్పుడే వండిన వేడివేడి ఆహారం తినాలనే ఆశ నుంచి హాట్-ఎయిర్ ఓవెన్ ఆలోచన పుట్టుకొచ్చింది. ఓవెన్‌లో పెట్టే వస్తువులను పట్టి ఉంచే పట్టీ, వేడిచేసే మెష్, ఉడికించే ట్రే, సమంగా కాల్చే రోటేటింగ్ బుట్టలతో వినూత్న ఓవెన్‌ను తయారుచేశారు. ''ఓవెన్ గరిష్ట ఉష్ణోగ్రతను 100 డిగ్రీ సెల్సియస్ నుంచి 190 డిగ్రీ సెల్సియస్‌కు పెంచాం. దీంతో చికెన్, మటన్ వంటి పదార్థాలను అప్పటికప్పుడు వేడివేడిగా తినొచ్చు''అని చైనా శాస్త్రవేత్త, చైనా ఆస్ట్రోనాట్ రీసెర్చ్, ట్రైనింగ్ సెంటర్‌లో పరిశోధకుడు యువాన్ యోంగ్ చెప్పా రు. ఈ ఓవెన్‌ను ఇటీవల షెంజువాన్–21 వ్యోమనౌక ద్వారా భూమి నుంచి తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాజాగా దీనిని చికెన్, మటన్ ముక్కలను బేక్ చేసి పరీక్షించారు. చికెన్ వింగ్స్‌ను చైనా షెంజువాన్–21, షెంజువాన్–22ల వ్యోమ గాములు ఎంచక్కా ఆరగిస్తున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

పొగరాకుండా ఏర్పాట్లు

భారరహిత స్థితిలో పొగ కమ్మితే అది ఎప్పటికీ బయటకు పోదు. దాంతో వ్యోమగాముల ఆరోగ్యంపై అది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. వంటలను వండినప్పుడు పొగ వెలువడకుండా ఓవెన్‌లో ప్రత్యేక ఏర్పాటుచేశారు. బహుళ పొరల ఫిల్టర్‌లను దానిలో అమర్చారు. అత్యధిక వేడిమిని ఇచ్చే రసాయన చర్యలు, సాంకేతికత మేళవింపుతో ఓవెన్‌ను తయారుచేశారు. భారరహిత స్థితిలోనూ అది సవ్యంగా పనిచేయడం విశేషం. అంతరిక్ష కేంద్రంలోనూ వాడగల ప్రపంచంలోనే మొట్టమొదటి ఓవెన్ ఇదేనని ఆస్ట్రోనాట్స్ సిస్టమ్‌లో డెప్యూటీ చీఫ్ డిజైనర్ లూ వీబో చెప్పారు. మొక్కజొన్న పొత్తులు వేయించుకునేందుకూ ఇందులో ఏర్పాటు ఉంది. కేక్ సైతం తయారుచేసుకోవచ్చు. తియాంగాంగ్ స్పేస్‌స్టేషన్‌లో ఉన్నప్పుడు ఏదైనా చైనా జాతీయ ప్రత్యేక దినోత్సవాలు వచ్చినప్పుడు వేడుకల్లో భాగంగా ఈ వంటకాలను ఇందులో తయారుచేయొచ్చు. దీర్ఘకాల అంతరిక్ష ప్రాజెక్టుల్లో వ్యోమగాములకు రుచికరమైన ఆహారం అందించే లక్ష్యంతో ఈ ఓవెన్‌ను తయారుచేసినట్లు చైనా తెలిపింది. స్పేస్ బార్బెక్యూతో పసందైన వంటకాలను తినబోతున్నామని చైనా వ్యోమగాములు చెప్పారు. గతంలో రష్యా, అమెరికా, చైనా సంయుక్తంగా నిర్మించిన, ప్రస్తుతం విధుల్లో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చాక్లెట్‌చిప్ కుకీలను బేక్ చేసినా అందుకు చాలా సమయం పట్టింది. కానీ చైనా వ్యోమగాములు కేవలం 28 నిమిషాల్లోనే చికెన్ వింగ్స్‌ను సంపూర్ణంగా ఉడికించి శెభాష్ అనిపించుకున్నారు. మటన్ ముక్కలనూ బేక్ చేశారు.

కశ్మీర్‌లో బస్సు పల్టీ.. 28 మందికి గాయాలు

జమ్మూ: కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో మంగళవారం మినీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 28 మంది గాయపడ్డారు. వీరిలో అత్యధికులు విద్యార్థులేనని అధికారులు తెలిపారు. బస్సు రాజౌరీ పట్టణానికి వస్తూ తండికస్సి సమీపంలో డ్రైవర్ అదుపు కోల్పోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన సహాయక సిబ్బంది బస్సు నుంచి 28 మందిని వెలుపలికి తీశారు. వీరిలో 26 మంది రాజౌరీలోని ప్రభుత్వం వైద్య కళాశాల ఆస్పత్రికి వెళ్లే 26 మంది విద్యార్థులని అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని జమ్మూలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జార్ఖండ్‌లో బస్సులు ఢీ.. 24 మందికి గాయాలు

ధన్‌బాద్: జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 24 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా, నిలకడగా ఉందని అధికారులు మంగళవారం తెలిపారు. రాజ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చలిబంగ్లా ఫ్లై ఓవర్ సమీపంలో సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. జంతారా జిల్లాలోని నాలా, కుందిహి ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది భక్తులు బొకారోలో జరిగిన మత సంబంధ వేడుకకు బస్సులో వెళ్తుండగా వేగంగా ఎదురుగా వచ్చిన మరో బస్సు ఢీకొట్టిందన్నారు. క్షతగాత్రుల్ని షాహిద్ నిర్మల్ మహతో మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించామన్నారు. ప్రమాదం కారణంగా కోల్‌కతా– ఢిల్లీ మార్గంలో గ్రాండ్‌ట్రంక్ రోడ్డుపై రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

ఎన్‌కౌంటర్.. నలుగురు మిలిటెంట్లు హతం

ఇంఫాల్: మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌లో మంగళవారం ఉదయం భద్రతా బలగాలతో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో నిషేధిత సంస్థకు చెందిన నలుగురు మిలిటెంట్లు చనిపోయారు. యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీ(యూకేఎన్ఏ)కి చెందిన సాయుధులు సంచరిస్తున్నారన్న సమాచారంతో ఉదయం 5.30 గంటల వేళ బలగాలు హెంగ్‌లెప్‌లోని ఖన్పి గ్రామం సమీపంలో కూంబింగ్ చేపట్టారు. ఈ సమయంలో తారసపడిన సాయుధులు, జవాన్లపైకి కాల్పులకు దిగారు. దీంతో, ఇద్దరి మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో కనీసం నలుగురు మిలిటెంట్లు చనిపోగా, మిగతా వారు పరారయ్యారని అధికారులు తెలిపారు. ఇటీవల కేంద్రం కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందంపై యూకేఎన్ఏ విభాగం సంతకం చేయలేదని అధికారులు వివరించారు. నలుగురు మిలిటెంట్లు చనిపోయిన ఘటనను కుకీ పౌర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అంత్యక్రియలు జరిపే రోజున చురాచంద్‌పూర్ జిల్లాలో బంద్ పాటించాలని పిలుపునిచ్చాయి.

నేపాల్‌లో హిమపాతం.. 9 మంది మృతి

కఠ్మాండు: నేపాల్‌లో సంభవించిన రెండు వేర్వేరు హిమపాత ఘటనల్లో 9 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. గౌరీ శంకర్ పట్టణ సమీపంలోని 6,920 మీటర్ల ఎత్తయిన యలుంగ్ రి పర్వతం వద్ద సంభవించిన హిమపాతంలో ఏడుగురు పర్వతారోహకులు సజీవసమాధి అయ్యారు. వీరంతా సోమవారం పర్వతాన్ని అధిరోహించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను వెలికి తీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఇద్దరు నేపాలీ గైడ్లు కాగా, ఇటలీకి చెందిన ఇద్దరు, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ దేశస్తులు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారని వివరించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు నేపాలీలు, ఫ్రాన్స్‌కు చెందిన ఇద్దరిని హెలికాప్టర్‌లో కఠ్మాండులోని ఆస్పత్రికి తరలించామన్నారు. వీరితోపాటు మరో నలుగురు పర్వతారోహకులు స్వల్పంగా గాయపడ్డారన్నారు. మరో ఘటన..మనస్లు ప్రాంతంలోని 6,887 మీటర్ల ఎత్తయిన పంబరి శిఖరాన్ని అధిరోహించేందుకు వెళ్లిన ఇటలీ వాసులిద్దరు హిమపాతం కారణంగా 5,242 మీటర్ల ఎత్తులోని తమ టెంట్‌లోనే ప్రాణాలు కోల్పోయారన్నారు. వీరితోపాటు ఉన్న మరో వ్యక్తిని ఆదివారం రక్షించి కిందికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

గ్రీస్‌లో యూఎస్ రాయబారిగా కింబర్లీ

ఏథెన్స్: కాలిఫోర్నియా మాజీ ప్రాసిక్యూటర్, టీవీ వ్యాఖ్యాత, యూఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు సన్నిహితురాలైన కింబర్లీ గుయిల్ఫోయిల్ మంగళవారం గ్రీస్‌లో తొలి యూఎస్ మహిళా రాయబారిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ జూనియర్‌తో గతంలో నిశ్చితార్థం చేసుకున్న 56 ఏళ్ల గుయిల్ఫోయిల్, సెప్టెంబర్ 29న వాషింగ్టన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, ప్రస్తుతం గ్రీకు అధ్యక్షుడు కాన్స్టాంటైన్ టస్సొలాస్‌కు తన దౌత్య పత్రాలను సమర్పించారు. గ్రీకు పోర్ట్ సదుపాయాల ద్వారా తూర్పు ఐరోపాకు ద్రవీకృత సహజ వాయువు ఎగుమతులను పెంచడానికి అమెరికా ప్రయత్నిస్తున్న సమయంలో ఆమె నియామకం జరగడం గమనార్హం. బహుళజాతి పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా యుద్ధంతో దెబ్బతిన్న ఉక్రెయిన్‌కు ద్రవీకృత సహజ వాయువు ఎగుమతుల విస్తరణపై చర్చల కోసం యూఎస్ ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్, అంతర్గత శాఖ కార్యదర్శి డగ్ బర్గమ్ ఈ వారం ఏథెన్స్‌కు రానున్నారు.

నెదర్లాండ్స్ ఎన్నికల్లో డీ66దే గెలుపు

ది హేగ్: నెదర్లాండ్స్‌లో నువ్వానేనా అన్నట్లు సాగిన ఎన్నికలు ఫలితాల ఉత్కంఠకు పోస్టల్ ఓట్ల లెక్కింపుముగియడంతో తెరపడింది. డెమోక్రాట్ 66 పార్టీ ఎన్నికల్లో గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ముస్లిం వ్యతిరేక వైఖరి తీసుకున్న గీర్ట్ వైల్డర్స్ సారథ్యంలోని పార్టీ ఫర్ ఫ్రీడం(పీవీవీ) స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. పార్లమెంట్‌లో చెరో 26 సీట్లను ఈ పార్టీలు దక్కించుకున్నాయి. రెండు పార్టీలకు దక్కిన ఓట్ల తేడా కేవలం 28 వేలు మాత్రమే. డీ 66 పార్టీ నేత రాబ్ జెట్టెన్ ఈ ఫలితాలను చారిత్రకం అంటూ అభివర్ణించారు. దేశ ప్రజలు తమపై పెద్ద బాధ్యతను ఉంచారన్నారు. బహిరంగంగా తనను గేగా ప్రకటించుకున్న రాబ్ జెట్టెన్ స్వల్ప వయస్సులోనే ప్రధాని పదవి చేపట్టే నేతగా రికార్డు సృష్టించనున్నారు. అయితే, సంకీర్ణం రూపు దాల్చేందుకు వారాలు, నెలలు పట్టే అవకాశముందని పరిశీలకులు చెబుతున్నారు.

వేదంకు భారీ ఊరట

43 ఏళ్ల అన్యాయం తర్వాత ఉపశమనం

- తాత్కాలికంగా దేశ బహిష్కరణ నిలిపివేత

ఆధారాల్లేని హత్య కేసులో శిక్ష పడి.. నాలుగు దశాబ్దాలు జైలులో గడిపిన భారత సంతతికి చెందిన సుబ్రహ్మణ్యం వేదం అలియాస్ సుబు (64)కు భారీ ఊరట లభించింది. ఒకటా.. రెండా.. 43 ఏళ్లు అన్యాయపు చెరలో నలిగిన సుబ్రహ్మణ్యం వేదంపై విధించిన దేశ బహిష్కరణ నిర్ణయాన్ని రెండు అమెరికా కోర్టులు తాత్కాలికంగా నిలిపివేస్తూ వలసల శాఖకు ఉత్తర్వులు జారీ చేశాయి. తొమ్మిది నెలల శిశువుగా అమెరికాకు వచ్చిన 'సుబు' తన జీవితంలో 40 ఏళ్లకు పైగా అన్యాయంగా జైల్లో గడిపారు.. ఆ తర్వాతే ఆయన దోషిత్వం రద్దయింది.

కటకటాల వెనుక కన్నీటి గాథ

హత్య కేసులో పడిన తప్పుడు శిక్ష ఇటీవల రద్దయినప్పటికీ, ఆయన తన జీవితంలో నాలుగు దశాబ్దాలకు పైగా కటకటాల వెనుక గడిపారు. వేదంను దేశ బహిష్కరణల కోసం విమానాశ్రయం సౌకర్యం ఉన్న లూసియానాలోని ఒక నిర్బంధ కేంద్రంలో ఉంచారు. గత వారం, ఒక ఇమ్మిగ్రేషన్ న్యాయమూర్తి ఆయన దేశ బహిష్కరణను తాత్కాలికంగా నిలిపివేశారు. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అప్పీల్స్ ఆయన కేసును సమీక్షించాలా.. వద్దా నిర్ణయించే వరకు ఈ నిలిపివేత కొనసాగుతుంది. ఈ ప్రక్రియకు నెలల వ్యవధి పట్టవచ్చు. అదే రోజు పెన్సిల్వేనియాలోని ఒక జిల్లా కోర్టు కూడా ఆయన దేశ బహిష్కరణను నిలిపివేసింది.

స్నేహితుడి హత్య కేసులో ఇరికించి..

తొమ్మిది నెలల వయసులో అమెరికాకు సుబ్రహ్మణ్యం వేదం వచ్చారు. వేదం స్నేహితుడైన 19 ఏళ్ల వయసున్న థామస్ కిన్సర్ డిసెంబర్ 1980లో అదృశ్యమయ్యాడు. తొమ్మిది నెలల తర్వాత అతని మృతదేహం అడవుల్లో దొరికింది. కిన్సర్‌తో చివరగా కనిపించిన వ్యక్తి 'వేదమే'. దీంతో కిన్సర్ హత్య కేసుతో సంబంధం ఉందనే ఆరోపణపై 1982లో వేదం అరెస్టు అయ్యారు. అమెరికాలో చట్టబద్ధమైన శాశ్వత నివాసి అయిన వేదం, ఈ కాలంలో డ్రగ్స్ కేసుల్లో కూడా కొద్ది కాలం పోలీసుల అదుపులో ఉన్నారు. 1983లో వేదంను దోషిగా నిర్ధారించడంతో.. పెరోల్ లేకుండా జీవిత ఖైదు శిక్ష విధించారు. డ్రగ్స్ నేరానికి అదనంగా రెండున్నర నుంచి ఐదేళ్ల జైలు శిక్ష కూడా పడింది.

శిక్ష రద్దుకు అలుపెరగని పోరాటం

'సాక్షులు లేరు, నేరానికి ఆధారాలు లేవు, కేవలం పరిస్థితుల ఆధారంగానే ఆయనకు శిక్ష పడింది'.. అని వేదం న్యాయవాదులు వాదించారు. ఇన్నేళ్ల పాటు ఆయన నిర్దోషిత్వాన్ని నిరూపించడానికి వేదం కుటుంబం అలుపెరగని ప్రయత్నం చేసింది. పెన్సిల్వేనియా జైలులో ఉంటూనే, వేదం మూడు డిగ్రీలు సంపాదించారు, ఉపాధ్యాయునిగా అనేక మంది ఖైదీలకు మార్గనిర్దేశం చేశారు. వేదం తండ్రి 2009లో, తల్లి 2016లో మరణించారు.

న్యాయదేవత కరుణించిన వేళ

దశాబ్దాలుగా ప్రాసిక్యూటర్లు అణచివేసిన బాలిస్టిక్స్ సాక్ష్యాన్ని న్యాయవాదులు వెలికి తీయడంతో, ఆగస్టులో పెన్సిల్వేనియా కోర్టు వేదం దోషిత్వాన్ని రద్దు చేసింది. దీంతో వేదానికి మరోసారి జీవితాన్ని గడిపే అవకాశం దొరికింది.

మళ్లీ నిర్బంధంలోకి..

43 ఏళ్లకు పైగా జైలులో గడిపిన తర్వాత, అక్టోబర్ 3న వేదం జైలు నుంచి విడుదలయ్యారు. అయితే, వెంటనే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అధికారులు గతంలో శిక్షకు కారణమైన చిన్న డ్రగ్స్ కేసు ఆధారంగా వేదంను దేశం నుంచి బహిష్కరించాలని చూస్తున్నారు. హత్య కేసు రద్దు అయినప్పటికీ, డ్రగ్స్ కేసు దోషిత్వం రద్దు కాలేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వాదిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన అనుభవించిన అన్యాయపు నిర్బంధాన్ని పరిగణనలోకి తీసుకుని, డ్రగ్స్ నేరాన్ని తోసిపుచ్చాలని వేదం సోదరి, న్యాయవాదులు వాదిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

తూటాలకు ఫిరంగులతోనే సమాధానం

పాకిస్తాన్ ఉగ్రవాదులకు అమిత్ షా హెచ్చరిక

దర్భంగా: భారత్‌పై మరోసారి దాడికి దిగే సాహసం చేస్తే తూటాలకు ఫిరంగులతో సమాధానం చెప్తామని పాకిస్తాన్ ఉగ్రవాదులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరించారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పహల్గాంలో మన పౌరులపై దాడి చేసి, ఆడబిడ్డల నుదుటిపై సిందూరాన్ని తుడిచేసిన ముష్కరులపై 20 రోజుల్లోనే ప్రతీకారం తీర్చుకున్నామని చెప్పారు. పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. అమిత్ షా మంగళవారం బిహార్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. రాష్ట్రంలో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ఇక్కడ తయారయ్యే ఫిరంగులను పాక్ ముష్కర మూకలపై ఎక్కుపెట్టనున్నట్లు స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ భద్రతను నిర్లక్ష్యం చేశామని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

నేరగాళ్లను నీరాజనాలు పలుకుతున్నారు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి ఓటు వేస్తే బిహార్‌లో మళ్లీ జంగిల్‌రాజ్ వస్తుందని ప్రజలను అమిత్ షా అప్రమత్తం చేశారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ నేరగాళ్లను నీరాజనాలు పలుకుతున్నారని మండిపడ్డారు. 'షాబుద్దీన్ అమర్ రహే'అంటున్నారని ఆక్షేపించారు. జంగిల్‌రాజ్‌ను మళ్లీ తీసుకురావాలని ప్రతిపక్ష నాయకులు ఆరాటపడుతున్నారని, ప్రజలు అందుకు అంగీకరించబోరని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ఈవీఎంపైనున్న కమలం గుర్తుపై మీటను నొక్కితే సుపరిపాలన వస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను అమిత్ షా తప్పుపట్టారు. చొరబాటుదారులను కాపాడే ప్రయత్నాలు మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

ఉగ్రవ్యతిరేక పోరులో భాగస్వామ్యం

- విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్య
- ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రితో విస్తృతస్థాయి చర్చలు

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించకూడదని, ఉగ్రవాదం పీచమణిచేందుకు అంతర్జాతీయ స్థాయి విధివిధానాలను రూపొందించుకోవాలని భారత్, ఇజ్రాయెల్ నిర్ణయించాయి. మూడ్రోజుల పర్యటన కోసం భారత్‌కు విచ్చేసిన ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడెన్ సార్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం ఢిల్లీలో విస్తృతస్థాయిలో చర్చలు జరిపారు. వాణిజ్యం, మౌలిక వసతులు, అనుసంధానత రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాల నేతలు ఓ నిర్ణయానికొచ్చారు. భారత్, పశ్చిమాసియా, ఐరోపా అనుసంధానతే లక్ష్యంగా ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనమిక్ కారిడార్(ఐఎంఈసీ) ఏర్పాటు అంశంపైనా ఇరునేతలు చర్చించారు. ''మన రెండు దేశాలు కాలపరీక్షను ఎదుర్కొంటున్నాయి. అత్యంత విశ్వసనీయ సత్సంబంధాలను ఇరుదేశాలు కొనసాగిస్తున్నాయి. మన రెండు దేశాలు ఉగ్రవాదమనే ఉమ్మడి శత్రువుతో పోరాడుతున్నాయి''అని జైశంకర్ అన్నారు. దీనిపై ఇజ్రాయెల్ మంత్రి గిడెన్ స్పందించారు. ''గాజాలో హమాస్ నుంచి లెబనాన్‌లో హెజ్‌బొల్లా నుంచి యెమెన్ నుంచి హౌతీ నుంచి వేర్పాటువాద ఉగ్రవాదాన్ని మేం ఎదుర్కొంటున్నాం''అని గిడెన్ వ్యాఖ్యానించారు.

ఇరుదేశాల రక్షణ ఒప్పందం

వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం దిశగా ఇరు దేశాలు కీలక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. అధునాతన సాంకేతికతలను పరస్పరంగా ఇచ్చి పుచ్చుకోవడంతోపాటు కీలక ఆయుధ వ్యవస్థలను సమష్టిగా అభివృద్ధి చేసి ఉత్పత్తిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు రక్షణరంగంలో మెరుగైన సహకారం కోసం ఇండియా–ఇజ్రాయెల్ సంయుక్త కార్యాచరణ బృందం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

విలీనంకానున్న ఎన్‌పీపీ, తిప్రా మోథా, పీపుల్స్ పార్టీలు

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల సమస్యలపై సమష్టిగా పోరాడే లక్ష్యంగా మేఘాలయ, అస్సాంలోని మూడు కీలక రాజకీయ పార్టీలు విలీనం కావాలని నిర్ణయించుకున్నాయి. మేఘాలయ ముఖ్యమంత్రి, కాన్రాడ్ సంగ్మా సారథ్యంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ), ప్రద్యోత్ మాణిక్య సారథ్యంలోని తిప్రా మోథా పార్టీ, అస్సాంలో డేనియల్ ల్యాంగ్థస నేతృత్వంలోని పీపుల్స్ పార్టీలు వచ్చే 45 రోజుల్లోపు ఒకే రాజకీయ పార్టీగా అవతరించాలని నిర్ణయించుకున్నాయి. నాగాలాండ్ నేత, మాజీ బీజేపీ నాయకుడు ఎంహోన్‌లూమో కికోన్ సైతం ఈ పార్టీలో భాగస్వామి కానున్నారు. కొత్త పార్టీ ఆవిర్భావంపై ఇప్పటికే వీరంతా సంయుక్త ప్రకటనపై సంతకాలు సైతం చేశారు. బీజేపీలో ఎన్‌పీపీ, తిప్రా మోథాలు భాగస్వాములుగా ఉన్న విషయం తెల్సిందే. ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా కొత్త రాజకీయపార్టీని ఏర్పాటుచేస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్ పిటిషన్లపై సమగ్రంగా బదులివ్వండి

కేంద్రాన్ని కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆగస్టులో తీసుకువచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానాలను సమగ్రంగా అందజేయాలని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆన్‌లైన్ మనీ గేమ్స్‌కు బ్యాంకింగ్ సర్వీసులను, సంబంధిత ప్రకటనలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ, కర్నాటక, మధ్యప్రదేశ్ హైకోర్టులతోపాటు అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పిటిషన్‌కు సమగ్రమైన సమాధానం ఇవ్వాలని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఈ సమాధానం ప్రతిని ముందుగా పిటిషనర్ల లాయర్లకు అందజేయాలని తెలిపిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

బిహార్ బాతాఖాని

నితీశ్‌పై ఒక్క కేసు కూడా లేదు

- ఎన్డీయే మాత్రమే 'వికసిత్ బిహార్'గా మార్చగలదు
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

పట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. బిహార్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చే సత్తా ఎన్డీయేకు మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మంత్రి రాజ్‌నాథ్ వైశాలి, పట్నా జిల్లాల్లో జరిగిన పలు ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తామంటూ ఇండియా కూటమి నేతలు ప్రజలకు తప్పుడు హామీలిస్తున్నారని విమర్శించారు. ఈ ఉద్యోగుల వేతనాలకు అవసరమైన సొమ్మును వాళ్లు ఎక్కడి నుంచి తెస్తారని ఆయన ప్రశ్నించారు. తాము తప్పుడు, మోసపూరిత హామీలను ప్రజలకు ఇవ్వబోమని చెప్పారు. యూపీయే హయాంలో బిహార్‌కు కేంద్రం నుంచి అందినవి రూ.2 లక్షల కోట్లు కాగా, మోదీ ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. 'బిహార్ అభివృద్ధి గురించి ఆలోచించేది కేవలం ఎన్డీయే మాత్రమే. ఎన్డీయేకే ఓటేయండి. అంతేతప్ప, జంగిల్ రాజ్‌కి కాదు' అని రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

వరి, గోధుమలకు బోనస్ పెంపు: తేజస్వీ

పట్నా: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకి అదనంగా క్వింటాల్ వరి ధాన్యానికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్‌గా చెల్లిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. మంగళవారం పట్నాలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 8,400 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా(పీఏసీఎస్)లతోపాటు ప్రాథమిక మార్కెటింగ్ సహకార సంఘాల చైర్మన్లకు ప్రజాప్రతినిధుల హోదాను కూడా కల్పిస్తామన్నారు. రిజిస్టరైన సంఘాల మేనేజర్లకు గౌరవభృతిని అందిస్తామన్నారు. అధికారంలోకి వస్తే వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఖాతాల్లో నెల నెలా రూ.2,500 జమ చేస్తామని ఇప్పటికే హామీ ఇచ్చాం. దీంతోపాటు, మకర సంక్రాంతి రోజున జనవరి 14న రాష్ట్రంలోని ప్రతి మహిళ ఖాతాలో రూ.30 వేలు జమ చేయాలని నిర్ణయించామన్నారు.

అతడు గెలిస్తే హిందువులు ఓడినట్లే

అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్య

సివాన్: దివంగత మాజీ ఎంపీ మహ్మద్ షహాబుద్దీన్ కుమారుడు, రఘునాథ్‌పూర్ ఆర్జేడీ అభ్యర్థి ఒసామా షహాబ్ గెలిస్తే హిందువులంతా ఓడిపోయినట్లేనని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన రఘునాథ్‌పూర్‌లో బీజేపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మాట్లాడారు. 'రఘునాథ్‌పూర్‌కు వచ్చిన నేడు ఈ పట్టణం పేరులో ఉన్న శ్రీరాముడు, సీత పేర్లను చూసి ఉద్వేగం చెందా. ఇక్కడ ఓ ఒసామా కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ ఒసామా తండ్రి షహాబుద్దీన్‌కు నేరాలు చేయడంలో ఘనుడిగా పేరుంది. ఒసామా చిన్నప్పుడు బొమ్మలకు బదులు ఏకే-47 రైఫిల్స్‌తోనే ఆడుకుని ఉంటాడు. అలాంటి ఒసామా రఘునాథ్‌పూర్‌లో గెలిస్తే హిందువులు ఓడిపోయినట్లే' అని హిమంత అన్నారు.

వాళ్లు ఉద్యోగాల్ని అమ్ముకున్నారు

నిప్పులు చెరిగిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

సమస్తీపూర్: బిహార్‌లో జరగనున్న ఎన్నికల్లో ప్రస్తుతం భారీ హామీ ఇస్తున్న వారే 20 ఏళ్ల క్రితం యువత నుంచి ఉద్యోగాల్ని, పేదల హక్కుల్ని లాగేసుకున్నారని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ నిప్పులు చెరిగారు. మంగళవారం ఆయన సమస్తీపూర్, గోపాల్‌గంజ్, లఖిసరాయ్‌లలో ఎన్నికల ర్యాలీల్లో మాట్లాడారు. 2005లో నితీశ్ కుమార్ అధికారంలోకి వచ్చాకనే రాష్ట్రం అభివృద్ధిబాట పట్టిందన్నారు. రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపి, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో నేడు ఐఐఎంలు, ఐఐటీలు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. 50 ఏళ్ల క్రితమే ఉండాల్సిన మౌలిక సదుపాయాలను నేడు ఎన్డీయే ప్రభుత్వం కల్పించిందన్నారు.

మా విరోధులు హెలిప్యాడ్‌ను తవ్వేశారు

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆరోపణ

పట్నా: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మంగళవారం సంచలన ఆరోపణలు చేశారు. బిహార్‌లో తాను ఎన్నికల ర్యాలీల్లో పాల్గొనాల్సిన ప్రాంతాల్లో హెలిప్యాడ్, రోడ్డును ఎన్డీయే విరోధులు తవ్వేశారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను ఎక్స్‌లో ఆయన షేర్ చేశారు. ఘటన ఎక్కడ జరిగిందన్న విషయాలను ఆయన వెల్లడించలేదు. 'నేనిక్కడికి వచ్చే సరికి..ఎన్డీయే గెలుస్తుందనే భయంతో మా విరోధులు హెలిప్యాడ్‌ను, రోడ్డును తవ్వేసినట్లు మా వాళ్లు చెప్పారు. అయినప్పటికీ, నేను అనుకున్న విధంగానే ర్యాలీలో పాల్గొన్నా'అని ఆయన చెప్పారు. మోహన్ యాదవ్ ప్రకటనను అధికారులు ఖండించారు.

జేడీయూ నేత లలన్‌పై కేసు నమోదు

పట్నా: కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్‌పై మంగళవారం అధికారులు కేసు నమోదు చేశారు. పట్నా పరిధిలోని మొకామాలో అరెస్టయిన జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ తరఫున జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రతిపక్ష నేతలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పోలింగ్ రోజున ప్రతిపక్షాల నేతల్ని కట్టడి చేయాలంటూ ఎన్డీయే మద్దతుదారులను ఆయన కోరుతున్నట్లుగా ఉన్న ఒక వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై దర్యాప్తు చేపట్టిన అధికారులు వివిధ సెక్షన్ల కింద లలన్‌పై కేసు నమోదు చేశారు.

అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు

డిక్ చెనీ కన్నుమూత

- అమెరికా చరిత్రలో అత్యంత శక్తిమంతమైన ఉపాధ్యక్షుడిగా గుర్తింపు
- 2001–09 మధ్య జూనియర్ బుష్ హయాంలో ఉపాధ్యక్షుడిగా సేవలు

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో అత్యంత శక్తిమంతమైన ఉపాధ్యక్షుడిగా గుర్తింపు పొందిన కరుడుగట్టిన సంప్రదాయవాది, రిపబ్లికన్ నేత డిక్ చెనీ (84) సోమవారం (స్థానిక కాలమానం) మరణించారు. న్యుమోనియా, గుండె, శ్వాస సంబంధ సమస్యలతో చెనీ మరణించారని ఆయన కుటుంబసభ్యులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చెనీ జీవితకాలంలో మొత్తం 5 సార్లు గుండెపోటుకు గురయ్యారు. ఆయన 2001–09 మధ్య జార్జ్ డబ్ల్యూ బుష్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2001 సెప్టెంబర్ 11న అల్‌ఖైదా ఉగ్రవాదులు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడులకు పాల్పడిన తర్వాత ఇరాక్‌పై అమెరికా యుద్ధం ప్రకటించటంలో డిక్ చెనీ కీలకపాత్ర పోషించారు. ఆయన ఇద్దరు బుష్‌ల హయాంలో వివిధ హోదాల్లో సేవలందించారు. జార్జ్ బుష్ (సీనియర్ బుష్) అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1989లో చెనీ అమెరికా రక్షణ మంత్రిగా సేవలందించారు. గెరాల్డ్ ఫోర్డ్ హయాంలో 34 ఏళ్ల వయసులోనే వైట్‌హౌస్ ఛీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులయ్యారు. 1990–91లో కువైట్ నుంచి ఇరాక్ దళాలను తరిమేసేందుకు అమెరికా ప్రారంభించిన పర్షియన్ గల్ఫ్ యుద్ధంలో తన దేశ సేనలకు నాయకత్వం వహించారు. నెబ్రాస్కాలోని లింకన్‌లో ఓ సాధారణ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో పుట్టిన చెనీ.. స్వశక్తితో ఎదిగి చిన్నతనంలోనే అమెరికా రాజకీయాపై ప్రభావం చూపించారు. వ్యోమింగ్ సెనేటర్‌గా ఎన్నికయ్యారు. 2021లో డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు అమెరికా పార్లమెంటుపై దాడి చేసిన తర్వాత ట్రంప్‌ను చెనీ విమర్శించారు. '246 సంవత్సరాల మన దేశ చరిత్రలో మన ప్రజాస్వామ్యానికి డొనాల్డ్ ట్రంప్ అంతటి ప్రమాదకారిని ఇంతవరకు చూడలేదు' అని వ్యాఖ్యానించారు. దీంతో సొంతపార్టీ అధ్యక్షుడిని విమర్శించినందుకు ఆయనను రిపబ్లికన్ పార్టీ నుంచి బహిష్కరించారు. చెనీ కుమార్తె లిజ్.. డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా భారీ ప్రచారం చేశారు.

వివాహ పన్ను రద్దు చేసిన తొలి విజయనగర రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

విజయనగర సామ్రాజ్యం

సంగమ వంశానికి చెందిన హరిహర, బుక్కరాయలు క్రీ.శ. 1336లో తుంగభద్రానదీ తీరంలో మాధవ విద్యారణ్య స్వామి సహకారంతో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. సోదరులైన వీరిద్దరూ ప్రారంభంలో కాకతీయ ప్రతాపరుద్రుడి కొలువులో సేనానులుగా ఉండేవారు. క్రీ.శ. 1323లో కాకతీయ రాజ్యాన్ని మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆక్రమించడంతో హరిహర, బుక్కరాయలు కర్ణాటకలో 'కంపిలి' రాజ్యానికి వలస వెళ్లారు. తర్వాత ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ వీరిని ఇస్లాం మతంలోకి మార్చి ఆనెగొంది, కంపిలి ప్రాంతాలకు పాలకులుగా నియమించాడు. కాలక్రమంలో 1336–1340 మధ్య వీరు ఢిల్లీ సుల్తాన్‌లను ధిక్కరించి స్వతంత్రంగా విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. ముస్లిం రాజులపై విజయ సూచకంగా 'విజయనగరం'గా, విద్యా విషయంలో సాధించిన అభివృద్ధి కారణంగా 'విద్యానగరం'గా ఇది చరిత్రలో పేరు పొందింది.

విజయనగర సామ్రాజ్య స్థాపన విషయంలో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. విజయనగర రాజ్య నిర్మాత హోయసాల రాజు మూడో వీరభల్లాలుడని ఫెరిస్తా రచన ఆధారంగా రెవరెండ్ ఫాదర్ హెరాస్ పేర్కొన్నారు. ఈ రాజ్య నిర్మాత హరిహర బుక్కరాయలేనని, 'విస్మృత సామ్రాజ్యం' (ది ఫర్గాటెన్ ఎంపైర్) గ్రంథ రచయిత రాబర్ట్ సీవెల్ నిర్ధారించారు. అధికమంది చరిత్రకారులు ఈయన అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. హరిహరుడు కన్నడవారా, తెలుగు వారా అనే విషయంలోనూ వివాదం ఉంది. స్థానిక చరిత్రలు, బదౌనీ, న్యూనిజ్ రచనల ఆధారంగా హరిహరరాయలు తెలుగు వారేనని ప్రసిద్ధ చరిత్రకారుడు డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్య నిర్ధారించారు. స్థానిక చరిత్రల ఆధారంగా హరిహర, బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్రుని సేనానులని, మంగళ నిలయవాసియైన 'సంగముని' కుమారులని చరిత్రకారులు పేర్కొన్నారు. 1336–40 మధ్య కాలంలో హరిహర, బుక్కరాయలు రాజధానిని 'ఆనగొంది' నుంచి హంపీ విజయనగరానికి మార్చారు.

ఆధారాలు

మాధవ విద్యారణ్యుని 'కాలజ్ఞానం'లో విజయనగర పాలకుల వివరాలు, విద్యారణ్యుని వృత్తాంతం, రాజ్యస్థాపన వివరాలున్నాయి. ఒకటో రాజనాథ డిండిముడు రచించిన సాళువాభ్యుదయం, రెండో రాజనాథ డిండిముడు రచించిన అచ్యుత రామాభ్యుదయం, అరుణగిరినాథ డిండిముడు రచించిన సోమవల్లీ యోగానంద ప్రహసనం, రామభద్రాంబిక రాసిన రఘునాథాభ్యుదయం, స్థానాపతి తెలుగులో రచించిన రాయవాచకం, కంపిలి రాయచరిత్ర, కృష్ణరాయవిజయం, తిరుమాలాంబిక రచించిన చారిత్రక గ్రంథాలు విజయనగర సామ్రాజ్య చరిత్రకు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. మాధవ సాయన మంత్రి చేసిన వ్యాఖ్యానాల ద్వారా సంగమ వంశ వివరాలు తెలుస్తున్నాయి. రెండో బుక్కరాయల ఆస్థాన వైద్యుడు రాసిన 'వైద్యరాజ్యవల్లభం' లాంటి ఆయుర్వేద గ్రంథం, లక్ష్మీనారాయణుడు రచించిన సంగీత సూర్యోదయం, కళింగ గజపతి ప్రతాపరుద్రుడి సరస్వతీ విలాసం, శ్రీకృష్ణదేవరాయలు రాసిన తెలుగులో పంచకావ్యమైన ఆముక్తమాల్యద (విష్ణుచిత్తీయం), అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' లాంటి గ్రంథాలు నాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను వివరిస్తున్నాయి.

మూడు శతాబ్దాల పాటు దక్షిణాపథ చరిత్రలో హిందూ సంస్కృతిని సముద్ధరించడంలో పేరొందిన చివరి హిందూ రాజ్యంగా విజయనగర సామ్రాజ్యం ప్రసిద్ధి చెందింది. భారతీయ సంస్కృతికి పునరుజ్జీవనం కల్పించింది. విజయనగర రాజులతో బహమనీ సుల్తాన్లు నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల వారు ఉత్తర భారతదేశం వైపు దృష్టి సారించలేకపోయారు.

విదేశీ యాత్రికుల కథనాలు

- మొరాకో (ఆఫ్రికా) దేశస్థుడైన ఇబన్ బటూటా అనే యాత్రికుడు మొదటి హరిహరుని కాలం నాటి విజయనగర పరిస్థితులను వివరించాడు.
- వెనిస్ (ఇటలీ) యాత్రికుడైన నికోలా డీ కోంటీ మొదటి దేవరాయల రాజ్యాన్ని సందర్శించి రాజ్య విస్తరణ, నాటి సాంఘిక పరిస్థితులను వివరించాడు.
- పారశీక (పర్షియా) యాత్రికుడు అబ్దుల్ రజాక్ రెండో దేవరాయల కాలం నాటి పరిస్థితులను వర్ణించాడు.
- డొమింగో పయస్ (పోర్చుగీసు) అనే యాత్రికుడు శ్రీకృష్ణదేవరాయల వ్యక్తిత్వం, రాజ్య పాలనా స్వరూపం, నాటి సంపద, రక్తతర్పణాలు, ఆచార వ్యవహారాల గురించి వివరించాడు.
- పోర్చుగీసు యాత్రికుడైన న్యూనిజ్ కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలం నాటి పరిస్థితులను గ్రంథస్థం చేశాడు.
- కృష్ణదేవరాయల కాలంలో వచ్చిన మరో పోర్చుగీసు యాత్రికుడు 'ఎడ్వర్డో బార్బోసా' నాటి పాలనా విధానాన్ని వర్ణించాడు.
- రష్యా వ్యాపారస్థుడు అస్తినాసియన్ నికితిన్ 1470లో దక్కన్ బహమనీ రాజ్యాన్ని సందర్శించి, నాటి న్యాయస్థానాలు, సైన్యం, ప్రజల స్థితిగతులను వివరించాడు.
- ఎడోవికో–డి–వర్తెమా (ఇటలీ దేశస్థుడు) గోవా, కాలికట్ ఓడరేవులు, విజయనగర రాజ్య పరిస్థితులను వివరించాడు.

శాసనాధారాలు:

- మొదటి హరిహరరాయలు వేయించిన 'బాగపల్లెసి' తామ్ర శాసనం ఆయన విజయాలను తెలియజేస్తోంది.
- కంపన కుమారుడు రెండో సంగముడు వేయించిన బిట్రగుంట దాన శాసనం 'అయిదుగురు సంగమ సోదరుల' వంశావళిని విశదీకరిస్తోంది.
- రెండో హరిహరరాయల చెన్నరాయ పట్టణ శాసనంలో ఒకటో బుక్కరాయలు జయించిన ప్రాంతాల గురించి వివరిస్తోంది.
- శ్రీరంగ పట్టణం తామ్ర శాసనం రెండో దేవరాయల విజయాల గురించి తెలుపుతోంది.
- ఇమ్మడి నరసింహారాయల 'దేవులపల్లి' రాగి శాసనం సాళువ రాజుల వంశావళిని విశదీకరిస్తోంది.

నాణేలు

విజయనగర రాజులు అధిక సంఖ్యలో బంగారు నాణేలు ముద్రించారు. వీటిని వరహాలు, పగోడాలు, ఫణాలని పిలిచేవారు. వీటిలో కొన్ని పూర్తి వరహాలు, అర్ధ వరహాలుగా ముద్రించారు. నాణేల వెనుకభాగంలో దేవతలు, నంది, ఏనుగు, గండభేరుండ, బాలకృష్ణ, లక్ష్మీదేవి, వేంకటేశ్వరుడి బొమ్మలు ముద్రించారు. నాణేనికి ఒకవైపు దేవనాగరి లిపి, మరోవైపు వైష్ణవ సంప్రదాయ బొమ్మలు ముద్రించారు. కొన్ని నాణేలపై కన్నడ లిపి కూడా కనిపిస్తోంది. ఈ నాణేల ద్వారా నాటి రాజకీయ చరిత్ర, మత విశ్వాసాలు, ఆర్థిక పరిస్థితులు తెలుస్తున్నాయి.

రాజవంశాలు

సంగమ వంశం: క్రీ.శ. 1336 నుంచి 1676 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాల వారు అవిచ్ఛిన్నంగా పాలించారు. తొలి రాజవంశం సంగమ వంశ సామ్రాజ్య స్థాపకులైన హరిహర, బుక్క సోదరులు సంగముడి కుమారులు కావడంతో సంగమ వంశమని పేరొచ్చింది. ఈ వంశంలో మొదటి హరిహర రాయలు 1336 నుంచి 1356 వరకు పాలించారు. 1339 నాటికి తూర్పున బంగాళాఖాతం నుంచి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు రాజ్యాన్ని విస్తరించారు. ఈయనకు 'పూర్వ, పశ్చిమ సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. దక్కన్ బహమనీ విజయనగర రాజుల మధ్య సంఘర్షణ మొదటి హరిహరుని కాలంలోనే ప్రారంభమైంది. కృష్ణా – తుంగభద్ర నదుల 'అంతర్వేది భూమి' ఈ సంఘర్షణలకు మూల కారణం. దీన్నే 'రాయచూర్ దోబ్' అంటారు. ఈయన కాలంలో మొరాకో (ఆఫ్రికా) యాత్రికుడు 'ఇబన్ బటూటా' విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించాడు.

మొదటి హరిహర రాయల మరణానంతరం ఆయన సోదరుడు మొదటి బుక్కరాయలు 1356 నుంచి 1377 వరకు పాలించాడు. ఈయన కాలంలోనే 'పెనుగొండ దుర్గం' నిర్మించారు. ఈయన కాలంలో జరిగిన మధుర (తమిళదేశం) ఆక్రమణ ముఖ్యమైంది. ఈయన కుమారుడు కుమార కంపన మధురను జయించి, విజయనగర రాజ్యంలో విలీనం చేశారు. మొదటి బుక్కరాయలు 1374లో చైనాకు రాయబారిని పంపినట్లు మింగ్ వంశ చరిత్ర ద్వారా తెలుస్తోంది. బుక్కరాయలు శైవ మతాన్ని, సంస్కృత, ఆంధ్ర భాషలను ఆదరించారు. సాయన, మాధవులు అనే కవులు ఈయన ఆస్థానంలో వేదాలకు భాష్యాలు రాశారు. నాచన సోమనాథుడు ఈయన ఆస్థానంలోని వారే. మొదటి బుక్కరాయలు, మహ్మద్‌షా మధ్య 'ముద్గల్' కోట కోసం జరిగిన యుద్ధంలో బహమనీ సుల్తాన్లు మొదటిసారిగా ఫిరంగులను వాడారు. భారతదేశంలో ఫిరంగి దళాలను ఉపయోగించిన తొలి యుద్ధం ఇదే.

మొదటి బుక్కరాయలు తర్వాత రెండో హరిహర రాయలు 1377 నుంచి 1404 వరకు పాలించారు. ఈయన కొండవీటి రెడ్లు, రేచర్ల పద్మనాయకులతో యుద్ధాలు చేశారు. పానగల్లు కోటను ఆక్రమించారు. సింహళంపై దాడిచేసిన మొదటి విజయనగర రాజు ఈయనే.

విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరించడంలో ప్రధాన పాత్ర వహించిన సంగమ వంశ రాజుల్లో మొదటి దేవరాయలు ముఖ్యులు. ఈయన 1406 నుంచి 1422 వరకు పాలించారు. రెడ్డిరాజుల నుంచి ఉదయగిరి, మోటుపల్లి ప్రాంతాలను ఆక్రమించారు. మొదటి దేవరాయలు తుంగభద్రానదికి ఆనకట్ట వేయించి, 15 మైళ్ల పొడవు కొండ ప్రాంతాన్ని తొలిపించి, కాలువల ద్వారా విజయనగరానికి నీటి సౌకర్యం కల్పించారు. ఈయన కాలంలోనే ఇటలీ యాత్రికుడు నికోలా డీ కోంటీ విజయనగరాన్ని సందర్శించాడు.

సంగమ వంశ విజయనగర రాజుల్లో సుప్రసిద్ధుడు రెండో దేవరాయలు. ఈయననే ప్రౌఢ దేవరాయలుగా పిలుస్తారు. ఈయన ఏనుగుల వేటలో నేర్పరి. ఈయనకు 'గజబేంతకార' బిరుదున్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. రెండో దేవరాయల పాలనా కాలం 1422 – 1446.

సైన్యాన్ని పటిష్టం చేయడానికి అధిక సంఖ్యలో ముస్లింలను సైన్యంలో చేర్చుకున్నారు. వ్యవసాయాభివృద్ధికి హరిద్రా ఆనకట్టను బాగు చేయించారు. బహమనీలతో రెండుసార్లు యుద్ధం చేశారు. రాజ్యాన్ని ఉత్తరాన గుల్బర్గా నుంచి దక్షిణాన సింహళం వరకు, తూర్పున బెంగాల్ నుంచి పశ్చిమాన మలబార్ వరకు విస్తరించారు. ఈయన శైవ మతాభిమాని. ముస్లింలకు మత స్వేచ్ఛనిచ్చి, మసీదులు నిర్మించారు. కన్యాశుల్కాన్ని నిరుత్సాహపరిచి, కన్యాదాన సంప్రదాయాన్ని ప్రోత్సహించారు. పారశీక రాయబారి 'అబ్దుల్ రజాక్' ఈయన ఆస్థానాన్ని సందర్శించాడు.

రెండో దేవరాయలు స్వయంగా కవి, పండితుడు సంస్కృత భాషలో మహానాటక సుధానిధి, వృత్తి అనే గ్రంథాలు రచించారు. 'వృత్తి' బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం. ఈయన కొలువులోని సంస్కృత కవి అరుణగిరినాథ డిండిముని ఓడించి, శ్రీనాథుడు కనకాభిషేకం పొందారు. 'ప్రభులింగలీల' కన్నడ రచయిత చామరసు ఈయన ఆస్థానంలోని వారే. రెండో దేవరాయలు 'ముత్యాలశాల' పేరుతో సాహిత్య సమావేశాలను నిర్వహించేవారు. దేవరాయల తర్వాత ఆయన కుమారుడు రెండో విజయరాయలు, ఆ తర్వాత రెండో విజయరాయల కుమారుడు మల్లికార్జునుడు 1447 వరకు పాలించారు. ఈ కాలంలో శత్రు రాజులైన బహమనీలు, ఒరిస్సా గజపతులు తిరిగి విజయనగరంపై దాడులు ప్రారంభించారు.

సాళువ వంశం (క్రీ.శ. 1486–1505)

సాళువ వంశస్థులు కర్ణాటకలోని కల్యాణి ప్రాంతానికి చెందినవారు. ఈ వంశానికి చెందిన మంగరాజుకు 'సాళువ' అనే బిరుదు ఉంది. ఈయన తర్వాత గుండరాజు రాజ ప్రతినిధి అయ్యారు. గుండరాజు కుమారుడు సాళువ నరసింహారాయలు. ఈయన విరూపాక్షరాయల కాలంలో సామంతుడిగా పనిచేశారు. ఈయన 1485లో సంగమ వంశం చివరి రాజైన ప్రౌఢరాయల నుంచి విజయనగర రాజ్యాన్ని ఆక్రమించారు. కొన్నాళ్లు చంద్రగిరికి సామంతరాజుగా పనిచేశారు. ఈయన ఆస్థానంలో సాళువాభ్యుదయం రాసిన రాజనాథ డిండిముడు, తెలుగులో శృంగార శాకుంతలం, జైమినీ భారతం రాసిన పిల్లలమర్రి పినవీరభద్రుడు ప్రముఖులుగా వెలుగొందారు. సాళువ నరసింహారాయలకు 'రాయమహారసు' అనే బిరుదు ఉంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు, పదకీర్తనా సంకీర్తనాచార్యుడైన తాళ్లపాక అన్నమాచార్యుడు ఈయన సమకాలికులే. సాళువ నరసింహారాయలను విజయనగర రాజ్య దురాక్రమణదారునిగా కొందరు వర్ణించారు. ఈయన తర్వాత తిమ్మరాయడు, ఇమ్మడి నరసింహుడు పాలించారు. ఇమ్మడి నరసింహుడు రాజైనప్పటికీ, అధికారమంతా తన సైన్యాధ్యక్షుడైన తుళువ నరసనాయకుడి చేతిలో ఉండేది. 1503లో తుళువ నరసనాయకుడు మరణించిన తర్వాత 1505లో ఆయన కుమారుడు వీర నరసింహుడు ఇమ్మడి నరసింహుని వధించి, సింహాసనాన్ని అధిష్టించి తుళువ వంశాన్ని స్థాపించారు.

తుళువ వంశం (1505–1576)

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మూడో రాజవంశం తుళువ వంశం. దీన్ని వీర నరసింహరాయలు 1505లో స్థాపించారు. ఈయన 1509 వరకు రాజ్యమేలారు. పాలించిన అయిదేళ్లూ యుద్ధాలతోనే సరిపోయింది. మైసూరులోని తుళవనాడు వీరి జన్మస్థలం. అందుకే తుళువ వంశమని పేరొచ్చింది. వీరనరసింహరాయలు వివాహ పన్నును రద్దు చేసిన తొలి విజయనగర రాజుగా ప్రసిద్ధి పొందారు. ఉమ్మెత్తూర్ పాలకులను అణచివేసే ప్రయత్నంలో 1509లో మరణించారు. తర్వాత ఈయన సవతి తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు మంత్రి తిమ్మరుసు సహాయంతో సింహాసనం అధిష్టించారు. తుళువ వంశంలో ఈయన అగ్రగణ్యులు. బీజాపూర్ సుల్తాన్ ఆదిల్‌షాను వధించి, కోవిల కొండను జయించారు. బీదర్‌లో మంత్రి బరీద్‌కు బందీయైన బహమనీ సుల్తాన్ మహ్మద్‌షాను విడిపించి ఆయనకు సింహాసనం అప్పగించి 'యవన రాజ్యస్థాపనాచార్య' బిరుదు పొందారు. ఉమ్మెత్తూర్, శివసముద్రం, పెనుగొండ దుర్గాలను జయించి 'దక్షిణ సముద్రాధీశ్వర' బిరుదు పొందారు. కొండపల్లి, రాజమహేంద్రి, కళింగలను జయించారు. విశాఖ జిల్లాలోని పొట్నూర్ వద్ద రాయలు విజయస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

చేపల్లో ఏకవలయ రక్త ప్రసరణకు కారణం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

వివిధ జంతువుల్లో రవాణా వ్యవస్థలు

వానపాము

- వానపాము రవాణా వ్యవస్థలో హృదయాలు, రక్తనాళాలు, రక్తం ఉంటాయి. శరీరంలో 8 జతల పార్శ్వ హృదయాలుంటాయి.
- రక్తనాళాలు మూసుకొని ఉండే గొట్టాలు, ఇవి హృదయంతో కలిసి ఉంటాయి. వీటిలో పృష్ఠ రక్తనాళం, ఉదర రక్తనాళం.. ఆహార నాళానికిపైన ఒకటి, కింద ఒకటి ఉంటాయి.
- పృష్ఠ రక్తనాళం ప్రతి ఖండితంలో వివిధ అవయవాల నుంచి రక్తాన్ని సేకరిస్తుంది. అందుకే ఇది ముఖ్య సిరగా పనిచేస్తుంది. ఉదర రక్తనాళం ప్రతి ఖండితంలో రక్తాన్ని వివిధ అవయవాలకు సరఫరా చేస్తుంది. ఇది ముఖ్య ధమనిగా పనిచేస్తుంది.
- పృష్ఠ రక్తనాళంలో రక్తం వెనుక నుంచి ముందుకు, ఉదర నాళంలో రక్తం ముందు నుంచి వెనుకకు ప్రయాణిస్తుంది.
- రక్తంలో ఆక్సిజన్‌ను తీసుకుపోయే ప్రొటీన్ ఉంటుంది. అందుకే రక్తం ఎర్రగా ఉంటుంది. ఎర్ర రక్తకణాలు ఉండవు. తెల్లరక్తకణాలే ఉంటాయి. రక్తంలో నీరు, లవణాలు ఉంటాయి.
- శరీర కుడ్యానికి, ఆహార నాళానికి మధ్య ఉన్న శరీర కుహరద్రవం కూడా పదార్థాల రవాణాలో ప్రముఖపాత్ర వహిస్తుంది.

బొద్దింక

- బొద్దింక రవాణా వ్యవస్థలో రక్తనాళాలు ఉండవు. రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది. అందుకే దీన్ని స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థ అంటారు.
- బొద్దింక శరీరంలో హృదయావరణ కోటరం, పర్యాంతరంగ కోటరం, ఉదర కోటరం, తలలో శిరఃకోటరం ఉంటాయి.
- బొద్దింక హృదయంలో 13 గదులుంటాయి. ఆఖరి గది మూసుకొని ఉంటుంది. మొదటి గది మహాధమని ద్వారా శిరఃకోటరంలోనికి తెరుచుకుంటుంది.
- రక్తం పక్షాకార కండరాల వల్ల చలిస్తుంది.
- బొద్దింక రక్తం తెల్లగా ఉంటుంది. ఇది ఆక్సిజన్ రవాణాలో పాత్ర వహించదు.

ఉన్నతస్థాయి జీవులు రవాణా వ్యవస్థ

- శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం శ్వాసేంద్రియాలకు ఆమ్లజనీకరణం కోసం వెళ్తుంది.
- తక్కువస్థాయి జీవుల్లో ఇక్కడ నుంచి శరీర భాగాలకు ప్రసరణం జరుగుతుంది.
ఉదా: చేపలు.

- ఆంఫిబియా నుంచి క్షీరదాల వరకు రక్తం శ్వాసేంద్రియాల నుంచి తిరిగి గుండెకు వస్తుంది. గుండె నుంచి శరీర భాగాలకు చేరుతుంది.

చేపలు

- చేపల్లో 2 గదుల హృదయం ఉంటుంది. ఒక కర్ణిక, ఒక జఠరిక ఉంటాయి. శరీర భాగాల నుంచి చెడు రక్తం సిరాసరణి చేరి తర్వాత కర్ణిక చేరుతుంది. అక్కడ నుంచి జఠరిక, తర్వాత మొప్పలకు వెళ్తుంది. మొప్పల్లో ఆమ్లజనీకరణం తర్వాత నేరుగా శరీర భాగాలకు మంచి రక్తం చేరుతుంది.
- చేపల్లో రక్తం గుండె ద్వారా ఒక్కసారే ప్రవహిస్తుంది. అందుకే ఈ వ్యవస్థని ఏకవలయ రక్తప్రసరణ అంటారు.
- చేప హృదయాన్ని 'జలశ్వాస హృదయం' అంటారు. (హృదయం మొప్పలకు రక్తాన్ని పంపుతుంది కాబట్టి)

ఉభయచరాలు

- కప్ప వంటి ఉభయచరాల్లో హృదయం 3 గదులు కలిగి ఉంటుంది. రెండు కర్ణికలు, ఒక జఠరిక ఉంటాయి.
- శరీరం నుంచి మూడు మహాసిరల ద్వారా చెడు రక్తం సిరాసరణి (Sinus venosus) చేరుతుంది. సిరాసరణి నుంచి కుడి కర్ణికలోనికి వెళ్తుంది.
- పుపుస సిర ద్వారా ఆమ్లజని సహిత రక్తం ఎడమ కర్ణికకు చేరుతుంది.
- కర్ణికలు రెండూ ఒకే జఠరికలోనికి తెరుచుకుంటాయి. కాబట్టి ఆమ్లజని సహిత, ఆమ్లజని రహిత రక్తాలు జఠరికలో కలిసి మిశ్రమ రక్తంగా ఏర్పడతాయి.
- మిశ్రమ రక్తం మహాధమని ద్వారా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.
- ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేస్తుంది కాబట్టి ఉభయచరాల గుండెను 'పుపుస హృదయం' అంటారు.
- ఉభయచరాల నుంచి అన్ని ఉన్నత స్థాయి జీవుల్లో (సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు) రక్తం రెండుసార్లు హృదయాన్ని చేరుతుంది. కాబట్టి ఈ వ్యవస్థను 'ద్వివలయ రక్తప్రసరణ వ్యవస్థ' అంటారు.

సరీసృపాలు

- వీటిలో రెండు కర్ణికలు, ఒక అసంపూర్తిగా విభజన చెందిన జఠరిక కలిగిన హృదయం ఉంటుంది.
- ద్వివలయ ప్రసరణ, పుపుస హృదయం సరీసృపాల్లో కన్పిస్తుంది.

పక్షులు, క్షీరదాలు

- పూర్తిగా నాలుగు గదుల హృదయం ఉంటుంది. రెండు కర్ణికలు, రెండు జఠరికలుంటాయి. వీటిలో సిరాసరణి ఉండదు.
- మహాసిరలు ప్రత్యక్షంగా కుడి జఠరిక లోనికి తెరుచుకుంటాయి.
- పుపుస హృదయం, ద్వివలయ ప్రసరణ కలిగి ఉంటాయి.

- చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, శీతల రక్త జంతువులు (Poikilothermic) రక్త ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారుతుంది.
- పక్షులు, క్షీరదాలు, ఉష్ణ రక్త జంతువుల (Homeothermic) ఉష్ణోగ్రత పరిసరాలను బట్టి మారకుండా స్థిరంగా ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. వివిధ శరీర భాగాల నుంచి వచ్చిన రక్తంతో ప్రారంభించి క్షీరదాల హృదయంలోని నాలుగు గదుల్లో రక్తప్రసరణ సరైన క్రమం (డీఎస్సీ-2012)
ఎ) ఎడమ కర్ణిక బి) కుడి కర్ణిక
సి) ఎడమ జఠరిక డి) కుడి జఠరిక
1) సి, ఎ, డి, బి
2) ఎ, డి, బి, సి
3) బి, ఎ, డి, సి
4) బి, డి, ఎ, సి

2. సరిగా జతపరచని వాటిని గుర్తించండి? (డీఎస్సీ-2012)
ఎ) సాలమండర్– 2 గదుల గుండె
బి) కప్ప– 3 గదుల గుండె
సి) కట్లకట్ల– 3 గదుల గుండె
డి) పావురం – అసంపూర్తిగా విభజన చెందిన 4 గదుల గుండె
1) ఎ, డి 2) ఎ, సి
3) బి, సి 4) బి, డి

3. హిమోగ్లోబిన్‌లో ఉండేవి? డీఎస్సీ-2006
1) వర్ణకం, ఐరన్, ఫోర్ఫైరిన్
2) హీమ్, ఫోర్ఫైరిన్, వర్ణకం
3) గ్లోబిన్, ఐరన్, హీమ్
4) గ్లోబిన్, ఐరన్, ఫోర్ఫైరిన్

4. రెండు గదుల హృదయం గల జీవి? (డీఎస్సీ-2004)
1) చేప
2) కప్ప
3) బొద్దింక
4) వానపాము

5. కప్పలో సిరాసరణి దేనిలోకి తెరుచు కుంటుంది? (డీఎస్సీ-2004)
1) కుడి జఠరిక
2) ఎడమ జఠరిక
3) కుడి కర్ణిక
4) ఎడమ కర్ణిక

6. కిందివాటిలో సరైంది? (డీఎస్సీ-2004)
1) పుపుసధమని ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు తీసుకొని పోతుంది
2) కుడి జఠరిక ఆమ్లజని సహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతుంది
3) ఆమ్లజని రహిత రక్తం ఎడమ కర్ణికలోకి చేరుతుంది
4) అన్ని శరీర భాగాల నుంచి ఆమ్లజని రహిత రక్తం కుడి కర్ణికలోనికి పంపుతుంది

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4;
4) 1; 5) 3; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోనికి పంపడానికి సహాయపడేవి?
1) వాయునాళ కండరాలు
2) పక్షాకార కండరాలు
3) ఉరఃకుహర కండరాలు
4) హృదయ కండరాలు

2. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరికావు
ఎ) కప్పలో 3 గదుల గుండె ఉంటుంది
బి) పావురంలో 2 గదుల గుండె ఉంటుంది
సి) కుక్కలో 4 గదుల గుండె ఉంటుంది
డి) మొసలిలో 3 గదుల గుండె ఉంటుంది
1) ఎ, బి
2) బి, సి
3) బి, డి
4) ఎ, సి

3. ఉభయచరాల్లో మహాసిరలు కలిసి ఏర్పాటు చేసేది?
1) కుడి కర్ణిక
2) ఎడమ కర్ణిక
3) జఠరిక
4) సిరాసరణి

4. స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థలో ఏవి ఉంటాయి?
1) రక్తనాళాలు, రక్తం
2) మొప్పలు, రక్తం
3) కర్ణికలు, జఠరికలు
4) గుండె, రక్త కోటరాలు

5. మెగాస్కోలెక్స్‌లో ఉండే పార్శ్వ హృదయాల సంఖ్య?
1) 9 జతలు
2) 8 జతలు
3) 7 జతలు
4) 6 జతలు

6. మిశ్రమ రక్తానికి సంబంధించి సరైన ప్రవచనం?
1) చేప కర్ణిక, జఠరికల్లో మిశ్రమరక్తం ఉంటుంది
2) పక్షుల సిరాసరణి ద్వారా మిశ్రమ రక్తం ప్రసారం అవుతుంది.
3) ఉభయచరాల జఠరికలో మిశ్రమరక్తం ఏర్పడుతుంది.
4) క్షీరదాల కర్ణికలో మిశ్రమరక్తం ఉంటుంది.

7. ద్వి ప్రసరణ రక్తప్రసరణ వ్యవస్థ కలిగిన జీవి?
1) బొద్దింక
2) వానపాము
3) కోతి
4) కోడి

8. వానపాములో సిరలు నిర్వహించే పనిని నిర్వర్తించే రక్తనాళం?
1) పృష్ఠ రక్తనాళం
2) ఉదర రక్తనాళం
3) మహాధమని
4) సిరాసరణి

9. కిందివాటిలో ఏ రెండు జతలు సరైనవి?
ఎ) బొద్దింక – ఎరుపు రంగు రక్తం
బి) మొసలి– 4 గదుల గుండె
సి) సాలమండర్– సిరాసరణి
డి) సరీసృపాలు– ఉష్ణరక్త జంతువులు
1) ఎ, డి
2) బి, సి
3) సి, డి
4) ఎ, బి

10. బొద్దింక రక్తప్రసరణను స్వేచ్ఛాయుత రక్తప్రసరణ వ్యవస్థగా పిలుస్తారు. ఎందుకంటే?
1) రక్తం రక్తనాళాల్లో ప్రవహిస్తుంది
2) ద్వి వలయ రక్తప్రసరణ జరుగుతుంది
3) రక్తం శరీర కుహరంలో కోటరాల్లో ప్రవహిస్తుంది
4) బొద్దింకలో గుండె భాగం ఉండదు

11. కిందివారిలో ఎవరు తెలిపిన ప్రవచనం సరికాదు?
1) శ్రావణ్ – చేప గుండెను జలశ్వాస హృదయం అంటారు
2) శ్రుతి – ఉభయచరాల్లో ఏక వలయ రక్తప్రసరణ ఉంటుంది
3) శ్రేయ– పక్షులు ఉష్ణరక్త జంతువులు
4) శ్రావ్య – వానపాములో తెల్లరక్తకణాలే ఉంటాయి

12. చేపల్లో ఏకవలయ రక్త ప్రసరణకు కారణం?
1) 2 గదుల గుండె ఉండటం
2) సిరాసరణి ఉండటం
3) మొప్పల నుంచి రక్తం నేరుగా శరీర భాగాలకు వెళ్లడం
4) చేపలు నీటిలో ఉండటం, శీతల రక్త జీవులు కావడం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 4;
5) 2; 6) 3; 7) 3; 8) 1;
9) 2; 10) 3; 11) 2; 12) 3.

వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

విషమ రోజులు: నెలలోని రోజులను వారాలుగా పొందుపరచగా మిగిలే రోజులను విషమ రోజులు అంటారు. అంటే ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చే శేషమే విషమ రోజులు. ఒక వారంలో విషమ రోజులు **(odd days)** 0.

రోజులు	విషమ రోజులు
28	0
29	1
30	2
31	3

ఉదా:

7)29(4
28
1

7)31(4
28
3

✦ ఈ రోజు సోమవారం అయితే 61 రోజుల తర్వాత వచ్చేవారం?

(Deputy Jailor, 2012)

ఎ) బుధవారం బి) శనివారం
సి) మంగళవారం డి) గురువారం

జవాబు: బి

సాధన: విషమ రోజులు

7)61(8
56
5

∴ సోమవారం + 5 విషమ రోజులు
= శనివారం.

నెలలు	విషమ రోజులు		
		Ju	2
		Jy	3
J	3	Au	3
F	0/1	S	2
M	3	O	3
A	2	N	2
M	3	D	3

✦ ఈ రోజు మంగళవారం. 94వ రోజు ఏ వారం?

ఎ) శుక్రవారం బి) శనివారం
సి) ఆదివారం డి) సోమవారం

జవాబు: ఎ

నెలల వారీగా విషమ రోజులు:

✦ ఆగస్టులో ఎన్ని విషమ రోజులున్నాయి?

ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

జవాబు: సి

సాధన: ఆగస్టు నెలలో 31 రోజులుంటాయి.

7)31(4
28
3

= ఆగస్టులో 3 విషమ రోజులుంటాయి.

....

గమనిక: సాధారణ సంవత్సరం, లీపు సంవత్సరాల్లో ఒకే రోజు, ఒకే తేదీ ఉండే నెలలు

సాధారణ సంవత్సరం	లీపు సంవత్సరం
జనవరి – అక్టోబర్	జనవరి – ఏప్రిల్
ఫిబ్రవరి – నవంబర్	జనవరి – జూలై
మార్చి – నవంబర్	ఫిబ్రవరి – ఆగస్టు
ఏప్రిల్ – జూలై	మార్చి – నవంబర్
సెప్టెంబర్ – డిసెంబర్	ఏప్రిల్ – జూలై
	సెప్టెంబర్ – డిసెంబర్

ఉదాహరణ:

1. ఏదైనా ఒక సంవత్సరంలో (సాధారణ/ లీపు) ఒకే రోజుతో ప్రారంభమయ్యే రెండు నెలలేవి?
ఎ) మార్చి–నవంబర్
బి) మార్చి–జూలై సి) జూలై– ఆగస్టు
డి) పైవేవీ కావు **జవాబు: ఎ**

2. సాధారణ సంవత్సరంలో ఏ నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి?
ఎ) జనవరి–జూలై బి) జూన్– ఏప్రిల్
సి) ఏప్రిల్–అక్టోబర్
డి) జనవరి– అక్టోబర్ **జవాబు: డి**

3. 31 రోజులున్న నెలలో చివరి రోజు బుధవారమైతే ఎన్ని సోమవారాలు ఉంటాయి?
(General S.I. 2010)
ఎ) 4 బి) 3 సి) 5
డి) చెప్పలేం **జవాబు: సి**

వివరణ: 31 రోజులున్న నెలలో 29, 30, 31 రోజుల్లో వచ్చే వారాలు 5 వస్తాయి. అంటే 31 రోజులున్న నెలలో 1, 2, 3 తేదీల్లో వచ్చే వారాలు 5 సార్లు వస్తాయి. కాబట్టి సోమవారం అయిదుసార్లు వస్తుంది.

సంవత్సరాలకు విషమ రోజులు

సౌర సంవత్సరం:

✦ భూమి, సూర్యుడి చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి 365 రోజుల 5 గంటల 48 నిమిషాల 48 సెకన్లు పడుతుంది. 365 రోజుల కంటే ఎక్కువగా ఉన్న సుమారు 6 గంటలను ఒక రోజుగా ఉంచడం వీలు కాదు. కాబట్టి సాధారణ సంవత్సరానికి 365 రోజులుగా తీసుకున్నారు.

✦ మిగిలిన ఆరు గంటలు నాలుగేళ్లలో 24 గంటలు.. అంటే ఒక రోజు అవుతుంది. దీన్ని ఫిబ్రవరి నెలలోని చివరి రోజు (29వ తేదీ)గా పరిగణిస్తారు. దీన్ని లీపు సంవత్సరం అంటారు.

సాధారణ సంవత్సరం: ఇచ్చిన సంవత్సరం చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్య 4తో నిశ్శేషంగా భాగించకపోతే దాన్ని సాధారణ సంవత్సరం అంటారు. సాధారణ సంవత్సరంలో 365 రోజులుంటాయి.

సాధారణ సంవత్సరాలు	సాధారణ సంవత్సరాలు కానివి
1981, 82, 83	1988, 92, 96
2001, 2002	2000, 2004

$\frac{365}{7}$ = 52 వారాలు + 1 విషమ రోజు

✦ సాధారణ సంవత్సరంలో 1 విషమ రోజు ఉంటుంది.

✦ సాధారణ సంవత్సరం ఏ రోజుతో ప్రారంభమవుతుందో.. అదే రోజుతో ముగుస్తుంది.

లీపు సంవత్సరం: ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్యను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లీపు సంవత్సరం ప్రతి 4 ఏళ్లకు ఒకసారి వస్తుంది. లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి.

✦ లీపు సంవత్సరంలో రెండు విషమ రోజులు ఉంటాయి.

✦ లీపు సంవత్సరంలో ప్రారంభ రోజు ఏ వారం అవుతుందో డిసెంబర్ 30 కూడా అదే వారం అవుతుంది.

1. కింది వాటిలో లీపు సంవత్సరం ఏది?
ఎ) 1986 బి) 2002
సి) 2100 డి) 1992
జవాబు: డి

శతాబ్ద సంవత్సరాలు 4తో నిశ్శేషంగా భాగితమైతే అవి లీపు సంవత్సరాలు కావు. 400తో నిశ్శేషంగా భాగితమైతేనే అవి లీపు సంవత్సరాలు అవుతాయి. ప్రతి నాలుగో శతాబ్దం లీపు సంవత్సరం అవుతుంది.

లీపు సంవత్సరాలయ్యే శతాబ్దాలు:
400, 800, 1200, 1600, 2000, ...

లీపు సంవత్సరాలు కాని శతాబ్దాలు:
100, 200, 300, 500, 600 ...

2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
ఎ) 1100 బి) 1300
సి) 1700 డి) పైవేవీ కావు
జవాబు: డి

3. కిందివాటిలో సాధారణ సంవత్సరం ఏది?
ఎ) 1200 బి) 2400
సి) 2600 డి) పైవేవీ కావు
జవాబు: సి

4. కిందివాటిలో లీపు సంవత్సరం కానిది?
ఎ) 1744 బి) 2016
సి) 1982 డి) పైవేవీ కావు
జవాబు: సి

5. 481 రోజుల్లో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 5
జవాబు: డి

100 సంవత్సరాలకు విషమ రోజులు

✦ వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి? 100 ఏళ్లలో 24 లీపు సంవత్సరాలు, 76 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
ఒక సాధారణ సంవత్సరానికి ఒక విషమ రోజు, ఒక లీపు సంవత్సరానికి రెండు విషమ రోజులు ఉంటాయి. ఆ ప్రకారం.. 100 ఏళ్లకు విషమ రోజులు
$= 76\times1 + 24\times2 = 76+48 = 124$

$\frac{124}{7}$ = 5 విషమ రోజులు

సంవత్సరం	విషమ రోజులు
100	5 → 5
200	10 → 3
300	15 → 1
400	20 + 1 → 0
500	5
600	3
700	1
800	0

✦ 100 సంవత్సరాల్లో 5, 200 సంవత్సరాల్లో 3, 300 సంవత్సరాల్లో 1, ప్రతి 4వ శతాబ్దానికి 0 విషమ రోజులు ఉంటాయి.

విషమ రోజులు	వారం
1	సోమవారం
2	మంగళవారం
3	బుధవారం
4	గురువారం
5	శుక్రవారం
6	శనివారం
0	ఆదివారం

ఉదా:

1. క్రీ.శ.1వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఏ వారం?
ఎ) శనివారం బి) ఆదివారం
సి) సోమవారం డి) మంగళవారం
జవాబు: సి

2. కింది వాటిలో ఏదైనా శతాబ్దం చివరి రోజు కానిది ఏది? **(General S.I. 2012)**
ఎ) శుక్రవారం బి) ఆదివారం
సి) మంగళవారం డి) సోమవారం
జవాబు: సి

వివరణ: శతాబ్దం చివరి నాటికి విషమ రోజులుగా మిగిలేవి 5, 3, 1, 0.
అంటే 5–శుక్రవారం, 3–బుధవారం, 1–సోమవారం, 0–ఆదివారం. వీటిలో ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది. కానీ మంగళవారం, గురువారం, శనివారాలు శతాబ్దం చివరి రోజులుగా రావు.

శతాబ్దం చివరి రోజులు		ప్రారంభ రోజులు
శుక్రవారం	→	శనివారం
బుధవారం	→	గురువారం
సోమవారం	→	మంగళవారం
ఆదివారం	→	సోమవారం

ఉదా:

1. కిందివాటిలో ఏదైనా శతాబ్ద సంవత్సరం ప్రారంభ రోజు కానిది?
ఎ) శనివారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం
జవాబు: సి

2. 247 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
ఎ) 1 బి) 3 సి) 4 డి) 5

జ. 200 రోజులకు 3 విషమ రోజులు ఉంటాయి. 47 ఏళ్లకు ఉండే విషమ రోజుల సంఖ్య తెలుసుకోవాలి.
47 ఏళ్లు = 11×4 + 3 = 44 + 3.
అంటే 47 ఏళ్లలో 11 లీపు సంవత్సరాలు, 36 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
47 ఏళ్లలో ఉండే విషమ రోజులు
$= 11\times2 + 36\times1 = 22 + 36 = 58$
58/7 = 2 విషమ రోజులు ఉంటాయి.
247 ఏళ్లకు విషమ రోజులు = 2+3 = 5
జవాబు: డి

3. 481 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
ఎ) 5 బి) 3 సి) 2 డి) 1
జవాబు: బి

4. క్రీ.శ. 100వ సంవత్సరంలో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
ఎ) 5 బి) 4 సి) 2 డి) 1
జవాబు: డి

గతంలో అడిగిన ప్రశ్న

✦ 1977 జూలై 1వ తేదీ శుక్రవారం అయితే 1970 జూలై 1 ఏ వారం అవుతుంది?
(అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, 2013)
1) బుధవారం 2) గురువారం
3) ఆదివారం 4) మంగళవారం

వివరణ: 1970 జూలై 1 నుంచి 1977 జూలై 1 వరకు విషమ రోజులు =

సంవత్సరాలు		విషమ రోజులు
1971	→	1
1972	→	2 (లీపు సంవత్సరం)
1973	→	1
1974	→	1
1975	→	1
1976	→	2 (లీపు సంవత్సరం)
1977	→	1

మొత్తం విషమ రోజులు = 9 ~ 2
కావలసిన రోజు = శుక్రవారం–2 = బుధవారం
జవాబు: 1

Idea of group discussion is..

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Any misinterpretation of a message (1)/ leads to communication breakdown (2)/ and creates confusion (3)/ and misunderstanding. (4)/ No error (5)

2. Organizational competent (1)/ is the ability (2)/ to organize information (3)/ in a logical and structured way. (4)/ No error (5)

3. In jet propulsion engines, (1)/ gas turbines are used (2)/ only to provide the work requires (3)/ for the compressor of the engine. (4)/ No error (5)

4. When you do use (1)/ the remote control for a long time, (2)/ take out the batteries (3)/ and store them in a cool, dry place. (4)/ No error (5)

5. He has submitted (1)/ the report (2)/ before he received (3)/ the memo. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Ionic compounds can be separate into their constituent ions with little effort.
1) sieved 2) segregated
3) filtered 4) dissociated
5) no correction required

7. Some of the more powerful microcomputers have all or most of the quality of earlier minicomputers.
1) resemblances
2) characteristics 3) features
4) properties
5) no correction required

8. A compound microscope is a device that is used to produce very large enlarged appearance.
1) ramification 2) upshot
3) magnifications 4) disclosure
5) no correction required

9. The Space Age began on October 4, 1957, when Russia started Sputnik 1 into orbit.
1) experimented 2) launched
3) send 4) devised
5) no correction required

10. X-rays are high energy photons, which can knock an atom outside of a molecule.
1) out 2) along
3) inside 4) within
5) no correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Crude oil is a mixture of different compounds that boil at different temperatures.
B) The remaining and heaviest fraction is the residue, which supplies waxes, asphalts and some fuel oils.
C) The fraction obtained by boiling between about 140 degrees and 320 degrees C is termed kerosene.
D) The next fraction, normally refined into gasoline, boils between about 30 degrees and 200 degrees C.
E) The lightest fraction consists of gases that boil below atmospheric temperature.
F) The fraction boiling above about 320 degrees C is commonly refined into heating, diesel and lubricating oils.

11. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) E

12. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

13. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

15. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 16 - 25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. In a huge ____ to the government and political parties in Tamil Nadu, the Supreme Court stayed the centre's ______ to holding of Jallikattu during Pongal.
1) setback, decision
2) decision, proposal
3) opposition, recession
4) retention, argument
5) format, demand

17. The _____ attempted to storm the mission building during the attack.
1) assailants 2) goon3) attacker 4) janitors
5) scrutinizers

18. I was ____ to start a production house of my own, but the project never ____ because astrologers advised me not to go ahead with production.
1) possibly, started
2) Supposed, took off
3) probably, crashed
4) thought, worked
5) naturally, rendered

19. Through telephone lines, an engineer with a personal computer can ____ data in the memory of other computers all ____ the world.
1) access, over 2) possess, across
3) acquire, along
4) pertain, among
5) grab, between

20. The warehouse supervisor can likewise use a personal computer with an _____ program to keep personal records, and those in the large computer's memory, _____.
1) record, record
2) inventory, updated
3) list, recorded
4) register, stored
5) check, retrieved

21. Aeroplanes have the ___ of being dangerous and even the hardened travelers are _____ by them.
1) probability, confused
2) remark, sick
3) reputation, intimidated
4) statement, rescued
5) possibility, sad

22. The very idea of group discussion is _____ on the concept of cooperation, where all members are _____ to work as a team.
1) revolving, accepting
2) based, expected
3) rotating, accepted
4) producing, entered
5) removed, ejected

23. Air pollution has been a major _____ not only to the quality of environment but also to the human health.
1) problem 2) concern
3) disaster 4) threat
5) coincidence

24. We could complete the assignment if it _____ not so late.
1) had 2) was
3) would 4) were
5) have

25. Having just eaten his dinner, he _____ to have even a soft drink.
1) was ready 2) wasn't
3) not supposed
4) was not ready
5) almost ready

Directions (Q.No. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It was through Jimmy John that I discovered that a vocabulary is an outgrowth of experience. As fast as he learned some activity, he acquired without effort the vocabulary that went with it. From the pony he learned saddle, bridle, stirrup, blacksmith and so on, although to begin with he had **hidden** from our pet in terror, with absolutely no words to describe anything about him. After a summer of sailing he unconsciously acquired nautical terms as a matter of course. But when we tried to increase his vocabulary by making him memorize words **arbitrarily**, he became confused and mixed them all up and misused them amusingly. The first time he saw a funeral procession he asked, "What's that" and someone said, "It's a hearse". Now it happened that Jimmy had not been looking at the hearse when this was said. His attention was focused on an Army officer in the procession. Sometime later he announced that there was a hearse in front of our house and when we peered out, rather **alarmed**, we saw a soldier standing there talking calmly to someone. No hearse anywhere. I than realized that you can't make a child merely memorize words; he has to live them, and therefore many experiences are vital to the growth of a child's vocabulary. Jimmy John educated me more than I ever educated him!

26. Which of the two statements is true according to the passage?
a) A child with a poor vocabulary is not very intelligent.
b) Children's vocabulary comes from experience - they have to live the words they learn.
1) only a 2) only b
3) both a & b 4) neither a nor b
5) either a or b

27. Identify the false statement:
1) Children's vocabulary comes from experience.
2) A child with poor vocabulary will not pass aptitude tests.
3) Children educate their parents more often than the other way round.
4) When we try to increase a child's vocabulary by making him memorize words, he becomes confused.
5) Vocabulary is an outgrowth of experience.

28. The antonym of **hidden** is
1) conceal 2) veil 3) secret
4) divulge 5) expect

29. The antonym of **arbitrarily** is
1) subjectively 2) personally
3) individually
4) instinctively 5) logically

30. The synonym of **alarmed** is
1) startled 2) stirrup
3) sensitized 4) scrutinized
5) overwhelmed

Directions (Q. No. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seeing is a complex act ____ (31) the optical system of the eye takes light ____ (32) from the object and forms an ____ (33) on a light sensitive layer, the retina. This ____ (34) energy ____ (35) a photochemical process is transformed into nerve energy and ____ (36) through the visual pathways to the brain. In the ____ (37) sense seeing is not complete until what is seen is interpreted ____ (38) the observer. This ____ (39) is based on past experience; hence, to a considerable ____ (40) seeing is a learned skill.

31. 1) wherein 2) where
3) where in 4) where upon
5) where on

32. 1) originate 2) emanating
3) derive 4) radiate
5) emit

33. 1) copy 2) picture
3) image 4) icon
5) figure

34. 1) beam 2) glow
3) brightness 4) light
5) darkness

35. 1) during 2) thorough
3) throw 4) trough
5) through

36. 1) passes 2) pass
3) is passing 4) passed
5) passes by

37. 1) broad 2) broadest
3) wide 4) large5) broader

38. 1) through 2) with 3) by
4) near 5) next

39. 1) construal 2) reading
3) version 4) interpretation
5) elucidation

40. 1) size 2) area
3) coverage 4) degrees
5) extent

KEY

1) 5; 2) 1; 3) 3; 4) 1; 5) 1;
6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 1;
11) 5; 12) 3; 13) 5; 14) 2; 15) 2;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 2;
21) 3; 22) 2; 23) 2; 24) 4; 25) 4;
26) 2; 27) 2; 28) 4; 29) 5; 30) 1;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;
36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5.